
సువేగా, మిస్టర్ మెకానిక్ మంచి స్నేహితులు కారు అది పనిచేసే తీరు, అతనికి పని కల్పించదు!





అది నిజం. సువేగా ఎంతో ఉత్తమంగా. దృఢంగా నిర్మించబడడంతో అరుగుదల, విరగడం విషయంలో మీరు ఖర్చుపెట్టవలసిన అవసరం ఎప్పుడో కాని కలగదు.

హార్డ్-క్రోమ్డ్ అల్యూమినియం సిలెండర్లున్న ఒకే ఒక మోపెడ్ ఇది—కాబట్టి అది నిరంతరాయంగా సాగుతూనే వుంటుంది. వీటితో, క్విక్ పిక్-అప్, దృఢంగా ప్రెస్ చేయబడిన స్టీల్ బాడీ మరియు చైన్-డ్రైవ్ శ్రేష్ఠమయిన రోడ్ గ్రిప్ మరియు వేగము అందచేస్తాయి.

వీటన్నిటికన్నా. ప్రత్యేకమూ నూతనమూ అయిన యన్ యస్ సీరీస్ కార్బురేటర్ అమర్చబడిన సువేగా లీటర్‌కి 70 కిలో మీటర్లు ఇస్తుంది! కదలండి సువేగా తీసుకోండి. అది సరయిన బేరం.

మోపెడ్స్ ఇండియా
లిమిటెడ్ తిరుపతి
ఆంధ్రప్రదేశ్

ఆశ్చర్యం లేదు, భారతదేశపు అత్యధికంగా అమ్ముడవుతోన్న మోపెడ్ సువేగా


తొలిమాట

జ్యోతి కథల పోటీలో పాల్గొన్న రచయితలందరికీ కృతజ్ఞతలు. పోటీలో బహుమతులు పొందిన రచయితలకు అభినందనలు.

కథల పోటీలో బహుమతులు పొందిన కథలూ, వాటి రచయితల వివరాలు క్రింద ఇస్తున్నాము.

ప్రథమ బహుమతి (రు. 1000/-) పొందిన కథ: గూడుచాలని సుఖం; **రచన: పి. శ్రీనివాసశాస్త్రి, హైదరాబాద్. ద్వితీయ బహుమతి (రు. 600/-)** పొందిన కథ: ప్రియురాలి ప్రేమలేఖ; **రచన: యర్రంశెట్టిశాయి, సికింద్రాబాద్. తృతీయ బహుమతి (రు. 300/-)** పొందిన కథ: మలుపులో మనుషులు; **రచన: పవని నిర్మలప్రభావతి, మొగలిచర్ల.**

తెలుగు కథ విశాలమైన పట్నం అయితే ఆ పట్నం పేరు కాళీపట్నం అనీ తెలుగు కథ ఎత్తయిన కొండయితే ఆ కొండపేరు రాచకొండ అనీ నమ్మే ఈ నేను ఇంతవరకూ చదివింది అంత ఎక్కువ కాకపోయినా, రాసింది తక్కువే. అచ్చయిన మూడు పదుల కథల్లో 'ఎన్నెన్నో ఆత్మహత్యలు'కు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1976 నల దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాను. నేను ఉప సంపాదకుడిగా పనిచేస్తున్న ఆంధ్రభూమి దినపత్రిక ఆది వారం సంచికలో వారం విడిచి వారం 'జనానందలహరి' కాలమ్ వ్రాస్తున్నాను.



శ్రీ కా.రా.'ఆర్తి', శ్రీ రా. వి. శాస్త్రి 'వర్షం', జంపన పెద్దిరాజు 'మంచం', శ్రీ ఇస్మాయిల్ 'ఖాళీ సీసాలు', శ్రీ పాలగుమ్మి 'పడవ ప్రయాణం', శ్రీ పురాణం (మా నాన్న గారు) 'సీత జడ', శ్రీ గోరాశాస్త్రి రేడియో నాటిక 'ఆశ ఖరీదు అణా', శ్రీ చాగంటి సోమయాజులు 'వాయు లీనం', 'ఎన్నెస్ 'పేపర్ టైగర్', శ్రీ కంఠమూర్తి 'ఆత్మ సౌందర్యం', శ్రీపతి 'సర్చ్', గోగోల్ 'ఓవర్ కోటు', లూసన్ 'ఏ మ్యాడ్ మాన్స్ డైరీ', ఓహెన్రీ, 'లాస్టు లీఫ్' నా మనసుమీద ముద్రవేసిన రచనలు.

25 ఏళ్ళ క్రితం వ. గో. జిల్లా జగన్నాథపురంలో పుట్టిన నాకు తల్లిదండ్రులు శ్రీమతి పురాణం సీత, శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ. ప్రేమతో పెంచిన తల్లిదండ్రులు, శ్రీమతి తొల్ల సూర్యకాంతమ్మ, శ్రీ తొల్ల శ్రీరాములు. చదువు చెప్పిన గురువులు—పెంచబడ్డ పేదరికం, పోషించబడ్డ ఐశ్వర్యం, చంపబడ్డ చైతన్యం.

—పి. శ్రీనివాసశాస్త్రి

సుమారు పదేళ్ళనుంచీ కథల్రాస్తున్నాను.

హాస్యం అంటే ప్రాణం. కానీ హాస్యరచనలు చేయడం ఎంత కష్టమో



రచయితలకే తెలుస్తుంది. అదీగాక హాస్యానికి ఉండాల్సినంత ప్రాముఖ్యత—ఈ రోజు మన తెలుగు సాహిత్యంలో లేదు. "జనాన్ని నవ్వించడం కష్టం—ఏడిపించడం తేలిక" అంటాడు గురుడు-ఆదివిష్ణు! అంచేత తేలిక పద్దతే అనుసరించక తప్పటంలేదు. అయితే అప్పుడప్పుడూ నవ్వించడానికి కష్టపడడమూ మానలేదు. మన పత్రికలు నిర్వహిస్తున్న కథల పోటీలు హాస్య రచనలకు ఏనాడూ బహుమతులివ్వలేదు. "తెలుగువారు హాస్యప్రియుల"న్నవారు ఆ మాట హాస్యానికన్నారేమో అని అనుమానం కలుగుతోంది.

ఒకప్పుడు చక్కని హాస్య రచనలను ఆదరించి, పదికాలాలపాటు గుర్తుండే హాస్యాన్ని అందించిన ఘనత జ్యోతి మాసపత్రికదే! అయినాగానీ కథల పోటీలనేసరికి వారుకూడా అందరిలాగా హాస్యరచలను నిర్లక్ష్యం చేస్తారేమోనని ఆ ప్రయత్నం చేయలేదు. అయితే' ప్రియురాలి ప్రేమలేఖ' కథ పోటీకోసం రాసిన కథ కాదు! ప్రాణమిత్రుడు-ప్రముఖ చిత్రకారుడు చంద్ర ఒకరోజు మాటల్లో చెప్పిన ఓ 'మాట' ఈ కథ.

అంచేత ఈ కథ చంద్రకే అంకితం—

—యర్రంశెట్టి శాయి

ఈ బహుమతులతోపాటు **ఇచ్ఛాపురపు రామచంద్రం** కథ '....రాలేనమ్మా రాలేను'. **వసుంధర** కథ 'లేకెంటుహీటూ ధర్మామీటరూ!', **సదానంద్‌శారద** కథ 'పలుపు', **కె. కె. మీనన్** కథ 'సీతాలు గుడిసె మారింది', **ఎ. రాజారామ మోహనరావు** కథ 'ఆడమనసు' మరియూ **వి. ఎల్. ఆర్.** కథ 'దిసీజ్ లైఫ్'—ఈ ఆరు కథలూ ప్రత్యేక ప్రశంసపొంది, ప్రత్యేక బహుమతిగా మేం ప్రకటించిన (రు. 100/-) గెలుచుకొన్నాయి.

పోటీలో విజేతలందరికీ మరోసారి అభినందన లందజేస్తున్నాము.

పోటీలో బహుమతులు పొందని కథలలో ప్రచురణార్హంగా ఉన్నవాటిని జ్యోతిలో సాధారణ ప్రచురణకు ఎన్నిక చేస్తున్నాము. అలా ఎన్నిక చేయబడ్డ కథల రచయితలకు ఆ విషయం వేరుగా, నేరుగా తెలియపరుస్తాము.

పోటీలో కథల ఎన్నిక ఏ పద్ధతిలో జరుగుతుందన్న ఆసక్తి రచయితలకేకాక పాఠకులకు కూడా ఉంటుంది. అందుకే బహుమతులు నిర్ణయించడంలో మేము అవలంబించిన పద్ధతి గురించిన చిన్న వివరణ నిస్తున్నాము.

పోటీకి కథలు రావడంతోనే—ఎడిటోరియల్ శాఖకు సంబంధించని ఉద్యోగి ఒకరు ఆయా కథలకు ఒక 'కోడ్ నంబర్' ఇచ్చి రచయిత పేరుగానీ, చిరునామా

12-3-'39 ఒంగోలులో జననం. 1954లో వివాహమయింది. భర్త శ్రీధరరావు గారు. 1954 నుంచీ రచనలు చేస్తున్నాను. 7 కథా సంపుటాలూ, 16 నవలలూ ప్రచురితాలు. దాదాపు తెలుగు వార, మాస పత్రిక లన్నింటిలోనూ కథలూ, నవలూ ప్రచురితమయినాయి. కథలలో అధిక భాగం కన్నడంలోకి అనువదించబడ్డాయి. ఈ పత్రిక (జ్యోతి) ప్రచురించిన "పంకంలో పద్మాలు" రేడియోలో సీరియల్‌గా నాటకరూపంలో ప్రసారమయింది. కన్నడంలోకి అనువదించబడుతోంది. కృష్ణాపత్రిక (వార పత్రిక)లో 'ఇయంగేహేలక్ష్మీ' (స్త్రీలకోసం ప్రత్యేక శీర్షిక) నిర్వహించాను. విశ్వసాహితీ సమితి (హైదరాబాదు) నిర్వహించిన కథల పోటీలో మొదటి బహుమతి, '61, '62 లలో ఆంధ్రపత్రిక (వీక్లీ) నిర్వహించిన వ్యాసరచన పోటీలో II, III బహుమతులొచ్చాయి. ప్రతి రచనకూ ఓ ప్రయోజనం ఉండాలని భావిస్తాను. సామాజిక పరిస్థితులను ప్రతిబింబించే ఏ రచన అయినా—ఆ రచన చేసిన ఏ రచయిత లేక రచయిత్రి అయినా నాకు అభిమానమే. తీరిక వేళల్లో శ్రీవారితో, పిల్లలతో ముచ్చట్లాడుకోవడమే నాకున్న హాబీ.



—పవని నిర్మలప్రభావతి

గానీ వ్రాతప్రతిపై లేకుండాచేసి సంపాదకశాఖకు పంపించిన తర్వాతే కథల పరిశీలన ప్రారంభమవుతుంది. తొలి వడపోతలో సాధారణ ప్రచురణకు కూడా అర్హం కావనిపించే కథలనన్నిటినీ తీసివేయడం జరుగుతుంది.

తరువాత వరుసగా జరిగే వడపోత ఉన్న కథల స్థాయినిబట్టి, సంఖ్యనిబట్టీ జరిగింది. చివరకు బహుమతులకు పరిశీలించవలసిన కథల సంఖ్య పదిహేనుకు తగ్గించడం జరిగింది.

చివరిస్థాయిలో న్యాయనిర్ణేతలు ముగ్గురు రెండు మూడు సార్లుగా చర్చలు సాగించి ఉన్న తొమ్మిది కథలలో—కథావస్తువు, భాష, కథరాసినతీరు, మొత్తం కథ అందించిన అనుభూతీ—కథావస్తువులో వైవిధ్యత ఈ అంశాలు ప్రధానంగా తీసుకొని బహుమతులు నిర్ణయించడం జరిగింది.

* * *

మన్నించాలి! ఈసారి బీనాదేవి సీరియల్ ప్రచురించలేకపోతున్నాము. వచ్చే సంచికనుంచీ యథావిధిగా కొనసాగుతుంది 'భూమి గుండ్రంగావుంది' సీరియల్.

ఉత్తరాలు

బీనాదేవి రచనలంటే తలెత్తి చూడని నేను 'భూమి గుండ్రంగా ఉంది' సీరియల్ ద్వారా నేను ఆకర్షితుడనయ్యాను. నెలనెలా బీనాదేవి అందిస్తున్న హాస్యపు జల్లు నిజంగా అమృతపు జల్లు.

పాత కథను కొత్త పంథాలో నడిపించిన "హజరా"గారి నవల "వెలిగే దీపం" పాఠకుల హృదయాల్లో కలకాలం నిలిచేదిగా వుంది.

ఈ నెల్ల కథలు అంతంత మాత్రంగా వున్నాయి. ప్రసన్నకుమార్‌గారి కథ "ఊంపం" అమోఘంగా వుంది. యర్రంశెట్టిసాయిగారి కథ "ఫౌల్" ఎందుకు ప్రచురించారో అర్థంకాకుండా వుంది. సత్యం మందపాటిగారి 'రుక్మిణీ కళ్యాణం' ఒక మాదిరిగా వుంది.

తూర్పున ఉదయిస్తూనే పడమట సంధ్యారాగపు మాధుర్యాన్ని మాకు చవిచూపించిన మల్లాది వారి సీరియల్ నవల మీ పత్రికకు ఒక హైలైట్.

'సినిమా' విషయంలో మీరు చేసిన మార్పులు బావుండలేదు. పాత పద్ధతిని అనుసరిస్తే మంచిది.

—యినుగంటి బుచ్చి వెంకట్రావు,
కొవ్వాడ.


మావద్ద వివాహాది శుభకార్యములకు
పనికివచ్చు అన్నిరకముల
వస్త్రములు లభించును
అశోక్
స్టోర్స్
బీసెంట్ రోడ్ * విజయవాడ 2


ASHOK
STORES
PHONE 6537
LEADING SHOPING CENTRE
BESANT ROAD VIJAYAWADA-2
Stockist BOMBAY DYEING
CALICO AND GWALIOR
SPECIALIST IN
WEDDING SAREES

మే నెల "జ్యోతి" చదివాము. "హజరా" గారి నవల "వెలిగే దీపం" నవల సుజాత పాత్ర త్యాగానికి ప్రతిరూపంగా నిల్చింది. కథలలో రాక్షసుడు, అంపం, వాస్తవానికి దగ్గరగా వున్నాయి. పడమట సంధ్యారాగం మొదట్లోనే మమ్మల్ని ఆకర్షించింది. క్రొత్తగా ప్రారంభించిన (వి)చిత్రవిజ్ఞానం చాలా ఆశక్తిదాయకంగా వున్నది. కార్టూన్లు మమ్మల్ని కడుపుబ్బనవ్వించాయి.

—శేఖర్ మరియు మిత్రులు, నిజామాబాద్

మే మాసపు 'జ్యోతి' సంచిక నాగేశ్వర్రావు, వాణిశ్రీల ముఖచిత్రంతో సర్వాంగ సుందరంగా వెలసి మమ్మల్నెంతగానో మురిపించింది. ఈ సంచికలో కథలు ఎక్కువగా ప్రచురించినందులకు ఎంతో సంతోషముగా వుంది. కథలన్నీ కడు రమ్యముగా యున్నవి.

మల్లాది వెంకట కృష్ణమూర్తి గారి పడమట సంధ్యారాగం సీరియల్ ఆదిలోనే ఆసక్తిదాయకంగా వుంది. కొత్తగా ప్రవేశపెట్టిన (వి)చిత్ర విజ్ఞానము శీర్షిక మాకు చాలా నచ్చిందండి.

—గంటా ఉమాశంకర్ రెడ్డి,
బరంపురం 1.

ప్రతి నెలా ఏ పత్రికనైనా అయిదు నిముషాల్లో పేజీలు తిరగేసి అవతల పడేసే నేను ఈ నెల జ్యోతి పేజీలు తిరగేస్తూ 39 వ పేజీలోనే ఆగిపోయాను. తమిరిశ జానకిగారు అందించిన "రాక్షసుడు" కధ నా కెంతో నచ్చింది. ఆ కధ చదివాక క్షణంసేపు ఆలోచింపచేసింది నా మనసు. అలాంటి కధ అందించిన జానకిగారికి నా అభినందనలు. అలాగే శ్రీనివాస శాస్త్రిగారి కధ (పెళ్ళయ్యాక చూడులో మినీ కథలు) బాగున్నాయి. ఎంతైనా ఆడది ఆట బొమ్మ అని నిరూపించారు రచయిత్రి జానకి మరియు శ్రీనివాసశాస్త్రిగారు.

—పి. శేషవర్ధనరావు, చాగంటిపాడు.

గత సంచికలో ప్రచురించిన "ఉత్తరాలు (భార్యల నుంచి భర్తలకు)" రచయిత శ్రీ డి. ఎల్. ఎన్. శాస్త్రి పేరు ముద్రణలో రాలేదు. అందుకు చింతిస్తున్నాము.

—ఎడిటర్

మే నెల జ్యోతి చదివాను. అందులో "వెలిగే దీపం" నవల చాలా బావుంది. చాలా సహజంగా వుంది. చాలామంది కుటుంబాల్లో సుజాతలాంటివాళ్ళు రేర్‌గా కనిపిస్తారు. ఈ నవల చదివిన ప్రతివారికి "సుజాత" చాలా రోజులవరకు మరపురాకుండా వుంటుందనడములో అతిశయోక్తి లేదు అనుకుంటాను. ఇంత మంచి నవలను అందించిన "హజరా" గారికి నా అభినందనలు. కథలు కూడా బాగున్నాయి. తమిరిశ జానకిగారి "రాక్షసుడు" రచన ఆకర్షణీయంగా వుంది. భర్తలకు భార్యల ఉత్తరాలు శీర్షిక చాలా తమాషాగా వుంది.

—ఎస్. విమల ఎం. ఏ., ధర్మవరం.

జ్యోతి (మే) సంచిక చదివాక ఈ లేఖ వ్రాయాలనిపించింది. ఈనెల మీరు చేసిన (క్రొత్తగా) మార్పులు, (వి)చిత్ర విజ్ఞానం, "ఎక్కువ సంఖ్యలో ఆణిముత్యాలవంటికథలు" యెంతో సంతోషాన్ని కలిగించింది. ఈ మార్పులతోపాటు జ్యోతి ప్రతిసంచికలో కనీసం ఒక నాటకం నైనా ప్రచురింపజేస్తే బాగుంటుంది. ఏ రామసంజీవిగారి "మయసభ"లో ఈ నెల వ్రాసినవి చాలా బాగానే వున్నా అవి అమలులోకి రావటం యెంతో కష్టం. కారణం మాటలు కోటలు దాటగలవు కాని చేతలు చేష్టలు కూడా దాటలేదు. ప్రచురిస్తున్న రెండు సీరియల్స్‌లో బీనాదేవిగారి "భూమి గుండ్రంగా ఉంది" ఫుల్ కామెడీగాను, మల్లాది వెంకటకృష్ణమూర్తిగారి "పడమట సంధ్యారాగం" సస్పెన్స్‌గాను వుంది. హజరాగారి "వెలిగే దీపం" బాగా కాలక్షేపం కలిగించింది.

—యం. సుధాకరగుప్త, తిరుపతి.

మే నెల, ఆంధ్రుల అందాల నా అభిమాన నటుడు అక్కినేని సరసన, నవ్వులతో, చిందిస్తూ, కళ్ళతో కవ్విస్తూ, అందాలను విరజల్లి తన నటనతో ప్రేక్షకుల హృదయాలలో స్థానం సంపాదించే వాణిశ్రీ, ముఖచిత్రం నాకెంతో నచ్చింది. ఇక తరువాత "భూమి గుండ్రంగా ఉన్నది". ప్రతీ వాక్యములలోను నవ్విస్తూ యెంతో సరదాగా ప్రతీ వాక్యాన్ని చదివినట్లు చేయించే రచయిత్రి బీనాదేవిగారికి ఇంత మంచి సీరియల్ అందింపచేస్తున్న మీకు నా హృదయపూర్వక అభినందనలు. కొత్త సీరియల్ "పడమట సంధ్యారాగం"లో మగవాడికి అనుమానం వస్తే తనలో యెంత సంఘర్షణకు గురై ప్రతీదానికి, అనుమానముతో అవమానముతో ఎలా అవుతారో తెలియచెప్పి, ఇంకా ముందు ముందు యెలా ఉంటుందో అని సస్పెన్స్‌తో ఉంది.


—జె. ప్రకాశరావు, టాటానగర్.

ఈ నెల జ్యోతికి అందానిచ్చినవి "రాక్షసుడు" కథ, "ఫౌల్" కథ. ముఖ్యంగా రాక్షసుడులో ఆ తల్లి తన మనసులోని బాధను గాథగా పిల్లలకు చెప్పటం, ఆ చిన్న మనసు తృప్తికోసం కథ ముగింపు సుఖాంతం చెయ్యటం, ఆ ముగింపే ఆ పసివాడి మనసుకు హత్తుకొని కథలోని రాక్షసునితో తండ్రిని పోల్చుకొని తల్లితో వెళ్ళిపోదామనటం యెంతోబాగున్నది. నవల "వెలిగే దీపం" అతి సామాన్యంగా వుంది.

—కె. సత్యవతి, సికింద్రాబాద్.

మే నెల "జ్యోతి" చదివాను. అందులో ముఖ్యంగా 'మల్లాది వెంకటకృష్ణమూర్తి'గారి "పడమట సంధ్యారాగం" సీరియల్ నవల మొదటి భాగం చాలా ఇంటరెస్టుగానూ, వెరైటీగానూ ఉంది. ఇకపోతే కథలన్నిటిలో "ఫౌల్", "స్నేహంకన్న తీయనిది" కథలు నాకు బాగా నచ్చాయి.

—జి. బెనర్జీబాబు, మచిలీపట్నం.



మా డాక్టర్ అన్నారు:
"పాపాయి సున్నితమైన జీర్ణశక్తికి మొట్టమొదట ఫారెక్స్ అలవాటు చేశాకనే ఏ ఇతర ఘన ఆహారాన్నయినా ఇవ్వవచ్చు".

మొదట ఫారెక్స్ అని డాక్టర్లు అంటారు! ఎందువల్ల?
3 నెలలు నిండాక పాపాయికి పాలు మాత్రమే తగినంత పోషణనివ్వలేవు. పాపాయి సున్నితమైన జీర్ణశక్తికి తగినట్లు ప్రత్యేకంగా తయారుచేయబడిన ఘన ఆహారం ఫారెక్స్ అతడికి అవసరం

ఇంకా ఏ విధంగా ఫారెక్స్ పాపాయి అవసరాలకు సరిపోతుంది?
మీ పాపాయి మెదడు, శరీరం పెరుగుదల కోసం ఫారెక్స్ సులభంగా జీర్ణమయ్యే ప్రొటీన్లను సరియైన ప్రమాణంలో అందిస్తుంది శక్తి కోసం కార్బోహైడ్రేట్లు కూడా సమకూరుస్తుంది.
ఫారెక్స్‌లో మీ పాపాయి అవసరాలకు పూర్తిగా సరిపోయే. అతడి రక్తాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తగినంత ఐరన్ ఉంది. దృఢమైన ఎముకలు, గట్టి పళ్లకోసం కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్ D_2 కూడా తగినంతగా అందిస్తుంది ఫారెక్స్.

3 నెలలు వచ్చాకనే ఎందుకు?
ఆహారాన్ని సరిగా జీర్ణం చేసుకొనేందుకు పాపాయికి నమలడం అలవాటు కావాలి. లేకపోతే, నమలకుండా మింగి వేయడం వల్ల అతడి పెరుగుదల దెబ్బతినవచ్చు లేదా కడుపు నొప్పి రావచ్చు.

"పెద్దలు తినే" ఆహారాన్ని ఎప్పటి నుంచి ఇవ్వవచ్చు?
మొదటిసారిగా అప్పుడుగులు వేశాక పాపాయికి పళ్లు, కూరగాయలు, పప్పు, గుడ్లు ఇవ్వవచ్చు. కాని అతడికి మూడేళ్లు వచ్చేవరకు ఫారెక్స్ అవసరం. అంచేత పాపాయి తినేవాటన్నిటిలో దాన్ని కలిపి పెట్టండి



సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదలకోసం పాపాయి మొట్ట మొదటి ఘన ఆహారం.

లింటాస్-GF.58-1710 Te


గంగ, యమున, సరస్వతుల సంగమం
త్రివేణి
రుచి, సువాసన, పరిమళాల సమ్మేళనం
"త్రివేణి" వక్కపొడి
TRADE MARK
Regd No. 169505
TRIVENI
TRIVENI
PARIMALA
NUT POWDER
తయారుచేయువారు..
PHONE 270
త్రివేణి నట్ పౌడర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ
మేనేజింగ్ పార్ట్నర్.... దేసు వెంకటసుబ్బారావు..
ఘోర్పురోడ్ .... మచిలీపట్నం (ఆంధ్ర)
KAMAL Process
బ్రాంచీలు హైదరాబాద్, సికింద్రాబాద్, ఏలూరు, కాకినాడ, గుడివాడ, విజయవాడ

కర్మ! ఉపన్యాస యోగం!!

చేసినట్టు కాదు భాయి, చెప్పినట్టు చెయ్యవోయి!

* విశ్వవిఖ్యాత వటవట సార్వభౌమ విషయం అందరికీ తెలిసిందే
ఆ బరువుకి తూగలేక ఏ స్టేజి అయినా కిర్రు కిర్రుమన వలసిందే
ఆ బొంగురుతో వేగలేక ఏ మైకు అయినా కుయ్యో మొర్రో అనవలసిందే
ఆ కస్సెర్రకి తాళలేక లేచిన ఏ శ్రోతయినా కిక్కురుమనకుండా కూచోవలసిందే
ఇంతకీ ఎక్కడ ఏ ఉపన్యాసం ఇచ్చినా ఆయన చెప్పేదొకటే గ్రహించండి.
'వీలయినంత నెమ్మదిగా మాటాడి మీ మీ శక్తుల్ని నిలవ చేసుకోండి
మాటలు తక్కువగా వాడి మీ మీ కాలాన్ని చక్కగా పొదుపు చేసుకోండి'
అనే కదా పదే పదే చెబుతున్నాడు, గొంతు చించుకుని, నెలల తరబడి!

మైక్రోఫోను కన్న మాకు ఎవరు మిన్న?

* కొంతమంది వక్తలకి మైకుని చూడగానే కొత్త పెళ్ళికూతురు గుర్తొస్తుంది
మనసు పరవశించిపోతుంది. మూరాకు వేస్తుంది. మూరాము చేస్తుంది
లోహనాగిని మమైకంలో వెనక పెద్దలుగాని ముందు సభ్యులుగాని వారికి కనపడరు.
అందుకనే పట్టుకున్న మైకు పట్టు విడవలేరు. ఆ వలపుల పలకరింపు ఆపలేరు.
దాని పెదవులపై వేళ్ళతో మీటుతారు. ఆ మెడని అదే పనిగా నిమురుతారు.
తరువాతి వక్తకి దాన్ని ఇమ్మంటే కట్టుకున్నదాన్ని తనుకుపోయినట్టు గోలెడతారు.
ఎన్నని చెప్పను ఆ చిట్టంటు చేష్టల లిస్టు!
ఎవరికివారు పోల్చుకుంటేనే అన్ని విధాలా బెష్టు.

చెప్పింది తక్కువా దగ్గింది ఎక్కువా!

* అటు స్టేజిమీదకి తరుముతోంది ఉపన్యాస రంధి
ఇటు బాత్‌రూమ్‌కి లాగుతోంది మధుమేహ వ్యాధి
అయినా ఒదిలే రకమా ముఖ్య అతిధి? అలా వెళ్లొస్తూనే ఎగరగొట్టేశాడు పెంకులు
ఆ వాగ్దాటికి విడిపోయే ఉంటాయి, విన్నవారి లోపలి చెవి లింకులు
ఇక అధ్యక్షులో? నిధి! హార్టు కంప్లెయింట్ ఉన్నా వెర్రి గుండె నిబ్బరం వారిది
మెట్లెమించి స్టేజిమీదకి స్ట్రెచ్చర్లో వారిని చేర్చడంవరకే మన సిబ్బంది ఇబ్బంది
ఆ తర్వాతా? సాయాసంగా సాగింది.. ఏ శివుడూ ఆపలేనిది వారి నోటి గంగానది
ఆ మర్నాటి పత్రికలో పడింది, 'ఆరోగ్య వారోత్సవ సభ అంటే అప్పుడే తెలిసింది'.

జ్యోతి కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

గూడుచాలని సుఖం

పి. శ్రీనివాసశాస్త్రి

పూరిపాకల్నీ పేద జనాన్నీ అట్టే పట్టించుకోకుండా చలిగాలులు విజృంభిస్తున్నాయి.

ఆ చలికి సత్తెమ్మ గజగజలాడింది.

అరగంట క్రితం——

కొడుక్కీ కోడలికీ మధ్య తానెందుకు అడ్డు అనిచెప్పి సత్తెమ్మ పాకబైట గోనెబరకం పరచుకు పడుకుంది. అసలు, అత్తాకోడలు లోపల పడుకుంటే కాసులు పాకబైట పడుకోవడం ఆనవాయితీ.

ఓ రాత్రివేళ నరాలు జివ్వుమన్నప్పుడు పిల్లిలా లోపలికెళ్ళి రత్తాల్ని జబ్బమీద గిల్లేవాడు కాసులు.

అది కాస్సేపు గారాలుపోయి, మరికాసేపు వయ్యారాలుపోయి మనసుతీరా బ్రతిమాలించుకొనేది.

కాసులు దాన్ని మెల్లిగా పాకబయటకు నడిపించి నులక మంచంమీదకు చేర్చేవాడు. చాలని నులక మంచం, చాలని దుప్పటీ, చాలని గూడు ఇచ్చే చాలీచాలని సుఖానికి వాళ్లు అలా అలవాటు పడిపోయారు.

పగలల్లా రిక్షా తొక్కితొక్కి చాలని గంజి మెతుకులు కడుపుకడంవల్ల పెరిగిన ఒంటివేడి రాత్రి ఆ రకంగా తీరిపోగానే కాసులుకి అపుకోలేని అలుపువచ్చి అలాగే నులక మంచంమీద ఒళ్ళెరక్కుండా నిద్రపోయేవాడు.

రత్తాలు వాడికి ఒంటినిండా దుప్పటికప్పి దుప్పటి చిరుగుల్ని ముడతల్తో సరిచేసి లోపలికొచ్చి తడిక బిగించి అత్తపక్కలో పదిలంగా పడుకునేది పాతచీర కప్పుకుని.

కాసులు మొన్న వేసవిలో రత్తాల్ని కాపురానికి తెచ్చుకున్నప్పటినుంచీ ఆ తల్లీ, కొడుకూ కోడలూ పాకని ఆ విధంగా పంచుకున్నారు రాత్రిళ్లు.

సత్తెమ్మ మాత్రం ఆ రోజు తాను కొడుక్కీ కోడలికీ అడ్డుగా వున్నట్లు తలపోసింది. అందుకు కారణం లేకపోలేదు.

అంతక్రితం రాత్రి ముసలమ్మకు మెలకువ వచ్చింది. పక్కలో రత్తాలు లేదు. ఎన్నిసార్లో అలా మెలకువస్తే పక్కలో రత్తాలు లేకపోవడము గమనించి నవ్వుకుని నిద్రలోకి జారుకునేది సత్తెమ్మ. కానీ ఆ రోజు నవ్వురాలేదు. నిద్రారాలేదు. లఘుశంకకి పోవాల్సివచ్చింది. బయటకు వెళ్ళాలంటేలేదు. ఆ సమయంలో బయటనించి సన్నగా వినిపిస్తున్న కొడుకు నవ్వులూ, కోడలి గుసగుసలూ తన అలికిడి వినగానే ఆగిపోతాయని భయం.

రత్తాలు తెలతెలవారుతున్న వేళ పాకలోపలికొచ్చి తడిక బిగించి పదిలంగా తన పక్కలో పాతచీర కప్పుకొని పడుకోడానికి ముందే సత్తెమ్మ ఓ నిశ్చయాని కొచ్చేసింది——

రేపటినుంచి పాకబయట తాను పడుకొని పాకని రాత్రిపూట కొడుకూ కోడళ్ళ స్వేచ్ఛకి వదిలెయ్యాలని.

పడక పడక పడిన కాపురం కాసులుది. కాసులు రిక్షాలాగి తెచ్చే డబ్బులుకాస్తా కోడలికి "కరువై పోడం" అతని తండ్రి వీరయ్యకిష్టం

లేదు. కీళ్ళవాతంవచ్చి ఎటూ కదలలేని వీరయ్యకు, కోడలొస్తే తనకి సారాడబ్బులు అన్నప్పుడూ దక్కవేమోననే భయం పట్టుకుంది.

"కాపురం పడనివ్వ నోడివి—పెళ్లెందుకు చేశావ్ కొడుక్కి?" అని ఇరుగూ పొరుగూ నిలవేశారు వీరయ్యని.

"అడగవచ్చారు కాబట్టి సెబుతున్నా. ఇది గిలారండి. ఈ పాక లోపల అడుగుపెట్టండి. మరో మనిషికి సాల్తదా ఈ పాక? పోనీ ఆ ఒచ్చేమనిషి ఒచ్చినట్టే సరుదుకోవచ్చు. రేపు పిలగాడు పుట్టుకొస్తే మాటేంటి? అందుకే ఓ వందరూపాలు కటుసుపెట్టి నాలుగు తడికెలూ, మూడు తాటిదూలాలూ, ఓ రాట, కమ్మలూ కొని ఏరే ఓగది ఈ పక్కన లేపింతరవాత పెళ్ళాన్ని తెచ్చుకోరా అన్నా. అలా అండం తప్పయితే ఇప్పుడే తెచ్చుకోమనంది పెళ్ళాం బెల్లం ముక్కని! నేనూ నాపెళ్ళాం-ఆడసలు

లచ్చిమి"ని ఇంటికి తెచ్చుకున్నాడు కాసులు. "మాంగారు" జామారూ, కండువా, చౌకరకం గళ్ళ టెర్లిన్ చొక్కా, రత్తాలుకి చీరా రవికా పెట్టారు. కలగక కలగక కలిగిన కొత్తకాపురం మోజులో కొన్నాళ్ళు రిక్షా లాగుడు వ్యాపారం మూలకి నెట్టేసాడు కాసులు, కుండలు డింకీలు కొట్ట నక్కరలేకుండా మామ ఇచ్చిన 50 రూపాయలూ సహాయపడ్డాయి'

అంతలో వేసవి వెళ్ళిపోయి వర్షాలు ప్రారంభమయ్యాయి. కాసులుకి రాత్రిళ్ళు గూడ సమస్యా ప్రారంభమయ్యింది.

ఆరుబైలుని "వానదేవుడు" ఆక్రమిస్తే పాకని "ముసలమ్మ" ఆక్రమించింది!

ఆ ఇరుకులో కాసులూ, రత్తాలూ పడ్డ 'సుఖం' ఏదైనా వుంటే అది ఎన్నో బాధలనీ, అభ్యంతరాలనీ కాదని సాధించి తెచ్చుకున్నదే!

ఆ చీకట్లో ఇరుకులో వాళ్ళిద్దరి సంభాషణా ముసలమ్మ చెవిన పడుతూనే వుండేది.



మా కొడుకు కాదనిసెప్పి రాములోరి గుడి ముందు సెట్టుకింద బతుకుతాం" అన్నాడు వీరయ్య అడగవచ్చిన ఇరుగూ పొరుగూతో.

వీరయ్య వాదంలో బాధ ఇరుగూపొరుగూ గ్రహించారు. కాసులూ గ్రహించాడు. కానీ ఏం చేయగలడు? పాక బాగుచేతకి వందరూపాయలు లేకనే పోయాయి.

అందుకే వీరయ్య పొమ్మేంతకాలం కాసులు కాపురం పడలేదు.

సరిగ్గా వేసవి వెళ్ళిపోడానికి ముందు "గుహ

"రత్తాలూ....నిద్రపోకే...."

"........"

"రత్తాలూ - నిన్నేనే."

"ష్! గట్టిగా ఇనబడతంది."

"మా అమ్మ నిద్దరోయింది లేయే."

"అందుకే! మాటాడకు! లెగుత్తాది!"

"లెగదు లేయ్....నా మాటిను....అలా పాక ఎనక మట్టి అరుగుమీదికి పోదామా?"

"సీ....సీ....వొరసం....తడిసిపోతాం"

కొత్తలో ఆ ఇరుకుతనం అటు సత్తెమ్మకీ

ఇటు కాసులూ రత్తాలుకీ కొత్తగా వున్న వర్షాకాలం అంతా ఆ ఇబ్బందికి అలవాటు పడిపోయారు. బైట వాన ఉధృతంగా పడుతుంటే ఆ "హోరు"ని వృధా కానిచ్చేవాడు కాదు కాసులు.

వర్షాకాలం వెళ్ళిపోయి శీతాకాలం మొదలు కాగానే కాసులు ఆరు బైటా, సత్తెమ్మా రత్తాలూ లోపలా పడుకోటంతో సమస్య కొంత విడినట్టే విడింది.

కానీ సత్తెమ్మకి కొత్త సమస్య తల ఎత్తి పడకల మార్పిడి అత్యవసరం అయింది మళ్ళీ!

తల్లి కొత్త నిర్ణయం విన్న తరవాత కాసులుకి ఒకపక్క సంతోషం మరోపక్క విచారం కలిగాయి.

"ఆరు బైట నువు పడుకోరాదని డాకట్రు సెప్పారు కదే" అన్నాడు మొహమాటంగా.

"ఆరు బైటయితే ఏటి, పాకైతే ఏట్రా ముసల్దానికి? ఐనా మీ అయ్య కంబళీ వుంది కదా?" అంది సత్తెమ్మ.

సత్తెమ్మకిగానీ, కాసులుకిగానీ వీరయ్య వదిలి వెళ్ళినది ఆ పాక, కంబళీ ఆ రెండే. వీరయ్య పోగానే సత్తెమ్మ తన ముక్కెరని రత్తాలుకి తగిలించింది. ఆ ముక్కెరని చెరిపించి బంగారం అమ్మి పాక బాగు చేయించాలని కాసులుకి మనసులో వుండేది. కానీ వీలులేకుండా



ముక్కెర తాకట్టులోకి వెళ్ళి—ఆ తరవాత అత్యంత సహజంగా వాకట్టులోకి వెళ్ళిపోయింది.

కాసులు మనసుపడినట్టుగా ఆ పాకని బాగు చేయించి, తడికెల బదులు పచ్చి ఇటుకలతో గోడలు లేపి పైన రేకులు వేయించి, దాన్ని రెండు గదులు చేసి, ఇల్లు ఆకారం రప్పించాలంటే వాడికి లాటరీ తగాలాలే తప్ప దారిలేదు. లాటరీ టికెట్టుకన్నా రూపాయి డబ్బులుండాలి కాబట్టి—ఆ పాక ఇక బాగుపడదనే చెప్పాలి

ఆ రోజు పాకని మొత్తానికి కొడుకూ కోడలి స్వేచ్ఛకి వదిలి పాక బైట గోనెబరకం పరచుకొని కంబళీ కప్పుకొని పడుకుంది సత్తెమ్మ.

బైట చలి ఆమెని కుదిపేస్తోంది.

*   *

చాలా రోజుల తరవాత రిక్షాకి ఎక్కువ బేరాలు తగిలిన హుషారుతో కాసులు ఆ రోజు 'నన్నెవ్వరాప లేరీవేళ' అన్నట్లున్నాడు.

పాకలోపల సుఖం క్రొత్తగా వుంది.

రత్తాలు కాసులు ఒడి వెచ్చదనానికి కరిగి పోతూవాడ చలిచలి అనడం మానలేదు.

"నే వెచ్చగా లేనా?" అని అడిగాడు కాసులు.

"ఛీ పో .." అంటూ చేత్తో కాసులు బుగ్గ మీద పొడిచింది రత్తాలు. గాజులు గల్లున గోల చేశాయి.

కాసులు బాధ నటించాడు. రత్తాలు కళ్ళల్లో చురుకుదనం తళుక్కుమంది.

కాసులు పట్టు తప్పిపోయాడు.

ఇద్దరికీ చాలటం లేదు దుప్పటీ.

కప్పుకున్నంత మేరా కొద్దిగా వెచ్చగా అనిపించినా, దుప్పటి బైటకి వచ్చిన పాదాలూ, వీపూ చలికి బిర్రబిగుసుకు పోతున్నాయి.

హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది కాసులుకి.

"రత్తాలూ! ఓ పనిసై" అన్నాడు.

"ఏటది?" అంది రత్తాలు.

"మా అమ్మ కప్పుకున్నాది కంబళీ....ఈ దుప్పటీ దానికిచ్చి, ఆ కంబళీ అట్టుకురా. .. పెద్దగుంటది. ఎచ్చగాకూడా వుంటది. మళ్ళా కోడి కూసే ఏళ కంబళీ కప్పేసి, దుప్పటీ తెచ్చేసుకుందాం."

"ఇయ్యాల నీకు కంబళీమీన మనసు పోనా దేటి?"

"సలనికాదే ఒక్క రేతిరి ఇద్దరం ఒకే పక్కమీన ఒకే దుప్పటికింద పడుకుందామని మనసౌతంది."

"నే మనసు పాడుగాను. దుప్పటుంది కదరా?"

"అది సాల్దే."

"నే తేనుపో"

"సంపుతాను."

"సంపితే వూరుకుంటానా? మెడ కొరికేస్తా అమ్మతల్లిలా."

"నేను సంపేసిం తరవాత నువ్వు నా మెడెలా కొరగ్గలవే?"

"సూపియ్‌నా? ఇదిగిలా."

రత్తాలు కొరికినందుకు ప్రేమ పెల్లుబికి కితకితలు పెట్టినట్లు నవ్వాడు కాసులు. కదలికకి దుప్పటి సాంతం జారి కిందపడింది.

"సీ. ఇదోటి" అని విసుక్కున్నాడు.

"కంబళీ తెస్తానుండు" అని లేచి తడిక తోసుకుని పాక బైటకొచ్చాడు.

కంబళీతో తల్లి ముడిచిపెట్టుకుని ఉండలా పడుకుంది. కంబళీమీద చేయి వేస్తుంటే గుండెలెందుకో వేగంగా కొట్టుకున్నాయి కాసులుకి.

ఒక్కరేతిరే కదా అని మనసుకి సరిపెట్టుకున్నాడు.

"ముసలమ్మకి ఒకవేళ మెళకువొస్తే...?" అని సందేహం కలిగింది.

మెళకువ రావడానికి అవకాశం ఇవ్వకుండా పదిలంగా కంబళీ తొలగించి దుప్పటీ కప్పి తడిక బిగించి పాకలోపలికొచ్చాడు దొంగలా.

కంబళీ నిండా కప్పుకున్న మొగుణ్నిచూసి రత్తాలు ఫకఫకబడి నవ్వింది "బూచాళ్ళా వున్నావ్" అంటూ.

బూచాళ్ళా వున్నావ్ అన్నందుకు కాసులుకి హుషారుపుట్టి నిజంగానే బూచాళ్ళా నాలికబైట పెట్టి రత్తాల్ని భయపెట్టాడు.


"ముందది ఇలగియ్యి" అంటూ శరీరాన్ని కంబళీలో దాచుకుని వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకుని "ఎచ్చగుంది" అంది రత్తాలు.

"ఇంకా ఎచ్చగుంటది సూడు" అంటూ కాసులుకూడా కంబళీలో దూరిపోయాడు.

ఇద్దరికీ ఉన్నంతలో సుఖం పంచి ఇచ్చింది కంబళీ.

కాస్సేపు వాళ్ళిద్దరి మధ్యనా మాటలు లేవు చేతలేతప్ప. చలిలేదు——వెచ్చటి హాయేతప్ప.

(వి) చిత్రవిజ్ఞానం



చైనా యువరాణి టూ-వాన్ క్రీ. పూ. 104లో మరణించింది. ఈమధ్య ఆవిడ సమాధి తవ్వగా ఒక కవచం బయటపడింది. దీనితోనే ఆవిడ మృతకాయం కప్పబడిందని తెలిసింది. ఈ కవచం 2,156 పచ్చరాతి పలకలతోనూ, 1,200 తులాల బంగారు తీగలతోనూ నిర్మించబడింది. ఇది ప్రస్తుతం లండన్‌లోని రాయల్ అకాడమీవారి స్వాధీనంలోవుంది. దీని ఖరీదు సుమారు మూడుకోట్ల రూపాయలని అంచనా.

సుఖంతో అలిసిపోయి ఎప్పుడు నిద్ర పోయారో తెలియదు. లేచేసరికి కోడి కూసేసింది. కాసులు బద్ధకంగా ఆవులించి కంబళీ తీసుకుని బైట తల్లిదగ్గర కొచ్చాడు.

కంబళీ కప్పబోతుంటే సత్తెమ్మ ఆయాసంతో రొప్పుతూ, చలికి వణుకుతూ దుప్పటిలో వుండచుట్టుకుపోయి కనిపించింది.

కాసులుకి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

పైకి అనడానికి తనకి నోరు తిరగని జబ్బు ఏదో తల్లికి వుందని మరిచిపోయాడు ఆ రాత్రి.

గబగబా తల్లిని చేతులమీది కెత్తుకుని లోపలికిచేర్చి నులక మంచంమీద పడుకోబెట్టి పాతారోతా బట్టలుకప్పి శరీరాన్ని నీరసంగా గోడకానుకుని కూర్చున్నాడు. పేదతల్లికి పేద కొడుకు చెయ్యగలిగినంతాచేసి ఆపైన భారం "బగుమంతుడి"మీద వేశాడు.

అప్పటికే రత్తాలు గాభరాగా శోకన్నాలు ప్రారంభించడంతో ఇరుగూ పొరుగూ చేరుతున్నారు.

జేబులు తడుముకున్నాడు కాసులు.

చేతికి రెండు రూపాయినోట్లు, ఏవో చిల్లర డబ్బులూ తగిలాయి.

"డాక్టరు దగ్గరికి పోదునా" అని ఆలోచించాడొక్క నిముషం.

"పోతేనే మంచిది. పోకపోతే ఈ ఆయాసం వణుకు, దగ్గుకి ముసలమ్మ సచ్చీసినా అంతకన్నా ఎక్కువే కటసవుద్ది" అనిపించి గబగబా రిక్షా తీసుకుని "సవక డాక్టరుగారి" ఆసుపత్రి వైపు జోరుగా రిక్షా నడిపిస్తూ వెళ్ళిపోయాడు.

సవక డాక్టరుగారి అసలుపేరు సుందర్రావు గారు. ఆసుపత్రి బోర్డుమీద ఆయన పేరుచివర ఎల్. ఎం. పి. అని వుంటుంది.

ఎల్. ఎం. పి. అవగానే ఆయన ఎకాఎకి ఆ పేద హరిజనవాడలో ప్రాక్టీసు ప్రారంభించి గుమ్మందాకా వచ్చిన ఏ కేసునీ వదలకుండా ఏదో ఒక మందిచ్చి డాక్టరుదగ్గరికి వెళ్ళామన్న సంతృప్తి పేదలకి మిగిల్చి 'సవక డాక్టరుగారని' పేదల్లో పేరుబడ్డారు.

ఆదరాబాదరా రిక్షామీద వచ్చి రొప్పుతూ కాసులు 'ఇసయం' చెప్పగానే ఆయన అంతకన్నా ఆదరా బాదరాగా రిక్షాయెక్కి మరి పది నిమిషాలకి కాసులు పాకముందు నిలబడ్డారు.

పాకలోపలినుంచి జనం అంతా బిలబిలలాడుతూ బయటికి వచ్చి "సవక డాక్టరు"గారికి దండాలుచెప్పి అక్కడొకరూ అక్కడొకరూ చెదురుమదురుగా నిలబడ్డారు ఆయనకేసి భక్తితో చూస్తూ.

సవక డాక్టరుగారికి నిజానికి ఆ డిగ్రీలో విలు

వయిన సొంతబంగళావుంది. 20 వేలు కట్నం పట్టుకొచ్చిన విలువయిన భార్యవుంది. మామగారి ఆస్తికి వారసుడైన "పెంపుడు కొడుక్కి" ఏ మాయరోగం రావటంలేదే అనే బాధవుంది. పేద వెధవలు ఎటూ పెద్ద ఆసుపత్రి గుమ్మం కూడా తొక్కలేక తనదగ్గరకే చేరతారనే ధీమా వుంది. రోజులో సగభాగం పేదల పాకదగ్గరే గడిపే అలవాటువల్ల ప్రస్తుతం కాసులు పాక చుట్టూ పరిసరాలుగాని, ఒంటిని సగమే కప్పగల బట్టలు, అమాయకత్వం నిండిన చూపులతో అక్కడ నిలబడ్డ జనంగాని ఆయనలో ఏ సంచలనం కలిగించలేదు.

సవకడాట్రుగారు పాకనోమారు పరికించి చూసి లోపల రోగిని చేరుకోడానికి తను యెంత వరకు వంగాలో అంచనావేసుకుని, అంతవరకూ వంగి లోపలకు అడుగు పెట్టారు.

మంచంమీద చలితో, ఆయాసంతో, దగ్గుతో ఉండలు చుట్టుకుపోతున్న సత్తెమ్మని చూడగానే ఆయన కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"లాభంలేదు....ఆస్మా .... అశ్రద్ధచేశారు" అన్నారు. మందని కాసులు అనుకున్న రంగు నీళ్ళను సిరంజిలో నింపి ఇంజక్షను యిచ్చారు. ఓ మందులచీటి రాసిచ్చారు. ఖరీదయినవిగా కాసులుకు తోచిన సలహాలు నాలుగిచ్చారు. చివర్న కాసులురిక్షా యెక్కి వచ్చిన దారినే వెళ్ళేరు.

కాసులు జేబులు తడిమి మూడురూపాయల చిల్లర ఆయన చేతిలో పొయ్యగానే కళ్ళజోడు సందులోంచి పరీక్షగాచూసి "రానుపోను రిక్షాకి డబ్బులు ఖర్చవలేదు కాబట్టి లాభమే" అనుకొని వ్యాపార ప్రకటనలాంటి మేలురకపు నవ్వునవ్వారు.

"ఇండీసను పొడిచేరు కాబట్టి సవకే. . " అని కాసులు అనుకుని "దండాలుబాబూ" అంటూ వంగి వంగి సలాముచేసి అజ్ఞానపు, అమాయకత్వపు నవ్వు నవ్వాడు.

ఆ తరవాత సత్తెమ్మ ఆయాసం, కాసులు దిగులూ, రత్తాలి శోకన్నాలు ఆ వెనుక ఇరుకూ పొరుగూ సానుభూతి వాక్యాలూ మామూలుగానే మిగిలిపోయాయి.

డాక్టరుగారిచ్చిన సలహాలలో ఖరీదయినవి ఎప్పుడో మర్చిపోయాడు కాసులు. జ్ఞాపకానికి ఇక మిగిలిందల్లా చవకబారు సలహా ఒక్కటే-

"ఆరుబయట పడుకో బెట్టకండి" అన్నది.

తన సుఖం కొంత ఖరీదుగా ముట్టచెబితే ఈ సలహా పాటించడం చాలా సుళువు.

వెంటనే ఆరాత్రి ఆ సలహా పాటించేశాడు.

మళ్ళీ యథాప్రకారం సత్తెమ్మ పడక పాకలోకీ, కాసులు పడక ఆరుబయటికీ మారిపోయాయి.

అదే నులకమంచం .

అదే చిరుగుల దుప్పటీ...

అదే ఇరుకు సుఖం.

అన్నింటికీ అలవాటు పడిపోయి ఆ శీతాకాలం నాలుగునెలలూ గడిపేశాడు.

వేసవి వెళ్ళి, ఆ వెనుకనే వర్షాకాలంకూడ వెళ్ళిపోతుండగా సత్తెమ్మ కన్నుమూసింది తిరగబెట్టిన ఆస్మా తగ్గక.

ఆ పాక యిక శాశ్వతంగా కాసులుదీ రత్తాలుదీనూ!

అలా అని గట్టిగా అనుకోడానికిలేదు.

అప్పటికే కొడుక్కి మూణ్ణెల్లు నిండగా రత్తాలు మళ్ళా కడుపుతోంది.

"ఈ ఇరుకు బతుకుతో ఎప్పుడూ మూడో వాడికి చోటుండటంలేదు. నువ్వెందుకొచ్చావురా ఈ పాకలోకి? ఏరే ఏదన్నా కలిగిన లోగిలి చూసుకోలేక పోయావా?" అని కొడుకు పుట్టిన రోజున కాసులు బాధపడితే రత్తాలుకళ్ళ నీరెట్టుకుంది.

"ఈసారి మగబొట్టె నియ్యకురా దేవుడా! ఆడబిడ్డనియ్యి—" అని రత్తాలు దేముణ్ణి ప్రార్థిస్తూ వుంటుంది కాసులుకి తెలీకుండా.

మరో కొడుకు పుడితే ఆ ఇరుకుపాకలో మరో వాటాకి పోటీ వస్తుందని రత్తాలు భయం!

ఒకసారి ఆమాట కాసులుతో అనగానే వాడు పగలబడి నవ్వాడు. ఎందుకు నవ్వాడో ఆలోచిస్తే వాడికే అంతుచిక్కలేదు.

వాడి ఇరుకు బతుకులో సుఖం ఎంతుందో వాడి నవ్వులో అర్థమూ అంతే వుంది! □

జ్యోతి కథలపోటీలో

ద్వితీయ బహుమతి పొందిన కథ

ప్రియురాలి ప్రేమలేఖ

ప్రియాతి ప్రియమైనరామ్,

ఈ ఉత్తరం ఎవ్రరాశారా అని ఆశ్చర్యపోతున్నావు కదూ? నీకు తెలీకూడదనే నేనూ సంతకం పెట్టలేదు. బహుశా ఈ దస్తూరి చూసి గుర్తించగలవేమో! మనం సరిగ్గా పదిహేనేళ్ళ క్రితం ఇదే రోజున కలుసుకొన్నాం. ఎక్కడో చెప్పుకోగలవా?

పోనీలే-నేనే చెప్తాను.

ఆ రోజు ఆబిడ్స్ బస్‌స్టాప్‌లో మా క్లాసు పుస్తకాలు పట్టుకొనినిలబడి బస్‌కోసం ఎదురు చూస్తున్నాను. నా పక్కనే నువ్వూ ఒకే ఒక్క నోట్‌బుక్ (నీలం రంగు అట్ట ఉంది. వెనుక షర్మిలా టాగూర్ బొమ్మ) పట్టుకొని నిలబడ్డావు. ఆ రోజు నేను వైలెట్ చారలున్న గ్రీన్ చీర కట్టుకొన్నాను. నువ్వు నల్లగీతలున్న ఊదారంగు పాంటూ, చుక్కల షర్టూ వేసుకొన్నావు. నువ్వు నావేపు రహస్యంగా చూడటం ప్రారంభించేవు. కాని అది నేను గమనించానన్న విషయం నీకు తెలీదు. కొద్దిసేపటి తర్వాత నేను నీవేపు చూశాను. ఇద్దరి చూపులూ కలుసుకొన్నాయి. నువ్వలా చూస్తూంటే నాకు సిగ్గు కలిగింది. వెంటనే మరోవేపుకి చూపులు మరల్చేసుకొన్నాను. ఈ లోగా బస్ వచ్చింది. నేను ఆ బస్ ఎక్కేశాను. లోపల నిలబడి కిటికీలోనుంచి నీవేపు చూశాను. నీ చూపులు ఇంకా నామీదే ఉన్నాయ్.

ఆ చూపుల్లో యెన్నో మూగభావాలు.

ఇంటికి చేరుకొన్నా నీ చూపులు నన్ను వెంటాడుతూనే ఉన్నాయ్. మర్నాడు మళ్ళీ అదే సమయానికి అక్కడ కలుసుకొన్నాము. కొదిసేపు ఇద్దరం అమాయకత్వం నటించాక మళ్ళీ మన చూపులు కలుసుకొన్నాయ్. ఈసారి నేను సిగ్గుపడ్డానుగానీ చూపులు వెంటనే మరల్చుకోలేదు.

కళ్ళు కిందకు దించుకొన్నాను.

"ఈ అమ్మాయ్ కళ్ళు ఎంత బావున్నాయో" అని నువ్వనుకొన్నావు. (అలా అని తరువాత చెప్పావు నువ్వు)

"ఈ అబ్బాయ్ యెంత బాగున్నాడో" అని నేననుకొన్నాను.

సరిగ్గా అప్పుడే నేను వెళ్ళాల్సిన బస్ వచ్చింది. నాకు మొదటిసారిగా బస్ త్వరగా వచ్చినందుకు కోపమొచ్చింది. చిరాగ్గానే బస్ దగ్గరకు నడిచాను. అక్కడ కొంచెం రద్దీగా ఉంది. అదే మరో రోజయినట్లయితే ఆ రష్ లోనే జొరబడి బస్ ఎక్కేదాన్ని. కాని ఆ రోజు అది సాహసగా తీసుకొని మళ్ళీ వెనక్క-

యర్రంశెట్టి శాయి

తిరిగివచ్చి నీ పక్కన నిలబడిపోయేను. నువ్వు అప్పుడు పొందిన ఆనందం నీ కళ్ళల్లో చూశేను. నాకూ ఓ విధమయిన అనుభూతి —తీయనిది మనసులో నిండిపోయింది.



ఉండుండి ఒకరి వంక ఒకరు చూసుకొంటూ మరి కొద్దిసేపు గడిపాము. ఎన్నో బస్సులు వచ్చిపోతున్న విషయం మనకు తెలీదు. ఎంతోమంది మనిద్దరినీ గమనించి తమదారిన తాము పోతున్న సంగతి కూడా గ్రహించే స్థితిలో మనం లేము.

చీకటిపడిపోయింది.

లైట్లు వెలిగాయి. అప్పుడు నేను స్పృహలోకొచ్చాను. టైము చూసుకొన్నాను.

గాబరాపడి బస్ కోసం చూడసాగాను. నువ్వు నవ్వావు. నీకు తెలీకుండా నేనూ నవ్వుకొన్నాను.

బస్ వచ్చేసింది. పరుగుతో వెళ్ళి బస్ ఎక్కేశాను. బస్ స్టార్టు అయాక కిటికీలో నుంచి నీవేపు చూశాను. నువ్వు చిరునవ్వుతో నావేపే చూస్తున్నావు.

“మరికొంతసేపు అక్కడే నిలబడితే ఎంత బావుండేది” అనిపించింది నాకు.

ఆ రాత్రి నాకు భోజనం సయించలేదు. ఆకలంతా ఏమయిపోయిందో తెలీదు. అర్ధరాత్రి

దాటినా నిద్రపట్టలేదు. ఏదో అనిర్వచనీయమైన స్థితి.

తర్వాతిరోజు మా కాలేజీనుంచి బయట పడేసరికి బాగా ఆలస్యమయిపోయింది. నువ్వు వుంటావో వుండవోనని త్వరత్వరగా నడుచుకొంటూ అక్కడికి చేరుకొన్నాను. అంత దూరంనుంచే నిన్ను గుర్తించాను. అంతవరకూ ఆత్రుతగా ఎదురుచూస్తున్న నీ కళ్ళు నన్ను చూడగానే మిలమిల మెరిసాయి. బయటకు పొంగి పొరలుతోన్న నా ఆనందాన్ని అతి

వెళ్ళకుండా ఉంటే బావుండునని నువ్వు అనుకొన్నావు. "ఇప్పుడే వెళ్ళకు" అన్న భావం నీ కళ్ళద్వారా నా కందించావు.

నేను కదలలేదు.

అక్కడే నిలబడిపోయేను. బస్ వెళ్ళిపోయింది. నువ్వు ఆనందంతో కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నావేపు చూశేవు. నాకు మరింత దగ్గరగా జరిగి "మీరు ఎందాకా వెళ్ళాలి?" అనడిగావు.

నేను జవాబు చెప్పలేకపోయాను. చాలా



కష్టంమీద అణచుకొన్నాను. నీ పక్కన నిలబడి నీవేపు చూశాను. నువ్వు సన్నగా మందహాసం చేశావు. నేనూ జవాబుగా—కనబడీ కనబడనట్లు—చిరునవ్వు చిందించాను. అంతలోనే సిగ్గు ముంచుకొచ్చి తల తిప్పుకొన్నాను.

ఆ సమయంలోనే నేను వెళ్ళాల్సిన బస్ వచ్చింది.

నా గుండెలు దడదడలాడినయ్. వెళ్ళాలా వద్దా అనే సంశయంలో పడిపోయాను. నేను ఎంబ్రేసింగ్‌గా ఫీలయ్యాను.

జవాబుగా నవ్వేసి చూపులు మరల్చుకొన్నాను.

"కొంచదూరం నడచివెళ్దాం రాకూడదూ?" ప్రాధేయపడుతూ అడిగావు.

నా గుండెలు వేగంగా కొట్టుకొన్నాయ్.

ఏం మాట్లాడాలో తెలీలేదు. సిగ్గుతో కుంచించుకుపోయాను. రక్తమంతా నా మొఖంలోకి ప్రవహించింది.

"ప్లీజ్" మళ్ళీ అన్నావు నువ్వు.

మనిద్దరి కళ్ళూ మళ్ళీ కలుసుకొన్నాయ్. నీ కళ్ళలోని ఆకర్షణ నన్ను కట్టివేసింది. 'కాదు' అన్న మాటను లోలోపలే రూపుమాపింది.

అప్రయత్నంగానే తలూ పేను. నువ్వు సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యావు.

"పదండి" అన్నావు ప్రపంచాన్ని జయించినంత ఉత్సాహంతో.

అని రెండడుగులువేసి నావేపు చూశేవు.

బిడియంగానే నేనూ కదిలేను.

ఇద్దరం పక్కపక్కనే నడవసాగేము. ప్రవాహంలా ఎదురొస్తున్న జనాన్ని, వాహనాలను ఎలా తప్పించుకొంటున్నామో, ఎలా దాటుతున్నామో మనకి తెలీనే తెలీదు.

కొద్దిదూరం నడిచాక "మీ పేరు చెప్పరూ?" అంటూ అడిగావు.

నేను ధైర్యం తెచ్చుకొని 'లలిత' అన్నాను.

నువ్వు ముగ్ధుడయిపోయావు "నా కెంతో ఇష్టమయిన పేరు" అన్నావు.

మరికొన్ని అడుగులు వేశాము.

"నా పేరు తెలుసుకోరా?" అడిగావు నువ్వు.

నేను నీ వంక చూసి 'చెప్పండి' అన్నాను చిన్నగా నవ్వుతూ.

"శ్రీరామ్" అన్నావు నువ్వు.

"మీరేం చదువుతున్నారు?" అడిగాను నేను.

"బి.కామ్. మరి మీరో?" అడిగావు.

"ఇంటర్మీడియెట్" జవాబిచ్చాను.

అలా మాటాడుకొంటూంటే మనిద్దరికే గాలిలో తేలిపోతున్నట్లుంది.

"మీ ఇల్లెక్కడ?" అడిగావు.

"మల్లేపల్లి —"

"మా ఇల్లు ఖైరతాబాద్" అన్నావు.

ఇద్దరం నాంపల్లి స్టేషన్‌వరకూ వచ్చేశాము.

"ఇంక నేను వెళ్ళిపోతాను" నువ్వు అక్కడే ఆగిపోవాలన్నట్లు అన్నాన్నేను.

"రేపు కలుస్తారు కదూ?" ఆశగా అడిగావు.

చిరునవ్వుతో తలూపాను.

నేను వెళ్ళిపోతూంటే నువ్వు అక్కడే నిలబడి చెయ్యి వూపావు. నేనూ చేయి ఊపాను.

ఆ రాత్రంతా నాకు ఎన్నో మధురమయిన ఊహలు.

ఆ మర్నాడు ఇద్దరం ఒకే సమయానికి అక్కడ కలుసుకొన్నాం.

"ఇవాళ కాసేపు గార్డెన్‌లో కూర్చుని మాట్లాడుకొందాం, ఏమంటారు?" అడిగావు నువ్వు నడుస్తూ.

"మీ ఇష్టం" అన్నాన్నేను.

ఇద్దరం గార్డెన్ వరకూ నడిచే వెళ్ళాము.

ఎవ్వరికీ కనబడకుండా పూల మొక్కల గుబురలో కూర్చున్నాం ఇద్దరమూ.

"మనిద్దరమూ ఒకరంటే ఒకరు ఎందుకిలా ఆకర్షింపబడ్డాము?" అడిగావు నువ్వు.

"నాకు తెలీదు" నవ్వుతూ జవాబిచ్చాను.

"రాత్రిళ్ళు మీకు నిద్రపడుతోందా?" తిరిగి అడిగారు.

"ఊహూ!"

"నాకూ అంతే! అంతకుముందెప్పుడూ మొద్దునిద్ర పోయేవాడిని. ఆ నిద్రంతా ఏమయిపోయిందో తెలీటంలేదు. మీకు భోజనం సయిస్తోందా?"

"ఊహూ! రెండు ముద్దలు తినేసరికే కడుపు నిండిపోతోంది" నేలమీద చేత్తో గీతలు గీస్తూ అన్నాను.

"అసలు నాకు అది కూడా సయించటం లేదు. మా వదిన గొడవపెట్టేస్తోంది. నేను ఇంకెక్కడో భోజనం చేసి వస్తున్నానని" నవ్వుతూ చెప్పావు నువ్వు.

నా చేతిలోని పుస్తకాలు తీసుకొని తిరగేశావు. ఇంగ్లీష్ టెక్స్ట్ పుస్తకంలో ఆఖరి పేజీలో వున్న నా పేరుకింద శ్రీరామ్ అని రాశావు.

అది చూసి 'అమ్మో' అన్నాను నేను కంగారుగా.

"ఏమిటి" ఆశ్చర్యంగా అడిగావు.

"ఎవరయినా చూస్తే ఇంకేమయినా ఉందా?" ఆందోళనగా అన్నాను.

"పోనీ కొట్టేశెయ్యనా?" ఇబ్బందిగా అడిగావు.

(వి)చిత్ర విజ్ఞానం



చదరంగం ఆట రష్యాలో రెండవ శతాబ్దంలో పుట్టిందని రష్యా వార్తాపత్రిక ప్రావ్దా పేర్కొన్నది. ఉజ్‌బెకిస్థాన్‌లోని "డాల్‌వరిన్ టేపే" అనబడే ప్రదేశంలో పురావస్తుశాఖవారు చదరంగం ఆటవస్తువులను వెలికితీసి యీ వార్త అందించారు. ఈ వస్తువులు మనదేశంలోని చదరంగం ఆటవస్తువులను పోలివుండటం చేత, ఈ ఆట మొదట భారతదేశంలో అంతకు పూర్వమే పుట్టిందని వారి అభిప్రాయం!

నాకు ఎందుకో అలా కొట్టివేయడం మనస్కరించలేదు.

"వద్దులెండి" అన్నాను.

అని నీ చేతిలోని పుస్తకం తీసుకొని 'శ్రీరామ్' అన్న అక్షరాల పక్కనే 'లలిత' అని రాశాను.

ఆ పుస్తకం నా చేతుల్లోనుంచి తీసుకొని 'లలిత' అన్న అక్షరాలను ముద్దుపెట్టుకొన్నావు.

నాకు తగని సిగ్గనిపించింది.

చీకటిపడేవరకూ ఇద్దరం తీయని కబుర్లలో లీనమయిపోయాం!

నన్ను మా ఇంటివరకూ పంపి నువ్వు వెనక్కి వెళ్ళిపోయావ్.

ఆ మర్నాడూ అలాగే గడిచిపోయింది.

ఇద్దరం మా ఇంటికి కొద్ది దూరంలో ఆగిపోయాము.

"రేపు ఆదివారం కదూ" అడిగావు.

"అవును!" బాధగా అన్నాను.

"మీ కాలేజీకి శెలవు కదూ?" తెలిసీ అడిగావు.

"అవును."

"మరి మనం కలుసుకొనేదెలా?" బాధగా అడిగావు.

"ఎల్లుండి" కావాలని అన్నాను నవ్వు బిగపట్టుకొంటూ.

"అంతేనా?" నిరాశతో అన్నావు.

ఇంక ఆపుకోలేక నేను నవ్వేశాను.

"మీకేమీ బాధగాలేదూ?" అడిగావు నువ్వు.

నేనేమీ మాట్లాడలేదు.

"పోనీ రేపు మధ్యాహ్నం బయటకు రాకూడదూ?" అడిగావు.

"ఎందుకు?" ఆశ్చర్యంగా చూశాను.

"....అలా కాసేపు తిరుగుదామని... "

నా మనసులో ఉన్న కోరికా అదే. కానీ కొంచెం బెట్టుచేశాను.

"ఊహు! కుదరదు" అన్నాను.

నువ్వు కృంగిపోయావ్.

"ప్లీజ్! లలితా! మిమ్మల్ని చూడకుండా ఉండలేను" అన్నావు బ్రతిమాలుతూ.

"సరే" అన్నాను జాలి తలచినట్లు.

మర్నాడు ఇద్దరం మళ్ళీ ఆబిడ్స్ బస్ స్టాండ్‌లో మధ్యాహ్నం రెండింటికి కలుసుకొన్నాం.

ఇద్దరం ఆ పక్కనే ఉన్న థియేటర్‌లో సినిమా కెళ్ళాం.

ఆ సినిమా ఏమిటో నీకు గుర్తుందనుకొంటాను. 'వాగ్దానం'.

అందులోని ప్రేమ దృశ్యాలు మనిద్దరినీ మరింత దగ్గర చేసినయ్. అంతవరకూ లోపల

దాగివున్న అనుభూతిని బయటకు లాగినయ్. మనకు తెలియకుండానే నా చేయి నీ చేతుల్లోకి చేరుకొంది.

ఎంత అద్భుతమయిన స్పర్శ అది. ఎంత మరపురాని అనుభూతి అది. నువ్వు నా కళ్ళ ల్లోకి చూశావు. నేనూ నీవైపే చూశాను. ఆ తరువాత మనం సినిమా చూడలేదు. మన కళ్ళల్లో దాగుకొన్న మధురమయిన ఊహల్ని కళ్ళద్వారానే కథలుగా చెప్పుకొన్నాం.

సినిమా హాలునుంచి బయటికొచ్చి టాంక్ బండ్ మీద పార్కులో కూర్చున్నాం.

నేను నీ వళ్ళో తలపెట్టుకొని పడు కొన్నాను. నువ్వు నా పెదాలమీద వద్దులే! ఆ తరువాతేం జరిగిందో నీకూ తెలుసుగా.

ఆ తరువాత ప్రతిరోజూ పార్కులోనే కలుసుకొనేవాళ్ళం.

"ఇకనుంచీ నన్ను 'మీరు' అనొద్దు" అడి గాను నేను.

"మరి నన్నుకూడా 'నువ్వు' అనే అనాలి" షరతు పెట్టావు నువ్వు.

ఇద్దరం మోకాళ్ళమీద తలపెట్టుకొని ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూస్తూ ఎన్ని రోజులు గడి పాము?

"జీవితాంతం యిలా నీ కళ్ళలోకి చూస్తూ నన్ను నేనే మరచిపోగల అదృష్టం లభి స్తుందా లలితా అంటూ" నువ్వడిగావు ఒకరోజు.

"నీ గుండెలమీద వాలిపోయి సర్వం మరిచి పోవడమే నేను కోరుకొనేది" అన్నాను నేను.

ఇద్దరం నవ్వుకొన్నాము. కబుర్లు చెప్పు కొన్నాము. ఒకరిమీద ఒకరం అలిగాము. ఒకరినొకరు స్పర్శించుకొన్నాము. కౌగలించు కొన్నాము.

ఎన్ని సాయంత్రాలలా గడిచిపోయాయ్?

నువ్వు బి. కామ్. పాసయ్యావు. నేనూ ఇంటర్మీడియెట్ పాసయ్యాను.

నువ్వు ఉద్యోగాన్వేషణలో వ డ్డా వు. మా వాళ్ళు నా చదువు మానిపించి వివాహ ప్రయ త్నాలు చెయ్యటం మొదలుపెట్టారు.

ఆ విషయం చెప్తే నువ్వు నవ్వావు.

"వివాహం మనిద్దరి కీరాసిపెట్టి ఉంటే వేరే సంబంధా లెందుకు చూస్తున్నారు?" అనడి గావ్.

నేనూ నవ్వేశాను.

మరికొన్ని రోజులు గడిచిపోయాయ్. మన మధ్య దూరాన్ని ప్రేమలేఖలు దగ్గర చేసి నయ్. అదివరలా ప్రతిరోజూ కలుసు లేకపోవ డంతో మనిద్దరికీ అశాంతిగానే ఉంది.

కలుసుకొన్న కొద్దిసేపూ మళ్ళీ విడిపోతామన్న బెదురులోనే గడిపేవాళ్ళం.

"విరహముకూడా సుఖమే కాదా" అన్న పాటలోని నిజాన్ని మనం అప్పుడు చవి చూచాము.

"ఇంకెన్నిరోజులు! మరో నెలరోజుల్లో నాకు ఉద్యోగం వచ్చేస్తుంది. అప్పుడు మనం మనపెద్దాళ్ళు వ ప్పు కొ న్నా లేకపోయినా వివాహం చేసుకొందాం" అన్నావు నువ్వు.

ఆరోజుకోసరమే ఇద్దరం కళ్ళల్లో వత్తు లుంచుకొని ఎదురుచూడసాగాము.

ఆ ఏడు దీపావళిపండుగ నీకు గుర్తుందా?

ఇద్దరం ఎలాగోలా మధ్యాహ్నమే ఇంట్లో నుంచి తప్పించుకొని, లోకల్ ట్రైన్‌లో ఉందా నగర్ వరకూ వెళ్ళాం. తిరిగి అదే లోకల్‌లో వచ్చేటప్పుడు చీకట్లో—ఇంకెవరూ లేని ఆ కంపార్టుమెంటులో కాకరపువ్వొత్తులుకాల్చాం. ఆ వెలుగులో ఒకరినొకరు చూచుకొంటూ మైమరచిపోయాం. ప్రతి దీపావళీ అంతటి ఆనందం. అంతటి ఉత్సాహంతో ఆ పండుగ జరుపుకోవాలని నిర్ణయించుకొన్నాం. అందరూ దీపావళి చేసుకొంటూంటే చేతిలో చెయ్యేసు కొని చూస్తూ వీధులన్నీ తిరిగేము.

"మా ఇంట్లోవాళ్ళు నాకు ఓ సంబంధం నిశ్చయం చేశారు. ఆ విషయం చెప్పి నేను కన్నీరు పెట్టుకొన్నప్పుడు, నీకూ కన్నీరాగ లేదు. అప్పుడు నా కన్నీళ్ళు తుడిచేస్తూ నువ్వే మన్నావో గుర్తుందా?

"పిచ్చి లలితా! మీవాళ్ళు నిశ్చయించినంత మాత్రాన ఆ పెళ్ళి అయిపోతుందనుకొంటు న్నావా? నే నెవరో తెలుసా? పృథ్వీరాజుని.

(వి) చిత్ర విజ్ఞానం



మలేరియా మనదేశంలో మళ్ళీ విజృంభిం చింది. ఈ వ్యాధి వ్యాప్తికి తోడ్పడే అనాఫిలిస్ దోమల జనాభా చెప్పనలవికానంత వేగంతో పెరిగిపోతున్నది. అనాఫిలిస్ దోమను నిర్మూ లించేందుకు అమెరికాలోని ఎల్‌సాల్వడార్ శాస్త్రజ్ఞులు ఇ-ఎన్-టి 61585 అనే మందును కనుగొన్నారు. ఈమందు చల్లితే దోమల జన నేంద్రియాలు నశించిపోతాయట!

నువ్వు రాణీ సంయుక్తవు. అర్థమయిందా?" అడిగావు నవ్వుతూ.

అప్పుడు నా కెంత ఆనందం కలిగిందని?

"ఇదిగో! ఇదే ఆఖరుసారి నీ కన్నీళ్ళు చూడటం! మరోసారి నువ్వు కన్నీరు పెట్ట కూడదు. పెట్టనీను. నువ్వు ఏం చేసినా నేను సహించగలను గానీ కన్నీరు మాత్రం చూడ లేను. దయచేసి ఏడవకు" అంటూ నన్ను నీ గుండెలకు హత్తుకొని ఊరడించావు.

"మన జీవితమంతా నవ్వులమయం కావాలి. ప్రతిక్షణం రసవత్తరంగా ఉండాలి. ఇప్పుడు పొందుతున్న ఆనందానికి యెన్నో రెట్లు ఎక్కువ అనుభవించాలి" అన్నావు నా చెవిలో.

అవి నా శరీరానికి యెంత గిలిగింతలు కలిగించిందీ నీకూ తెలుసు.

ఆ మాటలు నన్నే లోకాలకు తీసుకు పోయిందీ నా కింకా గుర్తుంది.

నీకు ఉద్యోగం దొరికింది.

ఆ రోజు యెంత హడావిడి చేశావ్ నువ్వు. ఎంత గొడవయిపోయింది?

సరాసరి మా యింటికొచ్చేశావ్. మా నాన్న గారిని కలుసుకొని మనిద్దరం స్నేహితులమనీ, వివాహం చేసుకోవాలనుకొంటున్నామనీ చెప్పావు. ఆయన ఖంగారుపడిపోయారు.

అమ్మ నన్ను నిగ్గదీసింది.

"నా కున్న ఉద్యోగంతో లలితను పోషిం చుకోగలను. మీరు ఆశీర్వదించి మమ్మల్ని ఒకటి చేయాలి" అనడిగావు.

వాళ్ళు మీ కులం యేమిటని నిన్ను అడి గారు.

"మేము మనుషులం! మీరూ మనుష్యులే కనుక మనది ఒకే కులం" అన్నావు నువ్వు.

అమ్మ వప్పుకోకపోయినా నాన్నగారికి నువ్వంటే ఇష్టం కలిగింది. కట్నాలివ్వలేక వదులుకొన్న సంబంధాలు ఆయనకు గుర్తున్నాయ్. అందుకే వెంటనే అంగీకరించారు.

ఆ రోజే మనిద్దరం మీ ఇంటికి వెళ్ళాం.

నన్ను బయటి గదిలో కూర్చోబెట్టి నువ్వు లోపలకెళ్ళావ్! మీ వదినను తీసుకొచ్చి నన్ను చూపించేవు.

ఆమె నిర్ఘాంతపోయింది నన్ను చూసి.

"ఎవరీ అమ్మాయ్?" అనడిగింది నిన్ను. తేరుకొని—

"మీ ముద్దుల మరిదికి ప్రియురాలు" అని చెప్పావు నీవు నవ్వుతూ.

ఆమె ఆశ్చర్యపోయింది.

"అయితే—వాళ్ళూ వీళ్ళూ నీ గురించి చెప్పినవన్నీ నిజమేనన్నమాట" అంది నా దగ్గరకొస్తూ.

నేను ఆమెకు నమస్కరించాను.

"నీ పేరేమిటి?" నా చేయి పట్టుకొని లోప లికి తీసుకెళ్ళి మంచంమీద కూర్చోబెట్టి తనూ నా పక్కన కూర్చుంది.

పేరు చెప్పాను.

ఎన్నో వివరాలడిగింది. అన్నీ వినయంగా చెప్పాను.

ఆ తరువాత మావాళ్ళు మీ ఇంటికి రావటం-అన్నీ మాట్లాడుకోవటం-పది రోజుల తరువాత మన వివాహం నిశ్చయింపబడటం, వెంటనే జరిగిపోయాయ్.

రేపు 'పెళ్ళి' అనగా ఇవాళ మనం కలుసు కున్నాము. ఆ రోజంతా ఎక్కడెక్కడ తిరి గామో, ఎంత ఆనందం అనుభవించామో మన ఆఖరి క్షణాలవరకూ మర్చిపోలేము.

"లలితా! నీ కివాళ మాట ఇస్తున్నాను. మనం ఇన్నిరోజులు ఎలా ఆడుతూ పాడుతూ గడిపామో-వివాహమయిన తర్వాత ప్రారంభ మయే జీవితంకూడా అలానే గడుపుతాము. ఈ రోజు నేను నిన్నెలా ఆరాధిస్తున్నానో జీవి తాంతం నిన్నలాగే ఆదరిస్తాను. అలాగే నువ్వూ ఎన్ని సమస్యలొచ్చినా, ఎన్ని కలతలెదురయినా నీ చిరునవ్వు వాడిపోదని హామీ ఇవ్వాలి. ఇప్పటివరకూ నా పట్ల నువ్వు చూపుతున్న అనురాగం జీవితాంతంఇలాగే చిగురిస్తూండాలి."

అన్నావు నువ్వు చెయిజూపుతూ.

నీ చేతిలో చేయి వుంచాను నేను.

ఆ క్షణాలు ఎంత పవిత్రమయినవి? ఆ ఆరా ధన, ఆ అనురాగం, ఆ అభిమానం ఎంత గొప్పవి.

ఎలా మర్చిపోగలం ఆ రోజుని.

వివాహం అయింది.

ఇద్దరం సంసారం ప్రారంభించాము. ఎన్నో రోజులు మనం ఊహించిన ఊహలకన్న మధురంగా గడచిపోయాయ్.

మనకిద్దరకూ మరో ఇద్దరు పాపాయిలు తోడయారు.

మనం ఎదురుచూడని సమస్య లెదురొచ్చి నయ్. కష్టాలు కమ్ముకొన్నయ్.

ఇబ్బందు లెక్కువయ్యాయ్.

చాలీచాలని జీతాలు, పెరిగిన సంసారం, బాధ్యతలు, చిక్కులు, చిక్కు సమస్యలు—

ఇవన్నీ మన ఆనందానికి అడ్డుతగలటం మొదలయింది.

నువ్వు నాకిచ్చిన హామీని మర్చిపోయావు.

నేను నీకు చేసిన బాసలు నిలబెట్టుకోలేక పోయాను.

మనిద్దరిమధ్యా ఆనాటి ఆరాధన లేదు. అనురాగం మాసిపోయింది. చిరునవ్వులు వాడి పోయాయి. నవ్వుతూ, తుళ్ళుతూ, పరవశిస్తూ చెప్పుకొనే కబుర్లు, ఆడుకొనే ఆటలు, చిరు కోపాలు, అలకలు, అలుపులు, సరదాలు, సంతోషాలు, పరిహాసాలు—క్రమేపీ ఎందుకు కరువయిపోయాయ్?

శ్రీరామ్!

నేను నీ లలితను.

ఆనాడు బస్‌స్టాప్ దగ్గర పరిచయమయిన లలితనే!

"నీ కళ్ళు ఎంత బావుంటాయ్" అన్న శ్రీరామ్‌వి నువ్వేకదూ!

"ఇలా నీ వళ్ళో పడుకొని ఎన్ని యుగా లయినా గడిపేయగలను" అన్న శ్రీరామ్ వేనా నువ్వు?

"నా చిరునవ్వు ఎప్పటికీ వాడిపోకూడదనీ, కలకాలం నేను నీ ఇంట్లో నవ్వుతూ పాడుతూ ఉండాలని" బాసలు చేయించుకొన్న నా శ్రీరామ్‌వే కదూ నువ్వు?

ఇవన్నీ ఎలా మర్చిపోగలిగావు శ్రీరామ్?

వద్దు శ్రీరామ్ వద్దు!

నేనిక భరించలేని జీవితం.


నాకు రుచికరమయిన భోజనం అవసరం లేదు. ఖరీదయిన బట్టలు నేను కోరటం లేదు. ఇంద్రభవనం లాంటి ఇల్లూ నా కొద్దు. కార్లూ, స్కూటర్లూ ఇవన్నీ నా కనవసరం.

నన్ను పస్తులుంచు నేను సహిస్తాను.

నన్ను కటిక దరిద్రానికి గురిచేయి. ఆనం దంగా సహిస్తాను.

నన్ను అష్టకష్టాలూ పెట్టు. చిరునవ్వుతో స్వీకరిస్తాను.

కాని శ్రీరామ్!



నాకు ఆనాడు ఆబిడ్స్ బస్‌స్టాండ్‌లో మనం అనుభవించిన తీయని అనుభూతిని మళ్ళీ ప్రసాదించు.

ఆనాడు గార్డెన్‌లో నా ఇంగ్లీష్ టెక్ట్స్‌లో ఆఖరి పేజీమీద నీ పేరు రాసి కలిగించిన థ్రిల్ మళ్ళీ కలిగించు.

ఆ రోజు టాంక్ బండ్ పార్క్‌లో నా పెదాల మీద ముద్దుపెట్టుకొని కలిగించిన గిలిగింతలు నాకు మళ్ళీ కావాలి.

ఆ రోజు మొదటిసారి సినిమా కెళ్ళినప్పుడు నా చేతిని నీ చేతుల్లోకి తీసుకొన్నప్పుడు కలిగిన గగుర్పాటుని దూరం చేయకు.

ఆ రోజుల్లో నన్ను నీతో పాటు నడిపించి, ఎన్నో తీయని కబుర్లు చెప్పి, కథలు వినిపించి, పరిహాసాలు చేసి, నాకు కలిగించిన ఆనందం, ఆకర్షణ, పరవశత్త్వం నాకు తిరిగి అందించు.

ప్రతిక్షణం ఒక అమూల్యమయిన వరంగా అందించిన ఆనాటి క్షణాలు మళ్ళీ మన జీవితంలో ప్రవేశపెట్టు.

"మన మధ్య నెలకొన్న ఆనాటి ప్రేమానుబంధం తాత్కాలికం కానీకు."

'నీకోసం నేను నాకోసం నువ్వు' అనే భావనను చెరిగిపోనీకు. దానికి మళ్ళీ జీవం పోయి.

మనం ప్రారంభించిన ప్రేయసీ ప్రియుల అనుబంధం చివరివరకూ అలాగే నిలవనీ; దానిని మధ్యలో మార్చివెయ్యకు.

నేను భరించలేను రామ్!

నేను ఆ 'మధురమయిన' రోజుల్లోనే ఉండి పోయాను. నన్ను నిర్దాక్షిణ్యంగా బయటకు లాగకు. దయచేసి నువ్వూ నా దగ్గరకొచ్చి నన్ను ఆదుకో.

నన్ను ఆనాటి లలితగానే మిగలనీ!

నువ్వు ఆనాటి శ్రీరామ్‌గా రూపొందు—


ఇంతే నేను కోరుకొనేది.

ఇదే నాక్కావలసింది — నీ — ఒకనాటి ప్రియురాలు." □

"విష్ యూ గుడ్ లక్!" కారు ఆపి, నేను దిగగానే, నావేపుచూస్తూ, కొంటెగా కన్ను గీటుతూ అన్నాడు రాజా.

ప్రతిగా ప్రతిసారిలానే గొప్పగా నవ్వబోయాను కానీ, ఎంచేతనో నవ్వలేకపోయాను.

"రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో అంటే సుమారు మూడుగంటల తర్వాత కారు ఇక్కడికే తెచ్చి, ఈ మలుపు దగ్గరే ఆపుతాను.. నువ్వు రాగానే వెళదాం ." కారు స్టార్ట్‌చేస్తూ మరోసారి నావేపు చూచి, హుషారుగా తలెగరేసి అన్నాడు రాజా...మరు నిముషంలో కారు వెళ్ళిపోయింది. సిటీ బార్డర్స్‌లో వున్న పెద్ద మలుపు ఇది. రెండు సంవత్సరాల క్రితం వరకూ ఇక్కడ ఇండ్రస్ట్రియల్ బిల్డింగ్స్ తప్ప



మలుపులో మనుషులు

పవని నిర్మలప్రభావతి

జ్యోతి కథల పోటీలో

తృతీయ బహుమతి పొందిన కథ



మరేమీ వుండేవి కావు. కానీ ఇప్పుడు చాలా బంగళాలు వెలిశాయి .... ఆ మూలగా, ఓ ఫర్లాంగు దూరంలో కనిపిస్తున్న ఎత్తైన నీలి రంగు బంగళా డాక్టర్ సుశీలది. ఈ మలుపులో తరచూ కారు, లారీ, బస్సు ప్రమాదాలు జరుగుతుంటాయి. మలుపు తిరగటంలో కొన్ని, ఎదురుగా వస్తున్న వాహనాన్ని చూచుకోక, కేర్ చెయ్యక మరికొన్నీ! అందుకే "డెత్ కార్నర్!" అంటారు దీన్ని ముద్దుగా! డాక్టర్ సుశీల మెడిసిన్‌లో నా క్లాస్‌మేటు. సిటీలో నాలాగే ప్రాక్టీసు పెట్టింది. గత పదేళ్ళలో సైకియాట్రిస్ట్‌గా నేనెంత పేరూ, పలుకుబడీ, డబ్బూ సంపాదించానో, తను అంత అట్టడుగుకు పడిపోయింది! ఆర్థికంగా చాలా ఇబ్బందులకు లోనయింది. ఎలా వచ్చిందో ఈ ఐడియా, ఈ కార్నర్‌కు ఓ ఫర్లాంగు దూరంలో డిస్పెన్సరీ ఓపెన్ చేసింది! ఆ క్షణం ఎలాటిదో గానీ, ఈ కార్నర్‌లో జరిగే ప్రమాదాల తాలూకు ప్రథమ చికిత్సలూ, ఓ మోస్తరు వైద్యమూ, ఆపరేషన్స్ ఆమెకు అంది వచ్చిన అవకాశంగా మారి, రెండేళ్ళలో ఆమె "శీలా నర్సింగ్ హోం" మంచి గుర్తింపు పొందింది! ఇప్పుడామె పేరు సిటీలోని లీడింగ్ డాక్టర్ల సరసనవుంది. ఇంకా పెళ్ళాడలేదు.

"పెళ్ళేమిటి రమణా! నా దృష్టిలో అదో పెద్ద ఇష్యూ కాదు!" అంటుంటుంది తరచూ. రెండు మార్లు తన బర్త్‌డే ఫంక్షన్స్ ఘనంగా జరుపుకొని పార్టీ ఇచ్చింది. ఐదారుమార్లు ఏవేవో చిన్నచిన్న సందర్భాలు పురస్కరించుక పార్టీ ఇచ్చింది. ముఖ్య అతిథిగా నన్ను

చాలా గౌరవిస్తుంది. అభిమానిస్తుంది.

"ఈ కార్నర్‌లో ప్రమాదాలు అరికట్టే గట్టి చర్యలు తీసుకొంటే బావుండును సుశీలా! స్ట్రీట్ లైట్స్ వున్నాయేగానీ, సరిగా మలుపులో వాటి వెలుతురు ప్రసరించదు!" అన్నానోసారి.

"బాబ్బాబు! పెద్దగా ఆ మాటనకు! మునిసిపల్ కమిషనర్ నిజంగా నడుంకట్టి, ఈ మలుపులో ప్రమాదాలు అరికట్టే ప్రయత్నాలు చేశాడంటే నా ప్రాక్టీసు గోవిందా!" అంది నవ్వుతూ.

సుశీల చాలా స్నేహశీలి! జీవితాన్ని కేవలం థ్రిల్‌గానే తీసుకొనే మనస్తత్వం ఆమెది. ఆమె స్నేహితుల జాబితాలో చాలామంది మినిష్టర్స్ మొదలుకొని యాక్టర్ల వరకూవున్నారు. హైక్లాసు ఫామిలీ స్త్రీలు చాలామంది సుశీల బంగళాలో, నర్సింగ్ హోంలో తరచూ కన్పిస్తుంటారు. వాళ్ళకేం జబ్బులో తెలియదుగాని సుశీల బంగళాలో అన్నిరకాల సదుపాయాలూ పొంది, ఆమెకు అంతులేని సిరి చేకూరుస్తున్నారని మాత్రం తెలుసు.

అసలు ఇన్ని వివరాలు నాకు తెలియకనే పోను! నా క్లాసుమేటు రాజా ఫస్టియర్ మెడిసిన్‌తో చదువాపేశాడు...ఆ తర్వాత వాడు అలా అలా గాలికి తిరిగి....రెండు సంవత్సరాల క్రితం నా దగ్గరకి వచ్చాడు. ఏదయినా వుద్యోగం అదెంత చిన్నదయినాసరే. కారు డ్రయివరుగానయినాసరే ఇప్పించమంటూ! జాలి కొద్దీ చేరదీశాను. కంపౌండరుగా, స్టోర్‌రూం మేనేజరుగా. బాధ్యత యిచ్చాను. కృతజ్ఞతతో బాధ్యతగా, నమ్మకంగా నా నర్సింగ్‌హోమ్ పనులన్నీ స్వంత మనిషిలా నిర్వహిస్తున్నాడు. నాకదెంతో సంతోషాన్ని కలిగించింది.

అయితే, వాడిదగ్గరున్న ఒకే ఒక బలహీనత.."వుమెన్ వీక్‌నెస్!" అది నేనేవిధంగానూ అరికట్టలేక పోయాను. "నా బలహీనతేదో నా దగ్గరే కదావుంది రమణా! అది నిన్నుగానీ, మరొకర్నిగానీ బాధించటంలేదు . . నేనందుకే పెళ్ళిలాంటి "బంధం"లో ఇరుక్కోదల్చుకోలేదు. ప్లీజ్! పదేపదే నాకు సలహాలివ్వకు!" అన్నాడోరోజు.. "ఫ్రెండ్‌గా నీ హద్దులని అతిక్రమించకు!" అన్న హెచ్చరింపు వున్నట్లుందా మాటలలో! మరెప్పుడూ నేనా విషయమై వాణ్ని మందలించలేదు.

తర్వాత వాడే ఓరోజు సుశీల "డెత్ కార్నర్" దగ్గరగా బంగళా కట్టించేస్తోందనీ ఆమె బంగళాలో చాలాచాలా అందమయిన అమ్మాయిలు..బాగా డబ్బున్నవాళ్ళు, కేవలం.. "సరికొత్త అనుభవాలకోసం" మాత్రమే, ట్రీట్‌మెంటు సాకుతో వుంటుంటారని విశేషాలు చెప్పాడు. కావలిస్తే రుజువు చేస్తానని కూడా సవాలు చేశాడు. ఆ కుతూహలమే నన్ను మలుపులోకి నడిపించింది..

ఆరునెలలుగా ఈ మలుపు నాకు బాగా సుపరిచితమై పోయింది! రాజా కారు డ్రయివ్ చేస్తాడు. ఈ మలుపులో నన్ను డ్రాప్ చేస్తాడు. వెళ్ళిపోతాడు. నేనిక్కడ వెయిట్‌చేస్తుంటాను ప్రతి మంగళవారం సాయంత్రం! డాక్టర్ సుశీల వయ్యారంగా నడుచుకుంటూ వస్తుంది. ఒకోసారి ఆమెవెంట మెరుపుతీగెలాటి స్త్రీ. .. వివాహితో, అవివాహితో...వుంటుంది....సుశీల పరిచయాలు చేస్తుంది..సరదాగా నడుచుకుంటూ, కబుర్లాడుకుంటూ సుశీల బంగళా చేరుకుంటాం. చూసేవాళ్ళు, ఇద్దరు డాక్టర్స్ యధాలాపంగా కబుర్లాడుకుంటూ వెళుతున్నట్లుంటుందే గానీ, మరో ఆలోచనకు ఆస్కారం కలగదు. బంగళాచేరాక. .బంగళాలో మేడమీద విశాలమైన బెడ్‌రూం. ..అందంగా అమర్చిన ఫర్నిచర్ మనిషిలోని అజ్ఞాత వాంఛల్ని ప్రోత్సహించే దృశ్యాల . . చిత్రాల మధ్య....వదలి సుశీల మెల్లగా తప్పుకుంటుంది. .

ఆ స్త్రీలతో అనుభవం చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది! వాళ్ళు కేవలం "సెక్స్"అనుభవాల కోసం, ఆరాటం కోసమే జన్మించారా అనిపిస్తుంది! చాలామందికి బోలెడంత సంపదవుంది. కానీ ఆ భర్తలు వాళ్ళబిజినెస్....వాళ్ళగోలలో వుండిపోయి వీళ్ళని నిర్లక్ష్యం చేశారనే సైకలాజికల్ ఫీలింగ్ .... పగ! మరి కొందరికి భర్తలు తాగుబోతులూ....నీరసులూ! వారి నుంచి నిజమైన ప్రేమానుభూతి పొందలేని

నిస్పృహా! ఇంకా కొందరికి.... పెళ్ళి అనేది ఓ పంజరంలా తోస్తుందట ...లైఫ్ ఈజీగా.... బాధ్యతా రహితంగా సాగిపోవాలిట!

ఈ వింతవింత మనస్తత్వాల మధ్య నా సైకియాట్రిస్ట్ మనస్సు ఏదో కొత్త అను భూతినీ, హాయినీ అనుభవిస్తోంది....కానీ.... రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో ఆ మలుపు లోనే ... నాకోసం కారుతెచ్చి సిద్ధంగావుండే రాజాను చూడగానే గిల్టీగా ఫీలవుతాను! అంత క్రితంవరకూ దూదిలా తేలిపోతున్న హృదయం ఒక్కసారిగా బరువెక్కిపోతుంది!

రాజా నన్ను మలుపులోకి... బలహీనతలోకి తెలివిగా తోశాడా? రాజాకు తెలిసిన ఈ రహ స్యం .... వాడు నాకో బ్లాక్‌మెయిలర్‌లా తయారు చేస్తుందా? ఊహూఁ! వాడలాంటి వాడుకాడు! లక్ష్మికి తెలిస్తే? లక్ష్మి....! అవును! లక్ష్మి పెద్దగా చదువుకున్నది కాదు. కానీ సంసారాన్ని తెలివితేటలతో దిద్దుకునే విద్య ఆమెకు తెలుసు! నన్నూ నా యిద్దరు పిల్లల్నీ....అనుక్షణం కంటికి రెప్పలా కాపాడు తుంటుంది! నేనెక్కడికి వెళుతున్నా, వచ్చినా, ఎక్కడికని? ఏమిటనీ అడగదు....నా వృత్తి రీత్యా వెళ్తొస్తున్నాననుకుంటుంది. నా సరదా లకు అడ్డురాదు! అలాంటి గృహలక్ష్మికి ద్రోహం చేస్తున్నానా అన్న ఆలోచన తొలిచే స్తోంది నన్ను. అమాటే అన్నాను రాజాతో...

"పిచ్చి ఆలోచనలు పెట్టుకోకురా రమణా! నిద్ర లేచింది మొదలు సైకియాట్రిస్ట్‌గా ఎంతో మంది మెంటల్ పేషెంట్సుతో వేగ వలసిన నీకు ఆమాత్రం రిక్రియేషన్ - రిలాక్సేషన్ ఏర్పరచుకోవటం తప్పుకాదు రమణా! తప్పని సరి కూడాను! చెల్లాయి లక్ష్మికి తెలియవలసిన అవసరమూ లేదు .... తెలిసినా, ఆమె పెద్దగా రభస చేస్తుందనుకోను! కారణం ఆమె నీ ఆనందం తప్ప మరోటి కోరని వున్నత, వుత్తమ ఇల్లాలు!" అనేశాడు.

అలాంటి అమాయకురాలికి ద్రోహం చేయ టము సామాన్యమైన నేరమా? అసలింతటి బలహీనత ఊబిలో నేనెందుకు కూరుకు పోయాను! ఏ మంగళవారానికావారం...ఈసారి ఒక్కసారే....ఈసారి సుశీలకు చెప్పేస్తాను.. యిక రాననీ... నాకోసం ఎవర్నీ ఎంగేజ్ చేయ వద్దని... రాజాకు చెబుతాను....అసలీ మలుపు వేపు పొరబాటుగా కూడా కారు మళ్ళించవద్దని.

ఈ శపథాలన్నీ ఏమైపోతాయో తెలీదు... ఈ మలుపులోకి మనసు మళ్ళుతుంది ప్రతి సారీ. ..ఈసారీ....

ఆటో దగ్గరలో ఆగిన చప్పుడవటంతో ఆలోచనల్లోంచి త్రుళ్ళిపడ్డాను. మలుపు తిరిగే చోట ... రోడ్డుకవతలగా .ఓ పెద్ద ఇండస్ట్రి యల్ బిల్డింగ్ కాంపౌండు వాల్ వుంది. అసలా గోడ మూలంగానే అక్కడెప్పుడూ స్ట్రీట్ లైట్ వెలుతురు ప్రసరించకుండా చీకటిగా వుంటుంది. బాగా అలవాటుపడిన వారికిగానీ, స్పీడుగా వాహనం నడుపుతుంటే అక్కడ మలుపున్నట్లు చటుక్కున స్ఫురించదు.

ఆటోలోంచి మోహన్‌రావు, రోహిణి, వారి ఇద్దరు పిల్లలూ దిగారు. మీటరుచూచి ఆటో డ్రయివరుకు డబ్బిచ్చి పంపాక, వెను దిరిగి చూచిన మోహన్‌రావు, చీకటి పరుచు కుని వున్న ఆ మలుపులో నన్నుచూసి గతుక్కు మన్నాడు. "నమస్కారం డాక్టరుగారూ!" అన్నాడు చిరునవ్వు తెచ్చుకుంటూ. రోహిణి కూడా గతుక్కుమన్నట్లు, విధిలేనట్లు "నమ స్కారం డాక్టరుగారూ!" అంది.

"నమస్కారం ... ఆరోగ్యం బావుందా?" అన్నాను...


"ఊఁ!" ఇద్దరూ తలూపారు ... "మీరు యిక్కడున్నారేమిటి?... మీకారుగానీ ట్రబు లిచ్చిందా?" అన్నాడు మోహనరావు నాకారు కోసం చుట్టూరా చూస్తూ.

"లేదు. ఓ ఫ్రెండ్‌కోసం ఎదురుచూస్తూ న్నాను." అన్నాను లోలోపల తడబాటు అణచు కుంటూ.

"ఓహోఁ! వస్తాం...." ఇద్దరూ యిబ్బం దిగా ముందుకు నడిచారు పిల్లలతో కూడా! వీళ్ళిద్దరూ యిక్కడికెందు కొచ్చినట్లు?

నెలరోజుల క్రితం నాదగ్గర ట్రీట్‌మెంట్

(వి) చిత్ర విజ్ఞానం



దృష్టి లోపాలు (చత్వారం) జంతువుల్లో కూడా వున్నాయి! పారిస్‌లోని మాడామ్. డెనిస్ రేమియర్ అనే ఓ కంటిడాక్టరు పిల్లులూ, కుక్కలూ చింపాంజీలు, గుర్రాలు మొదలగువాటికి కళ్ళజోళ్ల తయారుచేసింది. పారిస్ నగరంలోని ప్రతి పౌరుడి యింటిలోనూ పెంపుడు జంతువులకు తక్కువలేదు కనుక, యీవిడ, హాస్పిటల్ ఎప్పుడూ కుక్కలూ, పిల్లులూ మొదలగు వాటితో కిటకిటలాడుతూ వుంటుందట!

పూర్తయి వెళ్ళారిద్దరూ. ఇద్దరూ పెద్దబ్యాంకిలో ఉద్యోగాలు చేస్తున్నారు. బోలెడంత డబ్బు వస్తుంది. ఇద్దరు పిల్లలతో సుఖంగా జీవనం గడపవచ్చు! కానీ ఎలా అలవాటైందో, పెథిడ్రిన్ అడిక్ట్సుగా మారిపోయారు! ఇల్లూ, ఒళ్ళూ గుల్లయిపోయింది! అప్పులు పెరిగిపోయాయి, ఇద్దరిదీ ఇంటర్‌కాస్ట్ మారేజ్ కావటంవల్ల ఇరువేపులా ఎవరూ పట్టించుకోలేదు కోపంతో! రాజాకు దూరపు బంధువులూ, స్నేహితులూ అట! రాజా బలవంతంమీద ట్రీట్‌మెంటు ఇచ్చాను. మెదడులోని ఓ ముఖ్యమైన "సెల్" ఆపరేషన్ ద్వారా ఆ అడిక్షన్ అరికట్టవచ్చు ... కానీ పేషెంట్సులో దృఢనిశ్చయం వుండాలి, ఆ వ్యసనంనుంచి బయటపడాలని....డిశ్చార్జి చేస్తూ చాలా జాగ్రత్తలు చెప్పాను....మార్ఫియా పెథిడ్రిన్, బ్రౌన్‌షుగర్ లాటివి కళ్ళతోచూడవద్దనీ, చేతితో తాకవద్దనీ, అవి అమ్మే దళారులతో మాట్లాడవద్దనీ .... అలా యెన్నో మరెన్నో!

ఈరోజు ఈ కార్నర్‌లో దిగారెందుకు?

ఈ మలుపు ఇలాంటి అడిక్ట్సుకు కామధేనువు! ఆ కనిపిస్తున్న వూడలుదిగిన విశాలమైన మర్రిచెట్టు చాటున....ఆ మత్తుద్రవ్యాలు బ్లాక్‌లో అమ్మే ఘరానా మనుషులుంటారు....

ఎక్కడికయినా వెళ్ళాలని దిగారో, లేక తిరిగీ ఆ వ్యసనానికి బానిసలౌతున్నారో.. .అదే నిజమైతే . నా ట్రీట్‌మెంట్ అంతా బూడిదలో పోసిన పన్నీరే! వాళ్ళిద్దరూ ఈ మలుపు తిరిగిపోతే బావుండును...

"హలో రమణా!" పిలుపుతో త్రుళ్ళిపడ్డాను.

"ఎంతసేపయింది వచ్చి?" మృదువుగా అడిగింది డాక్టర్ సుశీల. ..

"ఇప్పుడే ఓ పదిహేను నిమిషాలయి వుంటుంది" ఏదో తడబాటు నాలో....

"సారీ! ఓ డెలివరీ కేసు కంప్లీట్‌చేసి వచ్చేసరికి ఆలస్యమైపోయింది. మీట్‌మై ఫ్రెండ్ లలిత!" అంటూ అందాకా తనవెనుక మలుపులోని చీకటిలో నిల్చునివున్న యువతి చేతిని నాచేతి కందించింది డాక్టర్ సుశీల! ముదురు నీలిరంగు జపాన్ జార్జెట్‌చీరె, అదే రంగు బ్లవుజులో .ఆ చీకటిలో....మెరుపు తీగలా కళ్ళు మిరుమిట్లు గొలుపుతుంది లలిత.

"గ్లాడ్ టు మీట్ యూ!" మా యిద్దరి చేతులూ కలుసుకున్నాయి. ..ఏదో విద్యుత్తు.... సంకేతం....అందాకా ఒకరికొకరం తెలియకపోయినా....ఆ క్షణంలో పరస్పరం అత్యంత సన్నిహితులమైనట్లు అనుభూతి .... జీవితపు హద్దుల్ని, సంఘపు కట్టుబాట్లనీ, ధర్మాధర్మాల

సరిహద్దులనీ, మలుపుతిప్పి, అతిక్రమించి కొత్త స్వర్గాలని సృష్టించు కోవాలన్న వెర్రి ఉద్వేగం....

"పదండి వెళదాం!" సుశీల తెలివిగా ఇద్దరి మధ్యకొచ్చి నడుస్తోంది. ఆ ఫర్లాంగుదూరం నడకా... కేవలం యిద్దరు అపరిచితుల మధ్య, ఓ విధమైన సన్నిహితత్వాన్ని రూపొందించ టానికే! సుశీల బుర్రలో ఈ రకమైన అతి తెలివి ఎలా ఉత్పన్నమైందో . ?

ఈ రోజు... ఈ ఒక్కసారి. .ఈ లలితలో అంతే! ఆ తర్వాత సుశీలకు చెప్పేస్తాను. ఈ మలుపులోకి రానని.. .

"ఏమిటీ? మూడీగా వున్నావు రమణా?" సుశీల అంది .

"అబ్బే! లేదే!" తడబడ్డాను..

"హలో డాక్టరుగారూ!" మలుపు తిరగబోతున్నాం. ఎదురుగా రిక్షా ఢీ కొన్నంతపని అయి ఆగింది! ముగ్గురం విడివిడిగా తప్పుకున్నాం. రిక్షా ఆగగానే.. .రిక్షాలోంచి దూకుతూ అన్నాడు శ్రీహరి . రిక్షాలోనే శిలా ప్రతిమలా కూర్చునివుంది మేనక . సజీవ శిల్పంలా!

"నమస్కారం" అన్నాను.

"డాక్టరుగారూ! మీతో ఓ చిన్నవిషయం మాటాడాలని మీ నర్సింగ్ హోం కెళ్ళాం! మీరు లేరని తెలిసింది. బహుశా పిక్చర్ కెళ్ళి వుంటారని అనుకున్నాం. ఇక్కడో ఫ్రెండును కలిసి, ఈ రాత్రి ట్రైన్ కే టికెట్లు రిజర్వ్ చేయించుకుందామని వెళ్తుంటే లక్కీగా మీరు కనిపించారు... " అన్నాడు శ్రీహరి.

"సుశీలా! మీరు మెల్లిగా నడుస్తుండండి. జస్టెమినిట్!" అన్నాను నాకోసం చూస్తున్న సుశీల, లలితలతో. ..

"ఆల్ రైట్!"అంది సుశీల. ఇద్దరూ మెల్లిగా అతిమెల్లిగా....నడుస్తున్నారు. లలిత నడకలో.. కళ్ళలో.. .అణువణువులో. . ఏదో కాంక్ష . క్షణకాలంకూడా ఆలస్యం భరించలేనంతటి తృష్ణ....కనిపిస్తోంది నాకు ...బహుశా కాస్త "హాట్" డ్రింకేదో తీసుకున్నట్టుకూడా వుంది అంతక్రితమే! నాలోనూ ఓ విధమైన థ్రిల్ నిలవనివ్వటంలేదు .... పానకంలో పుడకలా శ్రీహరి తయారయ్యాడు! ఇలాటి సమయాలలో అనారోగ్యాలకు సంబంధించిన వివరాలూ, ప్రిస్క్రిప్షనూ చెప్పాలంటే తగని చిరాకు నాకు.

మేనకకూడా రిక్షా దిగింది. ముగురం నాలు గడుగులు వేసాం. మేనకను అక్కడే ఆగమని చెప్పి, శ్రీహరి నా దగ్గరగా వచ్చాడు. రహస్యం చెబుతున్నట్లుగా అన్నాడు "డాక్టరుగారూ! ఈ రాత్రికే ఇద్దరం వెళ్ళిపోతున్నాం.. అస్సాం ప్రాంతానికి ట్రాన్ఫర్ ఆర్డర్స్ వచ్చాయి! మేనక ఆరోగ్యం పూర్తిగా కుదుట బడ్డట్టే గదా? ఆమె... ఆమె .. దాంపత్య జీవితానికి. ." శ్రీహరి కర్చీఫ్‌తో మెడ తుడుచుకుంటున్నట్లుగా కాస్త ఇబ్బందిగా నావేపు చూస్తూ చటుక్కున అన్నాడు " ఐమీన్. . సెక్స్‌కు. . పూర్తి అర్హురాలేనా?"


నేను నవ్వాను. "ఆవిడ ఫిజికల్ కండిషన్‌లో ఏలాటి లోపమూ లేదు. సిల్లీ అనుమానాలు పెట్టుకోకండి. కానీ ఆమె తలలోని టెంక్షన్ సప్రెస్ అయివుండటానికి ఇంకా కొంతకాలం ఆ స్లీపింగ్ టాబ్లెట్స్ వాడాలి! కానీ. ఒక్క విషయం.. .ఆమెకు ట్రీట్‌మెంటు ఇచ్చిన సైకియాట్రిస్ట్‌గా ఇస్తాను...."

శ్రీహరి కంగారు కప్పిపుచ్చుకుంటూ రాని నవ్వు నవ్వాడు "చెప్పండి డాక్టర్! మీ సలహా కోసమే కదా, మీకోసం మీ బంగళాకు వెళ్ళాను!"

"ఇఫ్ యు డోంట్ మైండ్ . మీ ప్రవర్తనలో బాగా మార్పు రావాలి! ఆమెను మీరు ప్రాణప్రదంగా చూచుకుంటారనీ, మీరామెకు సంపూర్ణ రక్షణ కల్పిస్తారనీ, కాన్ఫిడెన్స్ ఆమెకు మీరే కలిగించాలి. ఆవిడ మనసు నొప్పించే సంఘటనలూ, వాతావరణమూ కల్పించవద్దు .. . డాక్టర్‌గా నా సలహా అదొక్కటే!" ఆ మాటలంటుంటే ఎందుకో నా లక్ష్మి గుర్తొచ్చినా శరీరమంతా రోమాంచితమైంది ఒక్కసారిగా.

"ఆల్ రైట్ డాక్టర్! మేనక నా ప్రాణం! మరి వెళ్తొస్తాం!"

అందాకా, శిలాప్రతిమలా మాకు కొద్ది దూరంలో, సెడెటివ్స్ ఎక్కువ డోస్ తీసు



కుంటున్నందువల్ల ఓ రకమైన మొద్దుతనంతో నిద్రమత్తు వ్యక్తిలా వున్న మేనకకూడా "నమస్కారమండీ!" అని చెప్పి, భర్తపక్కన రిక్షాలో కూర్చుంది...రిక్షా మలుపు దాటుతోంది.

అలాగే నిల్చుండి పోయాను....వెళ్తున్న రిక్షా వేపు చూస్తూ.

శ్రీహరి మేనక

సరిగ్గా రెండు నెలల క్రితం ఓ శతవృద్ధు.. అజంతా శిలాసుందరి లాటి సజీవమూర్తిని వెంటబెట్టుక వచ్చాడు నా డిస్పెన్సరీలోకి! ఆ యువతి మెంటల్‌గా షాక్ తినివుంది! "మెంటల్ డి-కండిషన్" అది! వెర్రిచూపూ, పిచ్చిగా ఏడుపూ, తిట్లూ, కాస్సేపు నవ్వూ, హఠాత్తుగా వెర్రి ఆవేశం... ఫిట్సూ..వస్తున్నాయి.

వృద్ధుడు, కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు. "ఇది మంగళ. నా కూతురి కూతురు! మనవరాలన్నమాట! దీన్ని కనగానే, తల్లి చనిపోయింది. ఆ తర్వాత ఆ దిగులుతో మా అల్లుడూ దేశాలు పట్టి పోయాడు! నా భార్య అంతక్రితమే చనిపోయింది! ఇందర్ని చంపి ఇదొక్కటీ బ్రతికింది! చచ్చి చెడి — దీన్ని పెంచి పెద్దచేశాను! మిలట్రీలో పెద్ద ఆఫీసరుగా వున్న శ్రీహరి.... దీన్ని చూచి, కోరి చేసుకున్నాడు పెళ్ళి: ఇద్దరూ అతని ఉద్యోగరీత్యా కాశ్మీరునుంచి కన్యాకుమారి వరకూ తిరుగుతున్నారు ఈ ఏడేళ్ళుగా! అంతటితో నా బాధ్యత తీరిందనుకున్నాను. బిడ్డ సుఖపడుతున్నదనుకున్నాను .. ఏమయిందో, ఏమో. దీనికి పిచ్చెక్కిందని, పిల్చుకొచ్చాడు.!" "కారణం ఏమిటో చూచాయగానైనా తెలుసుకోగలిగారా?" అన్నాను ఆ యువతికెలా ట్రీట్‌మెంటు మొదలెట్టాలో మనసులో అంచనా వేసుకుంటూ! ఆ యువతివేపు పరిశీలనగా చూశాను. చాలా అందమైన, అమాయకురాలైన స్త్రీ అనిపిస్తుంది... నా లక్ష్మిలానే! "మంచి ఇల్లాలు!" అనే గౌరవ భావం కలిగిస్తుంది...

"ఆఁ! అడగ్గా అడగ్గా బయటపెట్టాడు వెధవ....అలా వెళదాం రాండి!" అన్నాడా వృద్ధుడు. నర్సును మేనకకు తోడుగా వుంచి, ఆ వృద్ధుడితో పక్కరూంలోకి వెళ్ళాను.

వాడు....ఆ శ్రీహరి .... మిలట్రీ ఆఫీసరన్నాను కదా? వాడికి చావంటే ఎలా భయం లేదో, బ్రతుకన్నా అంతే ఖాతరు లేదట! వాడే చెప్పాడు! అక్కడ తమకు ఎక్కువ నియమా

లుండవట....వుండేవాళ్ళు ఎక్కడైనా నీతిగా వుంటారనుకోంటి...వాడు పార్టీలలో పాల్గొంటాడట! అక్కడ ప్రేమ....చాలా స్వేచ్ఛ! వాడు ఇతరుల భార్యలతో....ఇతర స్త్రీలతో....తిరుగుతాడట ...అదో తప్పుగా పరిగణించరట .... దీన్నికూడా అలా తిరగమని . .ఒకళ్ళ భార్యల్ని మరొకరు అనుభవించే కొత్త ఆటట. .. ఛీ. ..ఛీ....పశువుల్లా!" ఆ వృద్ధుడిక చెప్పలేక, పై పంచతో ముఖం కప్పుకున్నాడు!

సిటీలలో,ఓమోస్తరు టౌన్లలో, బ్లూఫిలిమ్స్ ద్వారా పాకుతున్న గేమ్ ఇది ఇప్పుడిప్పుడే! నాగరికతకిది పరాకాష్ఠగా భావింపబడుతుంది ... ఈ వృద్ధుడికిదంతా కొత్త గందరగోళం . . బహుశా పల్లెటూరిలో పుట్టి పెరిగి, సాంప్రదాయాలలో పుట్టి పెరిగిన మంగళక్కూడా అది షాక్ ఇచ్చి వుంటుంది..

"దీనిపేరు "మంగళ" బాగాలేదని మేనకగా మార్చాడు ...అలా దీన్ని తిరగమనీ, లేకపోతే, తన స్నేహితులు తనని బాధిస్తారనీ....బాధ పెట్టేవాడుట ...బేజారెత్తి మతిచెడగొట్టుకుందీ పిచ్చితల్లి! నేను కాటికి కాళ్ళు జాచుకున్నాను. పిల్లది బాగుపడ్డాకయినా. . వాడితోనేగదా బ్రతకాలి? మొగుడిదగ్గరే ఆడదానికి రక్షణ లేక పోతే.. .ఇక లోకంలో ఎక్కడుందంటారు?"

వృద్ధుణ్ని ఓదార్చటం నా తలకు మించిన పనైంది! ముందీ షాక్‌తో ఆయనెక్కువకాలం జీవించడని తేలిపోయింది.

"వాణ్ని మీ దగ్గరకు పిల్చుకొస్తాను. నే చెప్పినట్లు కాకుండా, మీరే వివరాలన్నీ అడిగి, గడ్డిపెట్టండి బాగా!" అన్నాడా వృద్ధుడు చివరగా!

షాక్ ట్రీట్‌మెంట్లు ప్రారంభం అయ్యాక . శ్రీహరి వచ్చాడు... శ్రీహరి ద్వారానే వివరాలన్నీ లాగగలిగాను! శ్రీహరి చూడటానికి చాలా అందగాడే! చదువూ సంస్కారం వున్న యువకుడే! మరీ విపరీతం? బలహీనతా! అనుకోకుండా మలుపు తిరిగిందా అతగాడి జీవితం....? స్నేహంగా అడిగాను వివరాలు. శ్రీహరి నొచ్చుకుంటూ చెప్పాడు.

"అదో విషవలయంలా మారింది డాక్టర్! నేనే ఓ బలహీన క్షణంలో....నా ఫ్రెండు భార్య ఒకర్తె .... చాలా బ్యూటిఫుల్ లెండి" అడ్వాన్స్‌డ్ లేడీ కూడా .... ఆమె మీది మోజుతో. ..ఈ తమాషా గేమ్ ప్రారంభించాను.. .అది ఫ్రెండ్సందరికీ నచ్చింది ...కానీ అదే నా మెడకూ వురి అవుతుందనుకోలేదు....

ఇప్పుడా ఫ్రెండ్సంతా .... మేనకనుకూడా అలా మా పార్టీలో పార్టిసిపేట్ చేయించాలంటారు .నాకూ చాలా కష్టం....కానీ.... వాళ్ళు వదలరే! "నువ్వు మొదలెట్టిన గేమ్. .. నువ్వే ఆట నిబంధనలు అతిక్రమిస్తే ఎలా? ససేమిరా ఒప్పుకోం!" అని నిష్ఠూరం ఆడుతున్నారు. నిష్ఠూరం ఏమిటో వాళ్ళలో కొందరు "వైలెంట్"గా కూడా నన్ను ప్రెస్‌చేస్తున్నారు . . నాకు తప్పించుకొనే మార్గం కనిపించలేదు. మేనకమీద వత్తిడి తెచ్చాను ... ఫలితం మేనక మతి చెడి పోయింది. !"

వింటున్న నాలో ఓ రకమైన గగుర్పాటు కలిగింది.

"బాడ్ లక్! జరిగిందేదో జరిగిపోయింది! అక్కణ్నుంచి ట్రాన్సఫర్ కు ప్రయత్నించండి! ఆ విషవలయంలోంచి మీరు ఎలాగోలా బయట పడండి! ఆవిడని నొప్పించకండి! భర్తే దైవంగా భావించే ఇల్లాలు లభ్యంకావటం మగాడికో మహత్తర వరం!" నా గొంతుక నాకే చిత్రంగా కంపిస్తూ వినిపించింది. ఆ మాటలే నా లోపల్నుంచి ప్రతిధ్వనించినట్లను భూతి కలిగింది!

నెల రోజుల్లో ట్రీట్‌మెంటు పూర్తయింది. మేనకకు ఇప్పుడేమీ గుర్తులేదు. మెదడులోని ఆలోచనలకూ, ఉద్రేకాలకూ సంబంధించిన అన్ని నరాలూ, ముఖ్యకేంద్రాలూ, సెడెటివ్స్ తోనూ, షాక్స్‌తోనూ మొద్దుబారిపోయి వున్నాయామెకు! ఇంకా నాలుగైదు నెలలు ఇదే రకంగా మందులు, విశ్రాంతి కంటిన్యూ చేస్తేనే కానీ, ఆ తర్వాతగానీ ఆమె మామూలు మనిషి కాలేదు! ఆమెలో ఆ చైతన్యం తిరిగి రావటానికి శ్రీహరి చాలా ఓర్పు వహించాలి!

శ్రీహరి, మేనక ఈరోజు వెళ్తున్నారు. వెళ్ళక తప్పదు. మేనక నా వృద్ధుడు భరించ

లేదు. శ్రీహరికా ఉద్యోగం లేకపోతే జీవన భృతి లేదు! శ్రీహరి తన ప్రవర్తన మార్చుకుంటాడా? అతగాడా విషవలయాన్ని ఛేధించుకోగలడా? ఆ "డెత్ కార్నర్"ను దాటిపోగలడా? లేక ఆమె శాశ్వతంగా మెంటల్ పేషంటుగా, పిచ్చిదానిగా మారిపోయి. . అతగాడికి బరువై పోయి....భయంకరమైన మరణం పాలు....

"రమణా!"

ఉలిక్కిపడ్డాను. తల పగిలిపోతున్నట్లుంది. సుశీల పిలుపు ఏదో భయంకరమైన యాక్సిడెంటుకు ముందు — కారునుంచి వచ్చే శబ్దంలా వుంది! అసహనంగా చూస్తూ సుశీల, విసుగు బయట పడకుండా చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నిస్తోంది...

"రమణా! ఏమిటీ? ఆ జిడ్డు ఫ్రెండ్ వదల్లేదా?"

"ఊహుఁ! పద సుశీలా! జస్టె మినిట్! వస్తా పద!" అన్నాను. ఎందుకో శరీరమంతా చెమటలు పడుతోంది.

సుశీల అసహనంగానే, కాస్త వడివడిగా బంగళావేపు అడుగులు వేస్తోంది! బహుశః "బెట్టుచేస్తున్నాడు రమణ! ఎందాకా ఈ బెట్టు? అవసరం, బలహీనత అతగాడిది గానీ, నాక్కాదే! వస్తాడు. ఎవరికోసం?" అనుకొంటోందేమో!

మలుపులో నిల్చుండిపోయానలాగే!

శ్రీహరి.. .మేనక....

మోహన్‌రావు... రోహిణి....

నేనూ....రాజా....

ఏమిటో చుట్టూరా వలయాలు....

ఎందరి మనస్తత్వాల మీదో నా ట్రీట్మెంటుతో మార్పు తెస్తున్నాను. విజయం సాధిస్తున్నాను . .. మరి ఈ మలుపులోంచి నేను తప్పుకోలేనా?

ముందస్తుగా రాజాకు రేపొద్దునే ఉద్వాసన చెప్పాలి.. .లక్ష్మికి స్వయంగా చెప్పుకుని.... ఆ దేవత క్షమాపణ కోరాలి. .

"సార్! పది యాంపిల్సే వున్నాయి.... మార్ఫియా!"

దగ్గరలో గుసగుసగా వినిపించి తిరిగి చూశాను . మర్రిచెట్టు మాటునుంచి .... ఫుల్ సూటులో పెద్ద ఆఫీసర్లా వున్న ఓ దళారి వెధవ . .గుసగుసగా అంటున్నాడు. అటువేపు మనుషులెవరో చటుక్కున పోల్చుకోలేక పోయాను. . కళ్ళుబాగా విప్పార్చి చూశాక తెలిసింది....రోహిణి, మోహనరావు .. !

"సార్! పెథిడ్రిన్ మూడే వున్నాయి. బ్రౌన్ షుగర్ పది కాప్సూల్స్! ఏది కావాలి? ఏ మెడికల్ షాప్స్‌లోనూ దొరకటంలేదు ఇవ్వటంలేదు. ఎంత ఎరజూపినా బైటపెట్టటం లేదు ...! విదేశీ సరుకు ఇది! బొంబాయినుంచి నా ఫ్రెండొకడు చచ్చీచెడి సాధించి పంపాడు. ఒక్కొక్క యాంపిల్ పది రూపాయలన్నా, కొనేవాళ్ళున్నారు. ఎంచేతో మీ రంటే అభిమానం కలిగి, మీకు ఆఫర్ చేస్తున్నాను. త్వరగా తీసుకోండి. సిరెంజి కావాలన్నా నా దగ్గరే వుంది ...ఆలస్యం చేశారంటే....అదో ఆ కార్నర్ నుంచి ఓ పెద్ద మనిషొస్తాడిప్పుడు. చొరవగా నా పాంటు జేబిలో చెయ్యిపెట్టి అన్నీ లాక్కుంటాడు. నా జేబులో వందరూపాయల నోట్లు లెక్కపెట్టకుండా కుక్కేస్తాడు....ఆపైన మీ ఇష్టం...."

గుసగుసగా .... అంటున్న ఆ యువకుడి కళ్ళు రాబందు కళ్ళలా .... తనక్కావల్సిన మనుషుల్ని పోల్చుకున్నాయి....!


"రోహిణీ! ఒక్కటి.. .చెరొక్కటి తీసుకుందామా? ఇదే ఆఖరిసారి....మరి రేపట్నుంచీ వద్దు.. .ఏం?" మోహన్‌రావు అంటున్నాడు ఇంగ్లీషులో మెల్లిగా....

రోహిణి ఆలోచనగా అంటోంది "తీసుకుందామనే వుంది మోహన్! కానీ మళ్ళీ అడిక్ట్సుగా మారిపోతామేమో....పోనీ నువ్వన్నట్లు ఈ ఒక్కసారీ...."

"రమణా!" చాలా దగ్గరగా .... తియ్యని కంఠస్వరం....

తల తిప్పిచూశాను....భువన మోహనంగా వున్న లలిత లలితే! చాలా దగ్గరగా నిల్చుని రాతియుగంలోని . . ఆదిమానవులు .... కోరిక వెలిబుచ్చినట్లుగా....నాచేతిని తన చేతిలోకి తీసుకొంటోంది....

మలుపులో . ఆ డెత్ .... కార్నర్‌లో . నేనూ .. మరి కొంతమంది నాలాంటి మనుషులూ. నా అడుగులు ఎటుపడతాయో □



ఏడవకేడవకు

అది రైల్వే ప్లాట్‌ఫారం. అక్కడ చాలా రద్దీగా వుంది. ఆ రద్దీలో మనుషులున్నారు. వాళ్ళలో ఆడవాళ్ళున్నారు, మగవాళ్ళున్నారు. వాళ్ళంతా కుర్రగా వున్నారు, పడుచుగా వున్నారు, ముసలిగా వున్నారు. కుర్రాళ్ళ కళ్ళు వింతగా వున్నాయి, ఆశగా వున్నాయి. పడుచు వాళ్ళ కోర్కెలు దోరగా వున్నాయి. దొంగగా వున్నాయి. ముసలాళ్ళ మొహాలు దిగులుగా వున్నాయి, అనుభవంతో వున్నాయి.

ఇంకా అక్కడ దుకాణాలున్నాయి. వాటిల్లో కాఫీ లున్నాయి, ఖర్జూరా లున్నాయి, పళ్ళున్నాయి, పుస్తకాలున్నాయి, బిస్కత్తులున్నాయి, బరాణీ లున్నాయి. అంతేకాకుండా అక్కడ జంతువులూ వున్నాయి. వాటిలో సాధువుల్లాటి ఆవులున్నాయి. విశ్వాసం చూపే కుక్కలున్నాయి.

అందుకే అక్కడ చాలా రద్దీగా వుంది. ఆ జనంలో ఆ దుకాణాల కెదురుగా ఆ జంతువుల పక్కనుంచున్నాడొక మధ్యకాలపు మగాడు. మధ్యతరగతి ఆసామి. ఆసామి పేరు అప్పారావు.

అప్పారావు బలంగా లేడు.

పొడుగ్గా లేడు.

గొప్పగా లేడు.

గొప్పగా లేని అప్పారావు జేబులో రెండు రూపాయిల ముప్పావలా కంటె ఎక్కువలేదు. అతనా సాయంత్రమే బండి దిగాడు. ఐతే దిగి చాలా సేపయింది. తోటి వాళ్ళంతా తన్నిడిచి వెళ్ళిపోయారు.

తన దగ్గర సామానుంది. వాటిల్లో ఒక ట్రంకుపెట్టె, ఒక సంచె, ఒక చెరుకుముక్కల కట్ట!

జేబులో చెయ్యిపెట్టి డబ్బులు తీసాడు. లెఖ్ఖ చూసుకున్నాడు. ఒక పావలా, మూడర్ధ బిళ్ళలు, చివరగా ఒక రూపాయినోటు, సింపిల్‌గా ఎంచక్కా రెండుమ్ముప్పావలాయే!


గొణుక్కున్నాడు. సణుక్కున్నాడు. చిరాకుపడ్డాడు—తన దగ్గరింతే వున్నందుకు, ఎవన మిచ్చి నేర్చుకోనందుకు.

బండి దిగి పది నిముషాలు ఎప్పుడో గడిచింది. పది నిముషాల్లో పదిమంది కూలీల్ని పలకరించాడు. పరామర్శించేడు. చివరకు పొమ్మన్నాడు.

అందరికీ దురాశే! వెధవలు!? పీల్చేయాలి చెండాడేయాలి చెరిగేయాలి. విసుక్కున్నాడు.

సామాను మోసుకుని రిక్షా వరకు పోలేడు. వాటి బరువెక్కువ. అత్తారింటి నుంచొచ్చిన

పతివాడ మార్కండేయులు ★ కెజియాగ్రాంధ



సరుకులవి. ఎవడూ రూపాయికి తక్కువకు మొయ్యడు. పోనీ మోయించిస్తే? అమ్మో! ఇక మిగిలేది రూపాయి ముప్పావలా, ఇల్లు చేరుకోవాలంటే కనీసం ఉండాలి రెండు రూపాయిలు.

ఎలా! ఎలా!! ఎలా!!!

తల తిరిగింది. దుఃఖం వచ్చింది. అంతలో మరో రైలొచ్చింది.

సామాను చూసుకున్నాడు. జేబులో డబ్బును తలచుకున్నాడు. బేరీజు వేసుకున్నాడు.

ఆ వొచ్చిన రైల్లోంచి జనం దిగేరు. దిగిన వాళ్ళు ఆగకుండా వెళ్ళిపోయారు-తన సామాను మీంచి, తనను తప్పించుకుంటూ, కాళ్ళు తొక్కేస్తూ!

ఆ చెత్తలో, ఆ దుకాణాల కెదురుగా, జంతువులకు దూరంగా, తర్వాతి బండికోసం కళ్ళు గేలాలగా చేస్తున్న మనుష్యుల మధ్యలో అప్పారావు అక్కడే వున్నాడు తన సామానుతో!

“బాబూ కూలిప్పించండి!”

చూసాడప్పారావు అటువేపు. కుర్రాడు. పదమూడేళ్ళు కాదుకాదు పదిహేనేళ్ళ కుర్రాడు. కూలోడికి కూలోడులాగున్నాడు. నల్లగా వున్నాడు, నలిగిపోయున్నాడు. చింపిరిగా వున్నాడు. చిక్కిపోయి వున్నాడు. మురికిగా వున్నాడు. మాసిపోయి వున్నాడు. అర్థింపుగా వున్నాడు. ఆకలిగా వున్నాడు.

అనుమానం వేసిందప్పారావుకి, ‘యివన్నీ మొయ్యగలడా’ అని.

“నీ వయసెంతరా” అనడిగాడు.

“ఏమో నాకు తెల్దు!”

‘వీడికి ఆడదానికీ పోలికలున్నాయి’ అనుకున్నాడు. తర్వాత అడిగాడు ఎంత కావా’లని.

“అర్ధరూపాయిప్పించండి.” కుర్రాడి నోటి నుండి కాదు, కడుపులోంచి అన్నాడు.

అప్పారావు కళ్ళు మెరిశాయి.

కూలోడు చవగ్గా కుదిరాడు.

తనకు మరిబ్బంది లేదు.

వాడి నెత్తిమీద పెట్టె పెట్టాడు. దానిమీద చెరుపుల బుట్ట పెట్టాడు. సంచి తనే పట్టుకున్నాడు.

ఇప్పుడు గుండెల్నిండా గాలి పీల్చుకున్నాడు. తాపీ అయ్యాడు. సంతోషించాడు. సంతోషంతో ముందుకు నడిచాడు, జనంలోంచి.

“ఒరే కుర్రాడా!” వెనకనుంచొస్తున్న కుర్రాడ్ని పిలిచాడు.

“ఏటండి?”

“నీ పేరేట్రా?”

"అందరూ కొండయ్యా అంటారండీ. మా అమ్మ అలాగ పిల్డంది." వుంది.

"మరి మీయమ్మ ఎలాగ పిలుస్తాదిరా?"

"నాయినా అంటాదండీ."

"మీ నాయనేమి చేస్తున్నాడ్రా?"

"లేడండీ."

లేడంటే అప్పారావుకి తెల్సిపోయింది. తను తెలుసుకున్న దానికి ఎన్నో రంగులు వేసాడు. బహుశా వీడు తండ్రి గండాన పుట్టుంటాడు. వీడు పుట్టగానే ఆ తండ్రి మహాశయుడు చచ్చుంటాడు. లేదా వీడి తండ్రి వుండే వుంటాడు. వున్నా వాడు యింకో ఆడదానితో ఉండుంటాడు. కాకపోతే తాగినమత్తులో లారీ కిందపడి చచ్చుంటాడు.

అలా అనుకుంటూనే అప్పారావు మామూలుగా అడిగేసాడు—"లేడంటే?"

"యుద్ధంలో సచ్చిపోయాడండీ!"

అప్పారావు సిగ్గు (బాధ) పడిపోయాడు. ఆ జవాబు విని కళ్లు బైర్లు కమ్మటం, తల తిరగటం జరగలేదు కానీ—గుండెలో చెయ్యిపెట్టి కెలికినట్టనిపించి దతనికి. నిశ్శబ్దంగా నాలుగడుగులు వేసి, "కూలెందుకు చేస్తున్నావురా?" అనడిగాడు అమాయకంగా.

"అమ్మకోసం సార్!"

బలే బలే చిత్రంగా వుంది. అందరూ కడుపు కోసం కూలి చేస్తారు. వీడు అమ్మకోసం చేస్తున్నాడు.

వీడు శివాజీ లాంటోడు.

చంద్రగుప్తుడు లాంటోడు.

పోనీ—శ్రీరాముడి లాంటోడు.

అంతకీ కాకపోతే పరశురాముడి లాంటోడు.

హిస్టరీని వల్లించుకున్నాడు. ఒక్కొక్క హీరోని కుర్రాడి పక్కనపెట్టి చూశాడు. అతనికెందుకో తన సిమిలీలు తనకే నచ్చలేదు.

"మాకు దిక్కెవరు లేరండీ. మా అమ్మా, నేను, యిద్దరు సెల్లెల్లు, ఒక తమ్ముడు మేము మొత్తం ఐదుగురం. ఐదు రోజుల నుంచీ అమ్మకు జొరంగుంది. ఐదు పూటలయింది మేము తిండి తిని. కారీజులు మోసి, అందులో మిగిలింది తెచ్చి మమ్మల్ని పెంచుతుంది అమ్మ. అమ్మకు జొరం వొచ్చింది. కారీజులకు వెళ్ళలేదు. మాకు తిండి లేదు. అమ్మకు మందు లేదు. ఇయ్యాల కూలిచేసి అమ్మకు మందు కొంటాను. ముక్కల రొట్టె కొంటాను."

కుర్రాడి బాధలకు అప్పారావు అదిరిపడ్డాడు. ప్లాట్‌ఫాం మీద తన సామాను కదలకపోయినందుకు తనుపడ్డ బాధకంటె యిది చాలా విషాదంగా వుంది. వాడిమీద జాలిపడ్డాడు.

పిటీ! పిటీ!! పిటీ!!!

గేటులో టికెట్టిచ్చి నాలుగడుగులు నడిచి బయటపడ్డా రిద్దరూ.

ఎదురుగా రిక్షా!

బేరమాడేడు. రెండు రూపాయలకు తెగింది. వెంటనే సామాను రిక్షాలోకి వెళ్ళింది. తనూ వెళ్ళి కూర్చున్నాడు. జేబులో చెయ్యిపెట్టి కుర్రాడి మొహంలోకి చూసి, మరొకసారి జాలిపడ్డాడు. పావు నిమిషం ఆలోచించాడు. అర్ధకు బదులు లెక్కప్రకారం మిగిలిన ముప్పావలాను వాడి చేతిలో పెట్టాడు. కుర్రాడి మొహం విప్పారింది.

కళ్ళు కృతజ్ఞతలు చెప్పాయి.

పెదవులమీది చిరునవ్వులు సంగీత సౌరభాలను వెదజల్లాయి.

రిక్షా సర్దుకుని కదలబోయింది.

ఇంతలో—

"ఓరి దొంగ గుంటడా! మా కడుపులు కొట్టీడానికి నువ్వొక కొత్తోడివి తయారయినావేట్రా! ఇక్కడ లైసెన్సులు కట్టుకుని, యూనీఫారము బట్టలేసుకుని, బరువులు మోసుకుని మామ బతుకుతుంటె, మా బతుకులు సల్లార్చీడానికి బయిలెల్లినావేటి?"


అంటూ ఓ లైసెన్సు కూలీ గబగబ పరుగెత్తుకుంటూ వచ్చి కొండయ్యా చేతిలోనున్న ముప్పావలా నులిపి లాక్కున్నాడు.

అక్కడ కూలీ చేయడానికి కొండయ్యాకు లైసెన్సు లేదు!

* * *

సరిగ్గా అప్పుడే స్టేడియం మైదానంలో వేలాది ప్రజలముందు ఓ కవి గొంతెత్తి పాడుతున్నాడు—

దీనులార
హీనులార
బాధాసర్ప దష్టులార
ఏడవకం డేడవకండి! □



మయసభ

"దేశమా! నాకేమి ఇస్తావు?—అని అడగకండి. దేశానికి మీరేమిస్తారో చెప్పండి—" అన్నాడు ఒకప్పటి అమెరికా అధ్యక్షుడయిన జాన్ ఎఫ్. కెన్నెడీ.

మన దేశంలో ప్రతివాడూ అడిగేది .. "నాకేమిస్తావు—?" అనే సుమండీ .

ఈ "నాకేమిస్తావు—" అనేది బ్రహ్మ పదార్థం వంటిది.

దానికి బహురకాల భాష్యాలున్నాయి. అది వారి వారి తాహతులనుబట్టి, వారి వారి అవసరాలనుబట్టి మారుతుంటుంది.

ఈ బ్రహ్మపదార్థ జిజ్ఞాసతో ఆద్యస్థానం ఘనత వహించిన ప్రభుత్వంవారిది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలనేవి స్వయంవరంద్వారా ఎన్నుకునే పతిదేవుడిలాటిది. అంటే ఎన్నుకునేదాకానే మన వంతు. ఆ తర్వాత ఆ దేవుడు తన్నినా, కొట్టినా 'ఫలానా'ది తాగమన్నా 'ఫలానాది' తాగొద్దన్నా—అంతా శ్రీవారి ఇష్టమే. ఈ మొగుళ్ళే ఒక్కొక్కసారి 'యమర్జన్సీ' అన్చెప్పేసి, రంకుమొగుళ్ళయిపోవడం, వాళ్ళకు 'మీసా'లూ మారుతీలు వచ్చేయడం—ఇదంతా మనందరికీ స్వానుభవమే కదా!

అయితే మామూలు దాంపత్యాలకు ఈ ప్రజాస్వామ్య దాంపత్యాలకు వున్న తేడాల్లా, దీనిలో అయిదేళ్ళయ్యాక రాసుకున్న విడాకులిచ్చేసి కొత్త భర్తను ఎన్నుకోవచ్చును. ఇదే విధంగా, ప్రతి అయిదోఏటి చివరా భర్తని కాదనేసి, కావాలంటే ఇంకోరిని భర్తగా ఎన్నుకునే స్వేచ్ఛ కావాలా వద్దా—అనే విషయం 'ఉమెన్స్ లిబ్బరూస్' వాళ్ళూ ఆలోచించాల్సిన విషయం. మరీ అంత వదలలేని దాంపత్యం అయితే మళ్ళీ అదే భర్తను ఎన్నుకోవచ్చు కదా.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ఈ విధంగా మనం చేజేతులా ఎన్నుకున్న ప్రభుత్వమే—ఇటునుంచి అటు వెళ్ళగానే—"ఏవిటి బ్రదర్స్. మీరేమిటిస్తారు—?" అని మొదలెడతారు. అక్కడినుండి చట్టాల రూపంలో, పన్నుల రూపంలో పిండడం ప్రారంభిస్తారు. ఫిబ్రవరి నెలాఖరు తారీకయితే చాలు గవర్నమెంటువాడు మన్నేవి టిమ్మంటారో అని హడిలి చచ్చిపోతుంటారు. సిగరెట్టు తాగేవాడి దగ్గరనుంచి, టీవీ సెట్ కొనేవాడిదాక—రైతు దగ్గరనుంచి బిర్లాదాక బిక్కు బిక్కుమంటూ కూర్చుంటారు. ఈ విధంగా దేశంలోని వారందరినీ ఏక టాకీన తరతమ భేదాలు లేకుండా భయపెట్టడం—అంటే ఏవిటీ, అస్సలు సిస్సలు సోషలిజంను అమలులో పెట్టడం అన్నమాట. మరేవిటనుకున్నారు, సంవత్సరానికో

ఎ. రామసంజీవి

సారన్నా చేయకపోతే మనది సోషలిస్టుదేశం అని మరిచిపోము—

ఇంక ఆదాయపన్ను, వృత్తిపన్ను, రోడ్డుపన్ను, అమ్మకపన్ను అని ముప్పైరెండు రూపాలలో "నాకేమిస్తావు—" అనేది సాక్షాత్కరిస్తుంటుంది.

అజ్ఞాన తిమిరంతో కొట్టుమిట్టాడే సామాన్యులం మనం, ఏ సంవత్సరానికా సంవత్సరం—"అయిపోయింది. ఈ సంవత్సరంతో దేశంలో పన్నులు విధించగల వస్తువుల జాబితా అయిపోయింది—ఈసారి ఆర్థికమంత్రిగారు ఎంత గారడీ చేసినా పాత పద్దులమీదే ఏవో మారేడి కాయలు కాయాలి తప్ప పన్నులు కాయడానికి కొత్త 'ఐటమ్స్' ఏమీలేవు" అనుకుంటుంటాం.

కానీ—అదే కథతో పదేపదే సినిమాలు తీయగల తెలుగు సినిమా ప్రొడ్యూసర్లకన్న తెలివయినవాళ్ళే భారతదేశపు ఆర్థిక మంత్రులవుతుంటారు.


హఠాత్తుగా—"మీరు పోస్టాఫీసులో బెంచి మీద కూచుని ఉత్తరాలు రాస్తే కార్డుకు 3 పైసలు, ఇన్లండ్ లెటర్‌కు 4 పైసలు, కవర్‌కు 5 పైసలు చెల్లించాలి. ఇందువలన సామాన్యుడిమీద ఎటువంటి భారమూ పడదు-అనే నేను నమ్ముతున్నాను" అని బోలెడంత పెద్ద జోక్ వేసేసి, ఆ వెనకాలే పన్ను వేసేస్తారు ఘ.వ.ఆ. మంత్రి!

(i) రైల్వే ప్లాట్‌ఫారమ్మీద ఫానులక్రింద బెంచీలమీద కూర్చుంటే అరగంటకు అయిదు పైసలు చొప్పునా పన్ను.

(ii) ఆదివారప్పూట సముద్రం ఒడ్డున కూచుంటే మనిషికి పావలా, దంపతులయితే రూపాయి చొప్పునా.

(iii) పుస్తకాల రంగుల అట్టలమీద చదరపు సెంటిమీటర్‌కు రంగుకు ముప్పైపైసల చొప్పునా.

—ఇలాగ ముఖ్యందు సంవత్సరాలలో "నాకేమిస్తావు" దర్శన మివ్వచ్చును. రాష్ట్ర ప్రభుత్వాలయితే ఆవకాయ ఉత్పత్తిమీద, సీరి



యల్ నవలలు రాయడంమీద, ప్రత్యేక ఉద్యమాలమీద పన్నులు విధించితే ఆశ్చర్యపడకూడదు; ఆశ్చర్యంమీద పన్నువేసే ప్రమాదం వుంది.

అంచేత పన్నులు వేయడమేకాని, తీయడం వుండదు. అదే ఒకసారి మొక్కపాటి నరసింహశాస్త్రిగారు చెప్పారు. ఒక సుప్రసిద్ధ రచయిత అన్నారట. ..."ఏ ప్రభుత్వమూ చేయలేని పని నేను చేశానోయ్ ..అన్ని పన్నులూ తీయించేశాను" అని బోసి నోటితో నవ్వారట.

ఈ పన్నో దంతం కాకుండా—నాయకుల స్వాగతాలు, షష్టిపూర్తులు, డిన్నర్లు, సన్మానాలు వగైరా రూపాలలో కూడా 'నాకేమిస్తావు—' ప్రత్యక్షమవుతోంది. కొంద రు నాయకులు, చాలా ఆధునికులం, సాంప్రదాయ విరోధులం అంటూ—"మా కీ పూల మాలలు వేసి డబ్బు ఖర్చు చేయకండి—! కూరగాయల మాలలు వేయండి! మొక్కజొన్న కండెల మాల వేయండి! మసాలా గారెల దండలయినా ఫరవాలేదు—" అని అతి వినయంగో సూచనలు చేస్తుంటారు.

ఓ రూపాయెట్టి యే బంతిపూల దండో వేస్తే అయిపోయేదానికి రూపాయిన్నర కిలో చొప్పున రెండు మూడు కిలోల వంకాయల దండ వేస్తే గిట్టుబాటవుతుందా? ఆ ఫంక్షన్ ఏర్పాటు ఆ కూరగాయల మాల అలా వదిరేస్తే ఆ మంత్రిగారిని ఇంటిదగ్గర—ఛా ర్యా మ ణి "ఏవండీ ఆ కంఠకావరం? శుభ్రంగా ఆ జెండా సంఘంవాళ్ళ బంగాళాదుంపలు ఉల్లిపాయలు మాల వేస్తే ఇంటికి పట్రాకుండా అక్కడే వదిలేయడంలో ఏమిటి మీ వుద్దేశం—? ఆ దండ పళంగా వేపుడు చేద్దునుగదా—" అని ఆయన్ను వేయించేస్తుంది. మనకయితే మంత్రి గాని వాళ్ళావిడకు మొగుడే కదండీ!

కొంతమంది కవులున్నారు; మా మూ లు కవులు కాదండోయ్ . ప్రజా క వు లు . . అంటే ప్రజలకోసం ప్రజలమీద రాసే కవులు. వీళ్ళల్లో ఒకాయన్ను అమధ్య మా వూళ్ళో ఓ సాహిత్య సంఘంవాళ్ళు—"సార్! మేము మూడురోజులబాటు సాహిత్యోత్సవాలు చేసుకుంటున్నాము. మీరూ ఓపూట రావాలి. మేము అటూ ఇటూ రెండవ తరగతి రైలు చార్జీలు ఇచ్చుకుంటాం—ఇక్కడ ఆతిధ్యం సరేసరి!" అని రాస్తే ఆయన... "హా తెరి! నే నెవడను కున్నారు? నాకు మీరు సెకండ్ క్లాస్ ఫేరి స్తారా! ఫస్టు క్లాసివ్వంచే నే నెక్కడికీ రానని తెలీదా—అంటూ ముత్యాల సరాలు రాశాడు!

అంటే భారత రైల్వేలు అనేవి ప్రభుత్వ సంస్థలు కదా, వాటికి ఈ సాహిత్యపు కుచేల్స్ నుండి మరికొంత అదనంగా వి రా ళ ం ఇప్పిద్దాం—అనేటువంటి ఆ ప్రజాకవియొక్క దీర్ఘదృష్టి మనబోటిగాళ్ళ కవగాహన అయి ఏడవదు కదండీ .


ఇంకో అగ్రనటుడున్నారు ..ఆయనేమో ఎవరన్నా ఏ సభకన్నా పిలిస్తే—"ఆ సభా ముఖంగా మీరు నన్నే పదివేలో విరాళంగా అడగము అని ముందస్తుగా హామీ ఇవ్వ"మని అడుగుతాడు. ఆయన దరిద్రం ఆయనదీ!

వెనకటికో గాయకుడు విదేశాలకు వెళ్తుంటే ఎటూ ఢిల్లీమీదుగా వెళ్తున్నాడు కదా అని అక్కడి తెలుగువాళ్ళు రమ్మంటే "నాకు ఇంత ఇస్తారా?" అని ఘంటాపథంగా అడిగి లేవని పించుకున్నాడు .

. ఈ విధంగా ప్రభుత్వాలు, పెద్దవాడు "నాకేమిస్తావంటుం"డగా ము న్సి పలా ఫీ సు లో కాగితం కదలదానికి, తాసీల్దారుగారి సంతకానికి, బదీపంతుళ్ళ బకాయి జీతం యి వ్వ డా ని కి, ఇంటి ప్లాన్ ఆమోదించడానికి, కా ఫ పు, బస్సులకు, లారీకి లైసెన్సు ఇవ్వడానికి, రోడ్ మీద ఫుట్‌పాత్‌లమీద దుకాణాలు ప రి చి వస్తువు లమ్మడానికి—ఇలాగ అ నే కా నే క సందర్భాలలో—ఈ "నా కేమిస్తావ్" ప్రత్యక్ష మవుతుంటుంది.

ఆ యా సందర్భాలనుబట్టి "పత్రం పుష్పం ఫలం తోయమ్" ఇచ్చుకోవాల్సి వుంటుంది— 'పత్రం' అనగా కరెన్సీ పత్రాలు అనీ, పుష్పం అంటే సువర్ణ పుష్పాలనీ, 'ఫలం' అంటే పూబోడి అనీ, 'తోయమ్' అంటే విస్కీయం బీర్ వైనాది తీర్థాలనీ అన్వయించుకోవలసి వుంటుంది.

అందువల్లనే బ్రదర్స్! ఈ ఇండియా అనే భరతవర్షంలో బ్రతకడం అనేది నేర్చుకోవా లంటే చచ్చినంత పనవుతుంది! □


billyboy
SUITINGS
AARBEELON
SILK MILLS
BOMBAY-400 068
Distributors-
K LALSAREEWALA
Ghadial Galley
BOMBAY-400 002

మహిళాజ్యోతి

పిల్లల పెంపకము - తల్లుల బాధ్యత

బాలలని భగవంతుడికి మరో రూపమంటారు.

అయితే చిన్న పిల్లలలో భగవంతుడి రూపం చూడడం అందరికీ సాధ్యం కాదు, ఒక్క తల్లులకి తప్ప. చిన్న పిల్లల మనస్తత్వం అర్థం చేసుకోవాలి. వారి మూగ భాష వినాలి. వారిని వారి ప్రపంచంలో బ్రతకనిస్తూ పెంచాలి. వారి కోరికలు తీర్చాలి. వారిలో అంతర్గతమయిన శక్తిని చదవగలగాలి. అలా పిల్లలకి దగ్గరగా రాగల అపురూపమయిన శక్తి ఒక్క తల్లులకే వుంది. పిల్లలని అలా పెంచినప్పుడే వారు ఇతరులగురించి తెలుసుకో గలుగుతారు. 'నేను' అంటే అర్థమేమిటో వారికే తెలుస్తుంది.

నిజానికి పిల్లలు తమని గుర్తించుకోగల శక్తిని అలవరచుకోడానికి ముందరే తల్లుల్ని గుర్తించగలుగుతారు. అందుకే తల్లులు తమ పిల్లల్ని ఎంతో ప్రేమతో చూడాలి. పిల్లలకు చీమ కుట్టినా తల్లడిల్లిపోయే హృదయం మాతృమూర్తికి వుండాలి.

పిల్లల పెంపకంలో తల్లులకి ఎంతో బాధ్యత వుంది కనుక ఉద్యోగం చేసే తల్లులు పిల్లల్ని ఎలా పెంచాలనే ప్రశ్న సహజంగానే ఎదురవుతూ వుంటుంది. అటు ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ ఇటు పిల్లల్ని ఏవిధమయిన లోటూ రాకుండా ఎలా పెంచాలి? ఈ 'ద్విపాత్రాభినయం' తల్లులు ఎలా చేస్తారు? చూద్దాం.

నా స్నేహితురాలునే ఉదాహరణగా తీసుకుందాము. ఆవిడ పేరు కృష్ణవేణి అనుకుందాం. ప్రస్తుతం కృష్ణవేణి ఒక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా ఉంది. ఎనిమిదవ తరగతిలో వున్నప్పుడే కృష్ణవేణికి వివాహం అయింది. భర్త ఉపాధ్యాయుడు. వివాహం అయిపోయింది ఇక జీవితంలో పరిపూర్ణత ఏర్పడిందనుకున్నది పిచ్చి కృష్ణవేణి. అయితే కృష్ణవేణి సహజంగా ఎంతో తెలివయినది కావడంతో భర్త ఆమెని ఇంకా ఇంకా చదవమని ప్రోత్సహించాడు. అలా ఎం. ఏ. పాసయింది కృష్ణవేణి. ఇంత చదువు చదివి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడమెందుకని కృష్ణవేణి ఉద్యోగం చేయడానికి నిశ్చయించుకుంది. ఆర్థికంగాసూ కుటుం

డా॥ కె. ఇందిరాబాయ్ M.D,DcH.

డా॥ డి. పి. ఎన్. రత్నమాలిక M. D.

జానికి మరింత ధనం చేకూరుతుందనీ తలచింది.

కృష్ణవేణి 'కథ' ఇలావుంటే నాకు తెలిసిన మరొక అమ్మాయి వుంది. ఆ అమ్మాయి పేరు 'వసంత' అనుకుందాం. భర్తతోపాటు తనూ పనిచేస్తేకాని లాభం లేదనుకుంది వసంత. అయితే డాక్టరు చదువుదామనుకున్న వసంత నర్సింగ్‌లో మటుకే శిక్షణ పొందింది. తన అభిరుచికి తగిన వ్యక్తినే వివాహమాడింది. వసంత స్నేహితురాలు సీతమటుకు డాక్టరు చదివింది. డాక్టర్‌ని వివాహమాడింది. సీత డాక్టరు కాడానికి కుమార్తె అభిమతం తెలుసుకున్న తండ్రి ఎంతగానో సహాయం చేశాడు. అలా అదృష్టం అందరికీ కలిసి రాదు.

అయితే మరొక అమ్మాయి సుబ్బలక్ష్మి తన వివాహం కోసం కష్టపడి పనిచేయవలసి వచ్చింది. కట్నం ఇస్తేకాని పెళ్లికాని కుటుంబంలో సుబ్బలక్ష్మి పుట్టింది. ఉద్యోగంచేసి తన వివాహం కొరకు డబ్బు కూడబెట్టుకుంది. వివాహం తర్వాత ఉద్యోగంచేస్తూ పిన్నిళ్ళకి చన్నీళ్ళు అందించడం కొనసాగించింది.

ఇలా ఎంతమందినో నేను కలుసుకున్నాను. వనితలు ఎందుకు ఉద్యోగాలు చేయవలసి వస్తున్నదో పరిశీలించాను. ఉద్యోగాలలోవున్న ఈ వనితలందరూ పిల్లల తల్లులే. పిల్లలు ఉండగా ఉద్యోగం చేయడం కష్టమని వీరందరూ అంగీకరించారు. అయితే ఆర్థిక పరిస్థితి


మీ అందానికి తగిన
మిల మిల మెరిసే చీరెలు!
పట్టుచీరెలు!!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి.
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మీ జనతా స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిష్ట్లా, ఫోన్: 73467, 77052

వలన ఉద్యోగాలు . చేయకుండా వుండలేక పోతున్నామన్నారు.

కృష్ణవేణి తన పిల్లలకి మూడు నెలలు వచ్చేసరికి పనిమనిషి పెంపకంలో వుంచింది. అయితే పనిమనిషి 'తల్లిపాత్ర' నిర్వహించ లేదని కృష్ణవేణి అంగీకరించింది. పిల్లలు ఎలాగో పెద్దవారయ్యారు. ఇప్పుడు ఇక ఫరవాలేదంటుంది కృష్ణవేణి. ఉద్యోగానికి వెళ్ళి ఇంటికి తిరిగివచ్చేవరకూ మనసు పిల్లలుమీదే వుండటంతో ఉద్యోగ భారాన్నీ సరిగ్గా నిర్వహించలేకపోయాననే మోననే సందేహమూ నాకో వ్యక్తపరిచింది కృష్ణవేణి. ఆ పరిస్థితుల్లో కృష్ణవేణి కుటుంబ నియంత్రణ పాటించింది.

వసంత పిల్లలిద్దరికీ మధ్య తేడా ఒక సంవత్సరం. పిల్లలిద్దరికోసం ఒక పనిమనిషిని పెట్టింది వసంత. పనిమనిషి పిల్లల్ని సరిగ్గా చూడడంలేదని తెలిసినా పిల్లల భవిష్యత్‌కోసం ఉద్యోగం వదలడం లేదని వసంత చెప్పింది.

డాక్టరు సీతమటుకు డబ్బుకే లోటు లేకపోవడంతో చదువుకున్న, శిక్షణపొందిన 'ఆయా'ని పిల్లలకోసం నియమించింది. పిల్లల పెంపకం సక్రమంగా జరగడంతో సీత తన వృత్తి నిర్వహణలో అందరికీ సంతృప్తి కలిగించగలిగింది.

సుబ్బలక్ష్మి తన రెండు నెలల పాపని తన అమ్మ దగ్గరికి పంపించింది. తల్లి పాలులేక ఆహారంలోపంతో ఆ పాప కృశించిపోయింది. తన స్తన్యం పాప తాగకపోవడంతో సుబ్బలక్ష్మి రొమ్ములలోనూ వ్యాధి ప్రారంభమయింది. అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్స చేయవలసి వచ్చింది.

అలా ఉద్యోగాలు చేసే వనితలు ఎన్నో సమస్యలు ఎదుర్కొనడం చూశాను. పాల కోసం ఏడుస్తున్న పాపని విడిచి ఆఫీసుకి వెళ్ళాలి. కొన్ని సమయాల్లో ఆలస్యంగా ఇంటికి రావాలి. ఈ సమస్యల్ని జయించాలంటే ఒకటే మార్గం ఉద్యోగం చేయకుండా వుండడం. అప్పుడు మరిన్ని సమస్యలు ఎదురవుతాయి. అప్పుడప్పుడు తండ్రి రక్షణలో పిల్లల్ని పెంచుదామనుకుంటారు కొందరు తల్లులు. అయితే భర్తలకి మటుకు సెలవు సులభంగా దొరుకుతుందా? భార్యలనే పిల్లల్ని చూడమని అధికారంతో వీరు చెప్తారు ఉద్యోగం మటుకు చచ్చినా మానవద్దని అదే అధికారంతో అంటారు.

ఈ మధ్య ఒక భర్తని అడిగాను. ప్రశ్న మామూలుదే. అయితే లభించిన జవాబు చాలా చిత్రమయినది. 'మా ఆవిడకి అన్ని సదుపాయాలు వున్న పార్ట్‌టైమ్ జాబ్ వుంటే ఎంత బావుంటుంది' అన్నాడు ఆయన. మరొక భర్త 'ఇచ్చిన పని పూర్తిచేసే ఉద్యోగాలు వుంటే మంచిది. ఎంతకాలం పనిచేశారని లెక్కకట్టడంలో అర్థంలేదు' అన్నాడు. మెటర్నిటీ లీవ్ ఎన్నో నెలలు వుండాలని మరొక భర్త అంటే, ఉద్యోగాలకి వెళ్ళే తల్లులు తమ పిల్లలు చీకూచింతా లేకుండా పెరగడానికి సోషలిస్టు దేశాలలోలాగా సదుపాయాలు వుండాలన్నాడు మరో భర్త. తల్లులికి ఇంట్లో యెంతో పని వుంటుంది కనక, ఈ ఇంటిపనిని పశ్చిమదేశాలలోలాగా సులభం చేస్తే బాగుంటుందన్నాడు మరో భర్త.

ఆడదానిని సానుభూతితో అర్థం చేసుకుంటే అసలు సమస్యలే వుండవనీ, పిల్లల పెంపకం సుఖతరమవుతుందనీ భార్యాభర్తలమధ్య పొరపొచ్చాలు వుండవనీ, పిల్లలు శారీరకంగానే కాక మానసికంగానూ పెరుగుతారని నా ఉద్దేశం. □

లక్ష్మీదేవికి సుస్వాగతం

స్రవంతి వచ్చింది. మూతి ముడుచుకుని మరీ కూర్చుంది.

స్రవంతి రాకను గమనించనేలేదు తాతయ్య. పేపరు చదువుకుంటున్నవాడల్లా, దగ్గుతెర విపరీతంగా రావడంతో పేపరు పక్కవపెట్టేసి నప్పుడు చూచాడు స్రవంతిని.

"అరె స్రవంతీ! ఎప్పుడొచ్చావమ్మా?" అన్నాడు దగ్గు తగ్గాక.

"ఇప్పుడే తాతయ్యా! పదినిమిషాలయిందేమో!" ముక్తసరిగా వుంది స్రవంతి సమాధానం.

తాతయ్య స్రవంతిని పరీక్షగా చూచాడు. ఆయన కనుబొమలు ముడివడ్డాయి.

"అదేమిటి స్రవూ! అలాగున్నావు? ఏమయింది? ఈవేళ ఏమయినా అవాంఛితమయిన సంఘటనలు జరగలేదు గదా!" అన్నాడు సాలోచనగా.

"అవాంఛితాలూ లేవూ, ఆవకాయలూ లేవు. నీతో ఫ్రెండ్‌షిప్ మొదలెట్టినప్పటి నుండీ ప్రాణం పోతుందనుకో. ఎప్పుడూ రకరకాల ఆలోచనలు మనసులో సుడులు తిరుగుతున్నాయి. వాటికి అర్థం తెలిసీ తెలియక తికమకపడి చస్తున్నాను."

"పోసి ఇప్పుడేం మునిగిపోయిందమ్మా! నాతో ఫ్రెండ్‌షిప్ మానేయమ్మా! ఏ గొడవా వుండదు. అన్ని సమస్యలకూ చక్కటి పరిష్కారం దానంతట అదే దొరుకుతుంది."

అన్నాడు తాతయ్య కళ్ళద్దాల పైనుండి చూస్తూ చమత్కారంగా.

"అదిగూడా ట్రై చేశాను. వీలుగాకుండా పోతున్నది. నీ దగ్గరికి వచ్చేటప్పుడు మనసు నిండా ప్రశ్నను వున్నా వాటన్నిటికీ నువ్వు విడమరచి చెప్పాక మనసుకి హాయిగా వుంటున్నదిగా?"

స్రవంతి నెమ్మదిగా అంది.

తాతయ్య ముసి ముసి నవ్వులు ఒలకబోశాడు.

"ఇంతకీ ఈ వేళ నీకు వచ్చిన సమస్యయేమిటో చెప్పమ్మా!" అన్నాడు మెత్తగా.

"ఆఁ. మరేమీలేదు తాతయ్యా! మా అమ్మ గొడవ చాలా యెక్కువయిపోయింది."

"మీ అమ్మ గొడవా? అదేమిటి?"


"ఆఁ. ఏముంది? రోజూ యిల్లలికి ముగ్గు పెట్టాలట. అలా చేస్తేనే మనం లక్ష్మీదేవికి సుస్వాగతం చెప్పినట్లవుతుందట. అమందానందభరితయై ఆదిలక్ష్మి మన గృహప్రవేశం చేస్తుందట. లేకుంటే మూతి ముడుచుకుని మన యింటికేసి చూడమన్నా చూడకుండా వెళ్ళిపోతుందట. నాకేమో ఆ పేడను తాకడం, నీళ్ళల్లో కలపడం, పిసకడం—అదంటే ఒకటే మంట. పైగా ముగ్గులెట్టడం అంతకన్నా రాదు నాకు. ఏం చేయను తాతయ్యా? అమ్మ సాధింపులు మరీ ఎక్కువయిపోతున్నాయి." అంది బాధగా స్రవంతి.

"చూడు స్రవంతీ! మీ అమ్మ చెప్పినట్లు చేయడమే మంచిదని నా వుద్దేశం."

తాతయ్యమాటలకి ఒక్కసారిగా బాంబులా పేలింది.

"నువ్వు మరీ! పేడ పిసక్కపోతే, చేతినిండా సున్నం చేసుకోకపోతే లక్ష్మీదేవి రాదా!

(వి) చిత్ర విజ్ఞానం



టెక్సాస్ (అమెరికా) లోని డాక్టర్ మైకేల్ డిబేకీ యీ కృత్రిమ హృదయాన్ని రూపొందించారు. ఇది ఒకవిధమైన సిలికోన్ రబ్బరుతో చేయబడింది. గుండెజబ్బులున్నవాళ్ళు ఆపరేషన్ మూలంగా తమ గుండెను తొలగించి యీ కృత్రిమ గుండెను పెట్టుకోవచ్చు. ప్రస్తుతానికి దీనికి సంబంధించిన ప్రయోగాలు జంతువులమీద తీవ్రంగా జరుగుతున్నాయి.

మేము వికారులమయిపోతామా?"

"అక్కడే పొరబడుతున్నావు స్రవా! నా ఆలోచనలు, పద్ధతులు తెలిసిగూడా నువ్విలా మాట్లాడితే ఎలా?

పేడను నువ్వలా విసుక్కుంటున్నావు. పేడ యెంత మంచిదో తెలుసా? దానిలో క్రిమి సంహారక తత్వముంది. ఇంటి ముంగిట పేడ కలయపి (కళ్ళాపి) చల్లడంవల్ల, ఇంట్లో మామూలు మట్టినేల వుండేచోట్ల పేడతో అలకడంవల్ల యెంతయినా ప్రయోజనముంది. క్రిమి కీటకాదులు అరికట్టబడుతాయి.

పోతే ముగ్గుల విషయం చాలా పెద్ద విషయం. సర్వప్రయోజనకరం. ఎలాగంటే ముగ్గులు వేయడంవల్ల, ఆడవాళ్ళలో సహజంగానే ఉండే కళాభిరుచి, సృజనాత్మకశక్తి, హస్తలాఘవం పెంపొందుతాయి. పోతే ముగ్గు పిండిలో సున్నం కలవడంవల్ల, దాని ప్రభావానికి పురుగూ పుట్రా చచ్చిపోతాయి. కనుక అందంతోపాటు ఆరోగ్యంగూడా వుందన్న మాట యిందులో."

"అలాగా తాతయ్యా!" స్రవంతి చల్లబడింది.

"పోతే యింకో సంగతి. కొన్నిచోట్ల ముఖ్యంగా గుళ్ళల్లోనూ, శుభకార్యాల సందర్భంగానూ, పచ్చిబియ్యపు పిండితో గూడా ముగ్గులు పెడతారు. వేదాదిగా భూతదయను గురించి ప్రబలిన సిద్ధాంతముంది చూడు ఏ మతంలోనయినా వుందది. ఈ భూతదయ జీవకారుణ్యాలకూ, యీ ముగ్గులకూ గూడా సంబంధం వుంది."

తాతయ్య కామా పెట్టాడు.

స్రవంతి ముఖంలో ఆశ్చర్యార్థకం వెలిగింది.

తాతయ్యే మళ్ళీ మొదలెట్టాడు.

"అవునమ్మా! ఆ ముగ్గులలో వుండే బియ్యపు పిండి పిపీలికాది సన్న జీవరాసులకు భిక్షగా పనికి వస్తుంది..."

"మామూలు ముగ్గుల వెనకాల ఇంత కథ వుందా తాతయ్యా!!...." అంది స్రవంతి విస్తుపోతూ.

—అలపాటి

ట్యుటోరియల్ సంస్థలు

భారతదేశంలో నిరక్షరాస్యత రూపుమాపా లని ప్రభుత్వము చాలా కృషి చేస్తూంది. అయినా దానిని పూర్తిగా సాధించలేకుండా వున్నాము. ఇప్పటికి చదువుకున్నవారి సంఖ్య 30 శాతమునకు దాటలేదు. ఇలాంటి తరుణంతో ప్రజలుకూడ దీనికి సహాయం చేయవలసినదే. ట్యుటోరియల్ సంస్థలు ఈ కార్యక్రమములో చాలా తోడ్పడుతూ వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని వందల సంస్థలు ఒకటవ తరగతినుండి, 5 వ తరగతి వరకు విద్యార్థులకు తర్ఫీదు యిచ్చి 6 వ తరగతిలో చేర్పించుతూ వున్నారు. కొన్ని ట్యుటోరియల్ సంస్థలు మెట్రిక్యులేషను పరీక్షకు తర్ఫీదు యిచ్చి విశ్వవిద్యాలయ పరీక్షకు విద్యార్థులను పంపుచున్నాయి. ఈ విద్యాలయములను ఒక రకముగ వయోజన విద్యాకేంద్రములుగకూడ పరిగణింపవచ్చును.


ఈ ట్యుటోరియల్ సంస్థ లన్ని చక్కని శిక్షణనిచ్చి ప్రభుత్వమువారు,విశ్వవిద్యాలయము వారు జరుపు పరీక్షలకే విద్యార్థులను పంపుచున్నారు. వీరు ప్రత్యేకముగ సర్టిఫికట్టులు యిచ్చుటలేదు. చదువు చెప్పుటలోకూడ ప్రభుత్వమువారిచే గుర్తింపబడిన సంస్థలలో వలెనే ప్రత్యేక సబ్జక్టులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేతనే శిక్షణ యిప్పించుచున్నారు. ప్రత్యేక శ్రద్ధ యిచ్చట చూపించినటుల పెద్దపెద్ద సంస్థలలో వీలుపడదు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చాలా సన్నిహిత సంబంధం వుంటుంది. సమ్మెలు మొదలైనవి యిచ్చట జరుగుటకు వీలుండదు. కొన్ని ట్యుటోరియల్ సంస్థలు ఒక యూనియనుగ ఏర్పడి కామను పరీక్షలు మొదలైనవి జరుపుచు చాలా మంచి శిక్షణ యిస్తూ వున్నారు.

ఈ సంస్థలలో పనిచేయు ఉపాధ్యాయులు మంచి అనుభవజ్ఞులైనవారు. కొందరు రిటైరైన ఉపాధ్యాయులు ఉన్నారు. బి. ఇడి. పరీక్షలు పాసు అయి ఉద్యోగములు దొరకక పోయిన వారుకూడ ఈ సంస్థలలో చేరి పని చేయుచున్నారు. ఒక విధముగ ఇవి నిరుద్యోగ సమస్యను కొంత వరకు పరిష్కరించుటకు తోడ్పడుతూ వున్నవి.

ప్రభుత్వ పరీక్షలలో తప్పిన విద్యార్థులకు యీ సంస్థ చాలా గొప్ప సేవ చేయుచున్నవనుటలో సందేహములేదు. వీరుగనుక పూనుకోకపోతే, విద్యార్థి ఎచ్చటకు వెళ్ళి శిక్షణ పొందాలి? ప్రభుత్వము గుర్తించిన విద్యాలయములలో తప్పినవారిని చేర్చుకొనుటలేదు. ఒక వేళ ఎప్పుడైనా అవకాశముంటే ఒక్కసారి మాత్రమే చేరి చదువుకొనవలెను. తరువాత చేరుటకు వీలులేదు. కాలేజీలలో ఇంటరు, బి.ఎ. పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ట్యుటోరియల్ కాలేజీలే ఆధారము. విశ్వవిద్యాలయము జరుపు ప్రవేశ పరీక్షలకు శిక్షణ ట్యుటోరియల్ సంస్థల లోనేగాని ఇతరత్రా దొరికే అవకాశంలేదు.

కాని ఈ సంస్థలకు కొన్ని లోపాలున్నవి. వాటిని తీర్చుటకు ప్రభుత్వమే సహాయము చేయవలెను. వీరికి గ్రాంటులు మొదలైనవి లేవు కనుక పెద్దపెద్ద భవనములు లేవు. ఆటస్థలములు, లైబ్రరీలు, లేబరేటరీలు తక్కువ. కొన్ని సంస్థలు లేబరేటరీలుపెట్టి సైన్సు సబ్జక్టులలో మంచి కోచింగు ఇస్తూనే వున్నారు. చాలావరకు ట్రయినింగు పొందిన ఉపాధ్యాయులే పనిచేస్తూ వున్నారు. సమర్థులైన ఉపాధ్యాయులు మాత్రమే యిచ్చట పనిచేయుటకు వీలుండును. విద్యార్థులే వీరి శక్తి

యల్. చిరంజీవిరావు, M.A.,B.Ed.



సామర్థ్యములను నిర్ణయిస్తారు. ఈ సంస్థలను ప్రభుత్వమువారు గుర్తించకపోయినను, పుర ప్రముఖులు వీటిని గుర్తించి ఈ సంస్థలకు వారి పిల్లలను పంపుచున్నారు.

ఈమధ్య ప్రభుత్వముకూడ వీరు చేయుచున్న సేవను గుర్తించి, వీటిని రిజిస్ట్రేషను చేయించుకొనవలెననియు, ప్రభుత్వ పర్యవేక్షణలో పని చేయించవలెననియు తీవ్రముగ ఆలోచించుచున్నారు. ప్రభుత్వమువారు వీటికి బిల్డింగులకు, లేబరేటరి మున్నగువాటికి కొంత ధనసహాయము చేయుటకూడ ఉచితము. కొన్ని ట్యుటోరియల్ సంస్థలు మంచి హాస్టళ్ళనుకూడ నడుపుచున్నవి. ఆ హాస్టళ్ళనుకూడ మంచి పద్ధతులలో నడుపుచున్నారు.

ఈ విధముగ ఈ సంస్థలు విద్యాసేవ చేస్తూ వున్నవి. ముఖ్యముగ ఒకసారి పరీక్షకు వెళ్లి తప్పిన విద్యార్థులకు ఈ ట్యుటోరియల్ సంస్థలు వరప్రసాదము. పదవ తరగతి, ఇంటరు, బి. ఏ., బి. కాం, బి.యస్‌సి. తప్పిన విద్యార్థులు తర్ఫీదు పొంది మంచి మార్కులతో ప్యాసు అగుచున్నారు. కొందరు చిన్న తరగతులు కొంతకాలము చదివి నిలిపివేసిన వారు, తిరిగి చదువుకొనవలెనని బుద్ధిపుట్టినపుడు ఏ స్కూలులో చేరి చిన్నపిల్లలతో కూర్చుని చదవగలరు? అలాంటివారు ఈ విద్యాలయములలో చేరి తొందరగ విద్య నభ్యసించి ప్రభుత్వమువారు నడిపేపరీక్షలకు కూర్చుంటూ వున్నారు. ప్రభుత్వమువారు, విశ్వవిద్యాలయమువారు నేరుగ పరీక్షంకు కూర్చునే అవకాశము కల్పించినారు. అలాంటివారికి ఎవరు తర్ఫీదు యివ్వగలరు? ఈ ట్యుటోరియల్ సంస్థలు మంచి ఉపాధ్యాయులను నియమించి మంచి ట్రయినింగు యిప్పించుచున్నారు. ఈ సంస్థలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనేగాక యితర రాష్ట్రములలోకూడ లెక్కకు మిక్కుటముగ వున్నవి. ఢిల్లి, కలకత్తా, మద్రాసు, బొంబాయి మొదలైన పెద్ద పెద్ద నగరములలో అనేక రకములైన కోర్సులకు తర్ఫీదు ఇస్తూ వున్నారు. టైపు, షార్టుహేండు మొదలైన కోర్సులకు తర్ఫీదు యిచ్చే సంస్థలుకూడ ఈ సంస్థల క్రిందకే వచ్చును. మరికొన్ని సంస్థలలో చేతిపనులు కూడ నేర్పిస్తూ వున్నారు. ఈ విధంగా ప్రయివేటు సంస్థలు ప్రభుత్వ విద్యా విధానములో ఒక రకముగ మంచి సేవ చేస్తూవున్నవనుటలో సందేహము లేదు. ప్రభుత్వముకూడ వీరి సేవను గుర్తించి వీరికి తగిన స్థానము యిచ్చుటకు ప్రయత్నించుట శ్రేయస్కరము. □

చిక్కుముళ్ళు



బ్రహ్మం తలుచుకుంటే కట్టు గొయ్యకు కల్యాణం జరిపించగలడు. మా తాలూకాలో అవనివేసి పెళ్ళికాని పిల్లలున్న ప్రతిచెట్టుకీ, పుట్టకీ కూడా తెల్సు. పెళ్ళి కావలసిన అబ్బాయిలు - అమ్మాయిలు, వాళ్ళ పేర్లు - గోత్రాలూ, అసలు వయసులూ - నకిలీ సొగసులూ, ఆస్తులూ - దావాలు, పసుపులు - లొసుగులు, అలవాట్లు - పొరపాట్లు వగైరా వివరాలన్నీ అతని బుర్రలో అశోకుడి శిలాశాసనాల్లా భద్రంగా ఉంటాయి.

బ్రహ్మం కన్ను తెరిస్తే కాకికి కల్యాణ ఘడియ లొస్తాయి.

కన్ను మూస్తే తాళిబొట్టు త్రాచుపామై పెళ్ళాగి పోతుంది.

ఆ చేత్తో తాళి కట్టించగలడు. ఈ చేత్తో విడాకు లిప్పించగలడు. ఉన్న పెళ్ళాన్ని చంపించగలడు. రెండో దాన్ని చూపించగలడు.

అరవయ్యేళ్ళ వాడికి ఆషాఢంలో పెళ్ళి జరిపించగలడు. తల గొరిగించి తలంబ్రాలు పోయించగల సామర్థ్యం ఉందతనికి!

'దేవుడికి పుట్టించే శక్తితోపాటు గిట్టించే యుక్తి ఉందబట్టే ఈ నరులు మాటింటున్నారు. లేకపోతే కొబ్బరికాయ కొట్టమంటే దేవుణ్ణే కొనుక్కొచ్చుకోమనరూ' అంటాడు బ్రహ్మం.

సహజంగా సంబంధాలు తలపెట్టుకున్న వాళ్ళంతా ఊరూరునుంచి వచ్చి ఊరదేవతకు కొట్టినట్టు బ్రహ్మంకి ఓ కొబ్బరికాయ కొట్టి

చంద్ర సుబ్బారావు

గిరిజనుల నవజీవనం

గిరిజనాభివృద్ధికి పటిష్టమైన సంస్థలను ఏర్పాటు చేయడంలో ఆంధ్రప్రదేశ్ మార్గదర్శకమయింది. ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు తెగల ఆర్థిక సహాయ సంస్థ, గిరిజన సహకార కార్పొరేషను, గిరిజనాభివృద్ధి సంస్థ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల స్థాపన జరిగింది.

రాష్ట్రంలోని గిరిజనులకు ఆర్థికంగా ఒక నూతన శకం ప్రారంభమయింది. మూడవ ప్రణాళికా కాలంలో గిరిజనాభివృద్ధికోసం ప్రణాళికా కేటాయింపు 1.80 కోట్ల రూపాయలు మాత్రమే, వుండగా, ఐదవ ప్రణాళికలో ఈ మొత్తం 49.65 కోట్ల రూపాయలకు పెరిగింది.

వ్యవసాయం, చిన్నతరహా సేద్యపు నీటి వనరులు, పశుపోషణ, విద్యుచ్ఛక్తి, విద్యా రంగాలకు సంబంధించిన ప్రణాళికా పథకాలు చురుకుగా అమలుజరపడంతో ప్రగతి శక్తులు విజృంభించాయి. గిరిజనులను వారి పాత ప్రపంచం నుంచి వేరు పరచడానికి అవిరళ కృషి జరుగుతున్నది.

వారికి ఉజ్జ్వల భవిష్యత్తు ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ డైరెక్టరుచే ప్రకటితము.

37/77-78.

పోతుంటారు. 'అవసరమైతే ఓ చెయ్యి వెయ్యి దేవుడా' అనీ కావొచ్చు. 'దేవుడా ఈ సంబంధంలో వేలుపెట్టకు. మమ్మల్నిలా వదిలెయ్' అనీ కావొచ్చు.

'అంతేకాని-నీ వెంట'ని బ్రహ్మాన్ని తృణీకరించి కల్యాణం తలపెట్టినవాడు లేడు. ఉన్నా, వాడికి జన్మలో పెళ్ళికాదు. బ్రహ్మానికి 'బోకరేజి' యివ్వాలని కక్కుర్తిపడి, కొట్టు శివయ్య ఇలాగే మట్టి కొట్టుకుపోయాడు. వాడి కొడుక్కి వచ్చే సంబంధం, పోయే సంబంధం. పాపం ఆ పిల్లాడు కాసింత సన్నంగాని బాగానే వుంటాడు. బుద్ధిమంతుడు కూడా.

'ఏవయ్యా శివయ్యా పప్పన్నం ఎప్పుడూ' అని కొట్టుకు వచ్చిన వాళ్ళడిగితే.

'బ్రహ్మం కాలం చేసినప్పుడు.' అంటాడు శివయ్య!

'చొచ్చొచ్చొ' అనుకుని వెళ్ళిపోతుంటారు జనం! శివయ్యమీద జాలి కలక్కపోలేదు జనంలో. బ్రహ్మంతో అవసరం కలక్కపోదు కదా. ఈ విషయంలో ఖండించిన వాడి జుట్టు ఎప్పుడు బ్రహ్మానికి దొరుకుతుందో నన్న భయం!

* * *

నేను మా మరదలు లలిత పెళ్ళి విషయం బ్రహ్మానికే వదిలివేయ దలుచుకున్నాను. మామూలు పెళ్ళిళ్ళు జరగటమే కష్టం. ఇహ లలితలాగా కాసింత 'లొసుగు' కనిపిస్తే ఆ పెళ్ళికి చెరువుల నీళ్ళు త్రాగాల్సిందే. నేనా నోట్లో నాలికలేని వాణ్ణి. 'కూరగాయలు సరిగ్గా తుయ్యమని అడగలేను. ఇంకా ఆడకూతురు పెళ్ళి ఏం చేయగలను?' అనుకుని బ్రహ్మం దగ్గరకు పోయాను.

బ్రహ్మం సాదరంగా ఆహ్వానించి, చాపేసి కూర్చోబెట్టి 'కాసిని మంచి మజ్జిగ పట్రామ్మా' అని వాళ్ళమ్మాయికి చెప్పాడు.

'మజ్జిగెందుకు బాబాయ్-మంచినీళ్ళు చాలు' అన్నాను.

'పెళ్ళి పెద్దలకు లాంఛనాలుంటాయి. వాళ్ళడిగేవి కొన్ని. మనం ఇచ్చేవి కొన్ని. మాటవరసకు నువ్వు బత్తాయి రసం ఇమ్మంటే నేను యివ్వలేను. నీవు నీళ్ళివ్వమన్నా నేను పాలు-ఫలహారం పెట్టొచ్చు....'

బ్రహ్మం జేబులోనుంచి పొగాకుకాడ తీసి, నా వంక అదోలా చూసాడు.

'నేను పెళ్ళి పెద్దనని మీకు చెప్పలేదే....' ఆయన తెలివి కాశ్చర్యపోతూ అన్నాను.

'ఓస్-ఓస్ - నివ్వెవరవో, ఎందుకొచ్చావో తెలియకపోతే నేనింకా కల్యాణాలేం జరిపిస్తాను. కానుకలేం పుచ్చుకుంటాను. అసలు అబ్బాయ్—నీవు నాకు పరాయివాడివా—మజ్జిగిచ్చానా మంచినీళ్ళిచ్చానా అన్నది మూణ్ణిద్రలు అయ్యాక తీరిగ్గా కూచుని లెక్కేసుకోవాల. ఈ సమయంలో ఉండాల్సింది తెగింపు. అర్ధమయిందా ...'

బ్రహ్మం చిలక్కి చెప్పినట్లు చెప్పాడు.

నాకేమి టర్ధమవుతుంది. ఏనుగుముందు ఎలికలా కూర్చుని, గీతాపారాయణం వింటున్నానే కాని బ్రహ్మం కల్యాణ జ్ఞానం నాబోటి పామరుడికేం ఎక్కుతుంది?

పెళ్ళి విషయం ఎలా ఎత్తాలో తెలియలేదు. అందుకని, ఏదో కల్యాణపు తంతులగూర్చి మాట్లాడుతుంటే మధ్యలో మా లలిత గూర్చి అడక్కపోతాడా అనుకుంటూ.

'బాబాయ్, అసలు పెళ్ళంటే ఏమిటి?' అన్నాను, 'నాన్నా నేనెలా పుట్టాను' అనే పిల్లాడి ప్రశ్నలా.

బ్రహ్మం తడుముకోకుండా 'కనికట్టు' అన్నాడు.

ఓరి తస్సాగొయ్యా-ఇదేదో ఆధ్యాత్మిక చింతనలు ఆఖరిమెట్టులా వుందనిపించి . .మరి కాస్త తరిచి చూద్దామని....

'ఎట్లా! కనికట్టా' అన్నాను.

బ్రహ్మం మజ్జిగ గ్లాసు లోపల పెట్టించి చుట్ట ముట్టించాడు. 'చూడు బాబూ, నీవు త్రాగవని నీకు చుట్ట యివ్వటంలేదు కాని, దీని దుంపతెగ-ఈ గుంటూరు పొగాకుంది చూసావే కాబోయే వియ్యంకుడికి ఓ కట్ట పంపిస్తే లక్ష

ఆంధ్రప్రదేశ్ ఎక్కడుంది?

ఎక్కడుంది ఆంధ్రప్రదేశ్? వింధ్యకు అటూ, యిటూ? అక్కడ పెట్టుబడి మించి రాబడి వస్తుందట!

అక్కడ నా పరిశ్రమ మూడు పువ్వులూ, ఆరు కాయలుగా విస్తరిస్తుందట!

అడిగిందే తడవుగా, ఏవేవో పారిశ్రామికాభివృద్ధి సంస్థలు ఆసరాగా వచ్చి, బాసటగా నిలిచాయి. నన్నీ రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తగా నిలిపాయి.

ఇటీవలి కాలంలో రమారమి రూ. 10 కోట్ల పెట్టుబడి ధనంతో 72 భారీ మధ్యతరహా పరిశ్రమలు ఇక్కడ నెలకొన్నాయి. మరో 300 పరిశ్రమలు ద్వారాలు తెరుచుకోనున్నాయి. వీటిలో రూ. 850 కోట్ల అంచనా వ్యయంతో 193 సరికొత్త పరిశ్రమలు రూపురేఖలు దిద్దుకొని 60 వేల మందికి ఉద్యోగ ఉపాధి కల్పించనున్నాయి.

స్వయం ఉపాధి కల్పనా రంగంలో యీ రాష్ట్రం గర్వించదగ్గ ఔన్నత్యం గడించింది. సుమారు 8 వేల మంది ఔత్సాహికులు రూ. 19 కోట్ల పెట్టుబడి ధనంతో చిన్న, చిన్న పరిశ్రమలు పెట్టుకొన్నారు. 33,500 మంది విద్యావంతులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ - పారిశ్రామికాభివృద్ధి సంస్థ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఆర్థిక సహాయక సంస్థ, ప్రాతిపదిక అవసరాల కల్పనా సంస్థవంటి స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలెన్నో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి చేదోడు వాదోడుగా కృషి చేస్తున్నాయి.

సృజనాత్మక ప్రతిభా వ్యుత్పత్తులున్న ఔత్సాహికులను... యిదిగో యిక్కడున్నానని వేనోళ్ళ పిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ
డైరెక్టరుచే ప్రకటితము.

39/77-78

కట్నం క్రింద భావిస్తాడు. ఈ చిల్లరమల్లర మర్యాదలున్నాయే - మహా గొప్ప కార్యాలు సాదిస్తాయయ్యా. మన పిచ్చి జనానికి పదేలు కట్నం తగ్గినా పర్వాలేదు. విడిదింటికి పానకం పంపించారా లేదా అన్నది ముఖ్యం. '

మాట ప్రక్కదారికి మళ్ళించేమోనను కుంటూ 'నేనడిగిందీ' అన్నాను.

'నివ్వడిగింది నాకు గుర్తుందిలే.' శుభ కార్యాల్లో చిట్కా ఏమిటంటే నివ్వడిగింది నేను చెప్పకూడదు. అబ్బాయి తరఫువాళ్ళు ఆస్తి అడిగితే అమ్మాయి అందం గూర్చి చెప్పాల. వాళ్ళు అందం గూర్చి గట్టిగా లాగితే అమ్మాయి ఆస్తివాటా ఎంతో తెలియపరచాల. అబ్బాయి స్కూలు ఫైనలు తప్పాడనకూడదు. పది ప్యాసయ్యాడనాల. కాదు కూడదు రిజిష్ట్రీ చూపించమంటే మా కోడలు పెట్టిలో వుంది. ఆ పిల్ల పుట్టింటికెళ్ళింది. లగ్నాలనాడు చూద్దురుగాని అని సర్దుకోవాల . . చూడు అబ్బాయ్—'

'అర్థమైంది' అన్నాను అల్పసంతోషిలా.

'ఏమిటర్థమైంది. అర్థమయితే నీ మరదలు పెళ్ళి ఎప్పుడో చెయ్యవూ - ఇందాకనా-' చుట్ట బాగ నా ముఖంమీద ఊదుతూ—అన్నాడు బ్రహ్మం.

నా మనసు మాటల్లోను, ముఖం పొగలోను ఉక్కిరిబిక్కిరయ్యాయి. దగ్గొచ్చింది. దగ్గులో కలిసిపోయింది, కాని అప్పుడు నా ముఖంలో కోతులు కనిపించాయేమో!

'అసలు విషయం ఇట్టా పట్టేసేదే' అను కుని 'నీకు తెలియందేముంది బాబాయ్, చూసా వుగా-దానిమీద ఎంత మచ్చొచ్చిందో—ఇంకా పెళ్లెట్టా అవుద్ది చెప్పు.' బ్రహ్మం ఆప్యా యతగా నా చెవిదగ్గరకొచ్చి—

'పిచ్చోడా-ఇంతకాలం నా దగ్గర కెందుకు రాలేదా అనుకుంటున్నాను. ఇదా సంశయం. ఓస్సి. చందమామలో మచ్చలేదూ - ఎవడో ఓ నూలుపోగు గాడురాడూ-అసలు చందమామ గుణం ఏమిటో గ్రహించావా—?

ఏమిటన్నట్లు చూసాను.

'గ్రహించలేదూ - ఇవ్వాళ చూడు చంద మామని. మళ్ళీ రేపుచూడు. నీకే తెలుస్తది ' గుప్పెట్లో ఉన్నది గుణపం అన్నట్లు చెప్పాడు బ్రహ్మం!

'దాందేముంది-అమాసనాడు చందమామ ఏడుంటాడు' అన్నాను అదే పక్కిలో—

'అదగదీ, నీకూ నాకూ తేడా. పవుర్ణమినాడు పెళ్ళిచేసే బాధ్యత నా కొదిలెయ్. నీ మరదలైతే ఒకటీ, నా కూతురైతే ఒకటీనా—' చుట్టపళ్ళ క్రింద బిగిస్తూ అన్నాడు బ్రహ్మం.

బ్రహ్మం తలపెడితే అది జరిగి తీరుతుంది. తృణమో, పణమో ఆశించవచ్చు. మనది అవ సరం. అతనిది వ్యాపారం. అసలు తలపెట్టాడా లేదా అని చూసుకోవటం ముఖ్యం. బ్రహ్మానికి పెళ్ళిళ్ళంటే గిత్తల బేరాల క్రింద లెక్క. ఎటొచ్చీ 'సంభావన' గురించి అతనికీ మనకీ అపార్థాలుంటే ఆ పెళ్ళి కాళ్ళగోళ్ళ దగ్గర ఆగుతుందో, కార్యంగదిలో ఆగుతుందో చెప్ప లేం. అంచేత ఆ ముక్క నిశ్చయించుకుంటే బ్రహ్మంతో మామూలుగా పేచీలేదు. (అతనికి నీ మీద ఏదైనా వెనకటి గుర్రుంటే తప్ప!) అది కూడా తేల్చుకుందామని,

'ఆ మూడు ముళ్ళూ వేయించు బాబాయ్ దానికి. నీ ఋణం ఉంచుకోను' అన్నాను. అంతె చెప్పినంత ముఖంలో.

'నీ ఋణం తగలడ, నీ కిష్టమైతే ఓ కప్పు కాఫీ పొరెయ్. నీ పందిట్లో దివిటీ పట్టుకుని నిలబడతాను. కావలసింది పెళ్ళి-సరేనా—

'సరే.'


'అన్నట్టు రేపు కనిపించు' అన్నాడు.

లేచి పైపంచె భుజాన వేసుకుని బయలు దేరాను.

'కందులు విసరటం మొదలెట్ట మను' అని కేకేసాడు. బ్రహ్మం భాషలో అది పెళ్ళికి నాంది!

* * *

రెండో రోజు కాలవ కట్టమీద ప్రక్క ప్రక్కన నడుస్తున్నాం. కాలవనీళ్ళలా ప్రవాం



తంగా ఉంది బ్రహ్మం ముఖం. ఏం చెబుతాడో అని నీళ్ళలో చేపలా కొట్టుకుంది నా మనస్సు.

'ఈ పెళ్ళిళ్ళున్నాయి చూసావ్-' బ్రహ్మం మొదలెట్టాడు.

' . అన్నీ చిక్కుముళ్ళయ్యా. జాగరత్తగా లాక్కోవాల. ఓపిక లేకపోతే ఒట్టిదే. అవుతుందనుకున్న పెళ్ళి కాకపోవచ్చు. మాచికమ్మ కల్యాణం కుక్కలా బయటకు రావచ్చు.'

'వెయ్యి అబద్ధాలాడి ఓ పెళ్ళి చెయ్యమన్నారు గదా పెద్దలు' అన్నాను. పెళ్ళిళ్ళ గూర్చి నాకు తెలిసిన ఒక్కమాట బయటపెట్టే కిరిలో.

'ఎక్కినట్టుంది' అన్నాడు బ్రహ్మం.

నాకు సిగ్గేసిపోయింది. నాటకంలో చచ్చిన పాత్రకు 'వన్స్‌మోర్'. అంటే చుట్టూవున్న వాళ్ళు నవ్వినట్లు అనిపించింది.

'తెలివితక్కువ వెధవలు అనుండాలి. పెళ్ళికి వెయ్యి అబద్ధాలాడాలేమిటీ.. ' బ్రహ్మం వెలగని చుట్ట కాలవలో పారేసాడు.

అక్కర్లేదా అన్నట్లు చూసాను.

'చూడూ-నా సర్వీసులో నేను వందల పెళ్ళిళ్ళు జరిపించాను. పట్టుమని పది అబద్ధాలైనా ఆడలేదు. అసలు అబద్ధం ఎందుకయ్యా. అబద్ధం, నిజం అని రెండు మాటల్లేవు. అవి రెండూ రూపాయి బిళ్ళకు రెండు పక్కలు. మాట వరుసకు చెబుతున్నాను. ..

పెళ్ళికొడుకు భవంతిలో ఉంటాడు అంటే ...అది భవంతి కావొచ్చు....పెరట్లో కారు షెడ్డు కావొచ్చు ..

అబ్బాయికి జీతం పన్నెండొందలుఅంటే.... ఆ జీతం నెలకో—సంవత్సరానికో చెప్పం గదా. .' మరో చుట్ట వెలిగించాడు!

నేను ఘక్కుమని నవ్వి 'తప్పుగదా బాబాయ్' అన్నాను.

'నవ్వే విషయం కాదోయ్ సన్నాసీ' అన్నట్లు నా వంక చూస్తూ.

'నా తత్వం నీకు బోధపడలేదు. తప్పా - పెళ్ళంటే ఏమిటి? ఓ పచ్చి బూతు' అన్నాడు ఉపనిషత్తులోని మాటలా. 'బూతా' అన్నాను!

'కాక మరేమిటి? పరంధామయ్య కూతురు అడ్డమైన వాళ్ళతో తిరిగి ఆర్నెల్లకో కడుపు దించింది. ఇవ్వాళ పదెకరాల కట్నం వచ్చిందని ఓ కుంక పుస్తెకడితే పతివ్రత లాగా కాపరం చేస్తుంది. వెంకడి పెళ్ళాం లేచిపోయి పుల్లిగాణ్ణి గుళ్ళో పెళ్ళి చేసుకుంది. ఇప్పుడు వెంకడికి కాళ్ళుకడిగి కన్యాదానం చేస్తామంటున్నారు....'

'అందరికీ అలా జరగదు కదా....!

'నేను జరిపించిన కేసులు ఆకాసెంలో చుక్కలన్ని వున్నాయి. పోయి నేడు 'సుంద ర్రావ'ని మన పక్కూరే. తింటానికి తిండిలేదు. నెలకు యాభై రూపాయల సంపాదన! ఆళ్ళ య్యొచ్చి నా కాళ్ళమీద పడ్డాడు. మూడోనాటికి పెళ్ళి చేయించాను....'

'ఎవరితో—'

'లక్షణమైన పిల్లతో. ఆ పక్కూరు వెంక ట్రామయ్య కూతురుతో-చేయవలసింది కాపరం గాని, పెళ్ళి ఎలా జరిగిందో ఎవడి క్కావా లయ్యా.. '

'అంతే నంటావా—'

'ముమ్మాటికీ అంతే. పురాణాల్లో చూట్టంలా. చేపనుకొట్టి ఒక పిల్లనీ, వేటకెళ్ళి ఒక పిల్లనీ కొట్టుకొచ్చుకునే వాళ్ళు.. .'

బ్రహ్మం సాక్షాత్తూ దేవుడిలా కనిపించాడు. 'కాళ్ళమీద పడిపోదాం' అనిపించింది కాని, కార్యం జరగనిమ్మని ఊరుకున్నాను.

'అంచేత పెళ్ళిళ్ళు జరగటం, జరక్క పోవటం నయడి చేతిలో పని. .' బ్రహ్మం చుట్ట నిప్పు ఆరిపోయిందేమో చూసుకున్నాడు.

బ్రహ్మం సామర్థ్యం తెలియంది కాదు. ఆ శివయ్య కొడుకు పెళ్ళి ఇవాల్టికీ గుమ్మంలోనే ఆగిపోయిందంటే బ్రహ్మం ఘనతే. సంబం ధాల కొచ్చిన వాళ్ళని రోడ్డుమీద కలుసుకుని.

'ఏ వూరు బాబూ మనది?' అనేవాడు.

'ఏటపాలెం అండి. సంబంధం కోసం వచ్చాం. అన్నట్లు ఈ వూళ్ళో శివయ్య కొడు కని ఉన్నాట్ట. ' వాళ్ళు!

'లేకేం. మహారాజులా ఉన్నాడు.'

'ఏమండీ . . .ఏం .ఎలా వుంటాడు కుర్రాడు!'

'కుర్రాడు మంచావాడే. బుద్ధిమంతుడే. కాక పోతే కాసింత ఉసుకు దగ్గు వస్తుంటది. క్షయ లాంటిదేమీ కాదని డాక్టర్లు చెప్పారనుకోండి. అయినా దబ్బించే జబ్బు కాదేముందండి. బంగారంలాంటి మందులున్నాయి.'

ఈ వాక్యం కాకముందే వచ్చిన వాళ్ళు ఊరు పొలిమేరలు దాటేవాళ్ళు! అతన్ని కాదన్న వాళ్ళందరికీ అదే గతి!

'అన్నట్టు బాబాయ్, ఆ సుందర్రావు కెలా పెళ్ళి చేసావ్' అన్నాను, విని ఆనందిద్దామని.

'అదా .. కుర్రాడు కాలేజీలో పని చేస్త న్నాడు' అన్నాను. వెంకట్రామయ్య ఎగిరి గంతేసాడు.'

'అంత అబద్ధమా. తర్వాత తెలుసుకోలా

'పెళ్ళయ్యాక తెలుసుకున్నారు! నన్నడిగితే టుటోరియల్ కాలేజీ అంట గదా—మాట తేడా-నాకు ఇంగిలీసు రాదాయె అన్నానంతే.'

'ఊరుకున్నారా '

'ఉరెట్టు కుంటారా. . అన్నట్టు రేపోసారి సుందర్రావుని చూసి రావాల. మజ్జాన్నం బస్సుకి బయలు దేరు.'

'సుందర్రావునా - పెళ్ళయినవాడితో మన కెందుకు?'

'పనుందిలే బయలుదేరు ..'

నా మాట వినకుండా బ్రహ్మం గబగబా నడిచాడు.

కాలవలో నీళ్ళ పామొకటి కప్పను మింగే సింది!

* * *

రెండో రోజు భోజనాల్చేసి మధ్యాహ్నం బస్సెక్కాం.

బస్సు బయలు దేరింది. టిక్కెట్లు నేనే తీసుకున్నాను. బ్రహ్మం జేబులోనుండి ఫొటో బయటకు తీసాడు. గట్టిగా ఓ సారి వాసన పీల్చాడు. బస్సు సందడిలో మాటలు ఎవరికీ వినిపించవనుకున్న తర్వాత—

'చూడు బాబూ. నీ మనవరాలు అందమైన పిల్ల. అందరి కళ్ళూ దానిమీదే, ఏమంటావ్-' మెల్లగా మాటల్లోకి దించాడు.

'అనేదేముంది - వాస్తవమే గదా.'

'అవునా. తల్లీ తండ్రీలేని పిల్ల. నువ్వేదో పెంచి పెద్ద చేసావ్. ఇవ్వాళ దాని శీలంమీద

అపవాదొచ్చింది. తొందరగా వదిలిచ్చుకోవటం మంచిదయ్యా—'

'దానికోసమేగా బాబాయ్, ప్రయత్నం!'

'పెయత్నం అంటే చెంబులో చేపలుపట్టటం కాదు. నీ కూతుళ్ళు కూడా ఎక్కొ_స్తున్నారు చూసుకో—'

'నన్నేం చెయ్యమంటావ్.'

'రెండో పెళ్ళి వాడికిచ్చేయ్' చటుక్కున చెప్పాడు బ్రహ్మం!

'రెండో పెళ్ళా' గుండెల్లో గుభేలుమంది. పువ్వులాంటి పిల్లకు రెండో పెళ్ళా! అందాల నా మరదలుకు ముసిలి వెదవా . . బ్రహ్మం సముదాయించుతున్నట్టుగా మళ్ళీ అన్నాడు.

'బేజారెత్తి పోకు. పెళ్ళికొడుకు ముసలాడు కాదు. ఎవరితోనో తిరిగింది అనటం మొదటి పెళ్ళికంటే అన్యాయం. నా మాట విని సుందరావు కిచ్చెయ్—'

బ్రహ్మం ఏం చెబుతున్నాడో అర్థంకాలేదు. మరుక్షణం విషంపెట్టి చంపెయ్-అంటాడేమో ననిపించింది! కాస్త తేరుకుని.

'సుందర్రావుకా?' అన్నాను.

'ఆఁ. సుందర్రావు కిచ్చిన వెంకట్రామయ్య కూతురు లక్షణమైన పిల్ల అనుకున్నామా - ఆ పిల్ల కాళ్ళల్లో రెండంగుళాలు ఎత్తు తేడా ఏడిసిందంట - మేమూ విషయం గమనించుకోలా-!

'అయితే—'

'ఎత్తు చెప్పులు తొడిగి లగ్గంలో నడిపించాను. ఇప్పుడు కుంటిపిల్ల నా కక్కర్లేదని సుందర్రావు విడాకులు పుచ్చుకున్నాడు.'

'ఆ నామీ మరి తెలివిగా పెళ్ళి చేసాం అన్నాడు—.

'తెలివి తెలిపేననుకో. పెళ్ళిళ్ళు జరిపించటం మన వృత్తి. మరి ఆ వృత్తిలో బ్రతికే వాళ్ళు ఇంకా వుంటారు. అలాంటి వాడెవడో వెంకట్రామయ్యకు సాయం పట్టేసాడు.'

'అయితే సుందర్రావుకు లలిని నిమ్మకుటారా-దీన్ని వదిలెయ్యడని నమ్మకం మేముంది?' విసురుగా అన్నాను.

'ఆవేశపడకు. రెండో పెళ్ళాన్ని ఎవడూ వదలడు. తిండికి లేకపోవొచ్చుగాని సుందరావు సినిమాల్లో బొమ్మలా వుంటాడు. నీ మరదలు ఒల్లు గలిగిన పిల్ల. ఆడు ఛస్తే వదలడు. జత బాగా సరిపోద్ది. '

'ఒద్దు బాబాయ్-దిక్కులేందాన్ని చేసి రెండో పెళ్ళి చేసానంటారు' బస్సు ఆపి దిగిపోదామనిపించింది. బ్రహ్మానికి కోపమొచ్చింది.

'రెండో పెళ్ళి కాదు. నాలుగు రోజులలా వుంచితే నీకు రెండో పెళ్ళాం అంటారు. అందమైందని అట్టే పెట్టుకున్నాడంటారు. ఆ రోజు నీ పెళ్ళాం నీకూ, దానికీ కూడా ఇంత గంజి పోయదు-ఆలోచించుకో-'

బ్రహ్మం నామీద దివ్యాస్త్రం ప్రయోగించాడు. నాకు మాట రావటంలేదు. ఒళ్ళంతా చెమటలు ప్రాకుతున్నాయి. బస్సు కుదిపేస్తుంది. బస్సులో దగ్గులు - తుమ్ములు - పసిపిల్లల కేకలు! కండక్టరు ఈలలు!

రెండో పెళ్ళి! రెండో పెళ్ళాం !టుటోరియల్ కాలేజీ—కుంటిపిల్ల—విడాకులు బ్రహ్మం. పెళ్ళి . మోసం— దగా —పెళ్ళి అబద్ధం—అబద్ధమే పెళ్ళి .. గంజి ...గంజి... ఉంచుకోవటం లలిని ! అందమైన లలిని పెళ్ళాం రెండో పెళ్ళాం . .

నా బుర్రంతా కలవరంగా వుంది!


బ్రహ్మం మాత్రం ప్రశాంతంగా బయటకు చూస్తూ లెక్కలు వేసుకుంటున్నాడు.

'ఈ పెళ్ళి జరిగితే నేనిచ్చేదానికి, సుందరావు ఇస్తానన్నది కూడి మజ్జిగ ఖర్చు తీసేస్తున్నాను. మళ్ళీ వెంకట్రామయ్య కూతురికి సంబంధం చూడాలి. శివయ్య కొడుక్కి పెళ్ళి జరిపించమని కాళ్ళమీద పడ్డాడు. కుంటిపిల్లకు ఎత్తుచెప్పులు తొడిగి శివయ్య కొడుక్కిచ్చి ముడెయ్యాల. వెంకట్రామయ్య ఇస్తానన్నదీ, శివయ్య ఇచ్చిందీ కూడిక. వచ్చిందాన్ని 'పుణ్యం'తో హెచ్చవేసి 'పాపంతో' భాగారిస్తున్నాడు... !!' □

చూపుడు వేలు

"డ్రైవర్? . స్పీడ్! . స్పీడ్! . . "

అపార్థం చేసుకోబడిన హీరో, 'బాలసుబ్రహ్మణ్యం' నేపధ్యంలో పాడుతూ— ఆత్మహత్య చేసుకునే నిమిత్తమై ఏ 'బోట్ డోర్'ని ఎన్నుకుని ఉంటాడో ముందుగానే తెలుసునన్నట్లు డ్రైవర్ని తొందరచేసే తెలుగు హీరోయిన్లా — చిరంజీవరావ్, మిత్రుడు



విశ్వనాధమూర్తి—

స్టేషన్ వచ్చింది. ఆటో ఆగింది.

రైల్వే బుకింగ్దగ్గర ఆ చివర్నించి ఈ చివరికి, పెద్ద 'క్యూ'. రైలు అప్పటికే ప్లాట్ఫాం మీద ఆగివుంది. ఒగుర్చుకుంటూ వొచ్చి 'క్యూ'లో నిల్చున్నాడు చిరంజీవరావు. ప్రక్కనే విడిగా నిల్చున్నాడు 'కంపెనీ'కోసం వచ్చిన విశ్వనాధమూర్తి. 'క్యూ' చేంతాడు చివర కళ్ళారా చూద్దామని, తన బైనాక్యులర్ లెన్స్లాంటి కళ్ళని సెట్చేసి చూస్తాడు చిరంజీవరావు. "నాన్సెన్స్!" — అన్నాడు చిరాగ్గా. "ఇదే కలకత్తాలో అయితేనా " అన్నాడు. అని ఊరుకున్నాడు. (చిరంజీవరావు మూడేళ్ళుగా కలకత్తా మహానగరంలో ఉంటున్నాడు. తన ఈ 'గ్రేట్నెస్'ని ఎవరు ఎక్కడ 'నోటీస్' చేయరో-అని భయపడి-అందుకోసమని, పైడైలాగ్ని అనడం అవసరంగా భావించే, అలవాటు చేసుకున్నాడు చిరంజీవరావ్)

కొంచెంసేపాగి "బగర్స్! .ఇడియట్స్ స్కౌండ్రల్స్! ..బా. " అనబోయి మళ్ళీ ఆగిపోయాడు-చుట్టూ ఉన్నవాళ్ళందరూ 'తమని తిడుతున్నాడు'—అని అపార్థం చేసుకుని తిరగబడి కొట్టగలరన్న ముందుచూపుతో.

అర్జెంటుగా చేతివాచీవంక చూసుకున్నాడు. అక్కడ వాచీలేదు. అది మొన్ననే సిక్లీవ్ తీసుకుని 'వాచ్ హాస్పిటల్'లో 'ఎడ్మిట్' అయింది. ఎలానూ చేతివైపు చూసాడు గదా, ఆట్టే మర్యాదగా వుండదని, 'మైమ్' చేసాడు వాచ్ చూసినట్లుగా. 'హెల్ విత్ ద టైమ్'— 'ట్వెణ్టీవన్ అర్స్, ట్వెణ్టీ టూ మినిట్స్, ఎణ్ట్వెణ్టీ. త్రీ సెకణ్స్" . . . అనుకున్నాడు, కలకత్తాలో '174' డయల్ చేసినప్పుడల్లా టైమ్ చెప్పే ఆడటెలిఫోన్ ఆపరేటర్. . ప్చ్ . ప్చ్ టెలిఫోన్ ఆడఆపరేటర్ వాయిస్ని ఇమిటేట్ చేస్తూ. 'ఓణ్లీ థర్టీన్ మినిట్స్ అన్డ్ జీరో జీరో సెవెన్ సెకెణ్స్ మోర్—అనుకున్నాడు ఆలిండియా రేడియో రన్నింగ్ కామెంటేటర్లా.

వెనక్కితిరిగి చూసాడు. అప్పుడే తన వెనకాల అరఫర్లాంగు 'క్యూ' ఏర్పడిపోయింది. ముందుకు చూసాడు. మందు పుచ్చుకున్న గున్న ఏనుగులా గునుస్తూ నడుస్తోంది 'క్యూ'.

చిరంజీవ రావ్కి సడన్గా ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా, వాడివాడిగా, వేడివేడిగా కోపం ఒచ్చేసింది.

"ఇదేవైనా ధర్మాసుపత్రి సహాయార్థం

అరేంజ్ చేసిన క్యాబరే డ్యాన్స్. సింగిల్ డే, 'సింగిల్ షో'నా!-అందరూ ఈ 'ట్రెయిన్'కే ఎగబడ్డారు. కొందరు మరో ట్రెయిన్‌లోనూ, మరికొందరు బస్సులలోనూ పోకూడదూ"— ఏసుక్కుంటూ గొణిగాడు విశ్వనాథమూర్తితో.

"యూ ఆర్ కరెక్టు!—సెంట్ పర్‌సెంట్ కరెక్టు!. అసలు కొందరు 'ప్లెయిన్'లలోనూ కొందరు 'షిప్'ల్లోనూ పోరాదూ—" అందామనుకున్నాడు విశ్వనాథమూర్తి. కాని అన్లేదు-చిరంజీవరావు ఎక్కడ 'అర్థం' కాకుండా 'అపార్థం' చేసేసుకుంటాడో అని భయపడి.

ఇంతలోనే చిరంజీవరావు నోరు తెరిచాడు.

"ఛీఛీ! . ఇక్కడ రోడ్ల మీద ఓడలు కాదు సరికదా-చిన్న చిన్న పడవలు కూడా వెళ్ళవు. ఇదే కలకత్తాలో అయితేనా... ఇలా ఒక్క చినుకు పడితే చాలు, ఎక్కడ బస్సులక్కడ ఎక్కడ 'ట్రాము'లు అక్కడ ఆగిపోయిన కారణంగా, ప్రయాణీకుల సౌకర్యార్థం—ప్రత్యేకంగా, అప్పటికప్పుడు రోడ్ల మీద మోటారు బోట్లు నడిపేస్తారు ఒక్క చినుకు నాలుగు చినుకుల యిందా ?!"

"..ఇక బంగాళా ఖాతంలోంచి ఓడలు డైరెక్టుగా రోడ్ల మీదకే ఒచ్చేసి, బస్టాపుల్లో నిలబడిపోయిన మనుషులందర్నీ ఎక్కించుకుని సురక్షితంగా ఇంటింటికీ తీసుకువెళ్ళి దింపుతాయి ." అంటాడు కాబోసు, అనుకున్నాడు విశ్వనాథమూర్తి.


'ఇప్పుడు కాదు. టైం వుంది'—అన్నట్లుగా నోరు మూసేసాడు చిరంజీవరావు.

ఈసారి "అసలు నన్నడిగితే ఒక్కొక్క ఊరికి సంబంధించిన టిక్కెట్లు అమ్మడానికి ఒక్కొక్క బుకింగ్ ప్రత్యేకంగా వుండాలి. ఇదే కలకత్తాలో ఐతేనా.." అనబోతాడు

శ్రీసంజీవ్

చిరంజీవరావు, అనుకున్నాడు విశ్వనాథమూర్తి.

అందుకు సమాధానంగా "అస్సలు బుక్కింగులే వుండవ్; ఎందుకంటే-అసలు అక్కడ టిక్కెట్లు కొనేవాళ్ళే యెవరూ వుండరు—..; ఎందుకంటే, మనకి ఇక్కడ చాలామందికి సొంతసైకిళ్ళు ఉన్నట్లుగా, మీ కలకత్తాలో ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క 'ఓన్ ట్రెయిన్' (సొంతరైలు) ఉంటుంది. దానిలోనే ఆఫీసులకీ బజారులకీ, సినిమాలకీ వెళ్ళొస్తుంటారు... కదూ....!" అందామనుకుని, ముందే ప్రిపేర్ చేసుకుని వుంచుకున్నాడు విశ్వనాథమూర్తి.



'టైం! ఒచ్చేసింది' అనుకుని—నోరు తెరిచాడు చిరంజీవరావు.

ఆతృతగా ముందుకు వంగాడు విశ్వనాథమూర్తి.

'హాచ్చి' అని తుమ్మి ఊరుకున్నాడు చిరంజీవం.

జ్యోతిషానికి భవిష్యత్తు తెలుసా?

తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్ కాలాన్ని చూడగల జ్యోతిష్కులున్నారు.

పన్నెండు గదుల్లో దోబూచులాడే నవగ్రహాల వైనం తెలిసిన జ్యోతిశ్శాస్త్ర పండితులు మాత్రమే కాదు సుమండీ!

సగటు మనిషి జీవితపు చీకటిగదుల్లో రేపటి వెలుగును నేడే చూడగల అర్థికశాస్త్ర ప్రవీణులు.

సామాన్యుడి జీవితం మీద స్వతంత్ర భారత సంస్కృతి ముద్ర వేయగల ప్రణాళిక వ్యూహ రచయితలు.

"నా దేశం ఏ రంగంలో ప్రగతి సాధించినా, దాని ఫలితాలు భారతీయులందరికీ సమంగా దక్కాలి. అప్పుడే నేనా ప్రగతిని గుర్తిస్తాను." అన్నారు బాపూజీ. బాపూ కన్న కలలను నిజం చేస్తున్నాయి నేటి పంచవర్ష ప్రణాళికలు – ఐదవ పంచవర్ష ప్రణాళిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాలిటి వరం 1973–74లో ప్రణాళికా పెట్టుబడి రూ. 93 కోట్లు వుండేది. 1974–75లో రూ. 148 కోట్లకు చేరిన యీ వ్యయం 1975–76 నాటికల్లా రూ. 203 కోట్లకు పెరిగింది.

గత సంవత్సరం 1976–77 వార్షిక ప్రణాళిక పెట్టుబడి రూ. 298 కోట్లు. 1977–78 ప్రణాళికా కాలానికి రూ. 383 కోట్లకు పెంచారు.

1978–79లో యిది రూ. 450 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.

నాల్గవ పంచవర్ష ప్రణాళికా కాలం మొత్తం పెట్టుబడి రూ. 499 కోట్లు మాత్రమే కాగా ఒక్క 1978–79 వార్షిక ప్రణాళిక పెట్టుబడి ఈ మొత్తానికి రమారమి సమానమన్నమాట. ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో మొత్తం పెట్టుబడి సుమారు రూ. 1480 కోట్లు వుంటుంది— యిది నాల్గవ ప్రణాళిక పెట్టుబడికంటె మూడురెట్లు అధికం.

ప్రణాళికలు విజయవంతమైతే ప్రగతి భేరి ప్రతిమనిషి గుండెలో ప్రతిధ్వనిస్తుంది– తెలుగు తల్లి జడలో ప్రగతిపుష్పం ఘుమ్మున వికసిస్తుంది!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధ శాఖ
డైరక్టరుచే ప్రకటితము

38/77-78

'చిరంజీవి! చిరంజీవి!' అంటూ యేదో పోగొట్టుకున్నవాడిలా నిరుత్సాహ పడిపోయాడు విశ్వనాథం.

మళ్ళీ 'మైమ్' 'మైమ్' చేసాడు చిరంజీవి. (కలకత్తా ఆంధ్ర అసోషియేషన్‌లో గొప్ప 'మైమ్ ఆర్టిస్టు' గదామరి.)

'టెన్ మినిట్స్ అన్డ్ థర్‌టీన్ సెకెండ్స్ ఓన్‌లీ' అనుకున్నాడు—ఒళ్ళు మండు తున్నట్లుగా. చిరంజీవరావు విడిచిన ఈ ఒక్క వేడి ఆవిరి నిట్టూర్పు వలన—శక్తివచ్చిన 'స్టీమ్ ఇంజన్'లా హుషారుగా మొదలుపెట్టింది— 'క్యూ.'

'కెవ్వు—' మని కేకవేసాడు చిరంజీవరావు. తన నెత్తిమీద, సీలింగ్ ఊడిపడుతోందనుకొని అదిరిపడి పారిపోబోయి, నెత్తి తడుముకుని, తమాయించుకున్నాడు విశ్వనాథమూర్తి.

ఇంతకీ జరిగిందేమిటంటే, చిరంజీవరావు క్యూలో ఆరోమనిషనగా ఓ కాకీబట్టల పోలీస్ ఇన్‌స్పెక్టరు, సుడిగాలిలా వచ్చి, తన 'వేలు విడిచిన 'ఎక్స్'గాడి 'టిక్కెట్'కోసం, క్యూలు ప్రజలకోసమేగాని ప్రభువులకోసం కాద'న్నట్లు సరాసరి బుకింగ్ దగ్గరకివచ్చి, టిక్కెట్ పుచ్చేసుకుంటున్నాడు.

ఆంధ్ర బెబ్బులిలా గాండ్రించాడు-చిరంజీవి.

తాండ్రపాపయ్యలా గర్జించాడు-చిరంజీవి.

"డామిట్! స్టాపిట్!"—మైమ్‌లో కాదు 'రైమ్'లో అరిచాడు చిరంజీవి.

సబిన్‌స్పెక్టర్ టోపీ గమ్మత్తుగా అదిరిపడి, జారిపోయింది. బుకింగ్‌లోవున్న గుమస్తా కళ్ళజోడు, జర్రునజారి ముక్కు కొనకుతగిలి ఆగిపోయింది.

"వియ్ ఆర్ జస్ట్ ఫూల్స్ టు స్టాండ్ హియర్ ఇండిస్ బ్లడీ క్యూ." (ఈ వెధవ వరుసలో నిలుచుని వుండటానికి మేము వెర్రి వెధవలం?) అన్నాడు వ్యంగ్యంగా చిరంజీవరావు.

"యూ మీన్ టూసే ఐయామ్‌ఏఫూల్?" (అంటే మీ వుద్దేశ్యం—నేను వెధవనా)—ఇన్‌స్పెక్టర్‌కి అర్జంటుగా తన నెత్తిమీద టోపీ, చేతిలో 'స్టిక్కూ' గుర్తొచ్చాయి.

"అఫ్‌కోర్స్! ఐ మీన్ టు సే దట్." (అవును నేను ఖచ్చితంగా ఆ వుద్దేశంతోనే అన్నానయ్యా!).. చిరంజీవికి బియ్యేలో బట్టీ పట్టిన ఫండమెంటల్ రైట్స్ గుర్తుకొచ్చాయి. హిందీనటుడు 'షాట్‌గన్ (శతృఘన్) సిన్హా' పోజ్‌లో రెండుకాళ్ళూ స్టాండ్ ఎట్ ఈజ్‌లో వుంచి, ఎడమచేతిని నడుముమీద పెట్టుకుని, కుడిచేతి చూపుడువ్రేలును, 'పిస్తోలు' లాగ ఇన్‌స్పెక్టర్ గుండెలవైపుగా చూపిస్తూ— అన్నాడు.

"అంతే!"....అన్నాడు సబ్బిన్‌స్పెక్టర్.

"అంతే!"—అన్నాడు చిరంజీవయ్యర్.

షటప్పన్నాడు టోపీరావ్.

గెటౌటన్నాడు సిసింద్రీరావ్.


స్టిక్‌చుట్టూ ఇన్‌స్పెక్టర్ పిడికిలి బిగుసుకుపోయింది. (డిక్టేటర్ పిడికిల్లాగ కాదు. హిస్టీరియా పేషెంట్ పిడికిలిలా.)

అంతే; చిరంజీవరావ్‌కి హుషారొచ్చేసింది. సబిన్‌స్పెక్టరు, ఖంగుతిన్న ఈ దృశ్యంచూసిన 'క్యూ' మిత్రులంతా ఒక్కసారిగా,— కురుక్షేత్రంలో, అంతవరకూ దూరంగా నిల్చున్న ఎక్స్‌ట్రా సైనికులందరి వైపూ కెమేరా మూవ్ చేసినప్పుడు, వాళ్ళకి అమాంతం సరదాపుట్టేసి కత్తి పుచ్చుకుని సెన్స్‌మీదకొచ్చి చెడామడా చెడీ చేసేసినట్లుగా. యుద్ధం సీనులోకి దిగిపోయారు.

చిరంజీవరావుకి పిచ్చెత్తి పోయింది. అరిచేస్తున్నాడు. కరిచేస్తున్నాడు. జుట్టుపీకేసుకుంటున్నాడు. చేతులు ఝాడించేస్తున్నాడు.

అందరూ కలసి ఒక్కసారిగా ఇన్‌స్పెక్టర్ మీదబడ్డారు. ఇన్‌స్పెక్టర్ ఖంగారుపడిపోయాడు. బెంబేలెత్తి పోయాడు. మంచి వాళ్ళకు రోజుల్లేవనుకున్నాడు. అధర్మయుద్ధంలో అభిమన్యుణ్ణనుకున్నాడు. తనకి నాటకాల్లో బహుమతులొచ్చాయన్న విషయం గుర్తొచ్చి, విషాద ఘట్టంలో హీరోలా 'హయ్యో' అనుకుంటూ, నుదిటిమీద గుప్పిటతో కొట్టుకో

(వి) చిత్ర విజ్ఞానం



పేడను పిడకలుచేసి వంటచెఱుకుగా ఉపయోగించడం మన అలవాటు. కొలరాడో, అబర్న్ యూనివర్శిటీలలోని డా॥ సెక్లర్, డా॥ బ్రాడీ, పేడలో సుమారు ఎనభై శాతం సత్తువయిన పదార్థాలున్నట్లు తెలుసుకున్నారు. పేడను శుభ్రపరచి పచ్చటి పొడరు (పౌడి)ను తయారుచేసి దాన్ని పశువులకు ఆహారంగా వాడితే, పశువులు ఆరోగ్యవంతంగా వుంటాయంటున్నారు. అమెరికాలోని సిరిస్‌లాండ్ కంపెనీ ఇందుకై ఒక పెద్ద ఫ్యాక్టరీ నెలకొల్పింది!

జోయి, ఆ స్థానంలో టోపీ తగలడంతో దాన్నోసారి సరిచేసుకుని, ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

"గివ్ దట్ టికెట్ బాక్—" (ఆ టికెట్టు తిరిగి యిచ్చేయండి!) — చించుకున్నాడు చిరంజీవి.

హంటర్ దెబ్బ తిన్న సర్కస్ సింహంలా 'హుం'—అనుకుంటూ గుమాస్తాకి టికెట్ అందించేసాడు ఇన్స్పెక్టర్.

"ఖమాన్! గో అండ్ స్టాండ్ యిన్ ద క్యూ—" (రండి. వెళ్ళి క్యూలో నిల్చోండి) అన్నాడు చిరంజీవి.

విక్కచచ్చిపోయాడు ఇన్స్పెక్టరు. చింత చచ్చినా పులుపు చావదన్నట్లుగా, కుడిచేత్తో 'స్టిక్'ని ఎడమ అరచేతిలో 45 డిగ్రీల కోణంలో కొట్టుకుంటూ, తన వేలువిడిచిన 'ఎక్స్' గాడిదనే క్యూలో నించోమని, తను మాత్రం మాచ పీఛే మూడ్—మూడులో నిలబడిపోయాడు.

'క్యూ'లో అందరూ "హహ్హహ్హ..." అని నవ్వుతున్నారు.

రాజేష్‌ఖన్నా, వినోద్‌ఖన్నా, పుడ్‌బీఖన్నా లందరి పోజులూ చకచక మార్చేస్తున్నాడు. చిరంజీవరావ్ అన్నట్టు కలకత్తావాణ్ణి 'కదూ' అది గుర్తొచ్చి నాలిక్కరుచుకుని ...'ఉత్తమ కుమార్'లా ఊగిపోయాడు.

అందరూ 'ఆహా' అన్నారు. 'ఓహో' అన్నారు. 'శుష్కించిపోతున్న ఆంధ్ర ప్రజానీకంలో చైతన్యం తీసుకవచ్చాడన్నారు. 'మహా నాయకుడు వెలిసా'-డన్నారు. 'మరో ఆంధ్ర సింహం'-అన్నారు. తను మాత్రం 'బెంగాల్ టైగర్'ని అనుకున్నాడు.


పేపర్లో వేసేయాలన్నారు; దండలు వేసి తీసేయాలన్నారు; నిలబెట్టి శిలావిగ్రహం కట్టించి పారేయాలన్నారు;—కాని ట్రెయిన్ టయిమ్ అయిపోవడంతో ఆ ప్రోగ్రామ్‌లన్నీ పోస్ట్‌పోన్ చేసుకున్నారు.

గుమాస్తా మొహంలోకి గబ్బర్‌సింగ్ పోజ్ పెట్టి, టికెట్ తీసుకుని అందర్నీ ఒక్కసారి అలా ... అలా .... 'సంజీవ కుమారుడి'-లా శాంతంగా కలయజూసి, తమాషాగా కాలర్ ఎత్తుకుని, ప్లాట్‌ఫాంమీదకి వచ్చాడు చిరంజీవరావ్. అనుసరించాడు విశ్వనాథమూర్తి.

"మరీ ఎక్కువగా దులిపేసావేమోరా?! ... ఏదో టికెట్ తీసుకున్నాడే అనుకో ..దానికి ఇంత. "బెదురుతూనే ధైర్యంచేసి అనేసాడు, విశ్వనాథమూర్తి.

బుద్ధుడయిపోయినవాడల్లా ఫ్లాష్‌బ్యాక్ ఒచ్చి, నరసింహావతారం ఎత్తేసాడు చిరంజీవరావు.

"—ఇదిగో యిలా ప్రతివిషయానికి ఎడ్జస్ట్ అయిపోతున్నాం గనుకనే మనం ఇలా ఏడిస్తున్నాం. వాళ్ళు అలా రెచ్చిపోతున్నారు



రూల్ అంటే రూలే. ఇన్‌స్పెక్టర్ కాదు. వాడి గ్రాండ్ ఫాదర్... కాదు-గ్రేట్ గ్రేట్ గ్రేట్ గ్రాండ్‌ఫాదర్ కాదు .. 'రూలు' అన్నది ఎవరికైనా ఒక్కటే... ఎ రూల్ ఈజ్ ఎ రూల్ ఫర్ ఆల్. ఇదే కలకత్తాలో అయితే ఏం చేస్తారో తెల్సా?!—ఇలా 'క్యూ'లో నుంచోకుండా పొరపాటున ప్రక్కగా, విడిగా నుంచుని బుకింగ్‌వైపు కన్నెత్తి చూశావో!—నిన్ను అమాంతం కాళ్ళు చేతులు కట్టేసి, చాపలో చుట్టేసి, రైల్వే ట్రాక్‌మీద విసరేస్తారు. . కాబట్టి సోదరులారా ఇంతకీ నేను చెప్పొచ్చేదేవిఁటంటే. .."

"ఇప్పటికే కాలాతీతమై పోయింది. కాబట్టి ఇంతటితో విరమిస్తున్నాను—అని" అన్నాడు విశ్వనాథమూర్తి చిరంజీవరావుకి అడ్డుతగిలి.

'వీడింక రైలెక్కడు; నన్ను ఇంటికి బస్సెక్క నివ్వడు; మన కెవ్వరికీ యింక దక్కడు' అని భయపడ్డాడు విశ్వనాథమూర్తి. అందుకే ధైర్యపు విసుగుతో, టాపిక్ మారుస్తూ అన్నాడు—"అన్నట్లు ఇంతకీ నీకు రిజర్వేషన్ లేదు. ఏం అవస్థ పడతావో ఏమిటో .."

పల్లెటూరి రైతును చూసినట్లు చూసాడు చిరంజీవరావు. "హో. అవస్థా?" ఈమాత్రం తెలీదా ఫూల్' అన్నట్లుగా నవ్వాడు చిరంజీవరావు.

"అక్కడే వుందోయ్ మన చిరంజీవి గ్రేట్‌నెస్. మొత్తం ఈపాటికి యిండియా అంతా రౌండ్ కొట్టేసాను. కాని ఎప్పుడైనా ముందుగా రిజర్వు చేసుకున్నానా?....నెవ్వర్. కానీ ఎప్పుడూ దర్జాగా 'బెర్త్'మీదే వెళ్ళాను! ఎలాగ? సింపుల్. కండక్టర్ దగ్గరకివెళ్ళి చేతిలో అయిదురూపాయలు పెడితేఅయిపోయె. బెర్త్‌నీది. 'మేనేజ్' చెయ్యగలగాలోయ్. 'మేనేజ్—'' చిరంజీవరావ్ వేదాంతం సత్యనారాయణలా వేళ్ళూ కళ్ళూ తిప్పుతూ—కూచిపూడి పోజులో అన్నాడు. ('మేనేజ్' అన్న పదం చిరంజీవ్‌కెంతో ఇష్టం. ఎందుకంటే అది కలకత్తా జనాలకి ఎంతో ఇష్టం.)

అదే సమయానికి అక్కడికి ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడు వచ్చాడు. జుత్తంతా 'సుందర్బన్స్'లా చిందరవందరగావుంది. గెడ్డంమీద 'వీడ్స్' బాగా పెరిగిపోయి వున్నాయి. వాడి ఒంటిమీద 'బెంగాల్ పులి'లా చారల బనీనూ గ్రుర్రా గ్రుర్రా ..లేవు. ఏదో మాసిపోయిన చొక్కా, మాసికల పైజామా శరీరంమీద

వ్రేలాడుతున్నాయి. చూడగానే 'బ్రతికి చెడ్డ వాడు' అనిపిస్తుంది.

"బెర్త్ సార్.. బెర్త్—కావాలా" అన్నాడు. చిరంజీవరావ్ మొహం ఎలక్ట్రిక్ బల్బ్‌లా వెలగలేదు. దీపావళి చిచ్చుబుడ్డిలా పువ్వులు చిమ్మింది. "త్రీటయిరా, టూటయిరా?"— అన్నాడు చిరంజీవి.

"ఏటయిరూకాదు. జనరల్ కంపార్టుమెంట్" అన్నాడు కుర్రాడు. ఒక్కక్షణం నీసిగాడు చిరంజీవరావు. కాని మళ్ళీ ఆలోచించాడు. 'రెండ్రూపాయలు...చాలా చవగ్గా వచ్చేస్తోంది... అయినా ఏటయిరయితే ఏమిటి? ఓ రాత్రి జర్నీ ఇంకా చేస్తే బేరంచేస్తే కొంచెం తగ్గొచ్చు కూడాను'... అనుకున్నాడు.

"రెండ్రూపాయలా! అఖ్ఖర్లేదు. రూపాయి బస్! " అన్నాడు.

"కిట్టదు బాబూ;రెండు రూపాయలు దయుంచండి—"

"నో నో నథింగ్ డూయింగ్; రూపాయి! అయినా ఏవిటయ్యా! . మాకేమయినా బలవంతమా?"

"సాక్ సార్. పోనీ రూపాయిన్నరిప్పించండి సార్!—"

చిరంజీవిరావు ఆగాడు. ఏదో ఆలోచించడంకోసం బుర్ర గోక్కున్నాడు. బలవంతంగా పుస్తె కట్టించుకుంటున్న పెళ్ళికూతుర్లా.... "ఊ! సరే-పద" అన్నాడు.

ముగ్గురూ కలిసి జనరల్ కంపార్ట్‌మెంట్ వైపుకి నడిచారు. జనం లోపల తోక్కేసుకుంటున్నారు. లోనేసుకుంటున్నారు. విశ్వనాథమూర్తి బయట నిల్చున్నాడు. లోపలకి చిరంజీవరావూ, ఆ కుర్రాడూ ఎక్కారు. విండో దగ్గర సీటుమీదా, ఎదురుగా వున్న 'బెర్త్' మీదా రెండు తుండుగుడ్డలు పరిచివున్నాయి. 'ఇది సీటు, ఇది బెర్త్' అని చూపించాడు. 'దట్స్ గూడ్!' అనుకున్నాడు. కుర్రాడు డబ్బూ తుండు గుడ్డలూ తీసుకుని దిగిపోయాడు. బెర్త్ మీద హోల్డాల్ పరిచేసి, దానిమీద ఎవరూ కూర్చోకుండా సూట్‌కేస్ పెట్టి, విండో దగ్గర కొచ్చి కూచున్నాడు.

ఆలశ్యం అయితే వాళ్ళావిడ 'జ్యోతమ్మ' కేకలు వేస్తుందని భయపడి, బై! బై! చెప్పి వెళ్ళిపోయాడు విశ్వనాథమూర్తి.

కిటికీలోంచి ఓసారి అలా విలాసంగా బయటకి తలకాయ వంచి చూసాడు. ప్రక్కనే వున్న మరో కంపార్టుమెంట్ దగ్గర ఇందాకటి ఇన్‌స్పెక్టర్ కనిపించాడు. కండక్టర్‌తో ఏదో 'మేనేజ్' చేసాడు కాబోలు చూస్తుండగానే అతగాడి 'ఎక్స్' గాడిదని లోపలకి ఎక్కించేసాడు. 'హర్రి' అనుకున్నాడు చిరంజీవి. అలా అనుకుంటూ బుర్ర పైకెత్తడంలో విండోచేత రద్దున మొట్టికాయ కొట్టించుకున్నాడు. 'ఓ గాడ్!' అని ఇంగ్లీషులో బాధపడిపోయాడు.

కిసుక్కున నవ్వొకటి ఈసీను వైపుగా దూసుకు వచ్చింది, తన సీటుకి కొంచెం అటు వైపుగా, ఎదురుగా ఓ స్వీటీ, బ్యూటీ, బటర్‌ఫ్లై


'ఓ మై గుడ్ గాడ్!' అనుకున్నాడు. 'దట్స్ గూడ్! దట్స్ గూడ్!' అనుకున్నాడు. గాడెస్ అనుకున్నాడు. 'గ్లాడ్ టు సీ యూ' అని కూడా అనేసాడు మైమ్‌లో.

క్రాఫ్ సవరించుకున్నాడు. కాలర్‌ని దించాలో ఎత్తాలో అర్థం కాక, అలాగే వుంచేసాడు.

ఇంతలో ప్లాట్‌ఫాం మీద ఒక్కసారిగా పెద్ద అలజడి; అందమైన కల చెదరగొడుతూ 'అలారం' మ్రోగినట్టుగా చిరాకుపడిపోయాడు చిరంజీవుడు.

"కొట్టండి-తన్నండి- చీరండి వెధవని" పెద్ద గుంపు. మధ్యలో ఇందాకటి కుర్రాడు.

"బ్లాక్ చేస్తున్నాడండీ బ్లాకూ! రైలు ఇంకా స్టేషన్‌లోకి రాకుండానే, జనరల్ కంపార్టుమెంటులో ఔటర్‌లోనే ఎక్కేసి, అరంగుళం జాగా కనిపిస్తే చాలు తుండుగుడ్డలు పరిచేసి, వాటిని ఒకటికి, రెండుకి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారండీ వెధవలు. వెధవ. బ్రేకెటు వెధవ బ్లాకు బ్లాకు " అంటూ అరుస్తున్నారు ఓ బాల్డ్ హెడ్, బ్లాక్ స్పెక్ట్స్,



బఫేలో పురుషుడు— ఆ కుర్రాడికి ప్రసాదం ఒడ్డించడంలో జారిపోయిన తన వాచీ, బ్లాక్ గోల్డు చెయిన్‌ని సరిచేసుకుంటూ.

'ఆఫ్ ది పీపుల్; ఫర్ ది పీపుల్; బై ది పీపుల్' అన్న ప్రజాస్వామ్య సిద్ధాంతాల్ని శిరసావహిస్తున్నామన్న సంతృప్తితో గాబోలు, ఆ కుర్రాడి మీద ప్రతి ఒక్కరూ శక్తికొలదీ శ్రమ దానం ప్రదర్శిస్తున్నారు. కొందరు కథ కళి ఆడేస్తే, కొందరు పిడికిళ్ళతో బాక్సింగ్ చేస్తున్నారు. ఇంకొందరు కాళ్ళతో ఫుట్‌బాల్ ఆడేస్తున్నారు.

ఆ కుర్రాడు 'బాబోయ్-అమ్మోయ్!' అని అరుస్తున్నాడు.

'లబో దిబో'మని ఏడుస్తున్నాడు.

"బాబూ! ఈ పాలికి వదిలేయండి బాబూ ఇంకెప్పుడూ సెయ్యను బాబూ! . బాబూ! ... తప్పయిపోనాది—చ్చెమించండి బాబూ! ..." అని అందరి కాళ్ళూ పట్టుకుని, గుండెలవిసేలా గుండెల్ని కరిగించేలా, ఏడుస్తున్నాడు ఆ కుర్రాడు.

"ఈ వెధవలందరూ ఇంతేనండీ! అందితే జుట్టు. అందకపోతే కాళ్ళు. వెధవని ఇలా కాదు. పోలీసుల కప్పజెప్పండి!—" అన్నాడు సీటు విషయంలో ఆ కుర్రాడితో సెటిల్మెంటు కుదరక సీటు కోల్పోయిన ఓ అభ్యుదయవాది.

"ఔను పోలీసుల కప్పజెప్పండి...పోలీసుల కప్పజెప్పండి.. " అందరూ ఏకగ్రీవంగా, ముక్తకంఠంతో అరిచేరు. "హాబ్బా సమిష్టి భారతంలో ఎంత ఐకమత్యం! ఎంత ఐకమత్యం!"....అనుకుని రొమ్ములు విరుచుకుని, మురిసిపోయారు.

దుష్టశిక్షణార్థం భక్తుల మొరనాలకించి ప్రత్యక్షం అయిన ఆదినారాయణమూర్తిలా—చేతిలో స్టిక్‌ని సుదర్శన చక్రంలా తిప్పుకుంటూ పరుగెత్తుకొచ్చాడు—ఇందాకటి ఇన్స్పెక్టర్. (హాశ్చర్యం! ఇప్పుడు వెంట రెడీమేడ్ పోలీసు కూడా ఉన్నాడు)

'సంభవామి యుగే యుగే'-అన్న శ్లోకం చదివేసి, ఆశ్చర్యంతో, ఆనందంతో చేతులు జోడించారందరూ.

ఇన్స్పెక్టర్ సీన్‌లోకి వొస్తూనే, ఎదురుగా విండో దగ్గర కూర్చుని ఉన్న తనను చూసాడు అంతే! కుర్రాడిమీద విరుచుకుపడిపోయాడు. 'రాస్కెల్', 'స్కౌండ్రల్' అని ఆబోరులా అరుస్తూ, ఆ కుర్రాడిజుట్టు పట్టుకుని లేవదీసి, వాడి చెంపమీద ఎడాపెడా' ఫడామడా, పెన్ని సావేసాడు.

కుర్రాడు హృదయ విదారకంగా ఏడుస్తు

న్నాడు. "నన్ను జైలు కొట్టుకెల్లకండి బాబూ! మా యిల్లు ఇల్లంతా నా మీదే వుంది బాబూ! నేను లేకపోతే మా ఓల్లంతా సెల్లాసెదరై పోతారు బాబూ! . ఇంకెప్పుడూ సెయ్యను... ఈ పాలికి ఒగ్గీయండి బాబూ!"—ఆ కుర్రాడి కళ్ళలో ఉప్పెనలా పొర్లుకు వస్తున్నాయి నీళ్ళు.

అయినా అదేం చూట్టంలేదు ఇన్‌స్పెక్టర్. చిరంజీవరావునే చూస్తున్నాడు. చూపుల్తో మింగేస్తున్నాడు. పళ్ళు పటపటమని కొరుకుతూ 'షటప్'—అన్నాడు. 'నాన్సెన్స్!' అన్నాడు. "ఐ.పి.సి డాష్ డాష్ . (———) సెక్షన్ ప్రకారం యూ ఆర్ అండర్ అరెస్ట్—" అన్నాడు స్టిక్‌తో వణుకుతున్న కుర్రాడి కడుపులో పొడిచి, రెక్క పట్టుకు ఈడ్చుకు పోయాడు కూడా వచ్చిన కానిస్టేబిల్ పక్షి.

సడన్‌గా ఏదో ఆలోచన వచ్చి, అంత వరకూ స్టేడియంలో కూర్చుని, బైనాక్యులర్ లోంచి 'మాచ్‌ని' క్లోజప్‌లో చూసినట్లుగా ఆనందించిన వాడల్లా ఒక్కసారిగా, ఆ ఇన్‌స్పెక్టర్ స్టిక్‌ని తన కడుపులో పొడిచి నట్లుగా ఫీలయ్యాడు చిరంజీవరావు.

అమాంతం కరెంటు పోయినపుడు, స్టేజి మీద స్టేట్యూలా నిలబడిపోయిన హీరోమీద, ఆడియన్స్‌లోంచి ఎవరో ఎలక్ట్రిక్‌లైట్ ఫోకస్ చేసినట్లుగా అయిపోయాడు.

క్షణంలో క్షణంపాటు—చిరంజీవరావులో ఉన్న 'అహం' అంతా ఎటో ఎగిరిపోయింది.

'తనకి తెలియకుండానే తనెంత తప్పు చేశాడు. 'క్యూ'లో నిల్చున్నప్పుడు 'రూల్స్' గురించి చెప్పేరివ్వాడు. సరదాకి, 'తనకన్న ముందుగా మరొకడు టికెట్ పుచ్చేసు కుంటున్నాడే!—అన్న ఉక్రోషంలో-ఉపన్యాసం దంచాడు. కాని, అప్పుడు తనకి తెలియకుండానే, తాను తన స్వార్థానికి, అహానికి 'రూల్'ని అడ్డు వేసుకుని, తను చేసింది 'రైటు'—అని బోరవిప్పుకున్నాడు. రైల్లో కూర్చోవడం గొడవ వచ్చేసరికి, బ్లాక్‌లో సీటు కొనుక్కుని, న్యాయంగా మరొకడికి రావల్సిన సీటుని తాను కొట్టేశాడు. ఇక్కడ తనకి తెలియకుండానే తన స్వార్థాన్ని తన గొప్పతనంగా జమకట్టుకుని, తనకి తాను తెలివిగా సమర్థించుకున్నాడు. 'క్యూ'లో నిలుచున్నప్పుడు బాణంలా దూసుకు వచ్చిన 'రూలు'—సీట్లో కూర్చోవడం దగ్గర రెక్కలొచ్చి చక్కాపోయింది. ఇన్‌స్పెక్టర్‌ని చూపుడు వ్రేలితో చూపించడానికి మాత్రం ఆ రూలు అక్కడ అక్కరకు వచ్చింది. ఎంతలో ఎంత తేడా?!—ఎంతలో ఎంత మార్పు?!

చూపు మరల్చి కంపార్టుమెంటు అంతా ఓ సారి కలియజూసాడు. ఓ మూలగా, ఓ మూడు కాళ్ళ ముసలావిడ, కూర్చోవడానికి సీటులేక, నిల్చోడానికి చోటులేక ఒంటి కాలిమీద త్రిశంకు స్వర్గంలో వ్రేలాడుతోంది. పాపం! బోలెడు జాలి పుట్టుకొచ్చేసింది చిరంజీవరావుకి. పోనీ తను చేసిన తప్పుని సవరించుకుందామా అనుకున్నాడు. పోనీ తను లేచి తన సీటుని ఆ మామ్మగారికి ఇస్తే !

ఒకటి రెండు. మూడు . సత్యజిత్ రాయ్ పిక్చర్లోలా, అంతా నిశ్శబ్దం చుట్టూ చీకటి మధ్యలో స్పాట్ .అందులో హీరో. హీరోలో తీవ్ర అంతర్ సంఘర్షణ టిక్.... టిక్ టిక్. కట్!

ఏదో అజ్ఞాత శక్తి తనని తట్టి లేపినట్లు ఫీలయి కూర్చున్న సీటులోంచి లేచాడు. 'హత విధీ!' అనుకున్నాడు. 'లేదు, లేదు, లేదు-ఈ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు' అనుకున్నాడు.

అలా అనుకుంటూ, ఏదో స్వర్గానికి వచ్చినవాడిలా, సీటు మీద ఇందాకట్నుంచి తనకి గుచ్చుకుంటూ, తనని తట్టి లేపిన వేప నెమలిగాయ రెక్కల్ని దులిపేసి, ఇందాకటి స్వీటీ, బ్యూటీ, బటర్‌ఫ్లై తనకి సరిగ్గా తగిలేట్లుగా ఏంగిల్‌ని ఎడ్జస్టు చేసుకుని, అమాంతం చతికిలబడ్డాడు-చిరంజీవి. చిరంజీవి చిరంజీవరావు.

కూర్చున్న చిరంజీవరావునూ, నిల్చున్న 'నిలబడలేని' ముసలావిడనూ, చిరంజీవరావు చూస్తున్న తీయని సీతాకోక చిలుకనూ తనతో తీసుకొనిపోతూ రైలు కదిలి ముందుకు సాగింది. □

కాకిపిల్ల కాకికి ముద్దు!

"సీతమ్మ వదినా! సూరమ్మత్త కూతురు రత్నం పేరుకి రత్నమేగాని అదేమిటో అంత కారునలుపు! కురూపమైనా కాస్త కళగా ఉంటుంది. ఆ చిన్నారి చిలకని ఆవిడ చేసే ముద్దు ఇంతా అంతా నా?" అన్నది సూర్యకాంతం.

"కావచ్చు. అంతకన్నా నలుపూ అంటుకొంటుందేమో కాకితే అన్నట్లు ఉన్నదే అనుకో కాంతంవదినా! ఉండవచ్చు. అందరూ మల్లెపువ్వుల్లాగా గోరువంకల్లాగా ఉంటారా? ఆ పిల్లని ముద్దుచెయ్యడం విడ్డూరం కాదు. కన్ను వంకర అయినా కాలు సొట్ట అయినా తల్లికి తాను కన్నపిల్ల మల్లెపువ్వే. మరి ముద్దు చెయ్యడం సహజమే" అని మృదువుగా బదులు పలికింది సీతమ్మ.

పొట్లకాయ చెట్టుకి బరువు కానట్టే తల్లికి తన పిల్ల బరువూ కాదు ఎగుసూ కాదు. పైగా ప్రాణముతో పెనవేసుకొన్న ప్రాణమే అవుతుంది. గొట్టికాయలనుకూడా చెట్టు భరిస్తుంది. బరువనదు. సృష్టి నైజగుణం అది. పుచ్చిన కాయనుకూడా ముచ్చటగా భరిస్తుంది కాబట్టి మబ్బులాగా కురూపంలాగా ఉన్న కోకిల తన పిల్లను పుట్టగానే చూస్తుంది. దానితో అందచందాలకూ ఆకారరేఖకూ సమష్టిగా పుట్టినాగే కాకిపిల్లను కాకి ముద్దుగా చేరదీసి తన గొంతులో ఉన్న ఆహారాన్ని దాని నోటిలోకి సరఫరా చేస్తుంది. రెక్కలలో మేనంతా తుడుస్తుంది. అవ్యక్తమయిన ధ్వనిలో ఏమిటో అంటుంది. అదికూడా ఏదో గొణుగుతుంది. పెద్ద పురుగులను చేరకు. ఉండేలుకి ఎదురుగా ఉండకు అని హితోపదేశం చేస్తుంది. తన పిల్ల పెరిగి పెద్దది కావాలని, జాతిపక్షులలో తానూ చెప్పుకోదగ్గ పక్షిగా మెలగాలనీ, గాలిలో తేలుతూ గాలిపటంలాగా స్వేచ్ఛగా జీవించాలనీ కోరుకోవటం ఆ తల్లి కాకికి తప్పుకాదు.

నలుపు తెలుపులలో ఏముంది? గుణం ప్రధానం. కులానికి తక్కువైనా గుణానికి ఎక్కువయిన ప్రాణులుంటారు. అక్కడ రూపురేఖలకు మొక్కుబడులుండవు. కాని 'కాకి నలుపు' లోకములో ఒక సామెతగా నిలిచిపోయింది. ఎలా ఉందమ్మా పెళ్ళికూతురు అని అంటే ముందు వచ్చే జవాబు ఇదే— 'కాకి నలుపు'. అలాగే గుణాలకు ప్రాధాన్యం ఇవ్వవలసి వస్తే ఆ ప్రత్యేకతకూడా కాకి జీవితములో కనిపించదు. 'బలిభుక్కు'—అని దాని కొక పేరు సార్థకముగా వాఙ్మయ ప్రతిష్ఠను పొందింది. పితృదేవతలను ఉద్దేశించి వేసే బలిని ఆప్యాయంగా ఒకదానితో ఒకటి పోట్లాడుకొంటూ తినే పక్షి ఇదే. దీనిని అమంగళదేవతలకు ప్రతినిధిగా చెప్తారు. అంటే పవిత్రత తక్కువగల పక్షి అని సారం

అలాగే యెవరి కంఠమైనా కాస్త మొరటుగానూ, జీరగానూ ఉంటే అక్కడకూడా దీనికే స్వామ్యగౌరవం 'కాకి గొంతుక'—అని. కర్ణకఠోరమైన ధ్వని దీనిదే అని తాత్పర్యం. అదేమి విడ్డూరమో దాని గూటిలో దాని పెంపకములో పెరిగిన కోయిల గొంతుకే ఎంతో మెప్పు వచ్చింది మన భారతీయ వాఙ్మయములో. రూపానికి రెండూ ఒకటే మళ్ళీను. అయితే నేమి! 'వసంతకాలే సంప్రాప్తే కాకః కాకః పికః పికః' వసంత కాలం వస్తే కాకి కాకే, కోకిల కోకిలే— అంటే వాటి స్వరూపాలు యెలాగున్నా స్వభావాలు బయలుపడతాయి అని అర్థం. ఈ కోకిల గొంతుకి ఎంత సాహిత్య గౌరవం ఉందంటే ఏమి చెప్పేది?

కావ్యకంఠ గణపతి ముని పేరు ఆధునికులు చాలామంది విని ఉండరు. ఆ మహనీయుడు మన ఆంధ్రుడే. అది మన అదృష్టం.

యామిజాల పద్మనాభస్వామి

ఆయన దురదృష్టం. సంస్కృతం ఆయన పుట్టుపొడవు. పదునొకండవ సంవత్సరము లోనే మేఘసందేశమునకు దీటుగ 'భృంగ సందేశము' అనే చిన్నారి కావ్యం చెప్పిన కవి. కాలాంతరాన 'ఉమా సహస్రం' వంటి మహా ప్రబంధాలు చెప్పిన అపర వాల్మీకి. ఆయన ఇరవైయోయేట నవద్వీపములో కవితా పరీక్షకు నిలిచి ఒక సందర్భములో ఆనాటి అధ్యక్షుణ్ని

'సమాసీనే రసాపేత్వం
మౌన మావహ మాకశే!
లోకః కరోతు సత్కారం
మత్వా త్వామపి కోకిలమ్'—అని చాటుగా

ఆక్షేపించాడు. తియ్య మామిడి కొమ్మపై కూర్చున్నావేగాని ఓ కాకీ! నోరుమూసుకుని కూర్చో. తెరిచావా లోకం నీకూ కోకిలకూ చెయ్యవలసే విధంగా సత్కారం చేస్తారు- అని భావం. సహపంక్తిలో కూర్చున్నా సత్కారం అర్హతనుబట్టే జరుగుతుంది. కాని కాకి అరిస్తే చుట్టాలు వస్తారు అనే వాడుక ఒకటి ఉన్నది. బంధువుల రాకకూ కాకి కూతకూ ఏమి సంబంధమో చెప్పలేముగాని శకునము క్రింద ఆ కూతను మన్నిస్తాము. అది ఒక్కటే కాకి జీవితానికి సంబంధించిన మంచితనం.

దీని బ్రతుకుకి ఇంకో సామెతకూడా పుట్టింది. 'ఎద్దుపుండు కాకికి నొప్పా?' అని. అదికూడ దీని దుష్టత్వానికి చిహ్నముగానే ఉంది. నిష్కారణముగ ఎదుటివారిని అందునా బాధలలో ఉన్నవారిని మరింత బాధపెట్టే 'పుణ్యజనుణ్ణి' ఉద్దేశించి యీ సామెత వాడడం లోకం రివాజు. దీని గుణం అంత యోగ్యమైన దన్నమాట. కాడి రాపిడికి ఎద్దుమెడ నలిగి పుండై చర్మం చిదిగి బాధపడుతూ వుంటే యీ పుణ్యజన జాతిపక్షి కడుపు కక్కుర్తికి దానిని పొడుస్తుంది. దీనిని ఏమనాలి? ఏమీ అనవద్దు. రామ! రామ! అని విచారించడం, చేతనైతే విసువులేకుండా దానిని తోలడం ... అనడం అనిపించుకోవడం అనవసరం. 'అని అనిపించుకోవడం అష్టగదా! నీ

సామ్యం

పెదాల రేకులు విడి
నవ్వు పూస్తుంది
రేకుల పెదాలు విప్పి
పువ్వు నవ్వుతుంది—
తొంగి చూసిన ఉదయంలోకి
హృదయం పొంగి ఒకటి
ఉప్పొంగిన హృదయంలోంచి
ఉదయించి మరొకటి—
ముళ్లులేని పువ్వువంటిది
కుళ్లులేని నవ్వు—
పగిలిన గుండెలోంచి పెగిలిన నవ్వు,
నలిగిన రేకులవంటి పువ్వు—
వెలుతురు వెలితయితే
కలతపడుతూ రెండూ కనుమరు
గవుతాయి

ఒకటి విషాదంలోకి,
మరొకటి విపన్నంలోకి —

—టి. చంద్రశేఖరరెడ్డి

స్వభావమా?' అని ఊరకే అన్నారా? ఇంతకీ చెప్పవచ్చేదేమంటే 'కాకిపిల్ల కాకికి ముద్దు' అనే ముద్దయిన సామెతలో స్వభావసిద్ధమైన ఆత్మీయత ప్రదర్శించడములో అర్హతా, అనర్హతలకు చోటులేదనియ్యేనే. సింహానికి సింహపు పిల్ల యెంతో చిట్టెలుకకు దాని పిల్ల అంతే. కాళిదాసుకి తన కవిత యెంత ముద్దో

'మేకతోకకు తోకతోక మేకకు మేక
మేకతోకకు మేక తోక మేక'-అనే పద్యం

చెప్పిన కవికి ఆ 'మేకతోక' పద్యమూ అంతే ముద్దు. కనుక కొన్ని విషయాలు మనం ఆక్షేపించకుండా ఉండటంకూడా తప్పే అవుతుంది కదా! కాబట్టి ఎదుటివారిని ఆక్షేపించే ముందు, ముందు-వెనుకలు ఆలోచించటం మంచిది అని నా ఉద్దేశ్యం □

ఎఫ్. ఆర్. బోర్డు మాత్రమే తగిలించుకుని, నిజానికి ఊరి పొలిమేరలు దాటి పోకూడదు, కానీ అదో మొండి ధైర్యం, నన్నెవరు పట్టుకోవచ్చారూ అని! అంతగా ఏ ఎర్రటోపీ అన్నా అటకాయిస్తే, వో పది మనది కాదనుకుంటే సరిపోతుంది కదా అన్న నమ్మకం లోలోపల. దానికితోడు "ఏడువేలు పై చిలుకు దాని మొహానపోశారు. నన్నెట్లాగూ వెనకెక్కించుకొని బయటకు వెళ్ళడానికి మీకు బిడియం అనుకోండి, కనీసం పిల్లల్నయినా సరదాగా అల్లా తిప్పుకు రారేం?" అని ఇంట్లో రుక్మిణి సతాయింపు. పెద్దవాడు శాండిల్యకు, ఆ మోటారుసైకిలు నేను బయటకు తీసినప్పుడెల్లా, తనను వెనక కూచోమంటానేమోనని కొండంత ఆశ. "నాన్నారూ! చక్రాలు తుడవనా?" అంటాడు. "కార్బన్ క్లీన్ చేశాను డాడీ!" అంటాడు మరో సారి. ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి. నాకూ రుక్మిణిని పిలియన్ సీటుమీద కూచో పెట్టుకుని, పైటచెంగు పైరగాలితో సరస మాడుతుంటే, నలుగురూ నావేపు ప్రశంసా నేత్రాలతో, అసూయతో చూస్తూవుంటే, రంయిమని ముందుకు దూసుకుపోదామనే వుంటుంది.

కొండముది శ్రీరామచంద్రమూర్తి

పార్ట్‌నర్స్



కానీ మోటారు సైకిలు కొన్న తర్వాత, నా సైకిలు క్రిందనే రెండుమూడుసార్లు నేనుపడి, ముందుపన్ను కొంచెం వూడగొట్టుకొని, మొహంమీద పట్టీలేసుకుని, ఒకటి రెండు సార్లు దాన్ని తిట్టి, నన్ను తిట్టుకుని, చచ్చిచెడి డ్రయివింగ్ వచ్చిందనిపించుకుని, టెంపరరీ లైసెన్స్ సంపాయించుకున్నాను.

మావూరు, పల్లెపిల్ల పట్నం షోకులు చేసుకున్నట్టుగా వుంటుంది. వీధులు ఇరుకు, మనుషులు మురికి. ఈవూళ్లో నాకు చచ్చే చిరాకు. నిన్న సాయంకాలం మా స్వస్థలం నుంచి వో ఉత్తరం వచ్చింది. గంగా భాగీరథీ సమానురాలయిన మా పెద అమ్మమ్మ చిన్న కూతురి మూడో మనవరాలు కాలం చేసిందని! తొమ్మిదోరోజు కర్మ ప్రారంభిస్తున్నామని, పదోరోజు తర్పణం విడవడం పదిమందీ కర్తవ్యం అనీ!


పదోరోజు ఆదివారమే అయింది. పర్వా లేదు. కానీ సోమవారం ఉదయానికల్లా నేను కాలేజిలో వుండితీరాలి, పబ్లిక్ పరీక్షలు ఎనిమిదింటికే ప్రారంభం. ఇన్విజిలేషన్ వర్క్ తప్పించుకోవడం సాధ్యంకాలేదు. మనసులో ధైర్యం సంగతి ఎట్లావున్నా, కాస్త వొడ్డూ పొడుగూ వున్నవాడ్ని, కుర్రవాళ్ళతో సంయ్యమంటే సంయ్యి మనగలవాడ్ని నేను ఒక్కడ్నే అని ప్రిన్సిపాలు నమ్మకం.

"పద్మా! తర్పణాలకు వెళ్ళకపోతేఏం?" అన్నాను, శనివారం సాయంకాలం కాలేజీ నుంచి ఇంటికి వచ్చింతర్వాత.

"అదేమిటండీ! గాయత్రికి మీకన్నా ఐన వాళ్ళెవరూ?" అన్నది మిక్కిలి ఆశ్చర్యంగా.

"నిజమే గానీ! ప్రొద్దున్నే ఆ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళి, ఒంటిగంటకు తర్పణాలు విడిచి, ఏ మూడింటికో భోజనాలుచేసి, మళ్ళీ ఒప్పుని సరిగా ఈవెనింగ్ ఎక్స్‌ప్రెస్ క్యాచ్‌చేసి, అర్ధరాత్రి కొంపకు చేరుకోవడం యెంత స్ట్రెయినో ఆలోచించావా?"

"స్ట్రెయిన్ అన్నది ఒప్పుకుంటాను. కానీ, తప్పనిసరి!"



మనసులో అంత ఇష్టంగా లేకపోవడంచేత గామోసు, మా పెద అమ్మమ్మ సైనుపంచ కట్టుకుని, నెత్తిన ముసుగేసుకుని, గుడ్లుపత్తి కాయలంతేసి చేసి నావేపు కోపంగాచూస్తూ, బోసినోటి చప్పిదవడలను అటూయిటూ భీకరంగా కదుపుతూ, "ఏరా రావుడూ! రావం టున్నావేవిటీ! సైకిలు కొన్నావుగా, పెద్దాణ్ని కూడా దానిమీదెక్కించుకురా! - ఏం వస్తావుగా రాకపోతే నేనూరుకోను. నా సంగతి తెలుసుగా" అంటూ కల్లోకొచ్చి, ఆ కలలోనే గాలిలో కలిసిపోయింది.

గబుక్కున లేచిచూస్తే అర్ధరాత్రి. కటిక చీకటి. దూరంగా పక్షులేవో వికృతంగా కూస్తున్న చప్పుళ్ళు. గుండె బలహీనంగా కొట్టుకుంటున్నది. మొహాన కమ్ముకున్న చెమట చేతిని తడిచేసింది.

అప్పటికప్పుడు ప్రక్కమంచంమీద పడుకున్న రుక్మిణిని తట్టిలేపాను. "ఇప్పుడు నన్ను డిస్టర్బ్ చేయకండి" అంటూ అటుతిరిగి పడుకుంది. అతి కష్టంమీద లేపి కూచోబెట్టి, లైటువేసి, ఇదీ సంగతి. అందుచేత తెల్లవారు ఝామునలేచి, మోటారు సైకిలు మీద, శాండిల్యనుకూడా వెంటతీసుకుని బయల్దేర తాను. ఏమంటావ్?" అన్నాను.

"శుభమా అని కొత్తబండీ మీద చావు చోటు కెందుకండీ?" అన్నది రుక్మిణి నిద్ర కళ్ళతోనే.

"అక్కడ చావుసంగతి ఏమోకానీ, ఎల్లుండి పొద్దున్న పరీక్షహాల్లో నేను కనపడకపోతే ప్రిన్సిపాలు ముందు నన్ను చంపుక తింటాడు. లెక్చరర్స్‌ను చంపుకు తినడం ఇప్పటి ప్రిన్సిపాల్స్‌కో స్పెషల్ హాబీ!"

"మీరు వెళ్ళితే వెళ్ళరండి, చంటికూడా దేనికి?"

"నాకు కంపెనీ!"

"మీకు డ్రయివింగ్ రాదంటారుగా?— ఏదన్నా ఆక్సిడెంటయితే ..."

"అర్ధరాత్రిపూటా ఆ అపశకునం మాట లేవిటే—శకునపక్షిలాగా?"

"ఉన్నమాటంటే ఉలుకెక్కువే లెండి!" కోపంగా లైటు ఆర్పేసి, అటుతిరిగి పడుకుంది.

మర్నాటి పొద్దున్న మోటారుసైకిల్‌కు కిక్

ఇస్తుంటె, పక్క యింటివారి పనిమనిషి పుటుక్కుమని తుమ్మింది. ఆ తుమ్ముకు భయ పడ్డట్లుగా మోటారు సైకిలు ఒక్కమూలుగు మూలిగి, పెద్దగా సకిలించి, స్టార్టయింది.

"ఏమండీ! తప్పదా?" అన్నది కాఫీకప్పుతో ఎదురువచ్చిన రుక్మిణి.

"ఎదురుగా నువ్వొస్తే, ఇహ నాకు అంతా మంచే!"

జావా ముందుకు రోడ్డుమీదకు ఒక్కదూకు దూకి, విజయవాడ వైపుగా ఆఘమేఘాల మీదుగా దూసుకుపోతున్నది. మెత్తని వెడల్పు రోడ్డు, ఒంటిని స్పృశిస్తూ చల్లనిగాలి, వెనగ్గా పెద్దవాడి మాటలు. తూర్పువేపు ఆకాశం నెత్తురు కొలనులావుంది. సూర్యుడు రక్తపు ముద్దలా వున్నాడు. విజయవాడకు వచ్చే టర్నింగ్‌లో, వూరిబయట ఆ సూర్యుడే పాలి పోయిన పేషెంటులా కనిపించాడు.

ఎదురుగ్గా పదిపదిహేను గేదెలు, అటూ యిటూ అడ్డదిడ్డంగా నడుస్తున్నాయి. ప్రక్కనే టీకొట్లలో ఇడ్లీలుతింటూ కాఫీలు తాగుతు న్నారు కొందరు గడబిడగా మాట్లాడుకుంటూ.

శాండిల్య ఆరోజే విడుదలవుతున్న వో అక్కినేని సినిమా విశేషాలు వివరిస్తున్నాడు మనోజ్ఞంగా.

ఇంతలో టీ కొట్లోనుండి వో ముసిల్ది ఆదరాబాదరా రోడ్డుమీదకు పరిగెత్తుకువచ్చింది అటునుంచి యిటుకి, తడబడుతున్న అడుగు లతో. రోడ్డుకి అడ్డంగా గేదెలు, గేదెలకూ రోడ్డుకూ నా మోటారు సైకిలుకూ అడ్డంగా ఆ ముసిల్ది. ఆరిన కుంపటిలాంటి ఆ ముసిల్దా నికీ నాకు వో గజమైనాలేదు.

ముందుగా ఫ్రంట్‌బ్రేక్ వేశాను. వెంటనే బ్యాక్‌బ్రేక్ నొక్కాను. క్లచ్ రిలీజ్ చేయడం మర్చిపోయాను. మోటారు సైకిలు గీమంటూ ఒక్క యెగురు యెగిరింది గాలిలోకి. "నాన్నారూ!" అంటూ వెనుకనుండి పెద్దగా కేక. ఆ కేకకు తోడుగా ఎదురుగా "అయ్యో నాయనో!" అంటూ పడిపోయిన ముసిల్ది. ఎదురుగానె చూచానో, వెనక్కి తిరిగానో చేతులు హాండిల్ మీదినుంచి వదిలేశాను, మోటారు సైకిలు కిందపడిపోయింది.


నలుగురూ బిలబిలా పోగయ్యారు. ముప్ఫ య్యేళ్ళ ఓ యువకుడు పెద్దగా ఏడుస్తున్నాడు. "నన్ను పెట్టి వెళ్ళిపోకే, వో మామ్మో!" అంటూ. శాండిల్యకు చేతులమీదా, కాలిమీదా గాయాలయినాయి. కళ్ళుతెరచి చూసేసరికి బాధగా వాడు కిందపడిలేస్తూ కనిపించాడు. నా కళ్ళు మండిపోతున్నాయి. మొహం మీదంతా చిమచిమగావుంది.

ఎక్కడ్నుంచి వచ్చాడో ఓ పోలీసు వచ్చాడు. అందర్నీ అటూయిటూ సర్దాడు. "ఆ ముసిల్దానికో మంచం వెయ్యండెహే!" అన్నాడు అధికార పూర్వకంగా. పక్కనున్న వో సోడాకొట్టు వాడితో, నర్సింలూ, ఈళ్ళం దరకూ ముందస్తుగా నాలుగు సోడాలు కొట్టే" అన్నాడు మళ్ళీ.

ఇంకా ఆ ముప్ఫయ్యేళ్ళ యువకుడూ పెద్దగా ఏడుస్తోనే వున్నాడు. "ఏందిరా, అట్టా గేడుత్తావ్, ఆడదానిలాగా! వూర్కో-వూర్కో! పొద్దున్నే ఎవరిమొహం చూశావో, అదురెట్ట మంతుడివి, గాయాలే కాత్తమోపుగా తగి ల్నాయ్ నీ యవ్వకు. అయ్యగోరు డబ్బు లిత్తారుగానీ, వైద్దిగెం సేయించు పోయి, దానికి కొత్తిజావ కాపించు, పో!" అని నావైపుకు తిరిగి, "ఏం సాబ్, దానికో యాభై రూపాయ లిప్పించండి." అన్నాడు.

ఆ కానిస్టేబులు నోటుబుక్కుతీసి మోటారు సైకిలు నంబరు 'నోట్' చేసుకోడానికి ప్రయత్నంచేస్తే, నంబరు కనిపించక అదో నేరం, టెంపరరీ లైసెన్సుతో ఊరిపొలి మేరలు దాటడం మరోనేరం, వీటికితోడు ఏక్సిడెంట్ నేరం, ఎలారా భగవంతుడా అని లోలోపల ఒకటే మదనపడుతున్న నాకు, వీటిగురించి పట్టించుకోకుండా "యాభయి రూపాయ లిప్పించండి" అని అతనడగడం నెత్తిన పాలుపోసినట్లయింది. వెంటనే అడిగి నంతా ఇచ్చేశాను, మరోమాటలేకుండా.

పార్ట్‌నర్స్



డబ్బు తీసుకుంటూ అతను నావేపుచూసి నవ్వాడు. అతనెందుకు నవ్వాడో నాకు తెలీలేదు.

డబ్బుచూడగానే ఆ యువకుడి ఏడుపు ఆగి పోయింది. ముసిల్దాని మూలుగు సన్నబడింది.

"రండిసార్, మిమ్మల్నీ, అబ్బాయిగార్నీ అమెరికన్ ఆస్పిటల్కు తీసుకువెళతాను" అన్నాడు మళ్ళీ ఆ కానిస్టేబులు.

"నా మోటరు సైకిలు" నాలో సన్నగా గొణుగుడు.

"ఏం ఫర్వాలేదు. అదిక్కడే పడుంటుంది లెండి!" దాన్ని తిట్టాడు వో బూతుమాట.

అమెరికన్ ఆస్పత్రిలో ఓ నర్సు అతన్ని చూడగానే, "ఏం బ్రదర్! ఇవ్వాళిది మొదటి కేసా?" అన్నది కళ్ళుచికిలిస్తూ. ఆ కానిస్టేబులు కాస్త సిగ్గుపడ్డాడు. అంత బాధలోనూ వాళ్ళిద్దర్నీ చూస్తే నాకు ఎంతో ముచ్చటేసింది. ఆ సిస్టర్ కాశ్మీర్ ఆపిలులాగావుంది. ఆమె కళ్ళు విశాఖపట్నం కొండసంపెంగల్లా వున్నాయి. ఆమె యౌవనం కొంటెగావుంది. కానిస్టేబులు ఆమె భక్తుళ్లా వున్నాడు. వీలయితే "నీ బాంచను కాల్మొక్తా!" అనేంత వినయం వొలి కిస్తున్నాడు, డాక్టర్ దగ్గర. ఆ తర్వాత ఆనర్సు నన్నూ శాండిల్యనూ డ్రెస్సింగ్‌రూంలోకి తీసుకు వెళ్ళి చెరో రెండు ఇంజెక్షన్లు చేసింది. టాబ్లెట్లు నోట్లో వేసింది. మొహాన్నా, చేతులమీదా, కాళ్ళమీదా మందుపూసి, ప్లాస్టరు పట్టీలు అంటించింది.

ఆమె ఆ పనులు చేస్తున్నంతసేపూ ఆ కానిస్టేబులు ఆమెను అంటి పెట్టుకునేవున్నాడు. ఆమె తెల్లని గౌనుసూ, ఆమె తెల్లని ఒంటినీ పూసుకుని పూసుకుని తిరిగాడు. డ్రెస్సింగ్ అయింతర్వాత, "పాపం మీకోసం చాలా కష్ట పడ్డది సార్!" అన్నాడు.

"అవునుగానీ సిస్టర్! నేనిక్కడ వుండాలా, వెళ్ళిపోవచ్చా?" అని అడిగాను.

"మహారాజులా వెళ్ళిపోవచ్చు." ఆమె మాటల్లో అదే కొంటెతనం. ఆ నల్లని కళ్ళల్లో ఆకర్షించే—అదే నవ్వు.

ఆమె అక్కడ వుండమంటుందనుకున్నాను అనలేదు. నిరాశ. ఆమెకు ఎంతిస్తే బావుం టుంది. అదో సందేహం.

"ఏవయ్యా! కానిస్టేబుల్—ఎంతిస్తే బావు టుందంటావ్?" రహస్యంగా అడిగాను.

"ఇద్దరికి ట్రీట్‌మెంట్ కదుసాబ్! ఓ

యాభయి అన్నా ఇవ్వండి."

"యాభయ్యా! సాలెగూటిలో చిక్కుకున్న పురుగులా కటకటపడ్డాను. అయిదుపదులూ యిచ్చి, థాంక్స్ చెప్పి బయటకు వస్తుంటే, కానిస్టేబులు ఆమెదగ్గరకు వెళ్ళి ఆమె అర చెయ్యి గిల్లడం, ఆమె కిసుక్కున నవ్వడం నాకు కనిపించింది. "అదృష్టవంతుడవోయ్ కానిస్టేబులూ!" అనుకున్నాను మనసులోనే. "మళ్ళీరండి!" అంటూ వినిపించింది సన్నని ఆ నవ్వుగొంతు వెనుకనుండి.

"నేను రాను!—ఆ కానిస్టేబులు తప్ప కుండా వస్తాడు!" అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాను. ఆ కళ్ళల్లో ఎంత అయస్కాంతమో!

యాక్సిడెంట్ జరిగిన చోటికి తీసుకువచ్చి, మా యిద్దర్నీ అక్కడ వదలి, "సాబ్ కేసూ గీసూ వద్దు. ఓ యాభై యివ్వండి. నే పోతా!" అన్నాడు కానిస్టేబులు.

అంతవరకూ అతని మంచితనంమీద నేను పెంచుకున్న గౌరవం ఆ ఒక్కమాటలోనూ విశ్లథమైంది.

"యాభయ్యా?!"

"అవును సాబ్!—కోర్టుకు వెళ్తే, ఎంత నష్టం, ఎంత కష్టం!!"

మాట్లాడకుండా యాభై ఇచ్చి, "థాంక్స్!" అన్నాను కటువుగా. అతను డబ్బు అందుకున్న మరుక్షణం సైకిలెక్కి గుణదలవైపుగా వెళ్ళి పోయాడు.

మోటారు సైకిలు స్టార్టు చెయ్యబోయాను. చేతివేళ్ళు స్వాధీనంలో లేవు. హాండిల్ ఎత్తడమే కష్టంగా వుంది. శాండిల్య నాకు సహాయ పడేస్థితిలో లేదు.

"షల్ ఐ హెల్ప్ యూ?"

తల తిప్పి చూశాను. ఆ ముసిలాని మనవడు. అరుగుమీదకు చూశాను. ఆ ముసిల్ది టీ కొట్లో కూచుని, ఖల్లు ఖల్లుమని దగ్గుతుంటూ టీ తాగుతోంది.

"మీ అవ్వకు. "

"షి ఈజ్ ఆల్‌రైట్!" ఆ యువకుడు ఇప్పుడు నీట్‌గా పైకి దువ్వాడు. గళ్ళ చొక్కా టక్ చేశాడు. బెల్‌బాటమ్ ట్రౌజర్స్ లోకి "ఆమె నాకు అవ్వాకాదు, ఆమెకు నేను మనవణ్ని కాదు. అడవిలోని ఉసిరికాయా, ఏటి పక్క ఉప్పుకల్లూ . అంతేసార్! మాదో లివింగ్ పార్టనర్‌షిప్!"

"యూ స్కౌండ్రల్!" నాకు కోపం ఆగలేదు.

"నన్ను తిట్టకండి. ఐ యామ్ ఎ గ్రాడ్యుయేట్! ఉద్యోగంకోసం తిరిగి తిరిగి ఇప్పుడీ ఉద్యోగం చేస్తున్నాను. ఇప్పుడీ ఉద్యోగంలో యెంతమందో తెలుసా సార్ పార్టనర్స్? నేను, ఆ గ్రాండీ, మీకు హెల్ప్ చేసిన కానిస్టేబిల్, ఇంజక్షనిచ్చిన నర్స్ యస్ ఆర్. బోర్డులు తగిలించుకొని, సరదాగా ఊళ్ళవెంట బయల్దేరతారే, మీరే మా కస్టమర్స్! అర్థమైందా సార్?—బైదిబై, మీ రిప్పుడు డ్రైవ్ చెయ్యలేరు. సహాయం చెయ్యమంటారా?"

"చేసిన సహాయం చాల్లే!" అందామని పించింది. కానీ అనలేదు. ఈ రాబందుల దేశంలో ఉదర పోషణార్థం బహుకృత వేష ధారణలు.

"ఎంతీమంటావ్?"

"ఎనదర్ ఫిఫ్టీ!"

"ఇట్ ఈజ్ టూ మచ్!"


"మా దగ్గర బేరాలుండవు సార్! అంతా ఫిక్సెడ్ ప్రైయిసెస్. యాక్సిడెంటుకు యాభై!" ఇంజన్ స్టార్టుచేసి "ఎక్కడకు పోదాం సార్?" అని అడిగాడు ఆ యువకుడు.

"వెనక్కి, ఇంటికే పోనీ!"

ఇంట్లో రుక్మిణికి జరిగిన భాగోతమూ, నా చెలివితేటలూ తెలియజెప్పవద్దని శాండిల్యతో అందామనుకున్నాను. కానీ ఏదో అభిజాత్యం నా గొంతు నొక్కేసింది. మోటారుసైకిలు దిగీ దిగకుండానే, "అమ్మా! మరేమోనే " అంటూ వాడు, అంత బాధపడుతూనూ, అసలు కథంతా చెప్పేశాడు.

అంతా విన్న రుక్మిణి కళ్ళల్లో ఒక కంట్లో జాలి, మరో కంట్లో ఎగతాళీ.

"పాడు బండీ అమ్మేద్దాం అండీ! మనకిది అచ్చిరాలేదు" అన్నది వొంటికి వేడినీళ్ళతో కాపటం పెడుతూ. □



ఆయనేదో చెప్పాలనుకుంటున్నారు. కాని నాకు వినాలని లేదు. ఏం చెప్పినా నా మనసును బాధించేదేనని అనుభవైక వేద్యం. నన్ను ఏడిపించడం — ముచ్చటగా ఆటపట్టించడం కాదు—ఆయనకు యెంతో యిష్టం—ఏనాడో యెవరికో అపకారంచేసి పాపం ఒడిగట్టుకున్నానో ఈ రకమైన నరకం అనుభవిస్తున్నాను. ఎన్ని పుస్తకాలు చదివినా, యెంత ఆలోచించినా, ఎంతమంది మహానుభావుల మాటలు విన్నా—మన సంస్కార సారం—పూర్వజన్మ కర్మఫలం—ఇదే సత్యంగా, ఇదే నిత్యంగా కనిపిస్తుంది.

పొద్దున్ననుంచి రాత్రివరకు ఉద్యోగం... ఆ తరవాత ఇంటిపని బాధ్యత—అలసట. నిరాశ.

ఆయన భోజనం అయిపోయింది. బయట కడుపు నింపుకుని వచ్చిన మనిషికి ఇంటిలో తిండి విధాయకంకోసమే-రుచికోసమూ కాదు, అవసరంకోసమూ కాదు.

ఉస్సురుమంటూ లేచి కంచం తీసి కడిగే చోట పడేసి టేబిలు తుడిచి చేతులు కడుక్కున్నాను.

వక్కపొడిడబ్బా టీపాయ్‌మీద ఉంచాను.

ఆయన సోఫాలో జేరబడ్డాడు. ఆయన చెప్పబోయేది దేనిగురించై ఉంటుందా అని ఆలోచిస్తున్నాను—

మా అక్క ఎయిర్ హోస్టెస్‌గా ఉందనో, తమ్ముడు శానిటరీ ఇంజనీరుగా ఉన్నాడనో మా నాన్నగారు మలేరియా ఆఫీసర్ అనో ఆట పట్టించే మనిషి—మా పెళ్ళినాటికి ఇలా లేరు. నేనంటే, నా వాళ్ళంటే ఆయన కెందుకంత చులకన!

నా డబ్బు ఆయన అవసరాలకి కాదు—విలాసాలకి పనికి వస్తుంది. నేనూ పనికి వస్తాను, పనిమనిషి మేరకు—ఇంటి కాపలా మేరకు—ఎందుకూ కొరగానిదాన్ని. నాకు భగవంతుడు మనసెందుకిచ్చాడో—మనసులోకి మేకులు దిగవుకదా అని అలా మేకులు కొడుతూ ఉండడం కొందరికి సరదా.

"నాకు అలసటగా ఉంది. వెళ్ళి పడుకుంటా."

ఆయన వక్కపొడి నములుతూ సోఫాలో వెనక్కి జారగిలబడి చెప్పడం ప్రారంభించారు.

"సుజా! ఈ రోజు మనకు బాగా తెలిసినాయన ఒకరు ఆస్పత్రికి వచ్చారు. అంతే కాదు, నన్ను వెదుక్కుంటూ... "

"ఎవరండీ?"

క్షణికంగా ఆయన వేసిన సస్పెన్స్ మోటిఫ్ వలలో పడ్డాను.

"మీ రాఘవరావ్ మాష్టారు."

మొదటి వాక్యానికీ, రెండోవాక్యానికీ ఎంత తేడా!

రాఘవరావ్ మాష్టారు చేసిన మహాపరాధం ఏమిటంటేనన్ను కన్నకూతురులాచూసుకోడం. వల్లమాలిన అభిమానాన్ని ప్రదర్శించడం—ఇదే ఆయనకు కనపడింది. కాని మాష్టారు మాష్టారుకాదు—దేవుడు. తన దగ్గర చదువుకుంటున్న పిల్లలందరినీ అంత అభిమానంగానూ చూసుకోగలగడం ఆయన ప్రత్యేకత. అంతకంటే ముఖ్యమైనది వెకిలిచేష్టలు చేసే వాళ్ళను ఆయన అదుపులో ఉంచే తీరు. అందులో బాగుగా రవికి ఆయనపెట్టే చీవాట్లు—ఏనభైమంది క్లాసులో తలబిరుసు వదిలేటట్టు చేసే ఉన్నితమైన మర్దనా—

"మాష్టారొచ్చారా! ఎన్నాళ్ళయిందో ఆయనను చూసి, నా గురించి అడిగారా? మన ఇంటికి రమ్మనకపోయారా?"

"ఇంటికి రమ్మననూ లేదు, ఇంటి ఎడ్రసు వరకూ రానివ్వనూలేదు. ఆయన విధుల నిర్వహణలో ఉపన్యాసా లిచ్చేవాడే—అలాగే నేనూ నా విధి నిర్వహణలో నిమగ్నమై పోయాను. అంతమంది పేషెంట్లమధ్యలో, ఓపీలో ఆయనతోనే కబుర్లుచెబుతూ కూచోడం ఎలా సాధ్యం?"

"ఎంత ఓపీ అయితే మాత్రం పక్క క్యాబిన్‌లో రెండు క్షణాలు—పాపం, మీమీద ఎంత ఆశతో, అభిమానంతో వచ్చారో... "

"అభిమానం—కాదు అవసరం."

"అవసరమూ కావచ్చు. అవసరమైతే మన మేనా డాక్టర్లం—ఎంతోమంది ఉన్నారు. మీ దగ్గరకే—మీరన్నట్టు వెదుక్కుంటూ వచ్చారంటే మీమీద ప్రత్యేకం ఉండే అభిమానం, లేకపోతే గౌరవం—లేదా నమ్మకం—అని ఎందుకనుకోకూడదూ?"

"అలా ఎందుకనుకోవాలి? ఆయన మాటలకూ, చేష్టలకూ, వల్లించే ఆదర్శాలకూ, అనుసరించే మార్గాలకు పొంతన కుదరకపోడానికి మంచి ఎగ్జామ్‌పుల్ మీ మాష్టారు. . "

"మా . కాదు. 'మన'. ఆయన లాంటి మనిషేరు. ఆయనదగ్గర చదువుకున్నాం. మన చేతులలో ఆయన అవసరానికి ఏమి చెయ్యగలిగినా "

"అవునవును, యివన్నీ నాకూ తెలుసు, కాని ."

"కాని?"

"ఆయన యెట్లాంటి ఆదర్శాలు చెప్పేవారో జ్ఞాపకం ఉందా?"

"ప్రేకేం. ఆయన చెప్పిన పాఠాలు నాకు జ్ఞాపకం లేకపోవచ్చు. మనిషిగా ఆయన బోధించిన నీతులు, జీవితాంతం నాలో జీర్ణించుకుపోయి నాకు వ్యక్తిత్వాన్నిచ్చాయి. అవి నాలో ఓ భాగం అయిపోయాయి ఇంతకీ ఆయన వచ్చిందెందుకట? అంతా కులాసాయేనా?"

"దాని సంగతి తరువాత చెబుతాను. హోల్డేస్

(వి) చిత్ర విజ్ఞానం



అందరిలో బీరుంది!

చిన్నప్రేవుల్లో రోజూ మనం పుచ్చుకున్న ఆహారంలోని చక్కెరలనుండి "ఎతనాల్" తయారవుతుంది. "బీరు"లోని ముఖ్యమయిన పదార్థం "ఎతనాల్." జీర్ణకోశంలో దీని ఉత్పత్తిని కనిపెట్టింది సర్ హాన్స్ క్రెబ్స్! కాలేయంలోని కొన్ని ఎంజైములు యీ "ఎతనాల్" కు విరుగుడుగా పనిచేసి అది మత్తును కలిగించకుండా చేస్తాయి!

సారం ఒకటి చెప్పారు మనకి గుర్తుందా?

"గుర్తు లేకేం వుంది. హాల్డేన్ మహామనీషి. శాస్త్రవేత్త. ఆయన త్యాగం గొప్పది. ఇంగ్లండు దేశంలోపుట్టి భారతదేశానికివచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. భారత ప్రజల్లో ప్రజల మనసుల్లో, శాస్త్రీయ దృక్పథం ఆయన ఊపిరి. భారతీయులంటే ఆయనకు యెంత ప్రేమానురాగాలో ఆయన కడపటి కోరికే తెలుపుతుంది. శాస్త్రీయ దృక్పథం కాచి వడపోసి నరనరాల్లో జీర్ణింప చేసుకున్న మనిషి మమతకోసం, శాస్త్రదృక్పథంతోనే తన భౌతిక కాయాన్ని ఓ చిన్న కానుకగా వైద్య విద్యార్థుల వంకితం చేసిన మనిషి హాల్డేన్. శాస్త్రజ్ఞుడిగా ప్రపంచ ఖ్యాతిని సంపాదించడం ఒకయెత్తు. మనిషిగా ఆయన త్యాగం మరొక యెత్తు. .."

"అదంతా నాకు ఆయన్ను చూడగానే గుర్తొచ్చింది. కబుర్లు చెప్పడం తేలికే. కబుర్లు చెప్పే మనుషులు, వ్యక్తులుగా తాము బోధించిన ఆదర్శాలు మరిచిపోతారు."

"మేష్టారేం చేశారు?"

"ఏముంది? ఆయనకొక ఆపరేషన్ చెయ్యాలన్నారట అక్కడ డాక్టర్లు. అవసరమొచ్చే సరికి నేను జ్ఞాపకం వచ్చాను. నాపేరు వాకబు చేస్తూ వచ్చేశారు. ఆయనకు ఆపరేషన్ నేనే చెయ్యాలిట. ఆయనకు చాలా భయమట."

"అందులో ఆదర్శాలకీ ఆయన అడిగిన దానికీ మధ్య వైరుధ్యం ఏముంది?"

"ఆయనకు ఆపరేషన్ నేనే యెందుకు చెయ్యాలి? ... నలుగురు పిల్లలు, భార్య... రెక్కాడితేకాని డొక్కాడని బ్రతుకులు.. ఆపరేషన్‌లో . "

"పోనీ చేయించుకోడం మానేస్తే. "

"డాక్టర్‌గా నువ్ అడగవలసిన ప్రశ్నేనా?"

"ఎంతోమంది తెలిసీ తెలియని మనుషులు- కేవలం అజ్ఞానంతో, భయంతో ఎన్నో జబ్బులు ఇముడ్చుకుంటారు బయటకు చెప్పకుండా. . పోనీ ఆయన అంతగా అడుగుతుంటే మీరే చెయ్యరాదూ!"

"అది సింపుల్ థింగ్. సాధారణంగా హౌస్ సర్జన్స్ చేసేది. ఇంతకీ అందరూ ఛీఫ్‌చేతే చేయించుకోవాలంటే మరి వైద్య విద్యార్థులు నేర్చుకోవడం యెలా? అందుకూ నాకు వళ్ళు మండింది. హాల్డేన్ అంత త్యాగంచేస్తే ఆయనను కొనియాడిన మీ గురువుగారు యింత కంగారు పడడం - తనదాకా వస్తేకాని బాధ తెలియదనడానికి నిదర్శనం . ఇంతకీ చెయ్యడం

చెయ్యకపోవడం విషయంలో నాకు ప్రత్యేకమయిన అభిప్రాయంలేదు. అప్పటి పరిస్థితులనుబట్టి, ఓ అసిస్టెంటో, హౌస్‌సర్జనో, ఎవరో ఒకరు చేస్తారు .నా ఉద్దేశం నీకుబోధ పడిందా? ఆయన నిజస్వరూపం నీకు తెలిసిందా?''

"తెలిసింది. కాని మీరనుకుంటున్న దుస్స్వరూపంకాదు ఆయన ఎక్కడుంటున్నారో మీకు తెలుసా?"

"ఔట్‌పేషెంట్లు ఎడ్రసులు తీసుకునే అలవాటు నాకు లేదు.''

"మనిషికి ఎన్ని చెడ్డ అలవాట్లున్నా కొంతయినా మంచీ, మమకారం ఉంటాయనుకొని నేనే పొరబడ్డాను. "

—సోఫాలోంచి లేచి మంచంమీద పడుకుని పుస్తకంవంక చూస్తున్న సుజాతకి పుస్తకంలోని విషయం మనసు కెక్కడంలేదు.

రాఘవరావ్ మాష్టారే జ్ఞాపకం వస్తున్నారు. ఆయన అందరినీ ఏమోయ్ అనీ, అమ్మాయ్ అని పిలిచేవారు. ఏకవచనమూ వాడేవారు. మిగతా లెక్చరర్లందరూ 'ఏమండీ' అని వాళ్ళకంటే చిన్నవాళ్ళను పిలుస్తుంటే యెబ్బెట్టుగా ఉండేది. ఆయన ముఖంలోకళ—మాటలలో తేట—పిల్లలందరూ, ఆకతాయి వాళ్ళలోసహా జాగ్రత్తగా పాఠం వినేవాళ్ళు. ఆయన పాఠం చెప్పటంలో ఓ ప్రత్యేకమయిన తీరు పిల్లలందరినీ ఆకట్టుకునేది. తేలికగా వుండే పదాలూ, వివరణలో ఓపికా-ములక విషయాలు చర్చకొచ్చినా సున్నితంగా వాటిగురించి మాటాడటం-ఎప్పుడూ చిరునవ్వు—ఎంతో ఉత్సాహం—రాలుగాయి పెంకితనంచేసే కొమ్ములు తిరిగిన మొనగాళ్ళకు కూడా ఆయనంటే గౌరవం. భయం. కారణం ఆయన తనకేదో పవర్ వున్నట్టు చలాయించడానికి ప్రయత్నించక పోవడమే.

ఓరోజు సుజాతా వాళ్ళ నాన్నగారు మేష్టారు యింటికి వెళ్ళారు.

"డాక్టరుగారూ, మేమెంతటి వాళ్ళం. కేవలం బడి పంతుళ్ళం. మాకు ఆత్మ విశ్వాసమే కాని అహంకారం ఉండటానికి వీల్లేదు. పిల్లవాళ్ళు, అందులో ఈ రోజుల్లో, ఆకతాయిగా తిరగటానికి కారణం వస్తు వాళ్ళేకాదు. తలిదండ్రులూ, గురువులూ, సహాధ్యాయులూ, అందరూ కారకులే. వాతావరణం పూర్తిగా మారిపోయింది. వాళ్ళను మెల్లగా మంచిమాటలతో లొంగదియ్యగలమే గాని, ఏమాత్రం ఒత్తిడికో, బలప్రయోగానికో పాల్పడ్డామో అదానే అవుతుంది చివరకు— ఇంతకూ మాష్టర్లకు కావలసింది ఓర్మి. అవగాహన శక్తి. కేవలం డిగ్రీలు చాలవు. డబ్బు పవరూ కావాలనుకుంటే ఈ వృత్తిలోనికి రానే కూడదు ఇవన్నీ ఏదో ప్రసంగవశాత్తూ చెబుతున్నా మీ అమ్మాయికేం ఆణిముత్యం. పెద్ద డాక్టరయి మీపేరు నిలబెడుతుంది ఏమమ్మా నామాట నిలబెడతావ్ కదూ! నీకు ఎప్పుడు ఏది కావలసినా అడుగు. నేను చెయ్యగలిగింది సాయం చేస్తా నేనూ ఫిజిక్సూ, కెమిస్ట్రీచదువుకున్నాఇంగ్లీషుమాష్టరికి కెమిస్ట్రీ రాదనుకునేవ్ ఇంగ్లీషుమాత్రం జాగ్రత్తగా చదువుకో అమ్మాయ్. కేవలం పాసైతే చాలదు. ముందు ముందు నీ చదువంతా ఇంగ్లీషులోనే ఉంటుంది. ఇప్పుడు జాగ్రత్తగా నేర్చుకొని అలవాటు చేసుకోకపోతే తరవాత యిబ్బంది ఈమాట కనీసం బయటకి అనడానికి వీలులేని రోజులు వచ్చేటట్టు కనబడుతుంది దీనికోసం డాక్టరుగారూ, మీరు శ్రమ తీసుకు రావాలా? అవతల ఎంతమంది మీకోసం యెదురుచూస్తూ వుంటారో "

ఈ మాటలు సుజాత ఎప్పుడూ మరిచిపోదు.

రవికిమాత్రం రాఘవరావ్ మేష్టారంటే ఓ రకమైన యిది—అదే ద్వేషం. అతను ఆకతాయిగా తిరుగుతున్న రోజుల్లో అతని అహంకారాన్ని అణచడానికి సున్నితంగా ప్రయత్నంచేసి గెలవడం, మేష్టారుచేసిన నేరం. ఎంతమంది లోనో దీపాన్ని వెలిగించిన మేష్టారు రవికి మాత్రం పరమశత్రువే అయ్యారు.

రవి బాగుపడి డాక్టరై పోయాడనే తెలుసు కాని మాష్టారికి ఇంకేం తెలియదు. నిర్మలమైన మనసులో—తన దగ్గర చదువుకొని పెద్దాసు

(వి)చిత్ర విజ్ఞానం



దొంగ నోటినుండి నిజం బయటకి కక్కించడం పోలీసులకంత తేలికయిన పనికాదు. విదేశాలలో నిజం కక్కించే మందులు రెండు కనుగొన్నారు. ఒకదానిపేరు సోడియం పెంటోతాల్. మరొకటి టాక్సిఫ్లెక్సిల్! ఈ రెండింటిని ప్రయోగిస్తే నిజాన్ని ఎంత దాచుదామన్నా వీలుకాదట! ఇది నిజం!!

పత్రిలో వుద్యోగం నిర్వహిస్తున్న వైద్యుడు కదా అనివస్తే రవి ముభావంగా వుండడం ఆయనకెంత బాధ కలిగించిందో!

—మరుసటిరోజు సుజాత ఆస్పత్రికి వెళ్ళడంతోనే సర్జికల్ వార్డులన్నిటికివెళ్ళి ఆపరేషన్ షెడ్యూల్స్ చూసింది. ఎస్. వన్‌లో రాఘవరావ్ మేష్టారి పేరుంది. ఆపరేషన్‌కు వారం రోజులు టైముంది. ఈలోగా ఆయనను ఓసారి చూసి ఆయనకు ధైర్యం చెప్పాలని ఆయన ఇంటి ఎడ్రసుకూ, కాలేజీ ఎడ్రసుకూ రెండు ఉత్తరాలు రాసింది తమ ఇంటికి ఆహ్వానిస్తూ. మాష్టారు రానే వచ్చారు.

"అమ్మాయ్! నీ ఉత్తరం చూసి చాలా సంతోషించాను. మా ఆవిడయితేనా 'ఏమిటీ గాజు బొమ్మల్లే ఇంతవుండేది. అంత డాక్టరై పోయిందా' అంటూ పొంగిపోయింది. చాలా సంతోషమమ్మా. రవి దగ్గరనుంచి నీ దగ్గరకు రావాలని అనుకున్నాను ఆరోజు. కాని రవిని చూశాక ఎందుకో ఇంటికొస్తే కసిరేస్తాడని పించింది. నేనే పొరబడ్డానేమో! రవి ఏడమ్మా!"

"వస్తారు మాష్టారూ—రాత్రివాలా పొద్దుపోతుంది ఆయన వచ్చేసరికి. ఆయనకు ఎన్నో వ్యాపకాలు."

"అవునమ్మా, అర్థం చేసుకోగలను"

"దేవుడి దయవల్ల ఆపరేషన్ ఒడ్డెక్కి పోతే మరలా ప్రజల్లో పడ్డట్టే. నీ వుత్తరం నాకు ఎక్కడలేని ధైర్యాన్ని యిచ్చింది. నాకిక భయంలేదు. ధైర్యంగా వుంటాను. రవి భావమూ నాకు అర్థమయింది. పదిమంది ప్రజల్లోనూ నేనూ ఒకడిని. ప్రత్యేకంగా నాకు ఏమనా కావలిస్తే డబ్బు ఖర్చుచేసి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలి. అంతడబ్బు లేనివాడిని కాబట్టి నలుగురిలోపాటు జనరల్ వార్డులోనే ఉండదలచుకున్నాను. ఇంతకీ నాసొదే చెప్పుకు పోతున్నాను పిల్లలేరమ్మా?"

"అంత అదృష్టం చేసుకోలేదు మాష్టారూ! ఉన్నదానితో తృప్తిచెందడం నేర్చుకోవడం ఎంతో శ్రేయస్కరమని మీరన్నమాటలు నేను ఎప్పుడూ మరిచిపోను. దేనికయినా పూర్వజన్మ సుకృతమంటూ ఒకటి వుండాలనే నా నమ్మకం. ....విచారించి లాభంలేదు మాష్టారూ, తిలలు నాటివస్తే పండాలంటే ఎలా?"

"ఎంత వేదాంతిలా మాటాడుతున్నావ్ తల్లీ నిరాశ చెందడం మానవులకు తగదు. భగవంతుడు నీకు మేలు చేస్తాడు.. రవిని అడిగానని చెప్పమ్మా! ఎంతో ఆప్యాయంగా మాటాడావ్ అంతేచాలు మరి నే వస్తానమ్మా, రేపు ఆపరేషనట. పెద్దబ్బాయి వచ్చాడు నాతోపాటు ఆస్పత్రిలో నాకు సాయంగా వుండటానికి. వాడిని నువ్ చూశావుకదూ."

"శంకర్ కదూ మాష్టారూ. గుర్తులేకేం"

మాష్టారు వెళ్ళిపోయారు.

రాత్రి పదకొండు గంటలకు రవివచ్చి తూలుతూవెళ్ళి నిద్రపోయాడు. సుజాత నిట్టూర్చింది.

తెల్లవారింది. రవి యాంత్రిక జీవితం మొదలయింది.

సుజాతకి డ్యూటీకి వెళ్ళడానికి మనస్కరించలేదు. ఓ సెలవుచీటి రాసి ఆస్పత్రికి పంపేసింది. మరో అరగంటకు తనూ బయలుదేరింది.

వార్డులో బెడ్ మీద మాష్టారులేరు.

వడివడిగా థియేటర్‌వంక పరిగెట్టింది. బయట బెంచీమీద శంకర్! "నమస్కారం. డాక్టర్ సుజాతగారంటే మీరేననుకుంటాను... నాన్నగారు మీరువస్తారని ఇంతవరకూ చూశారు. ఇప్పుడే లోపలకు తీసుకువెళ్ళారు .. మీకీ ఉత్తరం ఇమ్మన్నారు...."

అంటూ సుజాతకొక కవరు అందించాడు.

కవరు బ్యాగులో వేసుకుని డ్రెస్సింగ్‌రూంలోకి పరిగెత్తింది సుజాత. థియేటర్లో టేబిల్ మీద మత్తులో వున్నారు మాష్టారు. సర్జరీ ప్రొఫెసర్, రవి, పి.జీలూ, హౌస్ సర్జన్‌లూ అంతా వున్నారు చుట్టూ.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్!"

సర్జరీ ప్రొఫెసర్ సుజాతవంక చూశాడు.

"ఆయన మా మాష్టారు...." గొంతు బొంగురుపోయింది సుజాతకి.

"ఏం కంగారు లేదమ్మా, నాకన్నీ తెలుసు. నువు గేలరీలో కూచో... జస్టు టెన్ మినిట్స్."

హుందాగా ప్రొఫెసర్ మాస్క్ మీదకు లాక్కున్నాడు. రవి దూరంగా నుంచున్నాడు.

"బి. పీ వన్ సెవెన్‌టీ బై నైన్‌టీఫై . పల్స్.. వన్ టెన్ .."

కలలో వినపడుతున్నట్టున్నయ్ థియేటర్ లోని మాటలు. సుజాతకు చెమట పట్టింది. తనకు మళ్ళీ తెలివి వచ్చేసరికి ఓ బెడ్ మీద వుంది.

రవి తనవంక ఆత్రంగా చూస్తున్నాడు.

"అంత సెంటిమెంటల్‌గా అయిపోయి, నెర్వస్ అయిపోతే ఎలా, రోజూ చేసే పనే కదా" విసుక్కున్నాడు.

"యూ కీప్ క్వయట్ యండ్ ఫ్రెండ్— షి ఈజ్ ఎ పేషెంట్ నౌ" సర్జరీ ప్రొఫెసర్ రవిని సున్నితంగా మందలించాడు.

రవి తల వంచుకున్నాడు.

"మనం ముందు మనుషులం, తర్వాత డాక్టర్లం. వ్యాధినివారణ ఎంత బాధ్యతో, అవసరమైనప్పుడు పేషెంటుకు ఆత్మస్థైర్యం ఇవ్వడం కూడా అంత బాధ్యతే! .. మీ మాష్టరు హాయిగా వున్నారు. అపరేషన్ అయిపోయి

చాలా సేపయ్యింది. నువ్వు లేవగలగ్గానే వెళ్ళి చూడు ..ఆయనకూ ఈసరికి తెలివి వచ్చి ఉంటుంది."

—ప్రొఫెసర్ వెనకాలే రవి వెళ్ళి పోయాడు.

సిస్టర్ 'కాసేపు విశ్రాంతి తీసుకోండమ్మా' అంటున్నా సుజాత లేచి మాష్టరి బెడ్ దగ్గరకు వెళ్ళింది.

"మాష్టారూ!"

"వచ్చావా తల్లీ! నే రాసిన ఉత్తరం చదివావా?"

"లేదు మాష్టారూ తరువాత చూస్తా . ఏమైనా బాధగా వుందా?"

"లేదమ్మా. పాపం నీ కోసం ఎంతమంది పేషెంట్లు కాసుకుని కూచున్నారో వెళ్ళి రామ్మా .వీలయాక నేను యింటికొస్తా!"

—సుజాత డ్రెసింగ్ రూమ్‌లో బ్యాగ్ తీసుకుని నేరుగా వార్డుకు వెళ్ళిపోయింది. మరో అసిస్టెంటుకి పి. జీకి కాసేపట్లో వస్తానని తన గదిలోకి వెళ్ళి కవరు చింపింది.

చిరంజీవి సౌభాగ్యవతి సుజాతకి

ఎందుకో చాలా భయంగా వుంది. సర్జరీ ప్రొఫెసర్ ఒకప్పుడు మన కాలేజీలో చదువుకున్నవాడేనని తెలిసి ఆయన దగ్గరకు వెళ్ళాను. చాలా మంచివాడు ఎంతో ధైర్యం చెప్పాడు.

అయినా మనసులో ఏదో బెంగ.

ఒకదానికొకటయితే ఇందులో జతచేసిన ఉత్తరాన్ని సూపర్నెంటుకియ్యి. మీ ఆంటీకి చేతనైన ధైర్యం చెప్పు.—రాఘవరావ్

ఆత్రంగా రెండో ఉత్తరం విప్పుతోంది. ఇంతట్లో రవి వచ్చాడు.

"ఎలావుంది?"

"మాష్టారు కులాసాగా వున్నారు."

"ఆయన్ను గురించికాదు నేనడిగింది ..."

"నేనూ బాగానేవున్నా"

"ఏమిటా ఉత్తరం"—రవి తీసుకుని చూసి "సిల్లీ-సూపర్నెంటుకు-ఒకవేళ తను చనిపోతే తన దేహాన్ని వైద్యవిద్యార్థులకిమ్మని—ఈయనకు నిజంగా ఆదర్శాలున్నాయనుకో లేదు ..

ఆవేశంగా లేచిన సుజాత అంది.

"మాష్టారు ఓ దీపం—ఆ దీపం కొడిగట్టదు—" □

అర్ధరాత్రి నగరం

రోడ్డుమీద నిలుచుని చూస్తే,
కరెంటు తీగలకి తగులుకున్న
గాలిపటంలా వున్నాడు చంద్రుడు
మేఘాల జెండాలను
ఊపేస్తోంది
ఊరిమీంచి లేచిన గాలి
ఏ యుద్ధభూమినుంచి
తిరిగివచ్చిందో,
క్షతనక్షత్రాలనుంచి ధారాపాతంగా
కాంతిని స్రవిస్తోంది ఆకాశం
ఎవరి చిరబాధా జీవితం
కాలి మసైతే
యేర్పడిందో ఈ చీకటి,
గుడ్డిదీపాల కళ్ళలోకి
గుచ్చి గుచ్చి చూస్తోంది.
రిక్షా చక్రం చువ్వల మధ్య
చిక్కుబడిపోయింది
వీధి లాంతరు వెలుతురు,
అర్ధరాత్రి
రోడ్డుమీద నిలుచుని చూస్తే,
వివిధ దృశ్యాలు చిత్రించబడిన
విశాలమైన కేన్వాసులా వుంది నగరం.

—దేవిప్రియ

పలురంగాలలో ఆంధ్ర ప్రముఖులు

ఎ.కె.యస్. రావ్‌గా పిలువబడే అవంత్స కుమార శేషగిరిరావు గోద్రెజ్ సోప్స్ లిమిటెడ్ సంస్థలో దక్షిణ శాఖకు సేల్స్ మేనేజర్‌గా వున్నారు. బి.కాం, ఎం.బి.ఎ (ఆంధ్రా యూనివర్శిటీ) ఈయన చదివిన చదువుకు గుర్తులు.

గోద్రెజ్ సోప్స్‌లో ఈయన తమ 29 ఏటనే బ్రాంచ్ మేనేజరై, అతి పిన్నవయసులో ఆ స్థాయిని సాధించిన ఘనత పొందారు. మార్కెటింగ్ సబ్జెక్ట్‌పై ఆసక్తి వుండటమేగాక, ఆ శాఖలో ఎంతో కృషిచేసి నిరంతర శ్రమతో ఇప్పటిస్థాయికి చేరారు శ్రీ రావ్. 'సింథాల్ సోప్' అమ్మకాలు పెంచేందుకు చేసిన కృషిలో భాగంగా నిర్వహించబడ్డ 'వాడకందారులకు బహుమతి పథకాలు' ఎన్నిటికో శ్రీ రావ్ రూపశిల్పి.

ఉద్యోగాల నిమిత్తం ఎంతమందినో ఇంటర్వ్యూ చేసిన శ్రీ రావ్ ఉద్యోగార్థులై వచ్చిన తెలుగు యువకుల పెరఫార్మెన్స్‌కు చాలా నిరుత్సాహం చెందానన్నారు. "కేవలం 'పుస్తక పరిజ్ఞానం' (బుక్కిష్ నాలెడ్జ్) తప్ప జనరల్ నాలెడ్జి చాలా తక్కువగా అనిపించింది నాకు" అన్నారాయన. ఈ విషయాన్ని చాలా బాధపడుతూ చెప్పారు శ్రీరావు.

విద్యార్థులలో, విద్య పూర్తిచేసిన యువకులలో అశాంతికి కేవలం ఆందోళనా పూరితమైన నిరుద్యోగ పరిస్థితులే కారణం కాదంటారీయన. 'వారికి సరైన మార్గదర్శకత్వం లేకపోవడం ముఖ్యకారణం. సమర్థుడికి ఉద్యోగం దొరకక పోవడం వుండదన్నది నా నమ్మకం' అని అభిప్రాయపడ్డారు శ్రీరావు.

ఎందరికో ఉద్యోగవకాశాలు కల్పించే విధంగా తమిళనాడులో వున్నట్లు కాప్టివ్ లేక



శ్రీ ఎ. కె. యస్. రావు

యాన్సిలరీ యూనిట్స్ ఆంధ్రలో అభివృద్ధి కానందుకు ఆయన తమ విచారాన్ని వ్యక్త పరిచారు.

'వ్యాపారమే ప్రధానంగా' వున్న తమ ఉద్యోగ నిర్వహణే గాక ఎన్నో కళా సాంస్కృతిక విషయాలపై ఆసక్తి కలిగి వున్నారు శ్రీ రావు. మద్రాస్ ఫిలిం ఫాన్స్ అసోసియేషన్స్ ఇచ్చే 'ఫిలిం ఎవార్డ్స్'కి చిత్రాల నెన్నికచేసే న్యాయనిర్ణేతలలో సభ్యులుగా మూడేళ్ళు పనిచేసిన శ్రీ రావు 'మంచి తెలుగు చిత్రాలు రావటం లేదన్న' భావాన్ని వ్యక్తం చేశారు.

యువకులకు తమ సలహాగా 'మీ చుట్టూ ఏం జరుగుతుందో గమనించండి. జనరల్ నాలెడ్జి పెంపొందించుకోండి. మీకున్న పరిజ్ఞానంతో, వచ్చిన అవకాశాలపై దండెత్తేందుకు ఒక సిపాయిగా సిద్ధం కాగలిగి వుండాలి" అన్నారు శ్రీ రావు.

—పి. సరళాసూర్యారావు

సినిమా

ఫిల్ము అవార్డులు

భారతీయ సినీ దర్శకులు భాషా అడ్డు గోడలను కూల్చివేశారు. సత్యజిత్ రే తన మొదటి హిందీ చిత్రానికి దర్శకత్వం వహించారు. తెలుగు చిత్రానికి మృణాల్ సేన్ దర్శకత్వం వహించారు. గత సంవత్సరం చిత్ర ప్రపంచంలో నూతన ప్రతిభలు యిటు దర్శకత్వంలోనూ, అటు నటనలోనూ వికసించాయని రచయిత అభిప్రాయం. ప్రాంతీయ చిత్రాలు ఉన్నతోన్నత శిఖరాలను అందుకోవడంలో ఈ ఫలితాలను చూడవచ్చు.

దేశంలోకెల్లా అతి శక్తివంతమైన ప్రచార సాధనమైన సినిమా పరిశ్రమను మొత్తంగా అధ్యయనం చెయ్యడానికి జాతీయ ఫిలిం అవార్డులు మనకు అవకాశాన్ని కల్గిస్తాయి. ఈ సంవత్సరపు గౌరవాన్ని పొందడానికి ఎందరో పోటీలకు దిగినందున అర్హులైనవారిని ఎంచుకోవడానికి శ్రీ అల్‌కాజీ అధ్యక్షతన గల న్యాయ నిర్ణేతల సంఘం ఎంతో శ్రమించి ఉండవచ్చు. అయినప్పటికీ వారి నిర్ణయం ఏదో విధమైన విమర్శకు గురికాకుండా వుండలేదు. యెంతో వైవిధ్యంగల పోటీదారులలో అర్హులైనవారిని ఎన్నుకోవడంలో వారు సరియైన ప్రమాణాలను అనుసరించారని అనడం మాత్రం వాస్తవం. కథావస్తువు, చిత్రీకరణలను



"సత్యచిత్ర' వారి నూతన చిత్రం ప్రారంభోత్సవంలో నిర్మాతలు: సత్యనారాయణ, సూర్యనారాయణ, దర్శకుడు సాంబశివరావు, రాఘవేంద్రరావు (లక్ష్మీ ఫిలింస్)



వీరు 'రామకృష్ణులు'

సమదృష్టితో పరిశీలించి వారు ఒక సమతూక మైన నిర్ణయానికి వచ్చారు.

భాషా ప్రతిబంధకాల తొలగింపు

ఈ అవార్డులలో విశ్వాసాన్ని పెంపొందించే ధోరణులు వ్యక్తమయ్యాయి. దేశంలో సినిమాల ప్రమాణాలను పెంపొందించడానికి జరిగే నిరంతర ప్రయత్నం ఇందులో గోచరిస్తున్నది.

భారతీయ సినీ రంగంలో యిప్పటికీ అఖండుడుగా సత్యజిత్‌రే ఉన్నారు. ఐనప్పటికీ ఈ సంవత్సరం నూతన శక్తిగల యుక్తులుగల యువదర్శకులు రంగంలోకి వచ్చారు. ఉదాహరణకు ఉత్తమ చిత్రంగా అవార్డు పొందిన కన్నడ ఫిలిం 'ఘటశ్రాద్ధ'కు జి. కాసరవల్లి దర్శకత్వం వహించారు. పూనాలోని ఫిలిం, టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌కు పేరు తెచ్చిన మొదటి చిత్రం యిదే. ఇక్కడే కాసరవల్లి ఆయన బృందం తర్ఫీదు పొందారు.

భాషా అడ్డుగోడలను కూల్చివేయడం ఈ సంవత్సరపు అత్యంత హర్షదాయకమైన పరిణామం. తెలుగులో ఉత్తమ అవార్డును పొందిన చిత్రానికి మృణాల్‌సేన్ దర్శకత్వం వహించారు. రే దర్శకత్వం వహించిన హిందీ చిత్రానికి ఉత్తమ హిందీ చిత్రంగా అవార్డు లభించడము సముచితమైనదే. "షత్రంజ్ కే ఖిలాడీ" అనే ఆ చిత్రానికి ఏవిధంగా చూచినా రంగంలో మరో హిందీ చిత్రం సాటి రాలేకపోయింది. అందులో అవసానదశలో గల ఫ్యూడల్ భోగభాగ్యాలను పారు పోకుండా కన్నులకు కట్టినట్టు రే చూపెట్టారు. దుస్తుల ఆడంబరం, గృహాలలోని అలంకరణలు మొదలుకొని బయటి దృశ్యాలను సందర్భోచితంగా ప్రదర్శించడం జరిగింది. ఈ చిత్రంలో పేరెన్నికగన్న కళాకారులు నటించినప్పటికీ అన్ని హిందీ సినిమాల మాదిరిగా మూసలో పోసినట్టు కనిపించదు. సినీ పరిశ్రమలో సిద్ధహస్తులైనవారు వినియోగించిన సరంజామాతోనే


అర్హుడైన దర్శకుడు ఏమి చూపెట్టగలడో, "షత్రంజ్ కే ఖిలాడీ"లో మనకు సత్యజిత్ రే ప్రదర్శించారు. ఈ సంవత్సరపు ఉత్తమనటుని అవార్డుకు గట్టి పోటీదారుగా వుండవలసిన ఈ చిత్రంలోని నటుడు సయ్యద్ జాఫ్రీ అమోఘంగా నటించారు. ఇందుకు భిన్నంగా "ఘటశ్రాద్ధ" తెలుపు నలుపులో ప్రస్తుతమున్న వాస్తవికతను ప్రదర్శిస్తుంది. ఇందులో సత్యజిత్ రే మొదటి చిత్రమైన "పథేర్ పాంచాలి"లో కనిపించే గానలాహిరి లేనప్పటికీ కాసరవల్లి సినీ రంగంలో మరో సత్యజిత్ రేగా తయారు కావచ్చు.

సామాజిక తిరుగుబాటుదారులు, నూతన కథావస్తువులు

ఘటశ్రాద్ధలో బలమైన దృశ్య వివరణ వుంది. బలమైన సినిమా భాషకు తగిన సామాజిక ఘటన దీనికి తోడైంది. స్కూలుమాస్టారుతో సంబంధం పెట్టుకొన్న బాలవితంతువు చుట్టూ తిరిగే కథ యిది. ఆదం నిషిద్ధఫలాన్ని భుజించినట్టు వుంటుంది. ఆమెను సంఘం బహిష్కరిస్తుంది. సాంప్రదాయం, హద్దులు దాటి అమానుషంగానూ, అసహ్యాకరమైనదిగానూ కనిపించే స్థాయివరకు ఘటనలు వెళతాయి.

మృణాల్ సేన్ దర్శకత్వం వహించిన "ఒక ఊరి కథ" మున్షీ ప్రేమ్‌చంద్ రచన కఫన్ ఆధారంగా నిర్మించబడినది. అసంతృప్తికరంగా ఉన్న సామాజిక వ్యవస్థను మలపడానికి ఏమాత్రం ప్రయత్నం చేయకుండా సుఖాలకు మరిగిన తండ్రీ కొడుకుల జీవిత ప్రపంచాన్ని తెలిపే చిత్రం "ఒక ఊరి కథ". ఏమీ పని చేయకుండా అనుభవించే అర్థంలో వీరిని తిరుగుబాటుదారులుగా చెప్పడం జరిగింది. త్రాగుడుకు డబ్బు లేనపుడు చేతులు చాచడం, అప్పులు చేయడం లేదా దొంగతనం చేయడం వరకు మాత్రం పరిమితమయ్యారు.

ఈ సంవత్సరపు పేర్కొనదగిన మరో చిత్రం శ్యామ్ బెనగళ్ దర్శకత్వం వహించిన "భూమిక". ఎప్పుడూ బలమైన సాంఘిక సందేశంగల చిత్రాలకు దర్శకత్వం వహించిన బెనెగల్ ఇపుడు ఒక నటి జీవితాన్ని కథావస్తువుగా తీసుకున్నారు. ఈ నటి తెరపై



'ఆంధ్ర కళా సమితి' (ఆవడి) నిర్వహించిన కాళయుక్తి నామ సంవత్సర ఉగాది వేడుకలలో అతిథులుగా పాల్గొన్నవారిలో (ఎడమనుంచి) సిరిశ్రీ వేణుమాధవ్, రంగనాథ్, ఇచ్ఛాపురపు జగన్నాధరావు వున్నారు.



"రాధాకృష్ణ"లో శోభన్ బాబు, జయప్రద

దేవిగానూ వాస్తవంగా అందుకు ఎంతో భిన్నంగా గల వైరుధ్యాలమధ్య కొట్టుమిట్టాడుతుంది. ఈ పాత్రను పోషించిన స్మితా పాటిల్ "నిషాంత్" లాంటి యితర బెంగాలీ చిత్రాలలో ఎంతో గొప్పగా నటించారు. కాని 'భూమిక'లో ఆమెపాత్ర అంతగా రాణించలేదు. కాని ఫిలిం సందర్భాన్నిబట్టి ఆమె సమకాలికులు అంతకన్నా బాగా నటించలేరని న్యాయ నిర్ణేతల సంఘం అభిప్రాయపడింది. యువతులలోకెల్లా ఆమె యెంతో సమర్థురాలైన నటి మాత్రమే కాకుండా వాణిజ్య సినిమాలు కల్పించే ప్రలోభాలను ప్రతిఘటించగల గణనీయమైన శక్తి ఆమెలో వుంది.

ప్రాంతీయ చిత్రాలలో ఉన్నత ప్రమాణాలు

ఉత్తమ కళాదర్శకత్వానికి అవార్డు ఏమీ ఇవ్వడం లేదనే మాటలు వినవస్తున్నాయి. "షత్రంజ్ కే ఖిలాడీ" అనే సినిమా చూచిన వారికి ఈ లోపం కొట్టవచ్చినట్టు కనపడుతుంది. చిత్రంలో కళాదర్శకత్వం చాలా ముఖ్యమైన భాగం. చిత్రనిర్మాణంలో ఈ అంశాన్ని గుర్తించడానికి ఇపుడు తగిన సమయం ఆసన్నమైంది.

ఉత్తమ చిత్రాలలో అన్నిటికన్నా ఉత్తమ చిత్రానికి ఒక అవార్డు ఉండాలని విమర్శకులు అభిప్రాయపడడం సముచితమే. ఇది యువ నిపుణులకు ప్రోత్సాహకరంగా ఉండడమే కాకుండా భారత సినీమాల అభివృద్ధికి మార్గదర్శకంగా వుంటుంది.

ప్రాంతీయ చిత్రాలలో ఉన్నత ప్రమాణాలు కనిపించడం ఈ సంవత్సరపు ప్రోత్సాహకరమైన ధోరణులలో ఒకటిగా వుంది. కొత్త తరహా దర్శకత్వ ప్రతిభలు అవతరించడమే యిందుకు కారణం. బి. ఎన్. సైకియా దర్శకత్వం వహించిన అస్సామీ చిత్రం "సంధ్యా రాగ్", జాన్ అబ్రహాం దర్శకత్వం వహించిన తమిళ చిత్రం అగ్రహారత్తిల్ కళుదై జబ్బార్ పటేల్ దర్శకత్వం వహించిన జైత్ రే జైత్‌లు యెంతో సృజనాత్మకమైన విలువలు కలిగి వున్నాయి. వీరంతా కొత్త దర్శకులే. కన్నడ ఫిలిం తబ్బలియు నెండె మగనె కూడా ఈ కోవకు చెందినదే. అయితే దీని దర్శకులు బి. వి. కారంత్, గిరీష్ కర్నాడ్‌లకు ఇదివరకే యెంతో పేరున్నది.

భారతీయ చిత్రాలలో ఈ సంవత్సరం వెల్లుబికిన నైపుణ్యాలు, వాటిని ప్రదర్శించడానికి సరిపోను సౌకర్యాలు లేని కొరతను మనకు

గుర్తు చేస్తున్నాయి. ఈ దశలో ఎటువంటి జాప్యం లేకుండా రెండు చర్యలు తీసుకోవాలి. సాధ్యమయినంత త్వరలో కళామందిరాలను ఏర్పాటు చేయాలి. అవార్డు పొందిన చిత్రాలకు వినోదపు పన్నును మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు నచ్చచెప్పాలి.

(ఎం. షమీమ్-టైమ్స్ఆఫ్ ఇండియా ఆకాశవాణి 'స్పాట్‌లైట్' సౌజన్యంతో)

హిందీ మాస్టారు

ఒక యువతిగాని, ఒక యువకుడుగానీ 'ఫిల్మ్‌స్టార్' అనిపించుకొనేందుకు కేవలం ఆ వ్యక్తుల కృషి చాలదు. ఎందరి సహకారమో అవసరమౌతుంది. మేకప్, హెయిర్‌డ్రస్సింగ్, కాస్ట్యూమ్, స్టిల్ మరియు మూవీ కెమెరా.... ఇలా ఎన్నో శాఖలకు చెందిన నిపుణులు తమ ప్రతిభకూడా జోడుచేయగా తయారయ్యే పదం 'ఫిల్మ్‌స్టార్'. ఇప్పుడు తారలు పరభాషా చిత్రాలలో అవకాశాలు పొందుతున్నప్పుడు ఆ భాషలు చక్కగా నేర్చుకోగలగడంకూడా ఫిల్మ్‌స్టార్‌కి ఉపయోగించే ఒక అంశం.

తెలుగు తారలకు హిందీ నేర్పే జలాలుద్దీన్ అరవై సంవత్సరాలు దాటిన వ్యక్తి. హైదరాబాదుకు చెందిన ఈ మాస్టరు మూడు దశాబ్దాల పైబడి మద్రాసులో వుంటూ తెలుగు తమిళ పరిశ్రమలోని నటీ నటులకి హిందీ నేర్పుతున్నారు.

కేవలం పాఠాలు చెప్పే పంతులుగారేగాక చక్కని కవిత్వం చెప్పగలవారీయన. ఆయన కవిత్వం తాలూకు కొన్ని మచ్చుతునకలు.

నటి కవిత పుట్టిన రోజుకు వెళ్ళిన జలాలుద్దీన్ గారితో 'మాస్టారూ నా పుట్టినరోజు. కనీసం పూలయినా కాన్కగా తేలేదు' అందట ఆ నటి.

అందుకు ఈ కవి ఆశువుగా చెప్పిన కవిత.

"నహీ కవితా! ఏ నహీ హోసక్తా జలాల్‌సే అయిసి భూల్ హుం!

పూల్ కవితా తుమ్ కో కైసెదూం
తుమ్ హీ ఏక్ పూల్ హో!
మైనా దూంగా పూల్ తుజ్‌కో!
చుబ్ నా జాయె హాథోం మే
పూల్ ఉస్‌సె భీ సఖత్ హై



జయసుధతో హిందీ మాస్టరు జలాలుద్దీన్



'రాజపుత్ర రహస్యం' షూటింగ్ సమయంలో ఆ చిత్ర కథానాయకుడు ఎన్. టి. రామారావుతో ముచ్చటిస్తున్న కన్నడ చిత్రరంగపు హీరో రాజ్‌కుమార్.

తుమ్ ఫూల్ సె భీ నరమ్ హో!

[ఈ కవిత భావార్థం: లేదు కవితా జలాల్ అలా మరచిపోవడం జరగదు. పూలు నీకెలా ఇచ్చేది-నువ్వే ఒక పుష్పానివి. మృదువైన పూలకంటే మృదువు నీ చేతులు. మరి పూలు నీ చేతులకు గుచ్చుకొని బాధించవూ]

జయప్రదతో అన్నారట జలాలుద్దీన్ ఓసారి (హిందీలోనే సుమండీ!)

"ఎంత ఆశ్చర్యంగా వుంది ఈ రోజు నాకు రెండు చందమామలు కన్పిస్తున్నాయి"

"అదేమిటి మాస్టారూ?" అని ఆశ్చర్య పోయిందట జయప్రద

'అవునమ్మా ...ఆకాశంలో ఆ చంద్రుడు... భూమిపై ఈ చంద్రబింబం' అని జయప్రద 'ముఖం' వేపు చూసారాయన.

తారలకు హిందీ నేర్పుతూనే ...ఇలా ఎన్నో అందమైన కవితలల్లుతున్నారు శ్రీ జలాలుద్దీన్.

జమునకు 25 ఏళ్ళు!

నటి జమున చలనచిత్ర జీవిత రజతోత్సవం హైదరాబాదులోని లాల్‌బహదూర్ స్టేడియంలో 'హైదరాబాద్ కల్చరల్ సర్కిల్' ఆధ్వర్యంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి డా॥ చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆ సభా సందర్భంలో ప్రచురించిన సావనీర్‌ని ఆవిష్కరించారు కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ ఎల్.కె.అద్వాని. ప్రఖ్యాత హిందీ నటి హేమామాలిని జమునకు సన్మానం జరిపింది. హైదరాబాద్ ఫిలిం సర్కిల్ తరఫున జమునకు 'ప్రజానటి' బిరుదప్రదానం చేశారు శ్రీ అద్వాని. జస్టిస్ ఆవుల సాంబశివరావు, ఎన్. టి. రామారావు జమునను అభినందిస్తూ ప్రసంగించారు.

ఈ సందర్భంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ లోని కొందరు నటీనటులు వ్యక్తిగతంగా హాజరై జమునను పుష్పమాలాలంకృతురాల్ని చేసి అభినందించారు. తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు చెప్పిన జమున తను చలనచిత్ర పరిశ్రమలో కాలూనడానికి ఎంతో సహకరించిన కీ॥ శే॥ డా॥ రాజారావుని ఈ సందర్భంలో స్మరించుకొని, పెద్దవాడై నిర్మాతగా పరిశ్రమలో



'పదహారేళ్ల వయసు'లో చంద్రమోహన్

వున్న డా॥ రాజారావుగారి పుత్రుడు పృథ్విని సభకు పరిచయం చేశారామె. నటిగా ఇంత



'ప్రేమ-పగ'లో మాడా

కాలం తాను విజయవంతంగా నిలవగలవడానికి తన భర్త రమణరావు ముఖ్యకారకులనీ, ఆయన సహకారంతోనే తను ఎన్నో సాంఘిక సేవా కార్యక్రమాలు తలపెట్టి నిర్వహించగలుగుతున్నాననీ కృతజ్ఞతలతో ప్రకటించి ఆయనను వేదికపైకి ఆహ్వానించి పాదాభివందనంచేసి తనకు ఆయనపై గల గౌరవభావాన్ని వెల్లడించుకొంది.

[జర్నలిస్టులకు వేదికకు సమీపంగా సీట్లు లభించని స్థితి ఏర్పడింది మొదట. తర్వాత అతి కష్టంమీద సీట్లు 'షేర్' చేసుకొనయినా మొత్తానికి వేదికకు దగ్గరగా సీట్లు లభింపచేశారు నిర్వాహకులు. వేదికకు వీలయినంత దగ్గరగా జర్నలిస్టులు వుండవలసిన అవసరం మీ విలేఖరికి స్పష్టంగాకన్పించిందీసందర్భంలో. అంత సన్మానపు ఆనందాన్ని అనుభవిస్తూ తనని తాను కంట్రోల్ చేసుకోగలిగిన జమున—తాను తన భర్తకూ, తన కుమారుడు తనకూ తన భర్తకూ పాదాభివందనం చేసినప్పుడు నిలదొక్కుకోలేని అద్భుతానుభూతిని పొంది వుండాలి. అందుకు నిదర్శనంగా—ఆ క్షణాన—చూస్తుండగానే, స్పష్టంగా కన్పిస్తూ ఆమె కంట గిర్రున తిరిగిన నీరు—ఆమె



'మయను పిలిచింది'లో కమలహాసన్, జయచిత్ర

ఆనందానికి ఏ రచయితా వ్యక్తపరచలేని ఏ కవీ వర్ణించలేని ఆనందాన్ని సూచించే ఆ ఆనంద బాష్పాలు—దూరంగా వున్న జర్నలిస్టు కంట పడే అవకాశం లేదు మరి!]

దేవర్ తెలుగు చిత్రరంగ ప్రవేశం!

విజయవంతమైన చిత్రాలు తమిళంలోనూ, హిందీలోనూకూడా నిర్మించి ప్రముఖ నిర్మాతగా కీర్తీ, డబ్బూకూడా సంపాదించిన శాండో చిన్నప్పదేవర్ ఇప్పుడు తెలుగు చిత్ర నిర్మాణంతో తెలుగు చలనచిత్రరంగంలోకడుగు పెట్టారు. చిన్నప్పదేవర్ చిత్రాల్లో నటీనటులతో పాటు రకరకాల జంతువులు కీలకమైన స్థానాల్ని కలిగివుండటం ప్రత్యేకత. నిర్మాత త్రివిక్రమ రావు దేవర్ కలిసి నిర్మించే 'పొట్టేలుపున్నమ్మ' లో శ్రీప్రియ, మురళీ మోహన్‌లతో పాటు చిత్రం పేరులోనే వున్న పొట్టేలుకూడా ఒక కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది.

చిలిపికృష్ణుడు శతదినోత్సవం!

నాగేశ్వరరావు, వాణిశ్రీలు నాయకా,నాయిక లుగా డి. రామానాయుడు నిర్మించిన చిత్రం 'చిలిపి కృష్ణుడు' విజయవంతంగా ప్రదర్శింప బడి నూరు రోజుల పండుగ చేసుకొంది. ఆ సందర్భంగా శతదినోత్సవ సభను మద్రాసులో జరిపారు నిర్మాత రామానాయుడు.



'కాలాంతకులు'లో జయసుధ

యమగోల రజతోత్సవం

ఎన్. టి. రామారావు, జయప్రద నాయకా, నాయికలుగా, సత్యనారాయణ, అల్లు రామ లింగయ్య 'యముండు' 'చిత్రగుప్తుడు'గా ఎన్. వెంకటరత్నం నిర్మించిన వినోద ప్రధాన చిత్రం 'యమగోల' రజతోత్సవం జరుపుకొంది. రజతోత్సవ సభను 'గోల' లేకుండా (ఆ చిత్ర రచయిత డి.వి.నరసరాజు మాటల్లో) సింపుల్‌గా మద్రాసులోని హోటల్ సుదర్శన్‌లో జరిపారు నిర్మాత.

క్లుప్తంగా....

ప్రముఖ హాస్యనటుడు అల్లు రామలింగయ్య చలనచిత్ర నట జీవితం 25 సంవత్సరాల వయసుకు చేరుకొన్న సందర్భంలో పాలకొల్లులో ఆయన 'చలనచిత్ర రజతోత్సవం' జరిగింది.

* *

ఎం. బాలయ్య సమర్పణలో అమృతా ఫిలింస్ నిర్మించే వర్ణచిత్రంలో బాలయ్య, మురళీ మోహన్, లత, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, సావిత్రి, సత్యేంద్రకుమార్. మాడా మొదలైనవారు నటిస్తున్నారు. బి.వి. ప్రసాద్ దర్శకుడు.

* * *



శోభన్ బాబు



'పొట్టేలు పున్నమ్మ' శ్రీప్రియ

ఎన్.డి. లాల్ దర్శకత్వంలో కృష్ణ, జయచిత్ర, మోహన్‌బాబు, సావిత్రి, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, ముక్కామాల, త్యాగరాజు మొదలైనవారు నటించిన చిత్రం 'ముగ్గురూ ముగ్గురే'.

* * *

కృష్ణ, జయప్రద, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, నాగభూషణం, కాకరాల, జయమాలిని, మొదలైనవారు నటించిన త్రిమూర్తి ప్రొడక్షన్స్ చిత్రం 'దొంగల వేట'. కె.ఎస్.ఆర్.దాస్ దర్శకుడు; నిర్మాతలు: పి. సాంబశివరావు, బాబ్జీ.

* * *

'కలియుగ సీత' చిత్రాన్ని ప్రముఖ ఛాయా



'రాజపుత్ర రహస్యం'లో రామారావు, జయప్రద

ప్రముఖ నిశ్చలన ఛాయాగ్రాహకుడు జైహింద్ సత్యం ('మనసత్యం') అజయ్ ఆర్ట్స్ పతాకంక్రింద నిర్మిస్తున్న చిత్రం 'శ్రీరామ రక్ష'. నాగేశ్వరరావు ద్విపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా గల ఈ చిత్రంలో వాణిశ్రీ, జయసుధ, జగ్గయ్య, నాగభూషణం, సత్యనారాయణ, రావుగోపాలరావు, గిరిబాబు నటిస్తున్నారు. తాతినేని రామారావు దర్శకుడు.

* * *

నిర్మాత క్రాంతికుమార్ వాసు (ఆడపిల్లల తండ్రి దర్శకుడు)దర్శకత్వంలో నిర్మిస్తున్న గ్రాహకుడు వి. ఎస్. ఆర్. స్వామి నిర్మిస్తున్నారు. కథ, దర్శకత్వం: పి. సాంబశివరావు. జయసుధ, చంద్రమోహన్, సత్యనారాయణ, సాక్షి రంగారావు, జయమాలిని మొదలైన వారు నటిస్తున్నారు.

* * *

కె.బాపయ్య దర్శకత్వంలో తయారవుతున్న 'సాహసవంతుడు'లో ఎన్. టి. రామారావు నాయకుడుగా, వాణిశ్రీ నాయికగా నటిస్తున్నారు.నేపాల్ తార కుమారి శ్రేష్టకూడా ఈ చిత్రంలో నటించడం విశేషం. ఈ చిత్రం షూటింగ్ నేపాల్‌లోని ఖాట్మండూలో మే 10వ ప్రారంభమవుతుంది.

* * *

రాజ్యలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ శ్రీదేవి, చంద్రమోహన్‌లు ప్రధాన పాత్రలుగా 'పదహారేళ్ళ వయసు' రాఘవేంద్రరావు దర్శకత్వంలో నిర్మిస్తోంది.



'మరో సీత కథ'లో ప్రభ



'కలియుగ సీత'లో జయసుధ

చిత్రంలో నాగేశ్వరరావు, రామారావులకు జోడీలుగా జయప్రద, జయసుధలు నటించిన ఈ చిత్రంలో జగ్గయ్య, అల్లు రామలింగయ్య, రాజబాబు, మోహన్‌బాబు, శరత్ బాబు, కాంతారావు, ధూళిపాళ, ముక్కామల, అంజలీదేవి, పుష్పలత, మొదలైన వారుకూడా నటిస్తున్నారు. ఆత్రేయ మాటలు, మహదేవన్ సంగీతం, వి. ఎస్. ఆర్. స్వామి కెమేరా నిర్వహించిన ఈ చిత్రానికి నిర్మాత దర్శకుడు వి. బి. రాజేంద్రప్రసాద్.

శిలువ వేయబడ్డాడు!

రాధాచిత్ర నిర్మిస్తున్న వర్ణ చిత్రం 'కరుణామయుడు' దాదాపు పూర్తి అయింది. ఆ చిత్రానికి అవసరమయిన మేజర్ ట్రిక్‌షాట్స్ కొన్ని మినహా చిత్రం షూటింగంతా అయిపోయింది. గతమాసం అధిక వ్యయప్రయాసలకోర్చి క్రీస్తును శిలువ వేసే దృశ్యాన్ని చిత్రీకరించడం జరిగింది. "అనుకొన్న కాలానికి చిత్రాన్ని పూర్తి చేయలేక పోవడానికి కారణం — అనుకొన్న ఎఫెక్ట్స్ కోసం, మంచి ఫలితంకోసం, రాజీలేకుండా, ఖర్చుకి వెనుదీయకుండా, సంతృప్తికరంగా వచ్చిన దృశ్యాలుకూడా మరింత బాగా చిత్రీకరించవచ్చు అనిపించినప్పుడు కొన్ని రీషూట్ కూడా చేయడం,— చిత్రం పూర్తికావడం ఆలస్యమైనా అనుకొన్న ఫలితాలు సాధించగలిగినందుకు ఆనందంగా వుంది" అన్నారు నిర్మాత, క్రీస్తు పాత్రధారి విజయచందర్ ఈ చిత్రంగురించి ముచ్చటిస్తూ.

—యస్వీనారాయణ


'ప్రాణం ఖరీదు' చిత్రానికి సి. ఎస్. రావ్ ('ఊరుమ్మడి బ్రతుకులు' చిత్రకథకుడు) కథ, మాటలు సమకూరుస్తున్నారు. చంద్రమోహన్, జయసుధ, సత్యనారాయణ, రావుగోపాలరావు, గిరిబాబు ప్రధాన పాత్రధారులు.

* * *

రామకృష్ణులు!

అన్నపూర్ణా స్టూడియోస్ & జగపతి ఆర్ట్ పిక్చర్స్ సంస్థ నిర్మించే భారీ వర్ణచిత్రం 'రామకృష్ణులు' సినిమాస్కోప్ (టాడ్-ఓ)లో తయారవుతోంది. నమ్మలేని విధంగా అద్భుతమనిపించే దృశ్యాల నెన్నిటినో కలిగివున్న ఈ

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు జూన్ '78

అడ్డం

1. వాది
4. తజ్జీవితం వసంతానికి
7. ఇందులో తగాదా ఉంది
8. చిన్నదైనా, పెద్దదైనా ఉద్యోగమే.
10. శ్రీ. శ్రీ. సులభ వ్యాకరణంలో షష్ఠీ విభక్తి.
11. స్త్రీ
13. ఒక 11 పేరు
14. ప్రపంచకవి, ఇంగ్లీషువాడు
15. చైత్రశుద్ధ పాడ్యమి
16. భాస నాటకం
18. కలిసి ఉంటే కలదు సుఖం : కనిపిస్తుంది ముందు భోగం!
21. దశరథుని తుది (భార్య) పిలుపా?
22. తొలినాళ్ళ విశ్వనాథ
24. సుమారు గురికి బారెడు
25. నోటిలో "—" రాస్తే తెలుస్తుంది

నిలువు

1. దక్షిణం
2. ఈ రేక ఒక ఆభరణం
3. తీస్తే ఏముంటుంది?
4. రోగా(గు)ల నిలయం
5. అరింట ఒక శత్రువు
6. ఇలాగ కూడా నవ్వవచ్చు
9. నిజానికీ, ఎన్నికలకీ.
10. భక్తులు వారణాసి కెందుకు వెళ్తారు?
12. ఇంగ్లీషులో 4 నిలువు
15. ఒక గొప్ప తెలుగు నవల
17. మూది
19. —ఉన్న రోజుల్లో ఉండవు నేరాలు.
20. మాచెర్ల గ్రామానికి పట్టిన గతి
22. వాక్కు (ఆమ్రేడిస్తే తిరగటానికి)
23. రా తమ్ముడా?

మే పదబంధ ప్రహేళికకు సమాధానం :

అడ్డం: 1. తరువాతి 4. అనుమానం 7. గున్నమామిడి 8. సని 10. పాగా 11. రిరంస 13. అణిమ 14. గువేరా 15. ఆశలు 16. విహీన 18. లాత్వం 21. తిట్టు 22 లాటానుప్రాసం 24. నలుగురు 25. సచిత్రాలు.

నిలువు. 1. తలసరి 2. వాగు 3. తిన్నడు 4. అమితం 5. నుడి 6. నందిగామ 9. నిరంకుశత్వం 10. పాణి గృహీతి 12. వేవేవే 15. ఆలాపన 17. నట్టువలు 19. కటారు 20. త్రిప్రాస 22. లాగు 23. సంచి.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి మే 1 తేదిలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితంమీద గళ్ళుగీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీ వొచ్చినపుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పైనెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

మే పదబంధ ప్రహేళిక విజేతలు :

1. ఎస్. రామశాస్త్రి, వరంగల్. 2. కె. ముత్యాలు, ఏలూరు. 3. ఆర్. కమల, వరంగల్. వీరి ముగ్గురుకీ బహుమతి మొత్తం (రు. 50) సమంగా పంచి పంపిస్తున్నాము.

గళ్ళ నుడికట్టు - కథా కమామీషు!

పాఠకుల్ని ఆకర్షించి అమ్మకాలను పెంచేందుకు తరచు సరికొత్త శీర్షికలను పత్రికల్లో ప్రవేశపెట్టటం కొత్త విషయమేంకాదు. అయితే కొన్ని శీర్షికలు తడిసిన మతాబుల్లా వెలుగకపోతే, మరికొన్ని నేర్పుగా విడిచిన రాకెట్లలా పాఠకలోకంలోకి దూసుకుపోతుంటాయి.

ఈ రెండో కోవకి చెందిన శీర్షికల్లో మొట్టమొదటిగా పేర్కొనవలసింది గళ్ళనుడికట్టు. దీనికున్న గిరాకీ ఆ నాటినుండి ఈ నాటివరకు చెక్కుచెదరలేదు. పైపెచ్చు నానాటికీ పెరిగిపోతోంది కూడా.

తొట్టతొలుత 1913వ సం॥లో న్యూయార్క్ నుండి వెలువడే 'వరల్డ్' పత్రిక క్రిష్టమస్ ప్రత్యేక అనుబంధంలో గళ్ళనుడికట్టు ప్రచురింపబడింది. దీనిని రూపొందించింది ఆర్థర్ వెన్ అను రచయిత. తాను తయారు చేసిన గళ్ళనుడికట్టుకింత ప్రచారం వస్తుందని దాని కర్తకూడా అప్పుడు వూహించి వుండడు. ఒక ఆదివారం వరల్డ్ పత్రిక గళ్ళ నుడికట్టు ప్రచురింపలేకపోవటంతో ఆ తర్వాత కొన్నిరోజులు ఆ పత్రికను కొనటం ఆపివేశారు పాఠకులు తమ నిరసనను తెలిపేందుకు, నుడికట్టుపై తమకున్న ఆసక్తిని వెల్లడించేందుకు. ఆ రోజుల్లోనే గళ్ళనుడికట్టుమీద పాఠకుల మోజు అంత అధికంగా వుందన్నమాట.

ధారావాహికంగా పది సంవత్సరాలపాటు గళ్ళనుడికట్టును ప్రచురించిన తొట్టతొలి పత్రిక వరల్డ్. ఈ కాలంలో మరే యితర పత్రిక 'మాదిరి గళ్ళనుడికట్టు' నైనా ప్రచురించలేక పోయింది—ఈ ప్రక్రియలోని కిటుకు ను గ్రహింపలేక.

1924 జనవరిలో గళ్ళనుడికట్లను పూరించేందుకు పనికొచ్చే నిఘంటువును ప్రచురించిన ఒక ప్రచురణ సంస్థ రెండుమూడు వారాల్లో ఆ ఒక్క పుస్తకం అమ్మకాలపై లక్షలకు లక్షలు ఆదాయం గడించింది.

వ్యాపారరంగంలో కూడా గళ్ళనుడికట్ల పాత్ర కొద్దిగా వుంది. కొందరు బట్టల వర్తకులు గళ్ళ నుడికట్టును పంచిపెట్టి—ఆల్ కరెక్ట్ ఎంట్రీలు పంపినవారికి—ఆ తర్వాత కొనే బట్టలమీద రిబేటు యిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టారు.

1924 డిశంబరులో లండన్ టైమ్స్ అనే పత్రిక గళ్ళనుడికట్లమీద ఘాటైన వ్యాసం ప్రచురించింది. గళ్ళనుడికట్లను పూరించటంఒక వ్యసనం లాంటిదని, వాటివల్ల వాటిల్లే ప్రమాదాలను పేర్కొంటూ అమెరికాలో గళ్ళనుడికట్ల వల్ల రోజుకి 5 మిలియన్ల పనిగంటలు దండగయిపోతున్నాయని వివరించింది.

మెల్లగా గళ్ళనుడికట్ల పిచ్చి ఇంగ్లండుకు ప్రాకింది. దాంతో అదే పత్రిక రాబోయే ప్రమాదాన్ని గురించి మరోసారి హెచ్చరించింది. అయితే ఆ హెచ్చరికను ఎవరూ పట్టించుకోలేదు.

1930 నాటికి ఇంగ్లండులో గళ్ళనుడికట్ల పిచ్చి బాగా ముదిరిపోయింది. కొందరు మహానుభావులు వృత్తిని, మిగతా వ్యాపకాలను మానుకుని నుడికట్టును పూరిస్తూ గడిపేస్తూండేవారు రోజుల తరబడి. గళ్ళనుడికట్లను నిషేధించాలని ప్రయత్నించారు కొందరు ప్రముఖులు. తాకిడికి తట్టుకోలేక లైబ్రరీలలో నిఘంటువులను దాచివేయటంలో, అలజడి మొదలయింది గళ్ళనుడికట్ల ప్రియులలో. దాంతో నిఘంటువు ఐదు నిముషాలకు మించి చూడరాదన్న నిబంధనను అమలుపరచారు అన్ని లైబ్రరీలలోనూ—

అరవై సంవత్సరాలు నిండినా గళ్ళనుడికట్టుమీద పాఠకుల ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు యిప్పటికీను.

ఆధారాలు యెంత యెక్కువ తికమక పెడితే అంత రంజుగా వుంటుంది గళ్ళనుడికట్టు. తెలుగులో మొట్టమొదటగా నుడికట్టును పేనింది ఆరుద్ర అయితే, దానికి నగిషీలు చెక్కి పెంపుగు పెట్టింది శ్రీ. శ్రీ.


కొన్ని నుడికట్లలో ఆధారాల్లో పటుత్వం లేకపోవటంవల్ల, ఒకటి రెండు మల్టిపుల్ చాయిస్ సమాధానాలు ఇస్తూ, అందులో తమ కిష్టమయిన సమాధానం మాత్రమే కరక్టు అనటం—యిదంతా లాటరీ వ్యవహారంగానూ, వ్యాపారపరంగానూ వుంటున్నాయి.

అసలు సిసలైన గళ్ళ నుడికట్టుగా కనుపించేది శ్రీ శ్రీ పదబంధ ప్రహేళికలు (ముఖస్తుతి కాదని మనవి). ఆధారాలివ్వటంలో వారికున్న నైపుణ్యం, నుడికట్టును అల్లటంలో వారి ప్రతిభ, పాఠకులను వాడ పెట్టే మకతికలు చాలా ఆసక్తికరంగా వుంటుంది.

—ఎస్. ఆంజనేయులు

గత సంవత్సరం ['77 ఏప్రిల్ - '78 మార్చి] జ్యోతిలో ఎన్నిక చేయబడ్డ
మూడు ఉత్తమ కథల రచయితల వివరాలు

ప్రథమ బహుమతి



స్వస్థలం విజయవాడ.

హైదరాబాద్‌లో స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నాను.

ఇంతవరకు రాసినవి పది కథలు. వివిధ వార, మాస పత్రికలలో ప్రచురింపబడ్డాయి.

బహుమతి పొందటం ఇదే మొదటిసారి.

రచయితగా తెల్సుకోవాల్సినవి, నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి. అంచేత రచయితగా నా దంటూ స్థిరమైన అభిప్రాయం ఎందులోనూ లేదు. కాని నాకున్న పరిజ్ఞానంలో ఈ రెండు ముక్కలూ చెప్పటానికి సాహసిస్తున్నాను.

"కథ రాయటానికి కేవలం ఇన్‌స్టింక్ట్ చాలు. మంచి కథ రాయాలంటే మనసులో Struggle అవాలి."

దేవరకొండ మురళి

ద్వితీయ బహుమతి



ముప్ఫయ్యేళ్ళ క్రితం ప్రకాశం జిల్లా రావినూతల్లో జననం. ప్రస్తుతం అవనిగడ్డ సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలో డాక్టరుగా పని.

ఇంతవరకు నలభై వరకు కథలు, పాతిక కవితలు, కొన్ని వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ఏడెనిమిది రచనలు విజయవాడ రేడియో కేంద్రంనుండి ప్రసారమయాయి. 'ప్రగతి' వార పత్రికలో వైద్య శీర్షిక నిర్వహించాను.

తీరిక వేళల్లో కథలు చదవటం, వ్రాయటం రేడియోలో సినిమా పాటలు వినటం హాబీ.

వివాహితుడిని. భార్య సుగుణ. పిల్లలు శిరీష, గోపీచంద్.

నాలోని రచయితకు వూపిరి పోసిన (మా అన్నయ్య) ప్రముఖ కవి, రచయిత శ్రీ నాగభైరవ కోటీశ్వరరావుగారికి, బహుమతి నిచ్చి అదనపు ప్రోత్సాహాన్నిచ్చిన "జ్యోతి"కి నా కృతజ్ఞతలు.

నాగభైరవ ఆంజనేయులు

తృతీయ బహుమతి



పుట్టింది 1946 లో.

ఇప్పటికి వందపైగా కథలు నాలుగు నవలలు వివిధ పత్రికలలో అచ్చు అయ్యాయి. 'వరద' కథల సంపుటిని ఎమెస్కోవారు వెలువరించారు. కన్నడ, హిందీ, తమిళ, మళయాళ భాషల్లోకి పది పైగా కథలు అనువాదం అయ్యాయి. 1977 స్వాతి కథలపోటీలో రెండవ బహుమతి. నవభారత్ బుక్‌హౌస్ వారి నవలా ప్రియదర్శిని బేలట్ పోటీలో 'కొత్త చిగురు' నవలకి బహుమతి వచ్చాయి.

తెలుగులో సాహిత్యానికి వ్యాపార రంగు ఎక్కువై పోతున్న సమయంలో "జ్యోతి" కొత్తకొత్త పథకాలతో మంచి కథలకోసం చేస్తున్న కృషికి సంతోషం.

వి. రాజారామమోహనరావు

ఏ రిక్షావాడూ మూడు రూపాయలకు తక్కువ వప్పుకోని
బేరాన్ని కేవలం రూపాయి ముప్పావలాకే వప్పేసు
కొన్న రిక్షావాడు అమాయకుడా? అమాయ
కంగా కన్పించే వాడా?

బ్రతక నేర్చినవాడు

కెఎస్వీ

హోటలు సాపాటు తినగలిగినంతా తిని, కిళ్ళీ వొకటి బిగించి, విల్స్‌ఫ్లేక్‌కింగ్స్ రెండు కొని వొకటి జేబులో భద్రపరిచి వొకటి వెలిగించాడు మూర్తి-సిగిరెట్టు వొకటి కొంటే పద్దెనిమిది పైసలు, రెండు కొంటే ముప్పై అయిదు పైసలు-వొక పైస ఆదా!

రాత్రి తొమ్మిది దాటుతోంది. దుర్గానగర్ కాలనీ వూరికి రెండు మైళ్ళ దూరంలో వుంది. ఆరు కేజీల బరువున్న సూటుకేసుతో అంత దూరం నడవటం-ప్రయాసే!

"—ఏయ్ రిక్షా...."

రివ్వుమని వొచ్చి వాలింది రిక్షా.

"దుర్గానగర్ కాలనీ.. .వొస్తావా?—"

"దుర్గానగరా సార్.. ."

"అవును....ఎంత కావాలి?...."

"మూడ్రూపాయల్సార్!...."

"మూడు రూపాయలా!...." వీడి రిక్షాలో ఎక్కడం పడదు-అనుకున్నాడు మూర్తి.

"ఏమిస్తారు సార్?... "

"రూపాయిన్నరిస్తా...."

"హే—" అంటూ నవ్వేడు రిక్షావాడు. మరోమాట లేకుండా రిక్షా తిప్పుకుని రివ్వున మాయమైపోయాడు.

తలపొగురు— వెధవలకి....అని తిట్టుకున్నాడు మూర్తి. సరే వీడు కాకపోతే మరోడు-వీడి బాబులాంటివాడు-అనుకున్నాడు.

నిజంగా మొదటి రిక్షావాడి 'బాబు' లాంటి వాడే వొచ్చాడు.

"రండి బాబూ...." అన్నాడు, ఖంగుమని దగ్గుతూ, ఎక్కడికనైనా అడక్కుండా.

ఎక్కడికో చెప్పగానే మాత్రం-"దుర్గానగరా బాబూ!" అన్నాడు, అప్పుడే బోల్డు ఆయాస పడిపోతూ.

"అవును దుర్గానగరే...."

"శానాదూరం బాబూ—వూరుదాటి అంతా మిట్ట . మూడ్రూపాయలిప్పించండి బాబూ."

మళ్ళీ వీడూ 'మూడ్రూపాయలు' దుర్గానగర్‌కి ఇది స్టాండర్డ్ రేటులా వుంది. అయినా 'ట్రయ్' చేస్తే? .

"రూపాయిన్నరిస్తానయా. ..పైసా కూడా ఎక్కువీను .... వొస్తేరా .... లేకపోతేపో .."

పెట్టె చేతిలోకి తీసుకుని దబాయింపుగా రెండడుగులు వేశాడు, అలాగైనా ముసిలాడు మెట్టుదిగతాడని.

మాట లేకుండా ఆయాసపు దగ్గు దగ్గుతూ గొణుక్కుంటూ కొంతదూరం రిక్షా తోసుకుంటూ వెళ్ళి ఆ తరువాత రిక్షా ఎక్కి దూరమైపోయాడు ముసిలాడు.

'వెధవలు-వెధవలు' అని తిట్టుకున్నాడు మూర్తి. అరిచి గీపెట్టినా వీళ్ళతో రాజీకి మాత్రం రాకూడదు—అనుకున్నాడు.

ముసిలాడు వెళ్ళిన వేపునుంచి ఇంకో రిక్షా వొచ్చింది. వీడు మెల్లకంటివాడు. తాజాగా రాజులా పోజుపెట్టి వొస్తున్నాడు. "రిక్షా—"

చప్పున దగ్గరకొచ్చి రిక్షా ఆపి, బండి దిగి, మూర్తి చేతిలోంచి సూటుకేసు లాక్కోబోయాడు మెల్లకంటివాడు.

"—దుర్గానగర్ కాలనీ. . " బెదిరింపుగా

అన్నాడు మూర్తి.

బెదర్లేదు వాడు, సూటుకేసు 'బండి'లో పెట్టేసుకున్నాడు. "ఎక్కండి బాబూ!...."

"ఎంత?...."

తేటగా నవ్వేడు వాడు,"ఎంతో వొకంత. .. తమకి తోచినంత ఇద్దురు గాన్లెండి....ఎక్కండి బాబూ...." మళ్ళీ నవ్వేడు, చిల్లగింపుగా.

సందేహం లేదు. వీడు టోపీ దాసు. పెద్ద పేచీకోరు. తీరా అక్కడ దిగేక నానా గొడవ చేసి బూతు పంచాంగం విప్పేరకం.

"ఎంతో నువ్వు చెప్పవయా...."

"నేను చెప్పేదేముంది బాబూ! తమకి తెలీదా? నా కష్టం తమరుంచుకుంటారా.... ఎక్కండి బాబూ!...."

"కష్టపడేవాడివి ..నువ్వు ఇంత కావాలీ అని ముందే అడగాలోయ్. ....ఎంత చెప్పూ...."

రేటు చెప్పటం తప్పనిసరయినందుకు కించిత్తు చింతిస్తూ, తేట నవ్వును తైరు నవ్వుగా మార్చాడు మెల్లకంటి రిక్షా చోదకుడు. తాజుగా రాజులా వొస్తున్నప్పటి పోజుకూ ఇప్పటి ధోరణికీ పోలికేలేదు.

"మూడున్నరిప్పించండి బాబూ!...."

"వాళ్ళీ వోగాయిత్వంగూల!—"అని స్వగతంలో ముక్కున వేలేసుకున్నాడు మూర్తి.

వీడితో ఇంకా బేరమాట్టంకూడానా? నయం—ముందే పట్టుబట్టి అడిగేశాడు. తీరా అక్కడ దిగాక—నిజంగానే అల్లరి చేసేవాడు.

"రూపాయిన్నరిస్తా!—"అన్నాడు మూర్తి. మొండిగా అనేశాడు.

చురుక్కుమని చూశాడు (!) మెల్లకంటి వాడు.

"హుఁ—" అని స్పష్టంగా హుంకరించాడు. వొక్క వుదుటన—రిక్షాలో రెణ్ణిమిషాల క్రితం అతి జాగ్రత్తగా ఉంచిన సూటుకేసుని—ధబ్బున నేలమీద పడేశాడు.

"రూపాయిన్న రిస్తాట్ట. . దుర్గానగర్‌కి.... ఏం—మేం రిక్షావోళ్ళమా — అడుక్కునే వోళ్ళమా....ధర్మానికిచ్చేట్టుగా వుంది....దుర్గానగర్‌కి—రూపాయిన్నర! ..."

విసురుగా రిక్షా ఎక్కి 'టప్ టప్' మని చైను చప్పుడు చేసేలా తొక్కుంటూ సభా భవనం నుంచి కోపంగా నిష్క్రమించే రాజులా వెళ్ళిపోయాడు మెల్లకంటివాడు.

పట్టరాని కోపమొచ్చింది మూర్తికి "స్కౌండ్రల్! స్కౌండ్రల్!—" అని తిట్టుకున్నాడు. పళ్ళు పటపట లాడించాడు.

టైము చూసుకున్నాడు—తొమ్మిదింబావు!....

ఈ రిక్షా బేరాలతోనే రాత్రి గడిచిపోతుందేమిటి?

తానొకటి తలచిన రిక్షావాడొకటి తలచునా?

"రిక్షా సార్!...."

వీడూ దగుల్బాజీయే అయివుంటాడు. అయినా—కదిపి చూద్దాం. అయితే—దుర్గానగర్ వెళ్ళటానికి తొందరపడుతున్నట్టు మాత్రం వీడికి అనిపించకూడదు.

"ఏం టోయ్?...."

"రిక్షా కావాలా సార్?"

"ఆఁ...." ఏదో చిరాకుగా, గంభీరంగా వాచీ చూసుకున్నాడు. పెద్ద తొందరేం లేనట్టు చప్పరించాడు.

"దుర్గానగర్ కాలనీదాకా వెళ్ళాలోయ్...."

"దుర్గానగరా సార్.. ."

"అవునోయ్...."

"రెండున్నర్రూపాయిప్పించండి సార్. "

"ప్చ్!...."

"ఏం సార్?...."

"మరీ యెక్కువడుగుతున్నావోయ్...."

"ఏమీ యెక్కువడగలేస్సార్....నే నందరు రిక్షావాళ్ళలాగా అడిగేవాణ్ణి కాన్సార్. . .అయినా —మీ దగ్గిర నేను ఎక్కువడిగేదేముంది సార్!?...."

"ఎక్కువేనోయ్ ..."

"పోనీ—ఎంతిస్తారో చెప్పండి సార్. .."

"నువ్వు రెండుంబావలా చెప్తే—ఇంకా నేను చెప్పేదేముంది—"

"పోనీ—ఎక్కండి బాబూ—ఆ పావలాతో సెయ్యండి—రెండ్రూపాయలిప్పించండి—ఎక్కండి—"

వీడెవడో మంచివాడులాగా వున్నాడు. ఈ రిక్షా లొక్కడు బిజినెస్‌కి కొత్తవాడిలా వున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా ఎక్కేసి రెండ్రూపాయ లిచ్చేయడం ఉత్తమం. ఈలోగా ఇందాకా తనతో బేరాలాడిన రిక్షావాళ్ళలో ఎవరైనా ఇటుగా వచ్చి—చాటుగా వీడికి సైగ చేసేసినా చేసెయ్యగలరు. బేరం బెడిసి కొడుతుంది! అయినా చూదాం ఆఖరి ప్రయత్నంగా!

"సరే — ఒకటిమ్ముప్పావలా యిస్తానయా. "

"సార్!. " దెబ్బతిన్న పక్షిలా చూశాడు వాడు. ముఖం ముడుచుకున్నాడు. తటపటాయిస్తూ అలాగే నిలుచున్నాడు.

ఈ బేరం కూడా కుదిరినట్టే కుదిరి ఎక్కడ చెయి జారిపోతుందోనని గుండె పీకింది మూర్తికి.

వీడు వెళ్ళిపోతే.—మరొడెవడు దొరుకుతాడు రెండుకి వొచ్చేవాడు? పావలా దగ్గర ప్రలోభపడితే-రూపాయి-లాస్! అంతలో—

"సరే—ఎక్కండి సార్! . "

కఠోరమైన విధినిర్ణయాన్ని వీపుమీద భరించే హీరోలా కదిలేడు వాడు. సూట్‌కేస్ రిక్షాలో పెట్టుకున్నాడు.

రిక్షాసీటులో కూలబడి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు మూర్తి.

షాపుల దీపకాంతుల్ని మెల్లి మెల్లిగా వెనక్కి తరలిస్తూ - రిక్షా ముందుకు కదిలింది.

జనసంవోహాన్ని గజిబిజినీ చీల్చుకుంటూ మౌనంగా 'పెడల్' చేస్తున్నాడు రిక్షావాడు.

రాస్తా ఊడదాటివచ్చాక కూనిరాగం తియ్యడం మొదలుపెట్టేడు. ఆ తరువాత ప్రసిద్ధ సినీగీతాలను రాగయుక్తంగానే గానం చేశాడు. బొత్తిగా నిర్జనమైన రోడ్డుమీదికి వచ్చాక, పాట ఆపి—మూర్తితో మళ్ళీ మాట కలిపాడు.

"ఇంతకీ—మీరు దుర్గానగర్ కాలనీలో ఎక్కడికి కెళ్ళాల్సార్?"

పేరుకి కాలనీ ఐనా దుర్గానగర్‌లో ఆరేడు కంటే ఇళ్ళులేవు. ఆ ఉన్నవీ చెదురు మదురుగా విసిరేసినట్టు అక్కడొక్కటీ ఇక్కడొక్కటీ వున్నాయి. కాలనీ మొదట్లోనూ కాలనీ అవతలా గుడిసెలు మాత్రం చాలానేవున్నాయి.

"కాలనీ మొదట్లోనే మర్రిచెట్టొకటుంది తెలుసా?"

"మర్రిచెట్టా సార్?—"

"పెద్ద మర్రిచెట్టోయ్—వూడలూ అవీ బాగా దిగి—"

"అవున్సార్! ఆఁ!—మర్రిచెట్టు—"

"ఆ మర్రిచెట్టుకి కొంచెం పైనే—పచ్చ మేడొకటుంది — డాక్టరుగారిది. వాళ్ళింటికి వెళ్ళేది."

"అబ్బ-ఊరికి ఇంత దూరంగా-చాలా కష్టం సార్ వుండటం . "

"ఎలాగో వుంటున్నాడు గదా వూళ్ళో యిళ్ళంటే అద్దెలు సామాన్యంగా వుంటయా. నూటయాభయ్యట—ఆ పచ్చమేడకి అద్దె. చవక కదూ "

"అవున్సార్! "

"ఎంతా రెండేళ్ళయింది మా వాడు ప్రాక్టీసు పెట్టి .. ఇదివరకోసారి వొచ్చినప్పుడు యేఁవీఁ బాగా జరగటం లేదన్నాడు. మళ్ళీ పికప్ అయిందని వుత్తరం రాశాడు. ..వూళ్ళో యిల్లు గనక వుంటే రాత్రి బాగా పొద్దుపోయే దాకా క్లినిక్ తెరిచి వుండొచ్చు ...యిల్లు దూరంగదా .. ఎనిమిదికే మూసేస్తున్నానని రాశాడు "

"ఇంతకీ మన్నేవూరు సార్?.. "

"ఏవూరైతేనేంలే .ఊఁదిగం అనకాపల్లిలో. ఆఫీసు పనిమీదే సికిందరాబాదు దాకా వెళ్ళాల్సొచ్చింది. తిరుగుబస్సులో పడేసరికి మా వాడు గుర్తొచ్చాడు. సరే-ఎటూ దారేగదా—కాస్తా ఇక్కడ దిగి వీణ్ణి పలకరించినట్టూ వుంటుంది—వోపూట రెస్టు తీసుకున్నట్టూ వుంటుంది-ఎటూ రేపు ఆదివారమే గదా తీరా చూస్తే దార్లో బస్సు చెడి గంటన్నర లేటయింది—లేకుంటే మా వాణ్ణి క్లినిక్‌లోనే

పట్టుకునే వాణ్ణి-ఇద్దరం కులాసాగా వొచ్చుండేవాళ్ళం—అనవసరంగా హోటల్ భోజనానికి రెండూముప్పై తగెయ్యాల్సొచ్చింది."

"అవున్సార్!...హోటల్ భోజనమంటే అంతే—"

దుర్గానగర్ కాలనీ రోడ్డు-ఉయ్యాల లూగిస్తోంది. గతుకుల కంకర రోడ్డు.

"ఎప్పుడయ్యా యీ వూపు బాగుపడేది—యీ కాలనీ మున్సిపాల్టీలోకి చేరలేదా యేం—ఇంకా—"

మాటలు మానేశాడు రిక్షావాడు-వొగరుస్తూ రిక్షా తొక్కుతున్నాడు.

"పాపం-రిక్షా తొక్కటం కష్టమే—" అనుకున్నాడు మూర్తి. అయినా—ఒకటిమ్ముప్పావలా యిస్తున్నాడు కదా? అది మాత్రం వూరికే వొస్తుందా?

బాగా చీకటిగా వుంది. రిక్షాకి వున్న గుడ్డిదీపపు వెలుగు రోడ్డు గతుకుల్ని ఎత్తి చూపలేకపోతోంది. గతుకులో చక్రం పడినప్పుడల్లా ప్రాణం గజం ఎత్తున లేచి పడుతున్నట్టుంది మూర్తికి. 'మెల్లిగా పోనీవయ్యా' అందామనుకున్నాడు. కాని, అనలేకపోయాడు.

అల్లంత దూరాన ఎత్తుగా చీకటి దయ్యంలా కనిపించింది మర్రిచెట్టు. మరో అయిదు నిమిషాలకి పచ్చబంగళా ముందు రిక్షా దిగి 'అమ్మయ్య' అనుకున్నాడు మూర్తి. జేబులోంచి రూపాయ నోటూ చిల్లరా తీసి—వొకటికి రెండుసార్లు చిల్లర లెక్కపెట్టి రిక్షావాడికి సరీగ్గా ఒకటిమ్ముప్పావలా ముట్టజెప్పాడు. "సరిపోయిందా—చూసుకో—" అన్నాడు.

"సరిపోయుంటుందిలేండి సార్—" అంటూ డబ్బు జేబులో వేసుకుని రిక్షా వెనక్కి మళ్ళించుకున్నాడు వాడు.

ఏదో తృప్తిలాంటిది కలిగింది మూర్తికి. మూడు రూపాయలకు తగ్గదనిపించిన బేరాన్ని ఒకటిమ్ముప్పావుకే సాధించినందుకు కించిత్తు గర్వమనిపించింది.

కాని, ఆ తృప్తినీ గర్వాన్నీ నిలుపుకునే వ్యవధిలేకపోయింది మూర్తికి.

రిక్షాదిగి,సూట్‌కేసుతో పచ్చమేడకాంపౌండ్ వేపు నిదానించి చూసేసరికే ఏదో అనుమానమనిపించింది. ఇంటివేపు పరికించి చూశాడు-నిజమే-లోపల లైట్లు లేవు. అప్పుడే లైట్లు ఆర్పేసుంటారా? కళ్ళు పొడుచుకుని చూశాడు తలుపులు-అవును-తాళం వేసినట్టు-సందేహం లేదు-తాళంవేసి-వున్నాయి!

"హతవిధీ!" అనుకున్నాడు మూర్తి. బహుశా సినిమాకుగాని వెళ్ళుంటారనుకున్నాడు ఆ ఆశకు బలం కల్పించుకుందామనుకుంటూ వుండగా—

"ఎవరు బాబూ?"—

ముసిలి గొంతొకటి వినిపించింది.

కాంపౌండు వారగావున్న గుడిసెముందు మంచంలోవున్న ముసిలాడు మూర్తిని చూసి లేచి కూచున్నాడు.

"డాక్టరుగారు-లేరా?"—

"మీరెవరు బాబూ?"—

"నేను—ఆయన ఫ్రెండ్‌ని స్నేహితుణ్ణిలే"

"డాక్టరుబాబు—లేరుబాబూ - అమ్మగారూ ఆయనా — భోజనాలు చేస్తుండగా ఏదో తంతొచ్చిందట—అరిజెంటుగా వూరుకు బోవాలని యెల్‌పోయినారు...."

"ఎప్పుడొస్తారు? ఏమన్నా చెప్పారా?"—

"చెప్పలేదు బాబూ—అరిజెంటు-వూరుకు బోతుండాం అన్నారు. అంతే బాబూ—వొరే ముసిలోడా-యిల్లు కొంచెం జూస్తావుండు—అని చెప్పిపోయినారు—అంతేబాబూ—"

ఉన్నచోటే కూలబడిపోవాలనిపించింది మూర్తికి. చేతిలో సూట్‌కేస్ బరువుకి అలా కూలబడి పోయేవాడే!

అంతలో—గుర్తొచ్చింది.

చప్పున వాచీ చూసుకున్నాడు.

రొమ్మిదీ నలభై.

సరిగ్గా పదిగంటలకి మెయిలుంది. ఎక్కేస్తే తెల్లారేసరికి వూళ్ళో దిగెయ్యొచ్చు. లేకుంటే యీళ్ళో ఎక్కడన్నా లాడ్జిలో ఈ రాత్రి గడపాలి. పది రూపాయాలు-గొడుగుడు. మెయిలు — మెయిలే వుంది. వేరే బస్సూ గట్రా ఏదీ లేదు. సరీగ్గా ఇరవై నిమిషాలు—

చూపుసారించాడు మూర్తి. రిక్షావాడు ఇంతలో ఎంతదూరం వెళ్ళుంటాడు?—కనిపించడే!.... మళ్ళీ రిక్షా—మరో ఒకటిమ్ముప్పావు! అయినా తప్పదు! నడిచివెళ్తే—మెయిలందదు! ఇంతకీ ఈ రిక్షా కనిపించదు! అప్పుడే మెయిన్ రోడ్డెక్కేశాడా?

"ఏం సార్?"

అంతదూరం నుంచి కేక.

మర్రిచెట్టుకి అవతలగా సిగిరెట్ల బడ్డీవున్న పాక దగ్గిర్నుంచి కదిలివొస్తోంది రిక్షా. రిక్షావాడి వదనం నుంచి పొగమేఘం-రేగుతోంది.

హమ్మయ్య—బ్రతికించాడు. తొందరపడి వెళ్ళిపోలేదు వీడు!

"రావోయ్ రిక్షా!—"

"ఏంసార్?"—

"మా వాడు ఇంట్లో లేడోయ్! తాళం వేసుంది మనం మళ్ళీ టౌన్ కెళ్ళాలి!"

"ఎక్కండ్సార్!"—

"రైల్వేస్టేషన్ కెళ్ళాలోయ్! మెయిలందుకోవాలి—ఇంక సరిగ్గా—పద్దెనిమిది నిమిషాలు టైముంది—"

"ఎక్కండ్సార్ మరి—"

ఎక్కి కూలబడ్డాడు మూర్తి. "తొందరగా పోనీ—" అన్నాడేగాని, నిమిషానిక్కూడా రిక్షా కదలకపోవడం గమనించలేదు మూర్తి.

"ఎంతిస్తారు సార్?"—

"అదేమిటోయ్ — ఒకటిమ్ముప్పావూ యిస్తాలే"—

"కిట్టదుసార్.. అది వొచ్చేటప్పుడు-ఇది పొయ్యేటప్పుడు"—

ఏఁవిటోయ్ .... ఏఁవిట్నువ్వనేది? నాకేం అర్థం గావడంలా—వొచ్చేటప్పుడు అప్పు! ఇప్పుడంతా దొనేగదా! — నిజానికి యింకా తక్కువివ్వాలి — పోనీ — తెలిసిన రిక్షాయేగదాని—వొకటిమ్ముప్పావూ యిస్తానన్నాను."

"అదేం కుదర్దుసార్! ఇప్పుడు నాలుగు

"వ్హాట్!"—

"అవున్సార్!... నాలుగు రూపాయలు! ఇస్తారా చెప్పండి—లేకుంటే దిగిపొండి"—

వీడా బంకు దగ్గిరికెళ్లి ఇంతలో తాగిగాని వొచ్చాడా అనుకున్నాడు మూర్తి.

కాని—అలా కూడా అనుకోటానికి వీల్లేదు.

వీడెవడో తెలివైనవాడిలా వున్నాడు.

ఈ ప్రాంతాల్లో వేరే రిక్షా దొరకదు. తను నడిచి సూట్ కేస్ మోసుకుంటూ వెళ్ళలేడు. వెళ్ళినా మెయిలు అందుకోలేడు. మెయిల్ అందుకోకపోతే—

"జౌరా!" అనుకున్నాడు మూర్తి.

"ఏదొకటీ తొందరగా చెప్పండ్సార్! నాలుగు రూపాయ లిస్తారా?"

ఒళ్ళు మండుకొచ్చింది. ఏం బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు వీడు! ఎంత తలపొగరు?

"అన్యాయమోయ్! చాలా అన్యాయం! ఇలా అడగటం నీకే మంచిది కాదు—"

"ఆ మాటలన్నీ ఎందుకుసార్! చెప్పండి—నాలుగిస్తారా?"

"సరే—మూడిస్తా—"

"దిగెయ్యండి సార్!—"

"ఏంటయ్యా—అవతల మెయిలు—"

"నాలుగిస్తారా?—"

కళ్ళు నీళ్ళొచ్చేంత పనయింది. అతి ప్రయత్నంమీద ఉక్రోషాన్ని బిగబట్టుకున్నాడు మూర్తి. ఏం చెయ్యగలడు తను యీ రిక్షా వాణ్ణి?—

వాచీ చూసుకున్నాడు. ఇంక సరీగ్గా—పావుగంట—

"సరేనోయ్—పద—" అన్నాడు ఓటమిని ఒప్పుకొంటున్న స్వరంతో.

"అయితే — ఏదీ — ఇచ్చెయ్యండ్సార్!—"

"ఏఁవిటి?—"

"నాలుగు రూపాయలు—"

మండుకచ్చి, కంపించి వూగిపోయాడు మూర్తి.

"ఏం—ఆ మాత్రం నమ్మకంలేదా?—"

"ఏమో—ఎవరు చూశారు? అవతల మెయిలు టైము అయిపోతోంది—రానివ్వండి మరి—" చెయ్యి చాపాడు.

పళ్ళు బిగబట్టి—జేబులోంచి కాగితాలు తీసి లెక్కబెట్టి, విసురుగా వాడి చేతిలో కుక్కాడు.

"ఊఁ పద—"

పకపకా నవ్వేడు రిక్షావాడు—"ఇహ చూడండి మన స్పీడు—"

స్పీడు—నిజంగానే చూపించాడు రిక్షావాడు.

ఊపిరి బిగబట్టుకుని కూచున్నాడు మూర్తి. శరవేగమో, వాయువేగమో, మనోవేగమో—

ఏమిటో చీకటిగా వున్నది వెలుతురైంది. టౌనులో లైట్లలా అనిపించింది. ఏవో శబ్దాలూ గందరగోళమూ వినిపించింది—కార్లూ—లారీలా—మనుషులా—

"దిగండ్సార్—"

ఆశ్చర్యం! తను చెక్కుచెదరకుండానే వున్నాడు. రిక్షా దిగుతున్నాడు—స్టేషన్‌లో.

"మరేం—యిదవకండి సార్....మనం ముందే వొచ్చేసినాం—మెయిలు కదల్డానికింకా దండిగా టైముంది—"

వాచీ చూసుకున్నాడు మూర్తి. నిజమే—చాలా తొందరగానే వొచ్చేశారు. అయినా—వెళ్ళాలి—స్టేషనులోకి—కాని—

రిక్షావాడివేపు తీక్షణంగా చూశాడు మూర్తి. అడగకూడదనుకుంటూనే అడిగేశాడు—

"ఏమోయ్—వెళ్ళేప్పుడు—వొకటిమ్మప్పావుకే వొచ్చినవాడివి—"

తేటగా—శాంతంగా నవ్వేడు రిక్షావాడు—"నిజం చెప్పేదా సార్...."

"ఏవిఁటి?—"

"మా ఇల్లు కూడా దుర్గా కాలనీలోనే... అంటే—మా గుడిసె—ఆ మర్రిచెట్టు దగ్గిరేనండి...."

"ఏఁవిటీ?"

"అందుకే—వెళ్ళేప్పుడు—తక్కువ రేటు కొచ్చానన్నమాట...."

"మరి—వొచ్చేప్పుడు—"

"మరంతే గదా—మళ్ళీ నేను ఖాళీగా ఇంటి కెళ్ళాలి—ఆ ఛార్జీ కూడా కలిపి—టోటల్‌గా ఐదుమ్మప్పావు—మీ దగ్గిర కిట్టించుకున్నానన్నమాట—"

"ఔరా!—"

బొంయ్యిమని కూస్తోంది మెయిలు. దడదడమని ప్లాట్‌ఫామ్మీదికి వొస్తోంది.

"అన్యాయమోయ్! చాలా అన్యాయం.... నన్ను ఏడిపించి తిన్నావ్..."

సూట్‌కేసు పుచ్చుకుని రెండడుగులు వేశాడు మూర్తి.

"ఇంకోమాట సార్!—"

"ఏఁవిటి?—"

"మీకు చెప్పొచ్చో చెప్పగూడదో—"

"ఏంటి—చెప్పు—"

"ఏఁవీ—అనుకోగూడదు మీరు—"

"చెప్పవోయ్—ఇంకా నస్పెన్సేవిఁటీ—"

"మీ డాక్టరుగార్ని టౌనులోకి తీసుకొచ్చింది నేనే సార్!—అమ్మగార్ని అయన్నీ బస్సెక్కించి వొస్తుంటే—మీరు కనిపించారన్నమాట...."

"ఔరా! ఔరా!—"

అని నోరు తెరిచేశాడు మూర్తి.

"ఏమనుకోకండి సార్!—మీ మెయిలొచ్చేస్తావుంది—పరిగెత్తండి మీరు.... మరేమీ ఇది కావొద్దు—ఎవరయినా బ్రతకనేర్వకపోతే కుదరదుగదా సార్.."

రిక్షావాడి మాటలు యింకేమీ వినిపించలేదు మూర్తికి. మెయిలు కూతతో చెవులు చిల్లులు పడతాయనిపించింది— □

ప్రగతి నికేతన్ (ఉత్తమ విద్యాసంస్థ)

సూర్యారావుపేట, — విజయవాడ - 2

స్థాపితము : 1966 పాఠశాల పునఃప్రారంభము : 12-6-'78

ఈ విద్యాసంస్థ 1966లో కొద్దిమంది విద్యార్థులతో శ్రీ యలమంచిలి చంద్రశేఖర్, M.A.,B.Ed.,L.S.G.D. గారిచే ప్రారంభించబడి, వారి కార్యదీక్షతో, సేవానిరతితో దినదినాభివృద్ధిగావించి ఇప్పుడు సుమారు 600 మంది విద్యార్థులతో నడుపబడుచున్నది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నవీన పద్ధతులతో ఉత్తమ క్రమశిక్షణతో నడుపబడు ఏకైక రెసిడెన్షియల్ (Residential) పాఠశాల.

నర్సరీ నుండి 10వ తరగతి వరకు విద్య గరుపబడుచున్నది. ఇంగ్లీషు తరగతులు L.K.G. నుండి 2వ తరగతి వరకు నడుపబడుచున్నవి. 1 నుండి 7వ తరగతి వరకు ప్రభుత్వ అనుమతియున్నది.

వివరములకు ఈరోజే వ్రాయండి. తగిన తపాలా బిళ్ళలు అంటించి ఎడ్రసు వ్రాసిన కవరు, రు. 2/-లు మనియార్డరు చేసిన రశీదుకూడా జత పరచిన Prospectus పంపబడును.

7వ తరగతి, Matric, 10వ తరగతిలో ఆకర్షణీయమైన ఫలితములు. నేడే సంప్రదించండి.

K. సీతారామమూర్తి
M.A,B.Ed.
హెడ్మాస్టరు

యలమంచిలి చంద్రశేఖర్
M.A,B.Ed,L.S.G.D.
FOUNDER PRINCIPAL
and CORRESPONDENT

D. S. C. బోస్

మేనేజరు

సీరియల్

పడమటి సంధ్యారాగం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

జరిగిన కథ:

ఎవరి మాటలు వినో తన భార్య ప్రియంవద శీలాన్ని శంకించి విపరీతమైన వేదనకు గురి అయాడు సత్యమూర్తి. ఆ ఆలోచనలలోనే తన మొదటి భార్య శ్రీవల్లి జ్ఞాపకాలలో సతమత మవుతున్నాడు.

శ్రీవల్లి ఇంట్లోకి రాగానే నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గరకి లాక్కున్నాడు.

"నేనింకా పూజచేసుకోలేదు. ఏమిటిది?" చిరుకోపంగా అడిగింది శ్రీవల్లి.

"ఇవాళకూడా పూజా, గీజా అంటే ఎలా? ఒక్కసారి" అన్నాడు సత్యమూర్తి భార్యని వదలకుండా.

సత్యమూర్తి ఛాతీమీద రెండు చేతులుంచి దూరంగాతోసి అన్నది శ్రీవల్లి.

"అబ్బాయిగారు ఇవాళే పుట్టారు. ఇలాంటివేం చేయకూడదు."

"నేనింకా పుట్టలేదయితే. మధ్యాహ్నం పన్నెండింటికి పుట్టాను నేను."

"రండి. స్నానం అయాక, త్వరగా గుడికి వెళ్ళివద్దాం. అష్టోత్తరం చేయించాలి. కుక్కర్ మీద వండుతాను. రాంగానే భోజనం చేయచ్చు."

భర్తకి తలంటిపోసింది. తలకి సాంబ్రాణి పొగవేసి వంటికి పౌడర్‌రాసి కొత్త లాల్చీ, పైజామాలు తనే తొడిగింది. తర్వాత కూతురు సత్యవల్లికి స్నానంచేయించి బట్టలు తొడిగింది.

ఇంటితలుపు తాళంవేసి బయిల్దేరారు. అరమైలు దూరంలోవున్న దేముడిగుడికి నడిచేవెళ్ళారు ఇద్దరూ. దేముడిగుడికి రిక్షామీద వెళ్ళటం నచ్చదు శ్రీవల్లికి.

వెంకటేశ్వరస్వామి గుడిలో అష్టోత్తరంచేయించి, దారిలో కమలా ఫలాలు కొనుక్కొని ఇంటికి చేరుకున్నారు.

శ్రీవల్లి భర్తకి వడ్డించి పక్కన కూర్చుంది, విసనకర్రతో భర్తకు విసురుతూ.

''చాలా బాగా చేసావు.''

మెచ్చుకోకుండా వుండలేకపోయాడు సత్యమూర్తి.

శ్రీవల్లి తృప్తిగా నవ్వింది.

''ఉన్న డబ్బంతా, ఆస్తంతాపోయినా చీకూ చింతా వుండదు నాకు నీలాంటి భార్య దొరికితే.''

శ్రీవల్లి ఆప్యాయంగా భర్త జుట్టుని తన వేళ్ళతో నిమిరింది. శ్రీవల్లి తన ప్రేమని, ఆప్యాయతని భర్తకి ముట్టుకుని చూపించే విధానం అది.

''రేపు మీ అక్కయ్యగారింటికి వెళ్ళాలి'' చెప్పింది శ్రీవల్లి.

''సత్యనారాయణవ్రతం చేసుకుంటున్నారనా?''

''అవును. పిల్ల బారసాలకి కూడా వెళ్ళలేదు మనం. ఓ వారం రోజులు శెలవు పెట్టండి. ఇంట్లో వుండి విసుగు పుడుతోంది. ఎటయినా వెళ్ళవద్దామని పిస్తోంది కొన్నాళ్ళు.''

''అలాగే.''

''అయితే టిక్కెట్స్ రిజర్వు చేయించండి రాజమండ్రికి. బస్సులో వెళదాం. ఎండాకాలం కాబట్టి రాత్రి బస్సులో వెళ్ళటం బాగుంటుంది.''

''అలాగే.''

''వాళ్ళకి కట్నాలు తీసుకెళ్ళాలి. మీ అక్కయ్యకి, బావగారికి బట్టలు కొనుక్కెళదాం.''

''చాలా ఖర్చవుతుందేమో!''

''అవునండి. ఫిక్సెడ్ డిపాజిట్ మీద వడ్డీ వచ్చేది ఈ నెలేగా.''

''అవును.''

భోజనం ముగించి సత్యమూర్తి పడక గదిలో మంచం మీద కూర్చుని లైబ్రరీ నుంచి తెచ్చిన 'ది విదరింగ్ హాయిట్స్' నవల చదవసాగాడు, ఓ చేత్తో పడుకున్న కూతురిని చిచ్చుకొడుతూ.

శ్రీవల్లి వంట గదిలో తన పని ముగించుకుని అరగంటలో వచ్చింది చిలకల్లా చుట్టిన తమలపాకులతో. సత్యవల్లిని నేలమీద దుప్పటి పరిచి పడుకోబెట్టింది.

భర్త పక్కన కూచుని తమలపాకులని నోటికి అందించింది. చేతిలోంచి పుస్తకం లాగి దూరంగా పెట్టి అన్నది చిరుకోపంగా.

''ఈ రోజు ఏం చదవద్దు.''

శ్రీవల్లి భుజాల చుట్టూ చేతిని వేసి మీదకు లాక్కున్నాడు సత్యమూర్తి.

''ష్. సత్యవల్లి లేస్తుంది'' అన్నది శ్రీవల్లి విడిపించుకుని.

''గుడికెళ్ళి వచ్చాంగా!'' నవ్వుతూ అడిగాడు సత్యమూర్తి.

''దేముడికి దణ్ణం పెట్టుకున్నారా?'' అడిగింది శ్రీవల్లి భర్త అరచేతిని తన చేతుల్లోకి తీసుకొని.



''నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?''

''రెండూ చెప్పండి.''

''ఏది నిజమో ఏది అబద్ధమో నీవే తేల్చుకో అయితే. పోయిన ఆస్తంతా తిరిగి రావాలి అని ...''

''రెండవది?''

''నీకన్నా ముందర నేనే చచ్చిపోవాలని కోరుకున్నాను దేముడిని.''

శ్రీవల్లి కొన్ని క్షణాలు కనురెప్పలు ఆడించి, భర్త అరచేతిని తన రెండు చేతుల మధ్యా వుంచుకొని బంతిలా దాన్ని ఎగరేసి పట్టుకుంటూ అన్నది.

''నాకు తెలుసు ఏది నిజమో ఏది అబద్ధమో.''

''చెప్పుకో అయితే?''

''రెండోది నిజంగా కోరుకున్నారు.''

''కరెక్టు.''

''అది తప్పు అని తెలియదా?''

''ఎలా?''

''భర్తకన్నా భార్య ముందు వెళ్ళిపోవాలి పునిస్త్రీ స్త్రీలా. భర్త కాదు ముందర.''

''కాని నేను వంటరిగా మిగిలిపోతే, నువ్వు లేకుండా బ్రతకగలనా?''

''అప్పుడు మీకు సత్యవల్లి తోడుంటుంది.''

''ఊహూ. నీవు లేని బ్రతుకు వూహించలేను.''

భర్త మొహాన్ని మీదకు లాక్కుని పెదవులని ముద్దు పెట్టుకుని చెప్పింది శ్రీవల్లి.

''నువ్వు లేనిదే బ్రతకలేను అని ఇలా మీలాచెప్పే భర్తని మించిన వరం ఆడదానికి ఇంకోటి లేదీ లోకంలో. అందుకే అనేకమంది కంటె నేను ఎంతో అదృష్టవంతురాలిని.''

''ఎవరా అనేకమంది?''

''భర్తలు వదిలేసిన ఆడవాళ్ళు, కలిసి వుంటూ కూడా ప్రేమ చచ్చిపోయి యాంత్రికంగా బ్రతికేవాళ్లు, అసలు పెళ్ళే కానివాళ్ళు. ఆ అనేకమంది ఇలా చాలా రకాలుగా వుంటారు.''

''ఈ చాలా రకాలులో ఎక్కువ దురదృష్టవంతు లెవరు?'' నవ్వుతూ అడిగాడు సత్యమూర్తి భార్య ముంగురులు సవరిస్తూ.

''భర్త వదిలేసిన స్త్రీ. ఎందుకంటే, ఒకసారి భర్తతో కాపురంచేసి తర్వాత విసర్జించబడటం అంటే భార్యలదే తప్పని తనకు రుజువవుతుంది. వాళ్ల అసమర్థులన్నమాట.''

''అదేం? భర్తతో బ్రతకలేక విడిపోతే, అప్పుడు భర్తలు దోషులవచ్చుగా!''

''పెళ్ళంటే ఏమిటి? ఇద్దరు వ్యక్తుల శారీరక, మానసిక సమాగమం. ముఖ్యంగా మానసిక సమాగమం. అప్పటిదాకా వేర్వేరు పరిస్థితుల్లో, వేర్వేరు కుటుంబాల్లో, వేర్వేరు మనస్తత్వాలతో పెరిగిన ఓ పురుషుడు, ఓ స్త్రీల కలయిక. మానసికంగా ఆ ఇద్దరూ ఒకరి కొకరు ఎడ్జస్టు అవుతేనే వాళ్ళలో ప్రేమ కలిగి అది నిలుస్తుంది. అలా సర్దుకుపోవాల్సిన బాధ్యత, నా వుద్దేశ్యంలో ఎక్కువగా స్త్రీ మీదే వుంది. ఎందుకంటే పురుషుడి కంటే స్త్రీకి ఓపిక, జాలి, కరుణ ఎక్కువ స్వతహాగా. భర్తకి అనుగుణంగా. అణకువగా వుండి భర్త ప్రేమని పొందటం లోనే తృప్తి వుంటుంది ఆడవాళ్ళకి. మీరు ఆడవాళ్లుగా పుట్టి ఆ స్థితి అనుభవిస్తేనే కాని మీకు దాని విలువ తెలియదు. నా మాట అర్థం కావు.''

''అందుకే మారావా నీవు?''

''అవును. అందుకే నా కిప్పుడు జీవితం ఎంతో సంతృప్తిగా నడుస్తోంది. పెళ్ళి కాక మునుపు మా ఇంట్లో ఎవరూ నేను సుఖంగా, సంతోషంగా సంసారం చేసుకుంటాననుకోలేదు. మొండి, పేచీ కోరు లాంటి బిరుదు లుండేవి. కాని, పెళ్ళయ్యాక నా సంసారం కోసం, నా భర్త కోసం నా పట్టుదల చంపేసుకుని సర్దుకుపోవటం నేర్చుకున్నాను. కొత్తల్లో ఇబ్బంది అనిపించినా అలవాటయి పోయింది. అందుకే. . .''

ఆగి భర్తని ముద్దు పెట్టుకుని పూర్తి చేసింది వాక్యం.

''....సంతోషంగా వున్నాను.''

''ఉంచుతున్నావు.''

''కరెక్టు.''

నవ్వింది శ్రీవల్లి.

కొన్నిక్షణాలు ఆగిచెప్పింది.

''లేకపోతే దేముడిని మీరలాంటి వరం కోరుకొనివుండరు. ఇది నాకన్నా ముందే చస్తే పీడ విరగడవుతుంది అని కోరుకొని వుండేవారు.''

''మంచిభార్య ఎలా మసలుకోవాలి? అనే వ్యాసం రాయగలవు నువు.''

''మీకు హాస్యంగావుంది. మంచి భార్య ఎప్పుడూ మంచి తల్లికి పుడుతుంది. మంచి కూతురెప్పుడూ మంచి భార్యవుతుంది.''


''మంచి భర్త?''

పీఠ ముడివేసినట్టుగా నవ్వి చెప్పింది శ్రీవల్లి.

''మంచి భార్యని కట్టుకున్న ప్రతీ వ్యక్తి మంచి భర్తగా చలామణీ అవుతాడు.''

''అంటే మంచి భర్తకి క్వాలిఫికేషన్ అదొక్కటేనా?''

''మంచి అబ్బాయి పెళ్ళయాక చెడుదారులు పడితే అది భార్య నేరం. చెడు



అబ్బాయి పెళ్ళయాక మంచివాడయా డంటే అంది భార్య సామర్థ్యం. అవక పోతే అది భార్య లోపం."

సత్యమూర్తి భార్య ముంగురులని సవరిస్తూండిపోయాడు ఆప్యాయంగా.

"మంచి భర్త అయితే పెళ్ళాన్ని ఇలా వూరికే వుంచడు ఇంతదగ్గరగా వుంటే."

శ్రీవల్లి నవ్వుతూ భర్త చెవిలో రహస్యంగా చెప్పింది.

సత్యమూర్తి నవ్వి వూరుకున్నాడు. తర్వాత కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

శ్రీవల్లి నాలిక అంచుని మూసుకున్న భర్త కనురెప్పలకి తాకించింది. సత్యమూర్తి కదలలేదు. కుడిచెవిని మృదువుగా పెదవులమధ్య పట్టి నొక్కింది. అయినా సత్యమూర్తి కదలలేదు. ఈసారి మునిపళ్ళతో మృదువుగా కొరికింది. తర్వాత బుగ్గని కొరికింది. పెదవులని ముద్దు పెట్టుకుంది మీదకివాలి.

రెండునిముషాలు ఆగి భర్తని గట్టిగా చక్కిలిగిల్లి పెట్టింది. సత్యమూర్తి గట్టిగా నవ్వుతూ 'వద్దు' అన్నాడు. శ్రీవల్లి వూరుకోలేదు. గట్టిగా చక్కిలి గిల్లి పెడుతూనేవుంది భర్త మొహం మీద ముద్దు పెట్టుకుంటూ.

సత్యమూర్తి శ్రీవల్లిని కదలకుండా పొదివి పట్టుకుని శ్రీవల్లి మెడని ముద్దు పెట్టుకున్నాడు.

"ఇప్పుడు మీరు మంచి భర్త" అన్నది శ్రీవల్లి, సత్యమూర్తితో నాలుగు నిముషాల తర్వాత.

చెయ్యిచాచి మంచంకింద వుంచిన గులాబి పువ్వుని అందుకుని కొన్ని రెక్కలని తుంచింది శ్రీవల్లి. సగం నోట్లో వుంచుకుని మిగతా సగం భర్త నోటికి అందించింది.

ఓ నిముషం తర్వాత సత్యవల్లి నిద్రలోకదిలి నెమ్మదిగా ఏడవసాగింది.

శ్రీవల్లిని వదలలేదు సత్యమూర్తి.

శ్రీవల్లి భర్త కౌగిలిలోంచి బయట పడాలని ప్రయత్నించలేదు. గులాబుల

వాసన.

తన నోట్లోని గులాబి రేకులని భర్త నోటికి అందించింది ముద్దు పెట్టుకుంటూ.

సత్యవల్లి ఏడుపు కొద్దిగా పెద్దది చేసింది. అయినా శ్రీవల్లి భర్త కౌగిలి లోంచి కదలలేదు. ఓ రెండు నిముషాల తర్వాత సత్యమూర్తి చెప్పాడు శ్రీవల్లిని వదిలి.

''చూడు.''

శ్రీవల్లి సత్యమూర్తి జుట్టుని ఓసారి వేళ్ళతో దువ్వి లేచి దూరంగా పడుకో పెట్టిన సత్యవల్లి దగ్గరకి వెళ్ళింది.

''మీ నాన్నగారికి నీమీద అసూయే'' అన్నది సత్యవల్లిని మృదువుగా ముద్దు పెట్టుకుని.

సత్యమూర్తి చిన్నగా నవ్వాడు.

*   *   *

దాదాపు సంవత్సరం క్రితం అదేగదిలో శ్రీవల్లి పాప ఏడుపువిని సత్యమూర్తి కౌగిలిలోంచి బలవంతంగా బయట పడింది.

పావుగంట తర్వాత పాలిచ్చి నిద్ర పుచ్చి మళ్ళీ సత్యమూర్తి దగ్గరకి వచ్చింది.

సత్యమూర్తికి కోపం వచ్చిందని గ్రహించింది శ్రీవల్లి మంచంమీద భర్త పక్కన కూర్చుని, భర్తచేతిని తన చేతి లోకి తీసుకుని అడిగింది.

''కోపమా? ఎందుకు ఇంతలో?''

సత్యమూర్తి దూరంగా జరిగాడు. శ్రీవల్లి భర్తచేతిని ఇంకాస్త గట్టిగా పట్టుకుని, అతని వడిలో తల పెట్టుకుని పడుకుంది.

శ్రీవల్లిని బలంగా తోసేసాడు సత్యమూర్తి కసిగా.

భర్త మొహంలోకి చూసింది. అతను అంత కోపంగా వుండటం యెన్నడూ చూడలేదు శ్రీవల్లి.

''ఏమిటి? ఎందుకంత కోపం?'' అడిగింది.

సత్యమూర్తి మౌనంగా వుండి పోయాడు. ఎన్ని ప్రశ్నలు అడిగినా జవాబు చెప్పలేదు.

భయం వేసింది శ్రీవల్లికి భర్తకోపం చూసి.

''ఏం తప్పుచేసాను? నోరువిప్పి మాట్లాడండి. చెప్పండి. మీరు చెప్పక పోతే నాకెలా తెలుస్తుంది?'' అడిగింది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి శ్రీవల్లికి.

అప్పుడే చెప్పాడు సత్యమూర్తి.

''నీకు నేనంటే ఎంత మాత్రంలేదు.''

''ఏమిటి?''

''ప్రేమ.''

శ్రీవల్లి ఆశ్చర్యంగా చూసింది భర్త కళ్ళలోకి.

''ఎందుకలా అనుకున్నారు?''

సత్యమూర్తి శ్రీవల్లివైపు తిరిగి చెప్పాడు.

''నేను బాధపడతానన్ని తెలిసికూడా, పాప ఏడిస్తే నన్ను దూరంగా నెట్టేసి వెళ్ళిపోతున్నావు. నా మీదకన్న మధ్యలో వచ్చిన పాపాయంటేనే ఇష్టం, ప్రేమ. ఈ రోజునుంచి నువు పాపదగ్గరే పడుకో. దాని బాగోగులు చూసుకో. అసలు నేనంటే నీకు ఇదివరకులేని నిర్లక్ష్యం ఏర్పడింది.''

ఆశ్చర్యంగా భర్త చెప్పే మాటలు వింటూండిపోయింది శ్రీవల్లి విస్ఫారిత

నేత్రాలతో. కొద్దిసేపాగి అడిగింది నెమ్మదిగా.

"ఎందుకలా అనుకుంటున్నారు?"

"నువ్వలా ప్రవర్తిస్తున్నావు కాబట్టి. పాప నిద్రలో కదిలితే చాలు, చిన్నగా ఏడిస్తే చాలు, అన్నీ మర్చిపోయి దాని దగ్గరకి పరిగెత్తుతావు. నేనంటూ ఓ మనిషి వున్నానన్న సంగతే గుర్తుండదు అప్పుడు."

శ్రీవల్లి భర్తపక్కనే కూర్చుండిపోయింది చాలాసేపు ఆలోచిస్తూ. ఎన్నిసార్లో భర్తవద్దని ఆపినా, తను అటువైపు తిరిగి పడుక్కుని పాపను సముదాయించటం, పాలివ్వడం, బట్టలు మార్చడం, లేచి ఎత్తుకుని చిచ్చికొట్టి నిద్రపుచ్చటంలాంటి అనేక పనులు పాప కోసం చేసింది. ఆ సమయంలో భర్త ఇదివరకెన్నడూ యెరగనంతగా సణగడం వినుక్కోవడం గమనించింది తను. కాని అది కేవలం పాప డిస్టర్బ్ చేస్తోందన్న విసుగే అనుకుంది.

విసుగుకాదది.

అసూయ.

పాపమీద అసూయ.

తను యిదివరలో పూర్తిగా పొందుతున్న ప్రేమలో భాగం పంచుకుంటున్న పాపమీద అసూయ. తనమీద కోపం.

తన భర్త మనసు, ఆయన బాల్యం గురించి తెలిసీ ఈ విషయం అర్థం చేసుకోలేకపోయింది తను. అసలిలా జరగచ్చనే అంచనా వేయలేకపోయింది.


"అక్కయ నన్ను పట్టించుకునేది కాదు. తన కొడుకుమీదే వుండేది దాని మనసంతా. టి. బి. శానిటోరియంలో నేనువున్న సంవత్సరంలో గమనించాను. చిన్నప్పుడే తల్లిని తండ్రిని పోగొట్టుకుని నేను ఏం కోల్పోయాను" అనేకసార్లు చెప్పాడు తనభర్త తనతో.

"సారీ రాజు. వెరీసారీ. ఇంకోసారి నీకిలా బాధ కలిగేలా ప్రవర్తించను. ఇప్పుడు తెలిసిందిగా. సారీ."

సత్యమూర్తి శ్రీవల్లి తనపక్కన పడుకోగానే విసురుగా లేచాడు. పక్కగదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని లోపల గడియపెట్టి పడుకున్నాడు.

శ్రీవల్లికి ఈసారి ఆశ్చర్యంలోంచి తేరుకోడానికి చాలా సమయం పట్టింది. భర్తకి తనమీద ఇంతద్వేషం ఏర్పడిందా? తనకి తెలియకుండానే మానసికంగా ఇంత దూరం అయాడా?

(వి)చిత్ర విజ్ఞానం



తిమింగలాలు పాటలు పాడుతాయి! ఈ విషయం "హైడ్రోఫోన్" అనబడే శబ్దగ్రాహక పరికరం వుపయోగించి తెలుసు కున్నారు. తిమింగలం నోటినుండి వెలువడే శబ్ద తరంగాలను "స్పెక్ట్రోగ్రాఫ్" పరికరంతో రికార్డుచేయగా అవి శృతిక్రమంగానూ, లయబద్ధంగానూ ఉన్నాయి. ఈ "పాటల"లో యిమిడివున్న సంకేతా లెటువంటివో శాస్త్రజ్ఞులు ఆరా తీస్తున్నారు.

లేచివెళ్ళి తలుపుమీద కొట్టింది. సత్య మూర్తి తలుపు తెరవలేదు.

"రాజూ, తలుపుతెరు. నీకోమాట చెబుతాను. ఒక్కసారి తెరు."

శ్రీవల్లి పావుగంటసేపు ఎంత బ్రతిమ లాడినా తలుపు తెరుచుకోలేదు. అసూయతో భర్త హృదయం ఎంతలా భగ భగ మండుతోందో అర్థం చేసుకోగలిగింది శ్రీవల్లి.

మర్నాడు వుదయమంతా ముభావంగా వున్నాడు సత్యమూర్తి. మౌనంగా భోజనంచేసి లైబ్రరీకి వెళ్ళిపోయాడు. భర్త తిరిగి వచ్చేదాకా శ్రీవల్లి భర్తను గురించే ఆలోచిస్తూండిపోయింది.

తిరిగి వచ్చాక ప్రతి చిన్నవిషయం దగ్గరుండి చూసుకోసాగింది భర్త అవస రాలు. పాప అనే ఓజీవి అసలాయింట్లో లేనట్లుగా ప్రవర్తించసాగింది.

సత్యమూర్తిలో తను ఎదురుజూసిన మార్పు కనపడ్డది శ్రీవల్లికి. తనమీద కోపం చాలాభాగం తగ్గిపోయింది. ముభావంగా మాట్లాడసాగాడు.

ఆ రాత్రి అన్నం కంచంలో కలుపుకు వచ్చి తనే స్వయంగా సత్యమూర్తినోట్లో పెట్టింది ముద్దలుచేసి. శ్రీవల్లి వొడిలో తలపెట్టుకొని కళ్ళుమూసుకుని భార్యనోట్లో పెట్టే ముద్దలు తింటూండిపోయాడు సత్య మూర్తి. ఇప్పుడతని హృదయంలో ద్వేషం, కోపం లేవు. మటుమాయమయి పోయాయి.

ఎంతో ప్రశాంతంగా వుంది సత్య మూర్తి మనసు.

"రాజూ" పిల్చింది శ్రీవల్లి.

"ఊఁ" పలికాడు సత్యమూర్తి.

"దేనికి రాత్రి అంత కోపంవచ్చింది నామీద?" అడిగింది.

నవ్వాడు. జవాబు చెప్పలేదు.

"చెప్పు, దేనికి?"

"నాకు బాధవేసింది."

"ఎందుకు?"

"నువు పాపని అంతప్రేమగా జూస్తూ వుంటే."

సత్యమూర్తి జుట్టులోకుడిచేతివేళ్ళుంచి దువ్వుతూ చెప్పింది శ్రీవల్లి.

"ప్రేమకాదు రాజూ. నీకన్నం వండి పెట్టినట్లుగా పాపకి ఆకలి వేసినప్పుడు పాలివ్వద్దా? నువు స్నానం చేయగలవు. పాప పెద్దయ్యేదాక మరి నేను స్నానం చేయించకపోతే ఎలా? దానికి చేతకాదుగా నీలాగా నీళ్ళు పోసుకోవటం. నీకు బాధ వేస్తే ఇలా దగ్గరుండి సముదాస్తున్నట్లుగా. దానికి ఏడుపు వస్తే ఎత్తుకుని సముదా యించాలికదా. లేకపోతే ఎవరు చూస్తారు దాన్ని? ప్రేమకాదు రాజూ, ఇది నా బాధ్యత. అంతే."

"కాదు. నీకు అదంటేనే ప్రేమ. అది పుట్టినప్పటినుంచి చూస్తున్నాను" అని ఆగి చెప్పాడు కొద్దిగా కఠినంగా

"ఎప్పుడు మెత్తుకుంటావు. ఊరికే దాన్ని ముద్దు పెట్టుకుంటావు."

శ్రీవల్లి కొద్దిసేపాగి అడిగింది.

"నీకు మన పాపంటే ప్రేమలేదా?"

"లేదు."

"మనకి పుట్టినదేగా?"

"కావచ్చు."

"ఒకవేళ పాప చచ్చిపోయినా బాధ వెయ్యదా నీకు?"

"అది చావాలి. చస్తే నగం నరకం

వదులుతుంది ఈ ఇంట్లో."

సత్యమూర్తి మొహంలో ఇప్పుడు కోపం లేదు. ప్రశాంతంగా వుంది. శ్రీవల్లికి ఆ క్షణంలో తన భర్త మొహం తొమ్మిదేళ్ళ పసిపిల్లాడి మొహంలా అనిపించింది. వంగి సత్యమూర్తిని ముద్దు పెట్టుకుని చెప్పింది.

"నీకన్నా నాకెవరూ యెక్కువ కాదు. నీ ఇష్టం వచ్చినట్లే వుంటాను. సరేనా!"

"నిజంగానా?"

"నిజంగానే."

"అబద్ధం ఆడుతున్నావ్" అనుమానంగా అన్నాడు.

"నీమీద వట్టు."

భర్త తల మీద కుడిచేతిని వుంచి అన్నది శ్రీవల్లి.

రెండు చేతులూ భార్య నడుం చుట్టూ చుట్టి భార్యవళ్లో తల దాచుకుని అన్నాడు సత్యమూర్తి.

"అదే నాక్కావాలి."

ఆ రాత్రి భర్త పక్కన పడుకుంది శ్రీవల్లి యెప్పటిలాగానే. సత్యమూర్తి భార్య భుజం మీద చెయ్యివేసి పుస్తకం చదువుకోసాగాడు.

అరగంట తర్వాత కింద చాపమీద పరిచిన దుప్పటి మీద పడుక్కున్న పాప గట్టిగా ఏడవసాగింది.

పాలు పట్టేవేళ అది.

శ్రీవల్లి పాప దగ్గరకి వెళ్ళే ప్రయత్నం చేయలేదు.

అలానే పడుకుంది కదలకుండా.

భార్యమీద వుంచిన తన చేతిని అలాగే వుంచి పేజీ తిప్పాడు సత్యమూర్తి.

గుక్కపెట్టి ఏడుస్తోంది పాప.

శ్రీవల్లి కదిలింది.

సత్యమూర్తి చెవుల్లో గింగురుమంటోంది పాప ఏడుపు.

శ్రీవల్లి కదిలి, పక్కకి తిరిగి, ఎడం చేతిని భర్త జుట్టుమీద, కుడిచేతిని ఛాతీ మీదవున్న వెంట్రుకలమీద వేసి మృదువుగా నిమురుతూండిపోయింది. సత్యమూర్తి ఇంకో పేజీ తిప్పాడు.

పాప ఏడుపు ఇంకా పెరిగింది.

"ఎందుకనుకుంటావ్ నీ మీద నాకు ప్రేమ లేదని? నువ్వంటే నాకిష్టం. నువ్వు లేకపోతే బ్రతకలేను రాజూ. నిన్ను కాదని ఎన్నడూ బ్రతకను తెలుసా?"

సత్యమూర్తి ఇంకో పేజీ తిప్పుతూ తల పక్కకి తిప్పి చూసాడు శ్రీవల్లి మొహంలోకి.

శ్రీవల్లి ఎంతో తృప్తిగా మందహాసం చేస్తూ భర్త కళ్ళలోకి చూసింది

సత్యమూర్తి తల అటువైపు తిప్పి పాపవైపు చూసాడు.

గుక్కపెట్టి ఏడుస్తున్న పాప మొహం ఎర్రగా కందిపోయి వుంది ఏడుపుకి.

క్షణకాలం జాలివేసింది సత్యమూర్తికి. మళ్ళీ పుస్తకంలోకి తల దూర్చాడు. అక్షరాలు మనసులోకి ఎక్కడం లేదు.

వద్దనుకుంటూనే ఇంకోసారి పాప వంక చూసాడు.

ఎర్రగా కందిపోయి వుంది మొహం.

భార్య వంక చూసాడు.

పాప ఏడుస్తోందన్న బాధ యెంత తరచిచూసినా సత్యమూర్తికి శ్రీవల్లి మొహంలో కనబడలేదు. నిర్మలంగా,

ప్రశాంతంగా వుంది.

ఇంకో పేజీ తిప్పాడు.

తర్వాత పుస్తకం గట్టిగా విసిరికొట్టి అసహ్యంగా అన్నాడు

"పాడు కొంప. ఈ రాక్షసి నరకం లోంచి వచ్చి పడిందీ ఇంటి మీద."

కొన్ని క్షణాలు పాప వంక, భార్య వంక మార్చి మార్చి చూసి చెప్పాడు.

"చెవులు పగిలిపోతున్నాయి."

శ్రీవల్లి కదలలేదు.

కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ చెప్పాడు చిరాకుగా.

"వల్లీ నిన్నే."

శ్రీవల్లి మాట్లాడలేదు.

"లే."

శ్రీవల్లి కదిలింది. కదిలి భర్తని మరీ కాస్త గట్టిగా అతుక్కుపోయింది కాని లేవలేదు.

పాప కంఠం తెగిపోయేలాగా, వూపిరి తిత్తులు పగిలిపోయేలాగా గుక్కపట్టి ఏడుస్తోంది.

"వల్లీ, లే. లేచి ఆ పాడు పిల్లని చూడు" సత్యమూర్తి కోపంతో కూడిన అసహ్యంతో చెప్పాడు.

"ఏడవనీయండి. ఏడ్చి ఏడ్చి అదే పడుకుంటుంది" అన్నది శ్రీవల్లి భర్తని ముద్దు పెట్టుకుని.

"లే, లేచి దాన్ని అవతల గదిలోకి తీసుకెళ్లు ముందు."

"వద్దు, తర్వాత మీరు తిడతారు."

"తిట్టను. లే."

శ్రీవల్లి రెక్క పట్టుకుని బలవంతంగా లేపాడు సత్యమూర్తి. పాప దగ్గరకి తీసుకెళ్ళాడు.

శ్రీవల్లి పాపని యెత్తుకోగానే కొద్దిగా ఏడుపు ఆపింది కాని మానలేదు.

"ఊరకే అలా యెత్తుకుని నిలబడ తావే? రోజూలా వూరడించు" అన్నాడు సత్యమూర్తి పాప ఏడుపు పెంచడంతో.

శ్రీవల్లి పాపతో ప్రక్క గదిలోకి వెళ్ళింది. పదినిముషాల తర్వాత నిద్ర పోతున్న పాపతో తిరిగి వచ్చింది గదిలోకి. పాపని చాప మీద పడుకోబెట్టి వచ్చి భర్త పక్కన పడుకుంది.

సత్యమూర్తి తలకింద రెండు చేతులూ వుంచుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"మళ్ళీ ఏమిటలా వున్నారు?" అడి గింది శ్రీవల్లి భర్త పక్కన కూర్చుని.

సత్యమూర్తి మాట్లాడలేదు.

"నే చెప్పనా మీ మనసులో ఏం వుందో?" అడిగింది.

సత్యమూర్తి మౌనంగా వుండి పోయాడు.

"మీకు భయం నాకు మీమీదకన్నా పాపంటేనే ప్రేమ ఎక్కువని. ఆ భయం మర్చిపోండి. మీ తర్వాతే నాకు పాప. ఇక నుంచి పాప ఎప్పుడు ఏడ్చినా మీరు వెళ్ళమంటేనే వెళ్తాను, మీరు యింట్లో వున్న సమయంలో. పాప విషయంలో పడి మిమ్మల్ని అశ్రద్ధ చేస్తానని భయ పడకండి. పాపమీదకన్నా ఈ రాణికి మీమీదే ప్రేమ అన్న విషయం నమ్మండి, చాలు. మీకు ఏ బాధా వుండదు. అలా నమ్మితే రెండు మూడేళ్ళలో అది పెద్ద దయ్యాక ఇంకే సమస్యా వుండదు."

సత్యమూర్తి మాట్లాడలేదు.

"అయినా మీకెందుకంత అసూయ?"

"నాకు తెలియదు."

"నాకు తెలుసు."

"ఏమిటి?"

"మీ అసూయకి కారణం."

"ఎలా తెలుసు?"

"మీ మనసు, మీ ఆలోచన, మీ గతం మీ బాధలు అన్నీ నాకు తెలుసు కాబట్టి."

మెత్తగా నవ్వింది.

"తెలిస్తే చెప్పు."

"మీకు చాలా చిన్నతనంలోనే తల్లి పోయింది. మీ అక్క మిమ్మల్ని పెంచి పెద్దచేసింది. మీకు అక్క ప్రేమ తప్ప తల్లిప్రేమ ఎలా వుంటుందో తెలియదు. మీరు టి. బి. శానిటోరియమ్‌లో వున్నప్పుడు ఆ నల్ల పిల్లాడి తల్లి వచ్చి చూపించే ఆదరణ చూసాక మీకు తల్లి ప్రేమ పొందని లోటు అర్థమయింది. పాపకి నేనిచ్చే ప్రేమ చూస్తూంటే మీకు అసూయ. మీరు పొందలేని ఆ ప్రేమ పాప పొందుతుందని దాని మీద అసూయ కోపం, ద్వేషం."

"నీకెలా తెలుసు?"

శ్రీవల్లి భర్త కళ్ళల్లో నీళ్లు తిరగడం చూసి ఆశ్చర్యపడింది.

"నీకెలా తెలుసు? నా అంతట నేనే చెప్పుకోడానికి నాకే సరిగ్గా అర్థం కాని నా మనసులోని భావాలు నీకెలా తెలుసు"

సత్యమూర్తి రెండు కళ్ళలోంచి నీళ్లు కారుతున్నాయి.

నవ్వింది, జవాబు చెప్పలేదు.

"నువ్ చెప్పింది నిజం వల్లీ."

శ్రీవల్లి భర్త చెంపల మీదికి కారిన కన్నీటిని చీర చెంగుతో మృదువుగా తుడిచింది.

సత్యమూర్తి గబగబా చెప్పాడు.

"నీకు తెలీదు. నువు నన్ను 'రాజూ' అని పిలుస్తూంటే అచ్చం మా అమ్మ పిలిచినట్లుగా అనిపిస్తుంది, ఆవిడని నేను ఎన్నడూ చూడకపోయినా. కంఠం వినకపోయినా నువు నా జుట్టులో వేళ్లుంచి నెమ్మదిగా నిమురుతుంటే అప్పుడు అచ్చం మా అమ్మలా అనిపిస్తావు. జీవితంలో మొదటిసారి ఇందాక నీ ఒళ్లో పడుక్కుని అన్నం తింటూంటే నేను ఎంతో చిన్న పిల్లవాడు అయినట్లుగా అనిపించింది. మళ్లీ అమ్మలా అనిపించావు. కాని భార్య అనే భావమే కలగలేదు నాలో. జీవితంలో రహస్యంగా నిశ్శబ్దంగా నేను కోరుకున్న తల్లిప్రేమ, ఎన్నడూ ఇక ఈ జీవితానికి లభించదనుకొన్న అమ్మయిచ్చే ప్రేమ నీనుంచి దొరుకుతుంది నాకు. కనీసం నా మనసుకి అలా అనిపిస్తోంది ... నాకు ఆ సమయంలో...."

సత్యమూర్తి ఏడుస్తున్నాడు. ఒక్కసారిగా గుండె గొంతులోకి వచ్చినట్లుగా అనిపించింది. ఇంక మాట్లాడలేక పోయాడు పుద్వేగంతో.

శ్రీవల్లి చాలాసేపు ఏడుస్తున్న భర్త మొహంలోకి చూస్తూండి పోయింది. శ్రీవల్లి మనసునిండా రకరకాల భావాలు కలగాపులగం అయాయి.

"పాపంటే నాకు అందుకే ద్వేషం."

తన భర్త మనస్తత్వంలో వయసు పెరిగినా పసితనపు ఛాయలు చాలా దాకా పోలేదని తెలుసు శ్రీవల్లికి. కాని అవి

యింత ప్రగాఢంగా లోతుగా పాతుకుని వున్నాయనిఎన్నడూ అనుకోలేదు శ్రీవల్లి.

ఒకరు తల్లి, ఇంకొకరు భార్య.

మొగవాడిని తీర్చిదిద్దేది కేవలం వీళ్లిద్దరే చాలాభాగం. జీవితాన్నేకాదు,మన సుని, సంస్కారాన్నికూడా. వీళ్లిద్దరూ వుండకపోతే అసలు మొగాడేలేడు.

మొగవాడనేవాడే వుండడు ఈ లోకంలో తల్లి, భార్య లేకపోతే.

మొగవాడికి ఆసరాగా, అండగా ఏ వయసులో ఎవరుండాలో వాళ్ళుండాలి. వాళ్లు లేకపోతే ఆ లోపం మొగవాడికి స్పష్టంగా తెలుస్తుంది. అది అతని అంత రాంతరాల్లో పాతుకుని పోయి బాధి స్తుంది అతన్ని-అతనికి తెలియకుండానే.

శ్రీవల్లి భర్త నుదుటిమీద మృదు వుగా ముద్దు పెట్టుకుంటూ అంది.

"రాజూ! నువు నా అదృష్టం. భర్తని కేవలం భర్తలాగేకాక, తల్లిలా కూడా లాలించి ప్రేమించే అవకాశం దొరికిన నాకు ..నేను నిజంగా అదృష్ట వంతు రాలిని." సత్యమూర్తి శ్రీవల్లి ఒళ్లో ఆ రాత్రి పసి పిల్లాడిలా నిద్రపోయాడు. శ్రీవల్లి తెల్లారేదాకా అలాగే కూర్చుంది నిద్ర పోకుండా.

* * *

సత్యమూర్తి, శ్రీవల్లి, సత్యవల్లిని తీసుకుని మేట్నీకి సినిమాకు వెళ్లాడు. ఇంగ్లీష్ సినిమా 'కింగ్ ఎలిఫెంట్' అది. తర్వాత బస్‌డిపోకి వెళ్లి మర్నాడురాత్రి బయలుదేరి వెళ్లే బస్సులో రాజమండ్రికి టిక్కెట్లు బుక్ చేసుకుని యింటికి చేరు కున్నారు.

పొద్దున వండిన పరవాన్నాన్ని వెచ్చ చేసి, భర్తకి అందించింది.

ఆ రాత్రి చెప్పింది శ్రీవల్లి సత్య మూర్తికి.

"ఇవాళ మీకో కబురు చెప్పనా?"

"చెప్పు. ఎన్నయినా చెప్పు" శ్రీవల్లి గుండెల మీద తలపెట్టి పడుకొన్నాడు సత్యమూర్తి.

"మీకు కోపం రాకూడదు. బాధ వేయ కూడదు."

"చెప్పు."

శ్రీవల్లి కొన్నిక్షణాలు మౌనంగా వుండిపోవటంతో సత్యమూర్తి లేచి శ్రీవల్లి మొహాన్ని తనచేతుల్లోకి తీసు కుని అడిగాడు మృదువుగ శ్రీవల్లి బుగ్గలని రాస్తూ.

"ఏమిటి ఆగావే?"

శ్రీవల్లి సిగ్గుతో కళ్ళు మూసుకుని చెప్పింది.

"మీకు పోటీగా యింకొకరొస్తు న్నారు."

"అంటే?"

"మళ్ళీ మీరు తండ్రి కాబోతున్నారు."

వెంటనే శ్రీవల్లిని ఆప్యాయంగా ముద్దుపెట్టుకుని చెప్పాడు సత్యమూర్తి.

"నన్ను నిర్లక్ష్యం చేయవన్న నమ్మకం వుంది నాకు."

"మీకు ఆనందంగా లేదా?"

"ఉంది."

భర్త జుట్టుపట్టుకుని మొహాన్ని తన మొహం మీదకి లాక్కొని ముద్దు పెట్టు కుంది భర్త మొహంమీద. శ్రీవల్లి కాలి కున్న వెండిగజ్జెలు గలగలలాడాయి.

6

మర్నాడు ఉదయం లైబ్రరీకి వెళ్లి

శెలవు పెట్టివచ్చాడు సత్యమూర్తి.

బేంక్‌కు తీసుకువెళ్లాడు శ్రీవల్లిని ఇంటికి తిరిగివచ్చి. శ్రీవల్లితన ఎకౌంట్‌లో క్రెడిట్ అయ్యి ఫిక్సెడ్ డిపాజిట్ మీద వడ్డీని విత్‌డ్రా చేసింది.

బట్టలకొట్టుకు బయలుదేరారు రిక్షామీద.

"మీ పేర వేసివుండాల్సింది" చెప్పింది శ్రీవల్లి దారిలో.

"ఎవరి పేరయితే ఏం?"

"తీసేసి మీ పేర చేస్తే ఏం? అనవసరంగా నా పేర ఎందుకు?"

"ఫర్వాలేదు. నువ్వు నేను ఒకటే కాని పేరుపేరు కాదు, నీ శరీరంలోనేనో అవయవం నా శరీరంలో నీవో అవయవం. ఒకళ్ళని విడిచి మరొకరం ఓరోజు కంటె ఎక్కువకాలం వుండలేం."

శ్రీవల్లి ఆప్యాయంగ భర్తచేతిని నిమురుతూండిపోయింది బట్టలకొట్టుకి చేరుకునే దాకా.

సత్యమూర్తి పెద్దక్కకి, బావకి పిల్లలకి బట్టలుతీసుకుంది. ఆరువందల రూపాయలుపైన అయ్యింది బిల్లు.

రాత్రి పదిన్నరకి బస్సు. శ్రీవల్లి భర్త బట్టలు, తన బట్టలు సర్దింది సూట్‌కేసులో. ప్లాస్టిక్‌బుట్టలో సత్యవల్లి బట్టలు సర్దింది.

ఆటోలో పదింటికి చేరుకున్నారు బస్‌డిపో. అయిదు నిముషాలలో స్టేండ్‌మీదికి వచ్చింది బస్.

ఆడవాళ్ళ సీట్లో శ్రీవల్లిని కూర్చోపెట్టి తను మొగవాళ్ళ సీటువైపు నడవబోయాడు సత్యమూర్తి. శ్రీవల్లి కాలి గజ్జెలు ఘల్లుమన్నాయి.

"పక్క పక్క సీట్లు కావా?"

"పక్కపక్క సీట్లే అడిగాను. ఇచ్చినట్లులేదు." చెప్పాడు సత్యమూర్తి.

"నాకిలా ప్రయాణం చేయటం బావుండదండి దూరం దూరంగా" గొణిగింది శ్రీవల్లి.

"నాక్కూడా. ఏంచేస్తాం?"

పదీనలభైకి బయలుదేరింది బస్.

బస్‌లో లైట్స్ ఆర్పేసారు హైద్రాబాద్ పొలిమేరలు దాటగానే.

సత్యమూర్తి సీట్‌కి ఆనుకుని కొద్దిసేపు ఎదురుగా అద్దంలోంచి కనబడే రోడ్‌ని చూస్తూ కూర్చున్నాడు.

ఆలోచనలు తమకి పుట్టబోయే బిడ్డ చుట్టు తిరుగుతున్నాయి.

ఈసారి పాపా? బాబా? పాపవుతే బావుండును. శ్రీవల్లికి ఆడపిల్లలంటే ఇష్టం. ఎప్పుడు?

ఎన్నో నెలో అడగలేదు తను. రాజమండ్రీ వెళ్ళగానే కనుక్కోవాలి.

మధ్యమధ్యలో సత్యవల్లి ఏడవటం శ్రీవల్లి సముదాయించటం వినిపిస్తోంది సత్యమూర్తికి ఆ చీకట్లో.

పన్నెండున్నర ప్రాంతంలో సూర్యాపేటలో ఆగింది బస్సు. సత్యమూర్తి బస్సు దిగుతూ శ్రీవల్లిని అడుగుదామనుకున్నాడు టీ తాగుతావా అని.

శ్రీవల్లి కిటికీకి ఆనుకుని నిద్రపోతోంది. శ్రీవల్లి వడిలో సత్యవల్లి కూడా నిద్రపోతోంది.

దిగి టీ తాగి మళ్ళీ బస్ ఎక్కాడు.

బస్ మళ్ళీ బయలుదేరింది. క్రమంగా నిద్రపట్టసాగింది సత్యమూర్తికి. బస్సు కుదుపులకి గాఢంగా కాకుండా కలత నిదర పడుతోంది.

ఆ ముందురోజు రాత్రి సత్యమూర్తి

రెండున్నర వరకు నిద్రపోలేదు. శ్రీవల్లి కూడా నిద్రపోలేదు. అగరుబత్తుల వాసన మధ్య, తెల్లటి దుప్పటి పరిచిన పరుపు మీద, గులబీపూల రెక్కలమీద, గిరగిరా తిరిగే సీలింగ్ ఫేన్ కింద సత్యమూర్తి, శ్రీవల్లి తెల్లవారుఝామున రెండున్నర దాకా నిద్రపోకుండా మేలుకుని....

బస్సు ఆగగానే మెలకువ వచ్చింది సత్యమూర్తికి. డ్రయివర్ బస్‌లో లైట్లు వెలిగించాడు. సత్యమూర్తి లేచి బస్సు దిగుతూ శ్రీవల్లివంక చూసాడు.

ఓసారి కళ్ళు తెరచి నిద్రమత్తుగా కిటికీ లోంచి బయటకి చూసి మళ్ళీ కళ్లు మూసుకుని పడుకుంది సత్యవల్లిమీద ఓ చేతిని వేసి.

సత్యమూర్తి టీ తాగడానికి కేంటీన్ వైపు నడిచాడు. మంచినీళ్లు తాగి వేడిగా వున్న టీని మెల్లిమెల్లిగా తాగసాగాడు.

హఠాత్తుగా సత్యమూర్తికి బస్సు హారన్ గట్టిగా వినిపించడంతో వులిక్కిపడి చూసాడు.

బస్సు ఇంజన్ స్టార్‌చేసి డ్రయివర్ హారన్ కొడుతున్నాడు. ఓ రెండు బస్సులు వచ్చి నిలిచివున్నాయి వక్కనే.

సత్యమూర్తి అర్ధరూపాయి బిళ్ళ టీ వాడికి ఇచ్చి, బస్సువైపు పరిగెత్తాడు. తలుపు తెరుచుకుని బస్సు ఎక్కి తన సీట్‌లో కూర్చున్నాడు గబగబ నడిచి వెళ్లి.

"అంతా వచ్చారా?" అడిగాడు కండక్టర్ విసుగ్గా.

ఎవరో సమాధానం చెప్పారు.

బస్సు బయలుదేరింది.

సత్యమూర్తికి కుదుపులకి నిద్ర పట్టింది వెంటనే. రెండుమూడు నిముషాలలో నిద్రలోకి జారిపోయాడు.

7

ఉదయం ఏడింటికి మెలకువ వచ్చింది. సూర్యకిరణాలు తనమీదపడి చురుక్కుమనటంతో గట్టిగా ఆవలించి జేబులోంచి కర్చీఫ్ తీసి మొహం తుడుచుకున్నాడు.

తర్వాత కిటికీలోంచి బయటకు చూశాడు. ఊరు దగ్గరవుతున్న గుర్తుగా దూరంగా ఇళ్ళు కనబడుతున్నాయి.

మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు మగతగా.

బస్సు వూళ్ళోకి వచ్చిన గుర్తుగా ట్రాఫిక్స్ తాలూకా రణగొణ ధ్వని వినపడటంతో కళ్ళు తెరిచి చూశాడు.

క్షణకాలం సత్యమూర్తి తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు.

బస్సు తిరిగి హైద్రాబాద్ వచ్చేసింది!

ఎడంచేతివైపు మూసీనది. కుడివైపు ఇళ్ళు, భవనాలు, దూరంగా బస్ డిపో రూఫ్ కనబడుతోంది.

సత్యమూర్తికి నిద్రమత్తంతా ఎగిరిపోయింది వెంటనే.

రాజమండ్రికే బయల్దేరారు. తిరిగి హైద్రాబాద్ ఎలా చేరుకున్నారు?

ఓసారి లగేజ్ రేక్‌వంక చూశాడు.

తన సూట్ కేస్ లేదు శ్రీవల్లి కూర్చున్న సీట్ దగ్గర.


ఒక్క వుదుటున లేచి శ్రీవల్లి సీట్ దగ్గరికి వెళ్ళి చూశాడు.

శ్రీవల్లి లేదు!

ఇంకెవరో ఆడవాళ్ళు కూర్చుని వున్నారు!

(సశేషం)

Edited & Published by V. Leelavathi Raghavaiah, at 17B Rajaran
Colony Kodambakkam Madras-600 024.&Printed by D. Hanuman


17,మొదటి మెయిన్‌రోడ్డు,లేక్ ఏరియా,
(వళ్ళువరుకోటము ప్రక్కన)
ACHIEVED
SYSTEMATIC EFFOR
ప్రయత్నముువలన ఫలి
పనులున్నవా?
ఆంగ్లము
సంభాషించుటకు
పరిచయముచేసికొ
కును, తపాలా ద
16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు
ఒకే సంవత్సరములో
విశ్రాంతి సమయములో
ప్రారంభమునుండి కాని - లక్ష్యలక్షణ
పరిశోధన
ఇంగ్లీష
నేర్చుకో
కోయదాన్ని, కొండజాతి కోయదాన్ని,
కొంచెమే చదివిన నన్ను అతడు
పెండ్లాడుటకు ఒప్పుకొనునా? నా చేతి
విద్యారేఖ ప్రకాశించుచున్నదా? బాగుగా ప్రకాశించు
చున్నదా? యువతీ! ఆంధ్ర యువతీ! నిజముగా మంచి
కాలము, మంచివేళ పంచాంగములో లేదు. విద్యారేఖ,
ధనరేఖ, హస్తమునందులేవు. అవి ప్రయత్నముయొక్క
ఫలములు. తక్కువవిద్యను ఎక్కువచేయుటకు ప్రయత్నించుము.
ఇపుడే ప్రయత్నించుము. అతనికే పాఠములు నేర్పునంతటి
నొందుము. నీ పలుకులనతడు ఆలకించును. వశీకరణమంత్రముచేనతని
నీవు లొంగదీసుకొనెదవు. నీవు
స్వరమునకు అతడు బుట్టలోని పాము
నగును. ఇది పెద్దల సందేశము.
ఫలించును.
G. SHANMUGASUNDA
ప్రారంభించు క్రొత్త తరగతుల
నేరుగా వచ్చికాని,
20 పైసల తపాలాబిళ్ళ